

ఈనాడు



విజయవాడ 3-7-2025 గురువారం సిటీ సంపుటి 51 . సంచిక 324

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

కారు కింద సొంత కార్యకర్త పడితే..

కుక్కపిల్లలా పక్కన పడేశారు

ఆయన భార్యను పిలిచి అంబులెన్స్‌లో ఏదో జరిగిందని చెప్పించారు


నా జీవితంలో ఇన్ని డ్రామాలు చూడలేదు ● కుప్పం పర్యటనలో సీఎం చంద్రబాబు



బ్యాటరీ ట్రైసైకిల్ పంపిణీ తర్వాత దివ్యాంగురాలితో మాట్లాడుతున్న సీఎం

ఈనాడు - చిత్తూరు

'నన్ను మీరు(కుప్పం వాసులు) తొమ్మిదిసార్లు గెలిపించారు. రాష్ట్ర ప్రజల ఆశీర్వాదంతో నాలుగు సార్లు ముఖ్యమంత్రిని అయ్యాను. నేను ఎప్పుడైనా నేరాలు చేశానని, ఎవరినైనా కొట్టానని, హత్య చేశానని విన్నారా? హత్యా, శవ రాజకీయాలు నేను చేయను. సేవ, ప్రజాహితమే పరమావధిగా పనిచేస్తా. నాది అభివృద్ధి, సంక్షేమ యజ్ఞం. కొందరు రాక్షసుల్లా వచ్చి భగ్నం చేయాలని చూస్తున్నారు. వారిని వదిలిపెట్టను' అని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం తుమ్మిశి గ్రామంలో బుధవారం నిర్వహించిన 'ప్రజా వేదిక సభలో సీఎం మాట్లాడారు. 'ప్రస్తుత రాజకీయాలు నేరమయం అయ్యాయి. బాబాయిని చంపి ఆయన కుమార్తెతోనే మా అన్న(జగన్) మంచివాడని చెప్పించారు. నిజం తెలిసి ఆమె తిరగబడ్డారు' అని సీఎం చంద్రబాబు చెప్పారు. కొందరు మానవత్వం లేని వ్యక్తులు ఇంకా ఆటలాడుతున్నారని.. కారు కింద సొంత పార్టీ కార్యకర్త పడి చనిపోతే కుక్కపిల్లను తీసేసినట్లు పక్కన పడేసి వెళ్లారని సీఎం మండిపడ్డారు. సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్లక పోవడంతో బాధితుడు చనిపోయారని.. ఇప్పుడు ఆయన భార్యను పిలిచి మేనేజ్ చేసి... కారు కింద పడి తన భర్త చనిపోలేదని, అంబులెన్స్‌లో తీసుకెళుతున్నప్పుడు ఏదో జరిగిందని ఆమె చేత ప్రచారం చేయిస్తున్నారని ఆక్షేపించారు. 'ఇలాంటి నేరస్థులను ఏమనాలి? కోడికత్తి, గులకరాయి దాడులకు నేనే కారణమన్నారు. నా జీవితంలో (మిగతా 2లో)



పింఛన్ల చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, నాయకులు, అధికారులు

జగన్ ఇలాకాలోనే దొంగ పింఛన్లు అధికం

- పులివెందులలో 7,487 దివ్యాంగుల పింఛన్లలో 1,708 బోగస్‌వే
- వైకాపా హయాంలో విచ్చలవిడిగా అనర్హులకు మంజూరు

పిలిపించుకుని.. పరామర్శ

- సింగయ్య, జయవర్ధన్ కుటుంబాల్ని రప్పించుకుని మాట్లాడిన జగన్
- ఆయన సత్తెనపల్లి పర్యటనలో కారు కింద పడి మృతి చెందిన సింగయ్య
- తోపులాటలో చనిపోయిన జయవర్ధన్

లోపలి పేజీల్లో

టూత్‌పేస్ట్, దుస్తుల ధరలు తగ్గుతాయా!

జీఎస్‌టీని తగ్గించే యోచనలో ప్రభుత్వం బిజినెస్ లో

విద్యార్థులకు రవాణా భత్యం

- మూడు నెలలకోసారి చెల్లించేలా ఎస్‌ఎస్‌ఏ కసరత్తు
- రాష్ట్రవ్యాప్తంగా ఏడాదికి 79,000 మందికి అమలు



ఈనాడు, అమరావతి: ఇళ్లకు దూరంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రవాణా ఛార్జీలు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. విద్యాహక్కు చట్టం ప్రకారం 1-8 తరగతుల విద్యార్థులకు పాఠశాల తప్పనిసరిగా నిర్ణీత దూరంలో ఉండాలి. బడి దూరంగా ఉంటే పిల్లలు వెళ్లి, వచ్చేందుకు రవాణా ఛార్జీలు చెల్లించాలి. ఈ రవాణా ఛార్జీల్లో కేంద్రం 60% ఇస్తే రాష్ట్రప్రభుత్వం 40% భరించాలి. 2025-26 విద్యా సంవత్సరానికి ఇప్పటికే కేంద్రం రూ.47.91 కోట్లు మంజూరుచేసింది. విద్యార్థుల జాబితాలను సిబ్బంది సిద్ధం చేశారు. ఈ ఏడాది మూడు నెలలకోసారి రవాణా ఛార్జీలను తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని భావిస్తున్నట్లు సమగ్ర శిక్షాభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ ఈ ఏడాది సంస్కరణల్లో భాగంగా పాఠశాలల హేతుబద్ధీకరణ చేసింది. తొమ్మిది రకాల బడులను తీసుకొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 9,600 ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటుచేసింది. ఇందుకోసం సమీపంలోని 3, 4, 5 తరగతులను ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు తరలించారు. కొన్నిచోట్ల విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో ప్రాథమికోన్నత బడుల స్థాయిని తగ్గించారు. దీంతో 6, 7, 8 తరగతుల విద్యార్థులు సమీపంలోని ఉన్నత పాఠశాలలకు వెళ్లాల్సి వచ్చింది.

ఒక్కో విద్యార్థికి నెలకు రూ.600

రాష్ట్రవ్యాప్తంగా 79,860 మంది విద్యార్థులకు రవాణా ఛార్జీలను చెల్లించనున్నారు. 1-5 తరగతులు ఉండే ప్రాథమిక పాఠశాల ఆవాసానికి కిలోమీటరు కంటే ఎక్కువ దూరం ఉన్నా.. 6, 7, 8 తరగతుల పాఠశాలలు 3 కిలోమీటర్ల దూరం కంటే ఎక్కువ ఉన్నా ఒక్కో విద్యార్థికి నెలకు రూ.600 చొప్పున రవాణా ఛార్జీలు చెల్లిస్తారు. గతంలో విద్యా సంవత్సరం ముగింపు సమయంలో ఒకేసారి రూ.6వేలు చెల్లించేవారు. ఈసారి మూడు నెలలకోసారి చెల్లిస్తే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఉపయోగపడతాయని భావిస్తున్నారు. పాఠశాలలు దూరంగా ఉన్నచోట పిల్లలు ఆటోల్లో బడులకు వెళ్తున్నారు. తల్లిదండ్రులు ద్విచక్రవాహనాలపై దింపినా పెట్రోల్ ఖర్చు అవుతుంది. రవాణా భత్యం పొందే విద్యార్థులు నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 12,951 మంది ఉండగా.. అత్యల్పంగా గుంటూరులో 437 మంది ఉన్నారు.



ఆకస్మిక మరణాలకు

కొవిడ్ వ్యాక్సిన్ కారణం కాదు

జీవనశైలి, ముసుపటి సమస్యలతోనే ప్రాణనష్టం

దేశీయ టీకాలు భేష్: కేంద్రం

ఈనాడు, దిల్లీ: యుక్తవయసువారి ఆకస్మిక మరణాలకు జీవనశైలి, ముందస్తు ఆరోగ్య సమస్యలే కారణం తప్పితే కొవిడ్ వ్యాక్సిన్ కాదని కేంద్ర వైద్య-ఆరోగ్యశాఖ వెల్లడించింది. భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్), దిల్లీ ఎయిమ్స్ నిర్వహించిన రెండు అధ్యయనాల ద్వారా ఈ విషయం తేలిందని స్పష్టంచేసింది. దేశీయంగా తయారైన కొవిడ్ వ్యాక్సిన్లు సురక్షితంగా, సమర్థంగా పనిచేస్తున్నాయని, తీవ్ర దుష్పరిణామాలు సంభవించిన ఉదంతాలు అత్యంత అరుదుగా కనిపించాయని ఐసీఎంఆర్, జాతీయ రోగ నియంత్రణ కేంద్రం (ఎన్‌సీడీసీ) అధ్యయనాలు వెల్లడించినట్లు వివరించింది. ఒక్క హసన్ జిల్లాలో గుండె సంబంధిత సమస్యలతో నెలలో 20 మంది మరణించడాన్ని కొవిడ్ టీకాతో ముడిపెడుతూ కర్ణాటక సీఎం సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో (మిగతా 2లో)



భారీ వర్షాలకు ఉద్ధృతంగా ప్రవహిస్తున్న ఏలూరు జిల్లా వేలేరుపాడు మండల పరిధిలోని పెదవాగు

ద్రోణి ప్రభావంతో వర్షాలు

ఈనాడు, విశాఖపట్నం: ఝార్ఖండ్ పరిసరాల్లోని అల్పపీడనం బుధవారం బలహీనపడింది. రాజస్థాన్ నుంచి మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఝార్ఖండ్ మీదుగా బంగాళాఖాతం వరకు ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి (మిగతా 2లో)

వైకాపా అభ్యర్థులకు మద్యం ముడుపుల సొమ్ము

సొత్తు తరలించింది బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణ

వీరు చెవిరెడ్డికి అత్యంత నమ్మకస్తులు

ఒక్కో విడతలో రూ.8-9 కోట్లు చొప్పున రూ.200-250 కోట్ల అందజేత

రిమాండ్ రిపోర్టులో సిట్ వెల్లడి


ఈనాడు, అమరావతి: గతేడాది సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో వైకాపా అభ్యర్థులు వెచ్చించిన సొమ్ము మద్యం ముడుపులదేనని సిట్ దర్యాప్తులో తేలింది. వైకాపా అధినేత జగన్‌కు అత్యంత సన్నిహితుడైన చెవిరెడ్డి భాస్కరరెడ్డే (ఏ-38) ఈ మొత్తం వ్యవహారాన్ని దగ్గరుండి నడిపించారని నిర్ధారణైంది. చెవిరెడ్డికి అత్యంత నమ్మకస్తులైన బాలాజీ కుమార్ యాదవ్ (ఏ-35), నవీన్‌కృష్ణతో (ఏ-36) పాటు మరికొందరు ముఖ్య అనుచరులు, సిబ్బంది ఈ ముడుపుల సొమ్ము తరలింపులో పాల్గొన్నారని స్పష్టమైంది. చెవిరెడ్డి ఆదేశాల మేరకు వీరంతా ఎప్పటికప్పుడు హైదరాబాద్, తాడేపల్లి నుంచి ముడుపుల సొమ్మును చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో వైకాపా నాయకులకు అందజేశారని సిట్ తెలిపింది. సార్వత్రిక ఎన్నికలకు కొన్ని నెలల ముందునుంచి ఒక్కో విడతలో రూ. 8-9 కోట్ల చొప్పున రూ.200-250 కోట్ల ముడుపుల సొత్తును వీరు తరలించినట్లు పేర్కొంది. రాజ్ కెసిరెడ్డి (ఏ-1), ఆయన బృందం నుంచి ముడుపులు సొమ్ము ఎలా తీసుకునేవారు? దాన్ని ఎవరెవరికి అందజేశారు? (మిగతా 2లో)



(c) eenadu

రూ.150కే లింగ నిర్ధారిత పశు వీర్యం

- రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన పంపిణీ
- అందుబాటులో 1.50 లక్షల డోసులు


సీఈవో మర్రిపూడి శ్రీనివాసరావు

న్యూస్‌టుడే – నెహ్రూనగర్ (గుంటూరు): రాష్ట్రంలో మేలు జాతి పెయ్యదూడల ఉత్పత్తికి ప్రభుత్వం మార్పులు తీసుకొచ్చింది. పశుసంపదను గణనీయంగా వృద్ధి చేయడం, పాల ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా లింగ నిర్ధారిత వీర్యం ఇంజెక్షన్ల పంపిణీని ప్రారంభించింది. గేదెలు, ఆవులకు పెయ్యదూడలు మాత్రమే పుట్టేలా చేయడమే దీని ఉద్దేశం. రైతులకు కేవలం రూ.150కే ప్రభుత్వం లింగ నిర్ధారిత వీర్యాన్ని అందిస్తుంది. ఈ సందర్భంగా పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో మర్రిపూడి శ్రీనివాసరావు 'న్యూస్‌టుడే'కు తెలిపిన వివరాలు..


వైద్యులు సిద్ధం చేసిన లింగ నిర్ధారిత వీర్యం

- గతంలో సాధారణ వీర్యం వల్ల మగ, ఆడ దూడలు దాదాపు సమాన సంఖ్యలో పుట్టేవి. లింగ నిర్ధారిత వీర్యాన్ని ఇంజెక్షన్ల ద్వారా ఎక్కిస్తే 90 శాతం పెయ్యదూడలు పుట్టేందుకు అవకాశం ఉంటుంది.
- పెయ్య దూడ పెరిగి మూడున్నరేళ్లకు గర్భం దాల్చేనాటికి దాని విలువ రూ.లక్షకు చేరుతుంది. అప్పట్నుంచి ఏటా ఒక్కో పెయ్య దూడను ఈనుతుంది. పాల ఉత్పత్తి పెరుగుతుంది.
- గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ సహకారంతో లింగ నిర్ధారిత వీర్యాన్ని అభివృద్ధి చేశారు. ఒక్కో డోసుకు రూ.300 వరకు ఖర్చవుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు రైతులకు తక్కువ ధరకే లింగ నిర్ధారిత వీర్యం అందించాలని నిర్ణయించారు. రూ.150 సబ్సిడీ పోగా మిగిలింది రైతులు చెల్లించాలి.
- మంగళవారం నుంచి రాష్ట్రంలోని 9,326 కృత్రిమ గర్భధారణ కేంద్రాల్లో లింగ నిర్ధారిత వీర్యం పంపిణీ ప్రారంభించాం. ప్రస్తుతం 1.50 లక్షల డోస్‌లు సిద్ధంగా ఉన్నాయి. వచ్చే ఏడాది జనవరి నాటికి మరో పది లక్షల డోస్‌లు అందుబాటులో ఉంచుతాం.
- 2030 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల డోస్‌లను వేయడం ద్వారా మేలుజాతి గేదెలు, ఆవుల హబ్‌గా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి సంసిద్ధత కార్యక్రమం

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 1 నుంచి 6 తరగతుల విద్యార్థులకు తరగతి సంసిద్ధత (రెడీనెస్) కార్యక్రమాన్ని నిర్వహించాలని పాఠశాల విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది. సాఫీగా తరగతి మార్పు, పునాది దశ విద్య నేర్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. ఒకటి, రెండు తరగతులకు 45, మూడు నుంచి ఐదు తరగతులకు 30, ఆరో తరగతి విద్యార్థులకు 40 రోజుల పాటు ప్రత్యేకంగా రూపొందించిన సిలబస్‌ను బోధించాలని ఆదేశించింది. ఒకటి, రెండు తరగతులకు తెలుగు, గణితం, ఆంగ్లంతోపాటు రంగులు గుర్తించడం, శబ్దాలు విని స్పందించడం లాంటివి నేర్పిస్తారు. 3 నుంచి 6 తరగతులకు తెలుగు, గణితం, ఆంగ్లం, ఈవీఎస్‌ను బోధిస్తారు.

చెవిరెడ్డి అనుచరులకు ఈ నెల 15 వరకు రిమాండ్

- బాలాజీ యాదవ్, నవీన్ కృష్ణలు గుంటూరు జిల్లా జైలుకు తరలింపు


బాలాజీ, నవీన్‌లను విజయవాడ కోర్టులో హాజరుపరచి జైలుకి తరలిస్తున్న పోలీసులు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో అరెస్టైన వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అనుచరులు బాలాజీ కుమార్ యాదవ్ (ఏ-35), ఎద్దల నవీన్ కృష్ణలకు (ఏ-36) ఈ నెల 15 వరకూ రిమాండు విధిస్తూ విజయవాడ ఏసీబీ న్యాయస్థానం బుధవారం ఆదేశాలిచ్చింది. వీరిని గుంటూరు జిల్లా జైలుకు తరలించాలని ఆదేశాలిచ్చింది. దీంతో బుధవారం రాత్రి వారిద్దరినీ పోలీసులు గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. అంతకు ముందు ఏసీబీ న్యాయస్థానంలో సిట్, నిందితుల తరఫు న్యాయవాదులు సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు మద్యం ముడుపుల సొమ్ము తరలింపులో వీరిద్దరూ ప్రత్యక్షంగా పాల్గొన్నారని సిట్ తరఫు న్యాయవాది, ప్రాసిక్యూషన్స్ జేడీ రాజేంద్రప్రసాద్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. సాధారణ ఎన్నికల సమయంలో తీసుకొచ్చిన ఈ ముడుపుల సొమ్మును వీరు ఎవరెవరికి చేర్చారనేది రాబట్టాల్సి ఉందని, అందుకే వారికి రిమాండు విధించాలని కోరారు. అనంతరం నిందితుల తరఫున న్యాయవాది శివప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. వీరికి అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు వర్తించవని, మిగతావి ఏడేళ్లలోపు జైలు శిక్ష పడే సెక్షన్లే కనుక రిమాండు అవసరం లేదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయాధికారి. . నిందితులకు 14 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులిచ్చారు. మరోవైపు సిట్ అధికారులు తనను దూషించారని, తెల్లకాగితంపై సంతకాలు చేయాలని బెదిరించారని బాలాజీ యాదవ్ న్యాయాధికారికి ఫిర్యాదు చేశారు.

ఇప్పటికే విజయవాడ కారాగారంలో 9 మంది నిందితులు

ఇప్పటివరకు మద్యం కుంభకోణం కేసులో అరెస్టు అయిన తొమ్మిది మంది విజయవాడ కారాగారంలో ఉన్నారు. తాజాగా రిమాండ్‌కు వెళ్లిన ఇద్దరితో కలిపి అరెస్టు అయిన వారి సంఖ్య 11కు చేరింది. కీలకమైన ఈ కేసులో ఒకే జైలులో ఇంత మందిని ఉంచడం క్షేమం కాదని భావించి బాలాజీ, నవీన్‌లను గుంటూరుకు తరలించారు.

ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిల బెయిల్ పిటిషన్ల కొట్టివేత

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో జైల్లో ఉన్న సీఎంవో మాజీ కార్యదర్శి విశ్రాంత ఐఏఎస్ అధికారి కె.ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ పి.కృష్ణమోహన్‌రెడ్డిలకు బెయిల్ ఇవ్వడానికి ఏసీబీ న్యాయస్థానం నిరాకరించింది. వీరిద్దరి బెయిల్ పిటిషన్లపై సుదీర్ఘంగా విచారణ జరిపిన న్యాయస్థానం.. వాటిని కొట్టివేస్తూ బుధవారం ఆదేశాలు జారీ చేసింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ
నెం. 16 టు 23/టీటి/2025–26, ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు నోటీసు తేది. 28.06.2025
కార్యనిర్వాహక ఇంజినీరు, ఆర్.డబ్ల్యూ.ఎస్ & ఎస్ డివిజన్, భీమవరం పరిధిలోని 8 పనులు చేయుటకు గాను అంచనా విలువ రూ.255.19 లక్షలకు వివిధ నిధులతో ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు తీసుకొనుటకు ఆఖరి తేది: 17.07.2025 సా. 4 గం. వరకు. తదుపరి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.ap.eprocurement.gov.inలో సందర్శించగలరు.
ఫోన్. 9441148974
సం/- కార్యనిర్వాహక ఇంజినీరు, ఆర్.డబ్ల్యూ.ఎస్ & ఎస్ డివిజన్, భీమవరం
DIPR No. 16882/CL/ADVT/1/1/2021-22

ANDHRA PRADESH DAIRY DEVELOPMENT COOP. FEDERATION LTD
APIIC TOWERS, IT PARK, MANGALAGIRI - 522 503, GUNTUR.
Notification No:17/2021/ADMN, Date : 03-07-2025
The Andhra Pradesh Dairy Development Co-op Federation Ltd., Mangalagiri, Guntur intended for engaging B.Tech (Dairy Technology/ Dairying) candidates as Managers on contract basis to work at district level by inviting the applications through APDDCF web portal @ https://www.apddcf.ap.gov.in on or before 11-07-2025 by 5:00 PM. The site will remain accessible to apply for the notification w.e.f. 03-07-2025 by 10:00 AM onwards. For further details the interested candidates may contact during Office hours Phone No: 0863-2381081/83/85, e-mail: notification25.apddcf@gmail.com.
Sd/-
MANAGING DIRECTOR (FAC)

కారు కింద సొంత కార్యకర్త పడితే..
కుక్కపిల్లలా పక్కన పడేశారు

(మొదటి పేజీ తరువాయి)

ఎప్పుడూ ఇన్ని డ్రామాలు చూడలేదు. నేను 1995 సీబీఎన్‌ను.. 2014 సీబీఎన్‌ను కాదు' అని హెచ్చరించారు. అంతకుముందు రూ.1,207.90 కోట్లతో చేపట్టిన పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల శిలాఫలకాలను ఆవిష్కరించారు. రూ.1,617 కోట్లతో పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు, కుప్పం నియోజకవర్గ అభివృద్ధి, నైపుణ్య శిక్షణపై నాలుగు కంపెనీలతో ఎంవోయూలు చేసుకున్నారు. 3,041 మందికి కొత్తగా వితంతు, దివ్యాంగ పింఛన్లు, వెయ్యి మందికి దీపం పథకం కింద వంట గ్యాస్ ఇచ్చారు. పీ4లో భాగంగా 50 కుటుంబాలను హిందాల్కో సంస్థ దత్తత తీసుకుంది.



చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం తుమ్మిశిలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, సభకు తరలి వచ్చిన ప్రజలు

సాధక బాధకాలు తెలుసుకుని...

వాతావరణం అనుకూలించక పోవడంతో బుధవారం మధ్యాహ్నం బెంగళూరు విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో కాకుండా రోడ్డు మార్గంలో తుమ్మిశికి చంద్రబాబు చేరుకున్నారు. సభలో సీఎం ప్రసంగిస్తున్న సమయంలో వర్షం పడినా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా... తాను కుటుంబ సాధికార సమితి సభ్యుడిగా ఉన్న 49వ పోలింగ్ బూత్ పరిధి తిమ్మరాజుపల్లిలోని 26 కుటుంబాలను బుధవారం రాత్రి కలుసుకుని వారి సాధక బాధకాలు తెలుసుకున్నారు. ఏడాదిలో ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

డబుల్ సంక్షేమం అందిస్తున్నాం...

'ఏడాది పాలనలో ఏం చేశారని కొందరు అడుగుతున్నారు. గతేడాది ఏప్రిల్ నుంచే పెంచిన పింఛను అందిస్తున్నాం. దీపం-2 పథకం కింద సిలిండర్లు ఇస్తున్నాం. ఎంతమంది పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం పథకం కింద డబ్బులు ఇచ్చాం. అన్నదాతా సుఖీభవ పథకం కింద గత ప్రభుత్వంతో పోలిస్తే రెట్టింపు నగదు జమ చేస్తాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి తెస్తున్నాం. ఇంటికి పెద్ద కుమారుడిలా అందరికీ సేవ చేస్తున్నా. డబుల్ సంక్షేమం అందిస్తున్నాం. విధ్వంసమైన రాష్ట్రాన్ని వికాసం వైపు అడుగులు వేయిస్తున్నాం. హంద్రీ-నీవా పథకానికి ఏడాదిలో రూ.3,890 కోట్లు ఖర్చు చేశాం. స్వాతంత్ర్యం వచ్చాక ఒక ఏడాదిలో ఏ ప్రాజెక్టుకూ ఇన్ని డబ్బులు ఇవ్వలేదు. మనకు కులాలు, మతాలు వద్దు. అభివృద్ధే కావాలి. ఏ ప్రభుత్వం, నాయకుడు అధికారంలో ఉంటే మేలు జరుగుతుందో ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి' అని చంద్రబాబు అన్నారు.

కష్టపడేది పేదల కోసమే...

'నేను కష్టపడేది పేదల కోసం. సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నా. 2029 నాటికి పేదరికం లేని సమాజం కోసం లక్ష్యం పెట్టుకున్నా. ఈ క్రమంలో ఆర్థిక అసమానతలను తగ్గించాలి. పేదలను ఆదుకోవడానికి పీ4 విధానానికి శ్రీకారం చుట్టా. బీదవారి జీవితాల్లో వెలుగు తెచ్చేందుకు నా జీవితాంతం కృషి చేస్తా. ప్రతి ఒక్కరూ ఇంటిపై సౌర విద్యుత్తు పరికరాలు అమర్చుకునే దాకా వెంట పడతా. శాశ్వతంగా విద్యుత్తు ఛార్జీలు కట్టే పని లేకుండా ఆదుకుంటా. రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల అప్పు ఉంది. అసలు, వడ్డీలు కట్టాలి. వ్యవస్థలు పడకేశాయి. అయినా సంక్షేమాన్ని ఆపడం లేదు. కొవ్వూరు నియోజకవర్గంలో చర్మకారుడు పోసిబాబు ఇంటికి వెళ్లి డప్పు కళాకారుల కేటగిరీలో రూ.4 వేల పింఛన్‌ను ఆయనకు అందించా. ఇది నాకు ఎంతో సంతృప్తిని కలిగించింది' అని సీఎం వివరించారు.

భూములను రక్షిస్తాం..

'వైకాపా హయాంలో భూముల రికార్డుల్ని అస్తవ్యస్తం చేశారు. వారికి భూములు ఇవ్వకుంటే 22ఏలోకి ఎక్కించి వేధించారు. రీ సర్వేను పకడ్బందీగా చేసి బ్లాక్ చెయిన్ సాంకేతికతతో ప్రజల భూములను రక్షిస్తాం. 29 వేల మంది రైతులు అమరావతికి 33 వేల ఎకరాలను ఇచ్చారు. వారికి న్యాయం చేసే బాధ్యత తీసుకున్నా. కుప్పం విమానాశ్రయానికి స్థలం ఇచ్చే రైతులకూ మెరుగైన ప్యాకేజీ అందిస్తా' అని చంద్రబాబు స్పష్టంచేశారు.

ఆప్యాయంగా పలకరిస్తూ.. అభివృద్ధిని వివరిస్తూ..

- 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి లోకేశ్


తాడేపల్లి పరిధిలోని మహానాడు ప్రాంతంలో మంత్రి నారా లోకేశ్‌ను ఆప్యాయంగా పలకరిస్తున్న వృద్ధురాలు

తాడేపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని మంత్రి నారా లోకేశ్ బుధవారం గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి పరిధిలోని మహానాడు ప్రాంతం నుంచి ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి అందరినీ ఆప్యాయంగా పలకరించారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వారికి వివరించారు. దశాబ్దాలుగా పట్టాలు లేని ఇళ్లకు పట్టాలిచ్చి ఆదుకున్నారంటూ ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కృష్ణా నది వరదతో మహానాడు ప్రాంతం ముంపునకు గురికాకుండా రిటైనింగ్ వాల్ నిర్మించే ప్రాంతాన్ని జలవనరుల శాఖ అధికారులతో కలసి లోకేశ్ పరిశీలించారు. పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

పథకాలు అందుతున్న తీరుపై ఆరా

మంత్రి లోకేశ్ మహానాడు ప్రాంతంలో వెదుళ్ల మధుబాబు ఇంటికి వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. 'ఎంతోకాలంగా ఇంటి పట్టా లేక దాన్ని అమ్మాలన్నా, రుణం తీసుకోవాలన్నా చాలా ఇబ్బంది పడ్డాం. రూపాయి ఖర్చు లేకుండా మా ఇంటికి మీరు పట్టా ఇచ్చారు. మా కల నెరవేరింది' అని మధుబాబు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంటర్ చదువుతున్న తమ కుమార్తెకు 'తల్లికి వందనం' సాయం అందిందని, దీపం-2 పథకం కింద వంటగ్యాస్ సిలిండర్ ఉచితంగా పొందామని చెప్పారు. తన కుమారుడిని ఇంజినీరింగ్ చదివిస్తానని ఆయన చెప్పడంతో అండగా ఉంటానని లోకేశ్ భరోసా ఇచ్చారు.

జగన్ విద్వేషాలు రెచ్చగొడుతున్నారు

- రామచంద్రపురంలో కార్మిక మంత్రి సుభాష్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్ కూటమి ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తూ కులమతాల పేరిట విద్వేషాలు రెచ్చగొడుతున్నారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని కార్మికమంత్రి వాసంశెట్టి సుభాష్ కోరారు. రాష్ట్రంలో 'సుపరిపాలనకు తొలిఅడుగు' పేరిట బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రామచంద్రపురంలో ఆయన స్థానికులకు కూటమి ప్రభుత్వ పథకాలను వివరించారు. మహిళలకు ఈ ప్రభుత్వంలో కలుగుతున్న ప్రయోజనాలను చెబుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. పట్టణంలోని 1, 2, 3, 15, 16 వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజాభిప్రాయాలు సేకరించి మై టీడీపీ యాప్‌లో పొందుపరిచారు. వైకాపా ప్రభుత్వ హయాంలో రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌కు దెబ్బతగిలిందని, అయితే ప్రస్తుతం పారిశ్రామికవేత్తలు నవ్యాంధ్రలో రూ.9.34 లక్షల కోట్లతో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకున్నారని చెప్పారు. వీటి ద్వారా రూ.8.5 లక్షల ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి నిర్మాణం ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, 77 ప్రాజెక్టులు, పథకాల పునరుద్ధరణ తదితర అంశాలను ప్రజల్లోకి తీసుకువెళుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.


రామచంద్రపురం పట్టణం 2వ వార్డులో మహిళలకు కరపత్రం అందిస్తున్న కార్మికశాఖ మంత్రి సుభాష్

ఆర్టీసీ ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు కల్పించాలి

ఈనాడు, అమరావతి: ఆర్టీసీలో అన్ని కేడర్లలోని ఉద్యోగులు, అధికారులకు పదోన్నతులు కల్పించాలని, ఉద్యోగులందరికీ అపరిమిత రెఫరల్ వైద్య సదుపాయానికి అవకాశం ఇవ్వాలని పీటీడీ వైఎస్సార్ ఉద్యోగుల సంఘం కోరింది. బుధవారం విజయవాడలో జరిగిన సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో పలు తీర్మానాలు చేసినట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చల్లా చంద్రయ్య, జేఎం నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. కేడర్ స్ట్రెంక్త్ పేరిట సర్దుబాటు చేసినట్లు చూపినవారిని, వాళ్లు పని చేసే డిపోల్లోనే కొనసాగించేలా చూడాలని.. ఇలా 18 తీర్మానాలు చేసినట్లు వెల్లడించారు.

వైకాపా అభ్యర్థులకు మద్యం ముడుపుల సొమ్ము

(మొదటి పేజీ తరువాయి)

తదితర అంశాలపై వీరిద్దరినీ లోతుగా ప్రశ్నించాల్సి ఉందని సిట్ తెలిపింది. బాలాజీకుమార్ యాదవ్, నవీన్ కృష్ణను మధ్యప్రదేశ్‌లో అరెస్టు చేసిన సిట్ అధికారులు.. బుధవారం విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో హాజరుపరిచారు. కుట్రలో వీరి ప్రమేయం, ముడుపుల సొత్తు తరలింపులో పాత్ర తదితర అంశాలపై దర్యాప్తులో తేలిన వివరాలను రిమాండు రిపోర్టులో న్యాయస్థానానికి సమర్పించారు. అందులోని ప్రధానాంశాలివి.

అధికారంలో ఉన్నాం.. ఎవరూ అడ్డుకోరంటూ భరోసా ఇచ్చి

బాలాజీకుమార్ యాదవ్ ఏపీఎస్‌పీడీసీఎల్‌లో ఉద్యోగి అయినా నిత్యం చెవిరెడ్డి వెంటే ఉండేవారు. నవీన్‌కృష్ణ.. చెవిరెడ్డి వద్ద పీఏగా పనిచేసేవారు. వీరిద్దరూ ఆయనకు నమ్మకస్తులు. వీరితోపాటు తన వద్ద గన్‌మన్‌గా పనిచేసిన గిరిధర్, తన స్నేహితుడు వెంకటేశ్‌నాయుడు (ఏ-34), మరి కొందరిని మద్యం ముడుపుల సొమ్ము తరలింపునకు చెవిరెడ్డి వినియోగించారు. వైకాపాయే అధికారంలో ఉన్నందున మద్యం ముడుపుల సొమ్ము రవాణాకు ఇబ్బంది ఉండదని, ఎవరూ అడ్డుకోరని గన్‌మన్ గిరిధర్‌కు భరోసా ఇచ్చి మరీ ఈ ముడుపుల సొమ్ము తరలింపులో భాగస్వామిని చేశారు.

- చెవిరెడ్డి భాస్కరరెడ్డి కుమారుడు, అప్పట్లో తుడా ఛైర్మన్‌గా పనిచేసిన మోహిత్‌రెడ్డి (ఏ-38) ఏపీ 39 బీవీ 3259 నంబరు కలిగిన తన అధికారిక వాహనాన్ని, తుడా డ్రైవర్ రామరాజును సొమ్ము తరలింపు కోసం బాలాజీ యాదవ్, నవీన్ కృష్ణ, గిరిధర్‌తో పంపించేవారు. ఈ ముఠా ఎప్పటికప్పుడు హైదరాబాద్, తాడేపల్లికి వెళ్లి సొమ్ము తీసుకొచ్చేది. ఆయా తేదీల్లో వారి కాల్ డీటైల్ రికార్డులు (సీడీఆర్), టోల్‌ప్లాజాల్లో నమోదైన వివరాల్ని విశ్లేషిస్తే ఇది స్పష్టమవుతోంది.

తుడా వాహనాల్లో డబ్బులు తరలించటం చూశామని సాక్షులు చెప్పారు

- తాడేపల్లి ప్యాలెస్‌కు (జగన్ నివాసం) సమీపంలోని ల్యాండ్‌మార్క్ అపార్ట్‌మెంట్ నుంచి తుడా వాహనంలో ఎప్పటికప్పుడు అట్టపెట్టెల్లో డబ్బు తరలించడం తాము చూశామని అక్కడ నివసించే పలువురు వ్యక్తులు, భద్రతా సిబ్బంది మాకు (సిట్) వాంగ్మూలమిచ్చారు. ఈ క్యాష్ హ్యాండ్లర్‌గా ప్రణోయ్ ప్రకాశ్ అనే వ్యక్తి వ్యవహరించారు. ఆయన దగ్గర నుంచి ఒక్కో విడతలో రూ.8-9 కోట్ల మొత్తాల్ని బాలాజీ యాదవ్, నవీన్‌కృష్ణ తీసుకొచ్చి తిరుపతికి తరలించేవారు.
- చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆదేశాల మేరకు 2024 మార్చి 1, 2, 24, 25, 26, ఏప్రిల్ 1, 2, 27, 28, మే 6, 7, 8 తేదీల్లో బాలాజీయాదవ్, నవీన్‌కృష్ణ హైదరాబాద్ నుంచి ఏపీకి ముడుపుల సొమ్ము తీసుకొచ్చారు. రాజ్ కెసిరెడ్డి (ఏ-1), బూనేటి చాణక్య (ఏ-8) పైలా దిలీప్ (ఏ-30), వెంకటేశ్ నాయుడు (ఏ-34) నుంచి ఈ సొమ్ము తీసుకునేవారు. అలా గతేడాది మే 8న రూ.8.36 కోట్ల డబ్బు తీసుకొస్తుండగా... గరికపాడు చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో పట్టుబడింది.
- వెంకటేశ్ నాయుడు నివసించే హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని క్రిషే వ్యాలీ అపార్ట్‌మెంట్స్‌కి బాలాజీయాదవ్, నవీన్‌కృష్ణ పలుమార్లు వెళ్లి ముడుపుల సొత్తు తీసుకొచ్చారు. దీన్ని ఒంగోలులోని వైకాపా నాయకులకు అందజేశారు. హైదరాబాద్‌లోని వెంకటేశ్‌నాయుడి ఇల్లు క్యాష్ కలెక్షన్ పాయింట్‌గా ఉండేది.
- మద్యం ముడుపుల సొమ్ము తరలింపునకు తుడా వాహనాన్నే కాకుండా... ఏపీ 03టీఏ 4566 నంబరు లారీని విస్తృతంగా వినియోగించారు.

విచారణకు నోటీసులిస్తే పారిపోయారు

సిట్ విచారణకు హాజరుకావాలంటూ జూన్ 21, 27 తేదీల్లో నవీన్‌కృష్ణ, బాలాజీయాదవ్‌లకు నోటీసులివ్వగా.. వారు గైర్హాజరయ్యారు. దర్యాప్తునకు ఆటంకం కలిగించాలని, వాస్తవాల్ని తొక్కిపెట్టాలనే దురుద్దేశంతో వీరిద్దరూ పరారైపోయారు. మద్యం ముడుపుల సొమ్ము సేకరణ, నిల్వ, తరలింపు, పంపిణీ వ్యవహారాలు వీరిద్దరికీ తెలుసు. అందుకే వీరిని ప్రశ్నించాల్సి ఉంది.

ఆకస్మిక మరణాలకు కొవిడ్ వ్యాక్సిన్ కారణం కాదు

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేసింది.

ముప్పు లేదని స్పష్టంగా తేలింది

"ఆకస్మిక మరణాలపై దేశంలోని పలు సంస్థలు పరిశీలించాయి. ఈ మరణాలకు, కొవిడ్ వ్యాక్సిన్లకు నేరుగా సంబంధంలేదని అధ్యయనాలు విస్పష్టంగా నిర్ధారించాయి. భిన్న సమస్యల కారణంగా ఆకస్మికంగా హృదయ సంబంధ మరణాలు సంభవిస్తుండొచ్చు. అనువంశిక సమస్యలు, జీవనశైలి, అంతకుముందే ఉన్న ఆరోగ్య పరిస్థితులు, కొవిడ్ అనంతరం తలెత్తిన సమస్యలు అందుకు కారణం కావొచ్చు. 18-45 ఏళ్ల వయసువారిలో ఆకస్మికంగా సంభవిస్తున్న మరణాల వెనుక కారణాలను కనుక్కోవడానికి ఐసీఎంఆర్, ఎన్‌సీడీసీలు రెండు అధ్యయనాలు నిర్వహించాయి. ఇందులో ఒక అధ్యయనం గత డేటా ఆధారంగా, రెండోది ప్రస్తుత వైద్యపరీక్షల నివేదికల ఆధారంగా చేపట్టాయి. తొలి అధ్యయనాన్ని 2023 మే-ఆగస్టు మధ్య 19 రాష్ట్రాల్లోని 47 ఆసుపత్రుల్లో చేశారు. యుక్తవయస్సు వారిలో ఆకస్మిక మరణాల ముప్పును కొవిడ్ వ్యాక్సిన్ పెంచలేదని ఇందులో స్పష్టంగా తేలింది.

జన్యుమార్పులే కారణమై ఉండొచ్చు

'యుక్తవయసువారిలో ఆకస్మిక మరణాలకు కారణాల నిరూపణ' పేరుతో ఐసీఎంఆర్ సహకారంతో దిల్లీ ఎయిమ్స్ ప్రస్తుతం రెండో అధ్యయనం చేస్తోంది. ప్రాథమిక అంశాల ప్రకారం గుండెపోటు, లేదా గుండె కండరాలకు రక్తప్రసరణ ఆగిపోయి కండరాలు నశించడం (మయోకార్డియల్ ఇన్‌ఫార్క్షన్) ఈ వయోవర్గంలో ఆకస్మిక మరణాలకు దారితీస్తోంది. గత సంవత్సరాలతో పోలిస్తే కారణాల్లో పెద్దగా మార్పులేమీ కనిపించలేదు. జన్యుమార్పులే మరణాలకు కారణమై ఉండొచ్చు. అధ్యయనం పూర్తయ్యాక అంతిమ ఫలితాలు వెల్లడిస్తాం. మరణాల ముప్పును కొవిడ్ వ్యాక్సిన్ పెంచడంలేదని అధ్యయనాలు స్పష్టంచేశాయి. మరణాలను కొవిడ్ వ్యాక్సిన్‌తో ముడిపెట్టడం తప్పుదోవ పట్టించడమేనని నిపుణులు పునరుద్ఘాటిస్తున్నారు. కొవిడ్ సమయంలో కోట్లమంది ప్రాణాలను కాపాడిన వ్యాక్సిన్ల పట్ల ప్రజావిశ్వాసాన్ని సడలించేలా వదంతులు వ్యాప్తి చేస్తున్నారు. ఇది టీకాలపై విముఖత పెంచి, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రజల ఆరోగ్యాన్ని రక్షించడానికి సాక్ష్యాధారిత పరిశోధనల నిర్వహణకు కేంద్రం కట్టుబడి ఉంది" అని వైద్య-ఆరోగ్యశాఖ స్పష్టంచేసింది.



పోలీసుల చేతిలో సోలార్ మైకులు



చిత్తూరు జిల్లాలో తుమ్మిసి వద్ద జరుగుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు సభలో పోలీసులు విభిన్నమైన మైకులను ఉపయోగించడం ఆకట్టుకుంది. ఈ మైకులు సౌరశక్తితో పనిచేస్తాయని, ఎండ లేనప్పుడు విద్యుత్ ద్వారానూ ఛార్జ్ చేసుకోవచ్చని పోలీసులు వివరించారు.
– ఈనాడు, చిత్తూరు

న్యాయవాదులకు రూ.4.42 కోట్ల ఆర్థిక ప్రయోజనాలు

ఈనాడు, అమరావతి: న్యాయవాదుల మరణ ప్రయోజనాలు, వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందించాలంటూ వచ్చిన దరఖాస్తులను పరిష్కరిస్తూ ఏపీ న్యాయవాదుల సంక్షేమ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఇటీవల జరిగిన సంక్షేమ కమిటీ సమావేశంలో హైకోర్టు, ఏపీ న్యాయశాఖ ప్రతినిధులతో పాటు ఏపీ బార్ కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకానాథరెడ్డి, సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు, పి.నరసింగరావు పాల్గొన్నారు. మృతి ప్రయోజనం కింద 75 మంది న్యాయవాదుల కుటుంబసభ్యులకు రూ 3.77 కోట్లు, వైద్య ఖర్చుల నిమిత్తం 85 మంది న్యాయవాదులకు ఆర్థిక సాయంగా రూ.50.40 లక్షలు, పదవీవిరమణ ప్రయోజనం కింద ఐదుగురు న్యాయవాదులకు రూ.15 లక్షలతో మొత్తం కలిపి రూ.4.42 కోట్లను మంజూరుచేసింది.

- మరోవైపు న్యాయవాదుల గుమాస్తాల సంక్షేమ నిధి నుంచి క్లర్కులు, వారి కుటుంబాలకు రూ.51.82 లక్షలు మంజూరుచేశారు.

ద్రోణి ప్రభావంతో వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

ఓ మోస్తరు వర్షాలకు అవకాశముందని భారత వాతావరణ విభాగం తెలిపింది. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో సోమవారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించింది. ద్రోణి ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ఏలూరు జిల్లా వేలేరుపాడులో 10 సెంటీమీటర్లు, అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరంలో 9 సెంటీమీటర్లు, ఏలూరు జిల్లా కుకునూరులో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. బుధవారం కర్నూలు, వైఎస్సార్ కడప, నంద్యాల, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు తదితర జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అత్యధికంగా కర్నూలు జిల్లా ఆదోనిలో 6.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.



ఆత్మవిశ్వాసం అంటే నటించడం కాదు!

ఆత్మవిశ్వాసంతో ఉండటమంటే మీరు కాని వ్యక్తిలా నటించడం కాదు. ఆత్మవిశ్వాసం అంటే- మీలా మీరు సౌకర్యవంతంగా ఉండగలగడం. సవాళ్లను అధిగమించి విజయవంతం కాగలమని మీపై మీరు నమ్మకం కలిగి ఉండటం.
– స్టీవ్ మాగ్నెస్, రచయిత

గ్రహం అనుగ్రహం

3–7–2025 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; గ్రీష్మ రుతువు, ఆషాఢ మాసం, శుక్లపక్షం
అష్టమి: మ. 2-40 తదుపరి నవమి
హస్త: మ. 3-08 తదుపరి చిత్త
వర్జ్యం: రా. 11-55 నుంచి 1-40 వరకు
అమృత ఘడియలు: ఉ. 8-37 నుంచి 10-21 వరకు
దుర్ముహూర్తం: ఉ. 9-53 నుంచి 10-45 వరకు తిరిగి మ. 3-06 నుంచి 3-58 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.5.33; సూర్యాస్తమయం: సా.6.35

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
నెల్లూరు	37.7	29.0
తిరుపతి	36.4	28.8
కడప	35.0	27.0
ఒంగోలు	34.7	26.0
అనంతపురం	33.3	22.5
తాడేపల్లిగూడెం	32.8	26.3
గుంటూరు	32.0	26.0
విజయవాడ	30.4	24.4
నరసాపురం	30.3	24.3
కర్నూలు	28.6	25.2
శ్రీకాకుళం	28.0	25.0
విజయనగరం	28.0	22.0
విశాఖపట్నం	27.2	24.6
రాజమహేంద్రవరం	27.0	23.0
హైదరాబాద్	26.0	21.1

(c) eenadu

కుంటలు తవ్వించినందుకు వాటర్ మిషన్ అభినందన



రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజను అభినందిస్తున్న జాతీయ వాటర్ మిషన్ డైరెక్టర్ అశోక్‌బాబు

ఈనాడు, అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా రాష్ట్రంలోని రైతుల భూముల్లో లక్ష పంట కుంటలు తవ్వించినందుకుగాను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజను జాతీయ వాటర్ మిషన్ డైరెక్టర్ అశోక్‌బాబు అభినందించారు. కమిషనర్ కృష్ణతేజ బుధవారం దిల్లీలోని జాతీయ వాటర్ మిషన్ డైరెక్టర్‌ను కలిసి జల సంరక్షణకు సంబంధించి రాష్ట్రంలో చేపట్టిన వివిధ పనులు, అమలు చేసిన కార్యక్రమాలను వివరించారు.

వేధిస్తున్నాడని కాలు నరికివేత

- ఆ కాలును గ్రామస్థులకు చూపిస్తూ బైకుపై తిరిగిన నిందితులు
- రక్తస్రావంతో బాధితుడి మృతి
- కర్నూలు మండలం సూదిరెడ్డిపల్లిలో ఘటన



కాలుతో ద్విచక్రవాహనంపై తిరుగుతున్న నిందితులు



శేషన్న

ఈనాడు, కర్నూలు; కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే: సూటిపోటి మాటలతో తరచూ వేధిస్తున్న వ్యక్తి కాలు నరికేసి.. దానితో బైక్‌పై ఊరంతా తిరిగారు నిందితులు. ఈ ఘటనలో బాధితుడు తీవ్ర రక్తస్రావమై మృతి చెందాడు. సంచలనం సృష్టించిన ఈ హత్య కర్నూలు మండలం సూదిరెడ్డిపల్లిలో మంగళవారం రాత్రి జరిగింది. సూదిరెడ్డిపల్లికి చెందిన లారీ డ్రైవర్ కురవ శేషన్న(62) అదే గ్రామానికి చెందిన పరశురాముడిని తరచూ వేధించేవాడు. పరశురాముడికి వినికిడి లోపం ఉండని చులకనగా మాట్లాడుతూ, అతని భార్యనూ హేళన చేసేవాడు. పలుమార్లు చెప్పిచూసినా శేషన్న తీరు మార్చుకోలేదు. దీంతో ఆగ్రహానికి గురైన పరశురాముడు సోదరులు బీసన్న, కుమార్, గోవిందప్పలతో కలిసి మంగళవారం రాత్రి శేషన్న ఇంట్లోకి వెళ్లి.. వేట కొడవళ్లతో అతని కుడి కాలును మోకాలి వరకు నరికేశారు. ఆ కాలును ద్విచక్రవాహనంపై ప్రదర్శిస్తూ ఊరిలో తిరిగారు. అనంతరం తాలూకా పోలీసుస్టేషన్ సమీపంలో కాలును విసిరేసి, పోలీసులకు లొంగిపోయారు. నిందితులు బైక్‌పై చక్కర్లు కొట్టిన వీడియోలు బుధవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

విదేశాల్లో వైద్యవిద్య పూర్తిచేసి వచ్చినవారిపై మీకెందుకు ఈ పగ?

సీఎం చంద్రబాబుపై వైకాపా అధ్యక్షుడు జగన్ విమర్శలు

ఈనాడు, అమరావతి: 'విదేశాల్లో వైద్యవిద్య పూర్తి చేసి, ఎన్‌ఎంసీ మార్గదర్శకాల ప్రకారం ఇక్కడ ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేషన్ పరీక్షలో (ఎఫ్‌ఎంజీఈ) ఉత్తీర్ణులై, తర్వాత ఇక్కడే ఇంటర్న్‌షిప్ పూర్తిచేసినా ఆ విద్యార్థులకు ఎందుకు శాశ్వత రిజిస్ట్రేషన్ నంబరు ఇవ్వడం లేదు' అని ముఖ్యమంత్రి చంద్రబాబును 'ఎక్స్' వేదికగా మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రశ్నించారు. 'రిజిస్ట్రేషన్ నంబరు అడిగిన విద్యార్థులపై పోలీసులతో దాడులు చేయిస్తారా? ఇంటర్న్‌షిప్ పేరుతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ, ప్రైవేటు వైద్య కళాశాలలకు లాభం చేకూర్చేలా, ఉద్దేశపూర్వకంగా వీరికి పర్మినెంట్ రిజిస్ట్రేషన్ (పీఆర్) నంబరు ఇవ్వకపోవడం వాస్తవం కాదా? ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన వారికి వెంటనే రిలీవింగ్ ఉత్తర్వులివ్వాలి' అని డిమాండ్ చేశారు. ఈ విద్యార్థులు అంతకుముందు జగన్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి మాట్లాడారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ వద్ద నిరసన తెలిపిన తమపై పోలీసులు దాడిచేశారని వాపోయారు. నిబంధనల ప్రకారం అర్హతలన్నీ పొందిన తమకు శాశ్వత రిజిస్ట్రేషన్ నంబరు ఇవ్వాలని తెలిపారు.

6 నుంచి డీఈఈసెట్ ప్రవేశాల కౌన్సెలింగ్

ఈనాడు, అమరావతి: డీఈఈసెట్ ప్రవేశాల కౌన్సెలింగ్ ఈ నెల 6 నుంచి ప్రారంభించనున్నారు. మొదటి విడత కౌన్సెలింగ్‌కు సంబంధించి సీట్ మ్యాట్రిక్స్‌ను 6, 7 తేదీల్లో సిద్ధం చేస్తారు. కళాశాలల ఎంపిక కోసం వెబ్ ఐచ్ఛికాలకు 8 నుంచి 12 వరకు అవకాశం కల్పించారు. సీట్ల కేటాయింపు, ప్రొవిజనల్ లెటర్ల జారీ 13 నుంచి 16 వరకు కొనసాగనుంది. డైట్లలో సర్టిఫికెట్ల పరిశీలన 17 నుంచి 22 వరకు నిర్వహిస్తారు. 25 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

ఇంటర్మీడియట్ ప్రవేశాల గడువు పొడిగింపు

ఈనాడు, అమరావతి: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల గడువును ఈ నెల 31 వరకు పొడిగించినట్లు ఇంటర్మీడియట్ విద్యా శాఖ డైరెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 30తో ప్రవేశాల గడువు ముగిసింది. కొన్ని కళాశాలల అభ్యర్థన మేరకు ప్రవేశాల గడువును పొడిగించారు. పదో తరగతిలో సప్లిమెంటరీ పరీక్షలతో కలిపి మొత్తం 5,92,602 మంది ఉత్తీర్ణత సాధించగా ఇప్పటి వరకు ఇంటర్మీడియట్‌లో 4.90 లక్షల మంది చేరారు. కొంత మంది ఐటీఐ, పాలిటెక్నిక్, ఇతరత్ర కోర్సుల్లో ప్రవేశాలు పొందారు.

నాటి పశువుల కాపరి... పరిశోధకుడయ్యారు!

- 13 ఏళ్ల వరకు బడి ముఖం చూడలేదు
- 14 ఏళ్ల వయసులో నేరుగా ఏడో తరగతిలో చేరిక
- 35 సంవత్సరాలకు జియాలజీలో పీహెచ్‌డీ పూర్తి
- స్ఫూర్తిమంతం... నాగర్‌కర్నూల్ జిల్లా యువకుడు పరమేశ్ జీవనయానం




ఈనాడు, హైదరాబాద్: పదమూడు సంవత్సరాల వయసు వచ్చేవరకు బడికి వెళ్లలేదు.. బలపం పట్టలేదు. తల్లిదండ్రులు కూలి పనులకు వెళితే ఇంట్లో ఉన్న తన తమ్ముళ్లను, చెల్లిని ఆడించేవాడు. తొమ్మిదేళ్ల వయసులో పనిలో చేరాడు. నాన్న జీతానికి ఉండే ఇంట్లో పశువుల కాపరిగా నాలుగేళ్లు పనిచేశాడు. ఆ సమయంలో ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అతడిని గుర్తించారు. చదువంటే ఇష్టమని చెప్పగా ఏడాదిపాటు బ్రిడ్జి కోర్సు గురించి ఆయన వివరించి అతడిని చదువు బాట పట్టించారు. నాటి పశువుల కాపరే తాజాగా ఓయూ జియాలజీ విభాగం నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఆయనే నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం కొండనగుల గ్రామానికి చెందిన చింతా పరమేశ్. స్కూలుకు వెళ్లకపోయినా చదువు మీద ఆసక్తితో దసరా పండగకు కొత్త దుస్తులుగా స్కూల్ యూనిఫామ్ కుట్టించుకున్నాడు. వాటిని ధరించి ఊళ్లో గుడి వద్ద జరుగుతున్న జాతరకు వెళుతుంటే ఎంవీ ఫౌండేషన్ కార్యకర్త మౌలాలీ గమనించి వివరాలు సేకరించారు. ఊరికి సమీపంలోని రాంపూర్‌లో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రిడ్జ్ క్యాంపు ఉందని...అందులో చదువుకోవచ్చని చెప్పగా... తల్లిదండ్రులను ఒప్పించి పరమేశ్ అందులో చేరాడు. అక్కడ అక్షరాలు దిద్ది.. చదవడం నేర్చుకున్నాడు. 14 ఏళ్ల వయసులో అక్కడి నుంచే ఏడో తరగతి బోర్డు పరీక్షలు రాసి ఉత్తీర్ణుడయ్యాడు. ఆ తర్వాత బల్మూరు మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ వసతిగృహంలో ఉంటూ... అక్కడ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటూ పదో తరగతి ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాడు. కల్వకుర్తిలోని గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్, హైదరాబాద్ సైఫాబాద్‌లోని సైన్స్ కళాశాలలో బీఎస్సీ, ఓయూ ప్రాంగణంలో ఎంఎస్సీ జియాలజీ పూర్తి చేశాడు. పీజీలో 85 శాతం మార్కులతో డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణుడయ్యాడు.

ప్రొఫెసర్ కావాలన్నదే లక్ష్యం...

పీజీలో ఉత్తమ మార్కులు సాధించడంతో పరమేశ్ ఓయూలో పీహెచ్‌డీ సీటు సంపాదించాడు. రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్‌నకు ఎంపిక కావడంతో పీహెచ్‌డీ పూర్తి చేయడం సులభమైంది. ఆచార్య మురళీధర్ పర్యవేక్షణలో అమ్రాబాద్, పదర మండలాల్లో భూగర్భ జల పరిస్థితులపై అధ్యయనం చేసి పరిశోధనా పత్రం సమర్పించారు. 35ఏళ్ల వయసులో ఇటీవల పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ప్రస్తుతం ఓ ప్రైవేటు సంస్థలో జియాలజిస్టుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా పరమేశ్ మాట్లాడుతూ ప్రొఫెసర్ కావడమే లక్ష్యమని చెప్పారు.

విద్యార్థుల అభ్యసన ఫలితాలపై మరింత దృష్టి

- ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం: మంత్రి లోకేశ్
- 'షైనింగ్ టీచర్' పేరుతో ఉపాధ్యాయురాలు కళ్యాణికి సన్మానం



ఉపాధ్యాయురాలు ఎం.కళ్యాణి కుమారికి జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: పాఠశాల విద్యా శాఖలో మొదటి ఏడాది సంస్కరణలు పూర్తయ్యాయని, ఇకపై విద్యార్థుల అభ్యసన ఫలితాలపై మరింత దృష్టి సారిస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. కర్నూలు జిల్లా పత్తికొండ మండలంలోని మారుమూల గిరిజన గ్రామం జేఎం తండాలోని ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలో వృత్తిపట్ల అంకితభావం చూపి, మంచి ఫలితాలు సాధించిన ఉపాధ్యాయురాలు ఎం.కళ్యాణికుమారిని మంత్రి అభినందించారు. ఆమె కుటుంబ సభ్యులతో సహా ఉండవల్లి నివాసానికి పిలిపించుకుని 'షైనింగ్ టీచర్' పేరుతో బుధవారం ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడంపై అభినందించారు. మంత్రి మాట్లాడుతూ.. "ఇకపై ఉత్తమ ఉపాధ్యాయులను కలిసి సలహాలు, సూచనలు స్వీకరిస్తాం. స్టార్ ఆఫ్ ద వీక్ ఆలోచన బాగుంది. డిజిటల్ విద్యకు ప్రాధాన్యమిస్తాం. ప్రభుత్వ బడులపై నమ్మకం కలిగించేలా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులం దృష్టి సారించాం" అని వెల్లడించారు.

దీర్ఘాయుష్మాన్‌భవతో వ్యక్తిగత శుభ్రత: టీచర్ కళ్యాణి

ఉపాధ్యాయురాలు కళ్యాణి మాట్లాడుతూ.. "విద్యార్థులు ఉన్నతంగా రాణించాలనే ఆశయంతో పనిచేశా. స్టార్ ఆఫ్ ది వీక్ పేరుతో ప్రతి సోమవారం హోంవర్క్, చేతిరాత, వ్యక్తిగత శుభ్రత, క్రమశిక్షణ, హాజరు, ఏకరూప దుస్తుల్లో అత్యుత్తమంగా నిలిచిన వారికి బహుమతి అందచేస్తా. 'దీర్ఘాయుష్మాన్‌భవ' పేరుతో విద్యార్థుల పుట్టినరోజు నాడు వ్యక్తిగత పరిశుభ్రత తెలియచేసేలా సబ్బు ప్రదానం చేసే సంస్కృతి తీసుకువచ్చాం. పిల్లలు బాగా చదవకపోతే తల్లిదండ్రులతో మాట్లాడతా" అని వివరించారు. 2017లో జేఎం తండా ప్రాథమిక పాఠశాలకు కళ్యాణి బదిలీ అయిన సమయంలో అక్కడ విద్యార్థుల సంఖ్య 14 ఉండగా.. ప్రస్తుతం 43 మందికి పెరిగారు.

మెడ్‌టెక్ జోన్.. చంద్రబాబు దార్శనికతకు నిదర్శనం

విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్(ఏఎంటీజెడ్) సీఎం చంద్రబాబు దార్శనికతకు నిదర్శనమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. ఏఎంటీజెడ్ దేశంలోనే అతిపెద్ద మెడ్‌టెక్ పరికరాల తయారీ, ఎగుమతి కేంద్రంగా ఎదిగి.. భారత్‌ను మెడ్‌టెక్ రంగంలో కీలకంగా మార్చిందని ఎక్స్ వేదికగా బుధవారం పేర్కొన్నారు. ఏఎంటీజెడ్‌పై డీడబ్ల్యూ ఏసియా అనే సంస్థ వీడియోను రూపొందించి ఎక్స్‌లో పోస్టు చేసింది. దీనికి లోకేశ్ స్పందించారు. 'వైద్య పరికరాల ఉత్పత్తిలో దేశాన్ని స్వయంసమృద్ధిగా మార్చే లక్ష్యంతో 2016లో ఏఎంటీజెడ్‌ను చంద్రబాబు ప్రారంభించారు. తమిళనాడుకు చెన్నై ఉంది. కర్ణాటకకు బెంగళూరు ఉంది. ఆంధ్రప్రదేశ్‌కు ఏముందని అడిగితే... చంద్రబాబు ఉన్నారని గర్వంగా చెబుతాం' అని లోకేశ్ పేర్కొన్నారు. డీడబ్ల్యూ ఏసియా వీడియోను తన పోస్టుకు జోడించారు.

చెప్పి కూలదు.. ముప్పు తప్పదు!





మచిలీపట్నం కోనేరు సెంటర్లో వృత్తాకారంలో ఉండే నగరపాలక సంస్థ దుకాణ సముదాయమిది. 270 షాపులతో ఉండే ఈ భవనం నిత్యం వందల మంది రాకపోకలతో సందడిగా ఉంటుంది. ఏళ్ల తరబడి ఉన్న ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో పైకప్పు పెచ్చులూడి ఇనుపచువ్వలు బయటకు చొచ్చుకొచ్చాయి. కొన్ని దుకాణాల్లో స్లాబులు కూలిపోవడంతో ఖాళీ చేసేశారు. ఈ నిర్మాణాన్ని కూల్చేసి కొత్తది నిర్మించాలన్న ప్రతిపాదన ఉన్నప్పటికీ అది జరిగేలోపే కూలిపోతే పలువురు ప్రాణాలు కోల్పోయే ప్రమాదముంది. వీలైనంత త్వరగా అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. - ఈనాడు, అమరావతి

ఏటా నెలైనా ప్రభుత్వ దవాఖానాల్లో సేవలందించాలి

- ప్రైవేటు, కార్పొరేట్ వైద్యులకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- డాక్టర్ నాగేశ్వరరెడ్డికి భారతరత్న వచ్చేలా కృషి చేస్తానని వెల్లడి
- ఏఐజీ ఆసుపత్రి బంజారాహిల్స్ శాఖ ప్రారంభం



స్వాగతం పలుకుతున్న రోబోను చూసి నవ్వులు చిందిస్తున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో డా.జీవీరావు, డా.నాగేశ్వరరెడ్డి, డా.పీవీఎస్ రాజు, సీవోవో కాప్రి జలోటా

ఈనాడు, హైదరాబాద్: ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు ఏడాదిలో కనీసం నెల రోజులైనా ప్రభుత్వ దవాఖానాల్లో నిరుపేదలకు సేవలు అందించే ఆలోచన చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. సామాజిక బాధ్యతగా పేదలకు సేవలు అందించడం వల్ల గొప్ప ఆత్మసంతృప్తి దొరుకుతుందని అన్నారు. హైదరాబాద్ నగరం బంజారాహిల్స్ రోడ్ నం.1లో ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ(ఏఐజీ) ఆసుపత్రి నూతన శాఖను ఏఐజీ ఛైర్మన్ డి.నాగేశ్వరరెడ్డితో కలిసి సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. 'కార్పొరేట్ ఆసుపత్రుల వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందించాలంటే ఇప్పటివరకు సరైన వేదిక లేదు. తప్పక ఏర్పాటు చేస్తాం' అని ప్రకటించారు. 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తున్నాం. అందులో హెల్త్ టూరిజం ఒక చాప్టర్‌గా ఉంటుంది. ఈ ప్రణాళికలో డాక్టర్ నాగేశ్వరరెడ్డిని కూడా భాగం పంచుకోవాలని కోరుతున్నా. ఏఐజీ లాంటి అతి పెద్ద ఆసుపత్రిని అందుబాటులోకి తెచ్చినందుకు డాక్టర్ ఆయనకు అభినందనలు. ఇప్పటికే ఆయనకు మూడు పద్మ అవార్డులు వచ్చాయి. భారతరత్న వచ్చేందుకు నావంతు కృషి చేస్తా' అని సీఎం అన్నారు.

నాణ్యమైన సేవలు, పరిశోధనలే లక్ష్యం: డా.నాగేశ్వరరెడ్డి

ఏఐజీ ఛైర్మన్ డా.నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ స్థాయి నాణ్యమైన సేవలు అందించటం, పరిశోధనలు చేయటమే ఏఐజీ ఆసుపత్రుల లక్ష్యమన్నారు. "హైదరాబాద్ ప్రజలకు వైద్యసేవలు మరింత చేరువ చేసేందుకు బంజారాహిల్స్ శాఖ ప్రారంభించాం. 25 ఏళ్ల క్రితం 300 పడకలతో సోమాజిగూడలో తొలుత ఏఐజీ ఆసుపత్రి స్థాపించాం. తర్వాత గచ్చిబౌలిలో వేయి పడకలతో పాటు ప్రపంచ స్థాయి వసతులతో మరో ఆసుపత్రి ఏర్పాటు చేశాం. బంజారాహిల్స్ ఏఐజీలో జీవ సైన్సెస్‌తో పాటు కార్డియాలజీ ఎక్సలెన్స్ కేంద్రాలు ఉంటాయి. పీడియాట్రిక్ కార్డియాక్ సర్జరీ, లివర్ సైన్సెస్, పల్మనరీ మెడిసిన్, న్యూరో సైన్సెస్, రీనల్, బ్లాడర్ సైన్సెస్‌తో పాటు అనేక ఇతర కీలక ప్రత్యేకతలు ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వ సహకారంతో పటాన్‌చెరు ప్రాంతంలో 140 పల్లెలను దత్తత తీసుకొని వైద్యసేవలు అందిస్తున్నాం" అని తెలిపారు. కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఏఐజీ వైస్-ఛైర్మన్ డాక్టర్ పీవీఎస్ రాజు, సీవోవో కాప్రి జలోటా, డా.జీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

తితిదేను అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తించాలి

- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్. వేదికపై నారాయణరావు, శ్రీరామ్, వెంకటేశ్వర్లు తదితరులు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానాన్ని అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కోరారు. బుధవారం విజయవాడలో నిర్వహించిన జాతీయ హిందూ ధార్మిక సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ఇటీవల నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం ద్వారా భారతీయ ఆధ్యాత్మిక విలువలను ప్రపంచానికి చాటిచెప్పిందన్నారు. సాధు పరిషత్ గౌరవాధ్యక్షుడు అల్లూరి నారాయణరావు మాట్లాడుతూ.. దేవాలయాలపై ఇచ్చిన వివాదాస్పద జీవోను రద్దు చేయాలని, తిరుపతిని ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రకటించి మద్య, మాంస రహితంగా తీర్చిదిద్దాలని కోరారు.

సమావేశంలో చేసిన తీర్మానాలు

'గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి. అయోధ్య, కాశీ యాత్రలకు వెళ్లే భక్తులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలి. ప్రతి ఆలయ అర్చకుడికి గౌరవ వేతనం రూ.10 వేలు ఇవ్వాలి. ప్రతి గ్రామంలోని దేవాలయాల భూముల్లో గోశాలలు నిర్వహించాలి. ప్రతి జిల్లాలో తితిదే ఆధ్వర్యంలో నూతన విద్యాలయాలు ఏర్పాటు చేయాలి' అని కోరుతూ తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సాధు పరిషత్ రాష్ట్ర అధికార ప్రతినిధి తురగా శ్రీరామ్, గాయకుడు గజల్ శ్రీనివాస్, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రవి, పెద్ద సంఖ్యలో సాధువులు పాల్గొన్నారు.

4న మార్కాపురంలో పవన్ కల్యాణ్ పర్యటన

ఈనాడు, అమరావతి: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ నెల 4న ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. నరసింహపురంలో రూ.1,290 కోట్ల విలువైన అతి పెద్ద తాగునీటి పథకం పనులకు శంకుస్థాపన చేస్తారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు.

పవన్‌కల్యాణ్‌పై కేసు మురుగన్‌పై దాడే: మాధవ్

ఈనాడు, అమరావతి: సనాతన ధర్మం నాశనమైపోవాలనే నీచమైన ఆలోచనతో తమిళనాడు ప్రభుత్వం ఉందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో పాటు భాజపా నేతలపై కేసు పెట్టడం మురుగన్‌పై దాడిగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. బుధవారం ఆయన విజయవాడలో విలేకర్లతో మాట్లాడారు. అన్నామలైకి అండగా పవన్‌కల్యాణ్ రంగంలోకి దిగారన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో గత 6 నెలల్లో జరిగిన రెండు ఘటనల్లో ఉగ్రశిక్షణ పొందినవారి పాత్ర ఉందనే అనుమానాన్ని పీవీఎన్ మాధవ్ వ్యక్తం చేశారు.

'పీ4' కింద నిరుపేద కుటుంబాన్ని దత్తత తీసుకున్న మంత్రి అనిత



బాజ్జీతో మాట్లాడుతున్న మంత్రి అనిత

నక్కపల్లి, న్యూస్‌టుడే: పీ4 మార్గదర్శి - బంగారు కుటుంబం కింద అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం దార్లపూడికి చెందిన ఓ కుటుంబాన్ని మంత్రి వంగలపూడి అనిత దత్తత తీసుకున్నారు. ఆ మేరకు నక్కపల్లి మండలం సారిపల్లి పాలెంలోని తన క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం సదరు కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు ప్రకటించారు. దార్లపూడిలో నివాసం ఉంటున్న నల్లమారి బాజ్జీది నిరుపేద కుటుంబమని, తెదేపాకు వీరాభిమాని అని చెప్పారు. 2012లో జరిగిన ఓ ప్రమాదంలో వెన్నెముక దెబ్బతినడంతో ఆయన చక్రాల కుర్చీకి పరిమితమయ్యారు. ఇన్నాళ్లూ కుటుంబాన్ని ఎలానో నెట్టుకురాగా, పరిస్థితి బాగా లేకపోవడంతో బుధవారం తన భార్య లక్ష్మితో వచ్చి మంత్రి అనితను కలిసి తన పరిస్థితిని వివరించారు. దీంతో బాజ్జీ కుటుంబాన్ని పీ4 కింద ఆదుకోడానికి అనిత ముందుకొచ్చారు. కుటుంబానికి తన సొంత నిధులతో రెండు ఆవులు, బాజ్జీకి మూడు చక్రాల మోటారు సైకిల్ ఇస్తానన్నారు. బాజ్జీ కుమారుడు రూపస్‌ను చదివించే బాధ్యతను తానే తీసుకుంటానని తెలిపారు. ఆ మేరకు అక్కడి నుంచే రూపస్ చదువుతున్న పాఠశాల ప్రిన్సిపల్‌తో మాట్లాడి ఫీజు తాను చెల్లిస్తానని తెలిపారు. దీంతో బాజ్జీ కుటుంబం మంత్రికి కృతజ్ఞతలు తెలిపింది. అనంతరం అనిత మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్న పీ4 పథకం.. నిరుపేద కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలని కోరారు.

8న ఒకేరోజు 25 వేల హెక్టార్లలో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమం

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మరో వినూత్న ప్రయోగం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మరో భారీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 8న ఒకే రోజు రైతులకు చెందిన 25 వేల హెక్టార్ల భూముల్లో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనుంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రారంభించనున్న ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, అధికారులు పాల్గొననున్నారు. గతేడాది ఆగస్టు 23న రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి, ఉపాధి హామీ పథకంలో 4 వేల కిలోమీటర్ల రహదారుల నిర్మాణాలు, ఇతర పనులకు తీర్మానాలు చేయించి రికార్డు సృష్టించారు. అదే పథకంలో ఇప్పుడు ఒకే రోజు భారీగా మొక్కలు నాటాలని నిర్ణయించారు.

కాగ్నిజెంట్‌కు విశాఖలో 22.19 ఎకరాలు

ఉత్తర్వులిచ్చిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు విశాఖ జిల్లా మధురవాడలో 22.19 ఎకరాలను.. 99 పైసలకు కేటాయించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి దశ ప్రాజెక్టు పనులను 2028 జూన్ కల్లా పూర్తి చేసేందుకు సంస్థ అంగీకరించింది. 2026 జూన్ నాటికి లీజు విధానంలో ఏర్పాటు చేసే క్యాంపస్‌లో 500 మందికి ఉపాధి కల్పించనుంది. ఏపీ ఐటీ పాలసీ 4.0 నిబంధనల మేరకు ప్రోత్సాహకాలను అందించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. విశాఖలో రూ.1,582.98 కోట్ల పెట్టుబడి పెట్టి... 8 వేల మందికి ఉపాధి కల్పించేందుకు కాగ్నిజెంట్ సుముఖత వ్యక్తంచేసిందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఇన్నోవేషన్ హబ్ స్పోక్ సెంటర్లకు.. నామినేటెడ్ అధికారులుగా జేసీలు

ఈనాడు, అమరావతి: విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతి, అనంతపురంలో ఏర్పాటు చేయనున్న రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్) స్పోక్ సెంటర్లకు ప్రభుత్వం తరఫున నామినీ అధికారులుగా సంబంధిత జిల్లాల సంయుక్త కలెక్టర్ల(జేసీ)ను నామినేట్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అమరావతిలో ఏర్పాటు చేసే ప్రధాన హబ్‌కు గుంటూరు జిల్లా జేసీ నామినేటెడ్ అధికారిగా వ్యవహరిస్తారని ప్రభుత్వం పేర్కొంది. జిల్లాల్లోని హబ్‌లు.. ప్రధాన హబ్‌కు అనుసంధానంగా పనిచేస్తాయని, భాగస్వామ్య పక్షాలను జేసీలు సమన్వయం చేస్తారని పేర్కొంది. హబ్‌లకు అవసరమైన మౌలిక సదుపాయాలు.. నిర్వహణను జేసీలు పర్యవేక్షిస్తారని వివరించింది.

వ్యవసాయ ఇన్‌పుట్ ఇంజిన్‌గా అజైల్ యాప్

ఈనాడు, అమరావతి: విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తదితర ఉత్పత్తులకు సంబంధించిన వ్యాపారం చేసేవారు అజైల్ (ఏజీఐఎల్ ఈ-అగ్రికల్చర్ ఇన్‌పుట్ లైసెన్స్ ఇంజిన్) ప్లాట్‌ఫాంను వినియోగించుకోవాలని, ఇదొక ఇన్‌పుట్ ఇంజిన్‌గా పని చేస్తుందని వ్యవసాయ శాఖ ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. ఆయన బుధవారం సచివాలయంలో అజైల్ యాప్‌ను ప్రారంభించారు. కేంద్రీకృత డిజిటల్ ఇన్‌పుట్ మేనేజ్‌మెంట్‌గా అజైల్ యాప్‌ను నవీకరించామన్నారు. కాగిత రహిత, పారదర్శక, ప్రామాణిక వ్యవస్థగా ఇది పని చేస్తుందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు పేర్కొన్నారు. యాప్‌లో రియల్ టైమ్ మానిటరింగ్ డ్యాష్ బోర్డు, ఆధునిక నివేదికలు, విశ్లేషణలు, సప్లై మేనేజ్‌మెంట్, ఈ-గవర్నెన్స్ ఇంటిగ్రేషన్ తదితర వివరాలు ఉంటాయని వివరించారు.

B.Sc (Hons) Agri
Recog.by UGC,
Eligi: All Govt., Private Jobs
NO EAMCET, NO DONATION
www.sunagbsc.org
89774 96789

ACHARYA NAGARJUNA UNIVERSITY
Technical collaboration with
NATIONAL INSTITUTE OF FIRE & SAFETY
DIRECTORATE OF ADMISSION NOTIFICATION 2025-26
B.Sc. Honours in Fire and Industrial Safety
(Regular On - campus Programme)
Eligibility : 10+2 / Intermediate or Diploma (2 or 3 years) any stream or equivalent.
Last Date for Admission - 21-07-2025
Visakhapatnam : 8374340999, 9246624868 Guntur : 8330984188
Website : www.nifsindia.net, www.nagarjunauniversity.ac.in
Sd/- Director

ANDHRA PRADESH INNOVATION SOCIETY
(A Society Registered Under the Andhra Pradesh Society Registration Act, 2001)
4th Floor, Pothuri Mercantile, Tadepalli, Amaravati-522 501 (AP)
Ph: +91-7396603335 E-mail: jd-startup-apis@ap.gov.in
website: https://apis.ap.gov.in/#/
ITC53-11022/1/2025-JD-ADMIN, Dt. 03-07-2025
EMPLOYMENT NOTIFICATION No. 07/2025
Notification is hereby issued for filling of the following contractual positions at the Ratan Tata Innovation Hub (RTIH)- a Section 8 Not-for-Profit organization 1. CEO (06) 2. Head Incubation (06) 3. Head Partnerships (06) 4. Head Finance (06). Eligible and interested candidates may apply through the "Vacancies" section at https://apis.ap.gov.in/#/. Application window will remain open till dt. 12-07-2025.
DIPR No. 4235PP/CL/Advt/1/1/2021-22 Sd/- CEO, APIS, Amaravati



ఈనాడు

మునీర్ మూర్ఖ ప్రేలాపనలు!

కుక్కతోక వంకర అన్నట్లుగా పాకిస్థాన్ తన బుద్ధి పోనిచ్చుకోదు. ముష్కర మూకలను ముద్దుచేసే పాపిష్ఠి పనులను మానదు. పాక్ సైన్యాధిపతి ఆసిం మునీర్ తాజా విష్వ్యాఖ్యలే ఇందుకు తిరుగులేని నిదర్శనాలు. జమ్మూకశ్మీర్‌లో నెత్తుటి నెగళ్లను ఎగదోస్తున్న ఉగ్రవాదులను స్వాతంత్ర్య సమరయోధులుగా, వారి పైశాచిక హింసోన్మాదాన్ని చట్టబద్ధమైన పోరాటంగా అభివర్ణించిన మునీర్- తనకు బాగా అలవాటైన రీతిలో మరోసారి భారతావనిపై విద్వేషాన్ని వెళ్లగక్కారు. టెర్రరిస్టులకు అన్ని రకాలుగా అండగా ఉంటామని బహిరంగంగా ప్రకటించడం ద్వారా ఇండియాపై ప్రచ్ఛన్న యుద్ధాన్ని ఆపేదిలేదని ఆయన తేల్చిచెప్పారు. పాక్ ప్రభుత్వాన్ని కీలుబొమ్మను చేసి ఆడిస్తూ, 'ఫీల్డ్‌మార్షల్' అనే తగరపు కిరీటాన్ని తనకు తానే తగిలించుకున్న మునీర్- స్వదేశంలో తన ఏకచ్ఛత్రాధిపత్యాన్ని సుస్థిరం చేసుకోవడానికే భారత్‌పై నిత్యం కయ్యానికి కాలుదువ్వుతున్నారు. ప్రాంతీయ సుస్థిరతను తాము కాపాడుతుంటే, ఇండియా ఉద్రిక్తతలను సృష్టిస్తోందన్నది మునీర్ వెర్రిమొర్రి భాష్యం! ఉగ్రవాదుల ఎగుమతి కేంద్రంగా తయారై, ఉపఖండంలో శాంతికి ప్రబల శత్రువుగా పరిణమించింది పాకిస్థానేనన్నది ప్రపంచం మొత్తానికి తెలిసిన పచ్చి నిజం!

కదనరంగంలో ఇండియాతో ప్రత్యక్షంగా తలపడిన ప్రతిసారీ పాకిస్థాన్‌కు తలతిరిగి ముద్ద నోట్లోకి వచ్చింది. అందుకే ఆ దేశం ఉగ్రవాదాన్ని జాతీయ విధానంగా మార్చుకుని, టెర్రరిస్టులకు సాయుధ శిక్షణిచ్చి మారణాయుధాలను సమకూర్చి భారతావనిపైకి ఉసిగొలుపుతోంది. జనరల్ జియా-ఉల్-హఖ్ జమానాలో పదునెక్కిన ఈ ధూర్తవ్యూహం భారతావనిలో అనేక నరమేధాలకు కారణమైంది. కేంద్ర హోంశాఖ వెల్లడించిన సమాచారం ప్రకారం, 1988-2019 మధ్యలో ఒక్క జమ్మూకశ్మీర్‌లోనే ఉగ్రవాద సంబంధిత ఘటనలు 56,232 చోటుచేసుకున్నాయి. వాటిలో 1.49 లక్షల మంది పౌరులు, 6413 మంది భద్రతా సిబ్బంది మరణించారు. గడచిన ఆరేళ్లలోనూ పహల్గాం పైశాచికకాండ వంటివాటితో పాక్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదం కశ్మీర్‌లో నెత్తుటేళ్లను పారిస్తోంది. ఇండియాతో శాంతిచర్చలకు సిద్ధమంటూ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇటీవల మేకవన్నె పులి మాటలు మాట్లాడారు. కానీ, దానవ దాయాది దేశం చంకలోని ముష్కరులు 2001-2019 మధ్యలో భారత్‌లోకి చొరబడేందుకు 1.11 లక్షల సార్లు యత్నించారు. 2004-2020 నడుమ కాల్పుల విరమణ ఒప్పందాన్ని 9014 సార్లు ఉల్లంఘించిన పాకిస్థాన్- ఇండియా స్నేహహస్తం చాచిన ప్రతిసారీ మారణహోమాలకు తెగబడింది. కాబట్టి వెన్నెముక లేని పాక్ నేతాగణాలు వల్లించే ధర్మపన్నాలన్నీ కపట నాటకాలే!

ఉగ్రవాద దాడులతో ఇండియాను అస్థిరపరచాలన్నది పాకిస్థాన్ కుతంత్రం. మతఛాందస భావజాలంలోంచి పుట్టుకొచ్చిన ఈ కుత్సితాలోచన చివరికి ఆ దేశాన్నే ఆత్మవినాశనంలోకి నెట్టుకుపోతోంది. ప్రపంచబ్యాంకు నివేదిక ప్రకారం, పాక్ విదేశీ రుణాల విలువ ఆ దేశ స్థూల జాతీయ ఆదాయంలో 39శాతానికి చేరింది. ఎగుమతుల ద్వారా ఇస్లామాబాద్ ఆర్జించే సొమ్ములో 43శాతం ఆ అప్పులపై వడ్డీల చెల్లింపులకే సరిపోతోంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి వంటి సంస్థలను డబ్బులకోసం దేబిరిస్తూ కాలం గడుపుతున్న పాక్ అధికారవర్గాలు- ఇండియాపై సమరానికి సై అంటూ సవాళ్లు రువ్వడం హాస్యాస్పదం! అందుకోసం సొంత ప్రజల సౌభాగ్యాన్ని పణంగా పెట్టడం మరీ దౌర్భాగ్యం! దక్షిణాసియాలో భారతదేశ ప్రాబల్యాన్ని తగ్గించాలన్న పన్నాగంతో చైనా, పశ్చిమాసియాలో స్వార్థ ప్రయోజనాలకోసం అమెరికా... పాకిస్థాన్‌ను పావుగా వాడుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పాక్ కుట్రలను అంతర్జాతీయంగా ఎండగట్టడంలో ఇండియా సదా అప్రమత్తంగా వ్యవహరించాలి. సరిహద్దుల్లో నిఘాను పటిష్ఠపరచుకుంటూ, రక్షణ రంగంలో స్వావలంబనను సాధించాలి!




భారతీయ మహిళలు ప్రత్యేక హక్కులు కాదు; సామాజిక, ఆర్థిక, రాజకీయ సమన్యాయం కోరుతున్నారు. ఆ సమానత్వమే స్త్రీపురుషుల నడుమ పరస్పర గౌరవం, అవగాహనలకు పునాది వేస్తుంది. దేశ జనాభాలో సగమైన మహిళల సహకారం లేకుండా పురుషులు ఎంతో దూరం ప్రయాణించలేరు.

– హంసా మెహతా, రాజ్యాంగ సభ సభ్యురాలు

దుఃఖం ఐచ్ఛికం

సృష్టిలో ప్రతి ప్రాణి ఏదో ఒక సందర్భంలో దుఃఖాన్ని అనుభవించక తప్పదు. అది అనివార్యం. దుఃఖం ఎప్పుడు కలుగుతుందో! వియోగం, మరణం, అనారోగ్యం... ఎన్నో విషయాలు మనిషికి దుఃఖం కలిగిస్తాయి. దాన్నుంచి తప్పించుకోగలమా? ఎవరికైనా సరే, అది అసాధ్యమే! మనిషిలో సహజంగా ఉండే ఉద్వేగం వల్ల విషాద సమయాల్లో దుఃఖం దానంతటదే వెల్లువెత్తుతుంది. మనిషి దుఃఖాన్ని తప్పించుకోలేడు కానీ, తగ్గించుకోగలడు. నియంత్రించుకోగలడు. అది అవసరం కూడా. దుఃఖం కలిగినప్పుడు అందులోనే ఉండి జీవితాన్ని కుంగదీసుకోకూడదు. నిరంతరం చింతిస్తూ వర్తమానాన్ని, భవిష్యత్తునూ కోల్పోకూడదు.

అన్ని దుఃఖాల్లోనూ సొంత మనుషుల మరణం వల్ల కలిగే వేదన గాఢమైంది. దాని నుంచి అంత తేలిగ్గా బయటపడలేం. ఒకసారి భగవాన్ బుద్ధుడు స్వగ్రామానికి సమీప ప్రాంతంలోని ఒక గ్రామంలో విడిది చేశారు. అక్కడికి చేరిన ప్రజలకు దుఃఖాన్ని ఎలా నివారించుకోవచ్చో బోధిస్తున్నారు. అంతలో ఒక స్త్రీ రోదిస్తూ వచ్చింది. 'మీ మాటలన్నీ అబద్ధాలు. ఒకవేళ మీ ఉపదేశం నిజమైతే మరణించిన నా కొడుకును బతికించి నాకు దుఃఖ విముక్తి కలిగించండి' అని కొంచెం దూరంలో ఉంచిన తన బిడ్డ శవాన్ని చూపించింది. ఆమె స్థితిని అర్థం చేసుకున్న బుద్ధుడు 'నీ కొడుకును బతికిస్తాను' అన్నారు. వెంటనే ఆ స్త్రీ ఏడవడం ఆపేసింది. అక్కడి వారందరూ ఆశ్చర్యంగా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. 'గ్రామంలోకి వెళ్లి మరణం సంభవించని ఇంటి నుంచి పిడికెడు నువ్వులు తీసుకురా' అని బుద్ధుడు ఆమెను ఆదేశించారు. ఆవేదనలో ఉన్న ఆ స్త్రీ నువ్వులు తీసుకురావడానికి వడివడిగా గ్రామంలోకి వెళ్లింది. ఊరంతా గాలించినా మరణం సంభవించని ఇల్లు దొరకలేదు. అప్పుడు అర్థమైంది ఆమెకి- లోకంలో ఎవరికైనా మరణం తప్పదనీ దాని గురించి దుఃఖించడం వృథా అనీ. పరుగెత్తుకుంటూ వచ్చి బుద్ధుడి పాదాలను ఆశ్రయించింది. 'అమ్మా! లోకంలో మరణం సహజం. దానికోసం శోకించడం తగదు' అని బుద్ధుడు ఆమెను ఓదార్చారు. ఆమె పేరు కిసాగౌతమి. అనంతరం ఆమె భిక్షుణిగా దీక్ష తీసుకుని దుఃఖ విముక్తురాలైంది.



అంతర్యామి

సమస్యకు పరిష్కార మార్గం ఉంటే దాని గురించి ఆలోచన చేయగలం. ప్రతి జీవికీ మరణం తథ్యం. దానికి పరిష్కారం ఏమీ లేదు. అటువంటప్పుడు దాని గురించి విచారించడం వృథా. నొప్పి, బాధ ఇవి మనం ఎంచుకునేవి కావు. అనివార్యంగా ఎదుర్కోవాల్సినవి. ఎవరి నొప్పి వారిదే, ఎవరి బాధ వారే భరించి తీరాలి. దుఃఖం అలాంటిదే. మనం ఎంత త్వరగా దాని నుంచి బయటపడితే అంత త్వరగా మిగిలిన జీవితకాలం పునర్వికాసం పొందుతుంది.

– డాక్టర్ బండి సత్యనారాయణ

వికసిత భారతానికి డిజిటల్ పునాదులు

"కొద్ది నెలల క్రితం దిల్లీలో ఒక ఐరోపా సీనియర్ మంత్రిని కలిశాను. ఇండియాలో డిజిటల్ పేమెంట్ల విప్లవాన్ని చూసి ఆమె ఆశ్చర్యపోయారు. విభిన్న భాషలు, భౌగోళిక పరిస్థితులు ఉన్న దేశంలో ఇదంతా ఎలా సాధ్యమైందని ఆమె ప్రశ్నించారు. నేను అయిదు వందల రూపాయల నోటు చూపించాను. దానిమీద పదిహేడు భాషల్లో నోటు విలువ రాసుంటుంది. ఇండియా వైవిధ్యానికి అది నిదర్శనం. ప్రధాని మోదీ దార్శనిక నాయకత్వంలో సాంకేతికత ద్వారా ఈ వైవిధ్యమంతా అనుసంధానమై, దేశానికి గొప్ప బలంగా మారింది."



అశ్వినీ వైష్ణవ్

డిజిటల్ ఇండియా కార్యక్రమానికి పదేళ్లు. కేవలం కొందరికి కాకుండా, ప్రతి ఒక్కరికీ మేలిమి సేవలందించే డిజిటల్ మౌలిక వ్యవస్థను తీర్చిదిద్దాలన్న ప్రధాని మోదీ విస్పష్ట ఆలోచనతో పదేళ్ల క్రితం డిజిటల్ ఇండియా ప్రయాణం మొదలైంది. అది నేడు విశ్వవ్యాప్తంగా ఇండియాకు ప్రత్యేక గుర్తింపు తెస్తోంది. మన 'ఆధార్' ప్రపంచంలోనే అతి పెద్ద బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థ. ఇది 140 కోట్ల మందికి డిజిటల్ గుర్తింపును కల్పిస్తోంది. వేగంగా, నమ్మకంతో కూడిన అత్యవసర సేవలందించే క్రమంలో నిత్యం సగటున తొమ్మిది కోట్ల ఆధార్ ధ్రువీకరణలు జరుగుతున్నాయి. ఇక మన యూపీఐ- ఆర్థిక లావాదేవీల తీరుతెన్నులనే మార్చేసింది. వీధి విక్రేతల నుంచి బడా వ్యాపారుల దాకా అందరూ చాలా తేలిగ్గా యూపీఐని వినియోగిస్తున్నారు. దేశీయంగా రోజూ సగటున 60 కోట్లకు పైగా యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయి. డ్రైవింగ్ లైసెన్స్, విద్యా సంబంధిత ధ్రువపత్రాలతో పాటు ఇతర ముఖ్యమైన పత్రాలను డిజిలాకర్ కేవలం ఒక్క క్లిక్ దూరంలోకి తెచ్చింది. మొబైల్ వినియోగం విస్తృతం కాకుంటే ఇవన్నీ సాకారమయ్యేవి కావు. ప్రస్తుతం మన యూపీఐ విధానాన్ని ఏడు దేశాలు అనుసరిస్తున్నాయి. మరిన్ని దేశాలు దాన్ని అందిపుచ్చుకునేందుకు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. ప్రతి భారతీయుడికీ సాధికారత కల్పించేందుకు ఉద్దేశించిన యూపీఐ కార్యక్రమం ప్రస్తుతం ప్రపంచానికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

సులువుగా పౌరసేవలు

జన్‌ధన్ యోజన కింద 55 కోట్ల బ్యాంకు ఖాతాలు ఓపెన్ అయ్యాయి. డీబీటీ పథకాల రూపంలో రూ.44 లక్షల కోట్లు నేరుగా వాటిలో జమయ్యాయి. 10కోట్లకు పైగా ఎల్పీజీ కనెక్షన్లు, వైద్య ప్రయోజనాలు నేరుగా ప్రజలకు అందాయి. జన్‌ధన్-ఆధార్-మొబైల్ (జామ్) త్రయం ద్వారానే ఇదంతా సాధ్యమైంది. తద్వారా సంక్షేమ పథకాల్లో లోపాలు తగ్గాయి. పరిపాలనలో పారదర్శకత నెలకొంది. సేవలు త్వరితగతిన అందుతున్నాయి. మైగవ్, ఉమంగ్ లాంటి డిజిటల్ వేదికలు రెండు వేలకు పైగా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేస్తున్నాయి. 'భీమ్' వ్యవస్థ 20భాషల్లో, 'ఉమంగ్' 13 భాషల్లో సేవలందిస్తున్నాయి. జాతీయ టెలీమెడిసిన్ వేదిక ఈ-సంజీవని 38 కోట్ల డాక్టర్ కన్సల్టేషన్లకు వీలు కల్పించింది. ప్రతి ఒక్కరికీ ప్రత్యేక డిజిటల్ ఐడీని రూపొందించడమే ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) లక్ష్యం. 79కోట్లకు పైగా హెల్త్ ఐడీలు, ఆరు లక్షల ఆరోగ్య పరిరక్షణ నిపుణులు, 60 కోట్ల హెల్త్ రికార్డులు ప్రస్తుతం అనుసంధానమవడం హర్షణీయమే. తద్వారా బిహార్‌లో ఎక్కడో మారుమూల పల్లెలో ఉన్న ఓ మహిళ ఇంటి నుంచే వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న డాక్టర్‌ను సంప్రదించేందుకు వీలు కలుగుతోంది. ఇదే డిజిటల్ ఇండియా గొప్పదనం. దీక్ష, స్వయం, పీఎం ఈ-విద్య వంటి డిజిటల్ వేదికలు లక్షల మంది విద్యార్థులకు వారి ప్రాంతీయ భాషల్లోనే అందుబాటులో ఉన్నాయి. స్కిల్ ఇండియా డిజిటల్ హబ్ (సిద్ధ్), ఫ్యూచర్‌స్కిల్స్ ప్రైమ్ వేదికలు కృత్రిమ మేధ, సైబర్ భద్రత, బ్లాక్‌చెయిన్ సాంకేతికతల్లో నవతరానికి నైపుణ్యాలు మప్పుతున్నాయి. వాతావరణ సమాచారం, నేల ఆరోగ్య కార్డులు, మార్కెట్ ధరలు రైతులకు నేడు డిజిటల్ రూపంలో అందుతున్నాయి.

దేశీయంగా డిజిటలీకరణ ఊపందుకొనేకొద్దీ, సైబర్ భద్రత సైతం బలోపేతమవుతోంది. సీఈఆర్‌టీ-ఇన్ లాంటి సంస్థలు, సైబర్ నేరాల హెల్ప్‌లైన్ 1930, డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ చట్టం 2023 వంటివి వినియోగదారుల గోప్యత, భద్రత పరంగా భారతదేశ నిబద్ధతకు అద్దంపడుతున్నాయి. తద్వారా డిజిటల్ సేవలను ప్రజలు పూర్తి నమ్మకంతో వినియోగించుకోగలుగుతున్నారు. 1.8 లక్షల స్టార్టప్‌లు, వందకు పైగా యూనికార్న్‌లతో ఇండియా నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థకు ఆలవాలంగా నిలుస్తోంది. డిజిటల్ ఇండియా పునాదిగా ఇవన్నీ ఎదిగాయి. ఏఐ మిషన్ సైతం శక్తిమంతమైన కంప్యూటర్ వ్యవస్థల వినియోగాన్ని సులభతరం చేస్తోంది. విస్తృత స్థాయిలో జీపీయూలు అందుబాటులోకి రావడం వల్ల స్టార్టప్‌లు, పరిశోధకులు, విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది.



అందరికీ అభివృద్ధి ఫలాలు...

ప్రధాని మోదీ ఇచ్చిన 'మేకిన్ ఇండియా, మేక్ ఫర్ ఇండియా, మేక్ ఫర్ ద వరల్డ్' నినాదాలతో ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్ల తయారీ ఊపందుకొంది. మన ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ విలువ రూ.12 లక్షల కోట్లు దాటిపోయింది. టెలికం మౌలిక వసతుల విస్తరణ సైతం దేశ పురోగతికి విశేషంగా అక్కరకొస్తోంది. చాలా ఏళ్ల తరవాత బీఎస్ఎన్ఎల్ మళ్ళీ లాభాల్లోకొచ్చింది. ప్రస్తుతం 4జీ దాదాపు దేశవ్యాప్తంగా అందుబాటులోకొచ్చింది. 5జీ సేవల విస్తరణ వేగవంతమైంది. ఇవన్నీ తరవాతి దశ డిజిటల్ ఇండియాకు దన్నుగా నిలుస్తాయి. దేశీయంగా చిప్ తయారీ కలను 'సెమీకండక్టర్ మిషన్' వాస్తవరూపంలోకి తెస్తోంది. డిజిటల్ ఇండియా కార్యక్రమానికి పదేళ్లు పూర్తయిన తరుణంలో మొత్తం పరిణామం గర్వకారణం. పటిష్ఠ డిజిటల్ ఇండియా పునాదిపైనే వికసిత్ భారత్ మహా సౌధ నిర్మాణం జరుగుతోంది. ప్రతి పౌరుడి జీవితంలో సాంకేతికతను నిజమైన సహచరుడిగా నిలపడమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం. దేశీయంగా ప్రతి ఒక్కరికీ అభివృద్ధి ఫలాలు అందాలన్న అంత్యోదయ లక్ష్యం మోదీ సర్కారుకు నిత్య మార్గదర్శకం.

రచయిత– కేంద్ర సమాచార ప్రసారాలు, రైల్వే, ఐటీ శాఖామాత్యులు



అనుకుంటే కానిదేముంది?

నిరుపేద కుటుంబానికి చెందిన ఆ అబ్బాయి అమ్మానాన్నలు చిన్నప్పుడే చనిపోయారు. నానమ్మ దగ్గర పెరిగాడు. ప్రభుత్వ పాఠశాల, కాలేజీల్లోనే ఇంటర్ వరకు చదివాడు. ఈ లోపలే తాతయ్య కూడా పోవడంతో ఇంటి బాధ్యత పూర్తిగా నానమ్మ మీద పడింది. కూరగాయలు అమ్మి ఇల్లు నడుపుతున్న ఆమె కష్టం చూడలేక పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరాడు. కాస్తయినా కష్టాలు తీరతాయి అనుకునేలోపే, ఉద్యోగంలో పై అధికారి సహోద్యోగుల ముందే తనని తీవ్రంగా అవమానించేసరికి తట్టుకోలేక రాజీనామా చేశాడు. వెక్కిరించిన వాళ్ల నోరు మూయించేలా ఎదగాలనుకున్నాడు. దానికి చదువే మార్గమని భావించి, డిగ్రీలో చేరాడు. ఇంటిముందే కూరగాయల అంగడి పెట్టుకున్న నానమ్మకు సాయం చేస్తూనే మంచి మార్కులు తెచ్చుకున్నాడు. ఆపై సివిల్ సర్వీసెస్ పరీక్షల మీద దృష్టి పెట్టాడు. గతేడాది ఐఆర్ఎస్ వచ్చింది. రెండో ప్రయత్నంలో ఈ ఏడాది ఐపీఎస్‌కి ఎంపికయ్యాడు. ఆయనే ప్రకాశం జిల్లా ఊళ్లపాలెం గ్రామానికి చెందిన ఎం.ఉదయకృష్ణారెడ్డి.

పాకిస్థాన్ నుంచి అమెరికాకు కుటుంబంతో సహా పొట్ట చేత పట్టుకుని వలస వెళ్లాడు గో అబ్దుల్ రవూఫ్ ఖాన్. కొడుకులు ముగ్గుర్నీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాడు. పెద్ద కొడుకు గోహర్ ఖాన్ అన్ని తరగతుల్లోనూ టాపర్. పదకొండేళ్ల వయసులోనే వెబ్‌సైట్లు తయారుచేసేవాడు. గేమింగ్ ఛానెల్‌నూ ప్రారంభించాడు. దాంతో చిన్న వయసులోనే 40వేల డాలర్లు సంపాదించాడు. చేపట్టిన ప్రతి పనిలోనూ తనదైన ముద్ర వేసుకున్నాడు. డిగ్రీ కోసం అప్లై చేస్తే.. హార్వర్డ్, కొలంబియా వంటి ప్రఖ్యాత యూనివర్సిటీలన్నిట్లోనూ సీటు వచ్చింది. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి ప్రత్యేక ఆహ్వానాన్నీ అందుకున్నాడు. చివరికి ఎంఐటీలో చేరి డిగ్రీ పూర్తిచేశాడు. తన యూట్యూబ్ ఛానల్లో చదువుకు సంబంధించిన టిప్స్, యూనివర్సిటీల్లో ఎలా చేరాలి, ఆర్థిక అంశాలు, జీవన నైపుణ్యాలు, హెల్త్‌కేర్... ఇలా చాలా అంశాలకు సంబంధించిన వీడియోలు పోస్ట్ చేస్తాడు. అలా అమెరికా విద్యార్థుల్లో మంచి క్రేజ్ సంపాదించాడు. సామాజిక మాధ్యమాల్లో అతడికి లక్షల్లో ఫాలోవర్లు ఉన్నారు. యూట్యూబ్ సీఈవో నీల్‌మోహన్‌నే ఇంటర్వ్యూ చేశాడు. ఏఐకి సంబంధించి వైట్‌హౌజ్‌లో జరిగిన సమావేశానికీ ఆహ్వానం అందుకున్నాడు. ఇరవై ఆరేళ్ల గోహర్ ఖాన్ ఆదాయం ఇప్పుడు ఒక్కో నెల కోటి రూపాయలు దాటుతోంది.

ఎవరైనా అనుకుంటారా? నిన్న మొన్నటిదాకా తమ ముందు కూరగాయలు అమ్మిన వ్యక్తి ఐపీఎస్ అవుతాడని! తలదాచుకోవడానికి పరాయి దేశానికి వచ్చిన కుటుంబానికి చెందిన పిల్లాడు కోటీశ్వరుడవుతాడని! కానీ క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్యం మీద గురి, కష్టపడే తత్వం ఉంటే ఏదీ అసాధ్యం కాదని నిరూపిస్తున్నాయి ఉదయకృష్ణారెడ్డి, గోహర్ ఖాన్‌ల జీవితాలు! డబ్బు లేక ఏమీ చేయలేకపోతున్నామని బాధపడేవాళ్లందరూ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే- పట్టుదలకి కష్టపడే తత్వం తోడైతే డబ్బు దానంతటదే వస్తుందని!

– మొలకలపల్లి కోటేశ్వరరావు

వదలని లింగ వివక్ష

దేశంలో విద్యావంతులు పెరుగుతున్నా లైంగిక వివక్ష, కరడుగట్టిన పితృస్వామ్య భావజాలం సమాజాన్ని వదిలి పోవడం లేదు. ఆడ శిశువుల భ్రూణ హత్యలు ఆగడం లేదు. దాంతో అబ్బాయిల కంటే అమ్మాయిలు తక్కువ సంఖ్యలో ఉంటున్నారు. 2023-24లో జాతీయ సగటు(930)తో పోలిస్తే చాలా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఆడ శిశువుల జననాలు తక్కువే. అవి ఏవంటే... (వెయ్యిమంది అబ్బాయిలకు అమ్మాయిల సంఖ్య)

లక్షద్వీప్	831
అండమాన్, నికోబార్	832
బిహార్	882
మహారాష్ట్ర	915
చండీగఢ్	916
తెలంగాణ	917
హరియాణా	917
దిల్లీ	918
నాగాలాండ్	919
పంజాబ్	924
దాద్రా, నగర్ హవేలి; దమణ్, దీవ్	924
గుజరాత్	925
మధ్యప్రదేశ్	929
మణిపుర్	929

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

నాటో నిర్ణయం... అమెరికాకే లాభం!

ఉత్తర అట్లాంటిక్ సైనిక కూటమి (నాటో) సభ్య దేశాలు నెదర్లాండ్స్‌లోని ది హేగ్ నగరంలో ఇటీవల సమావేశమయ్యాయి. ఈ సందర్భంగా రక్షణ వ్యయం పెంపుపై కీలక నిర్ణయం వెలువడింది. దీనిపై పలు దేశాలు అనాసక్తత వ్యక్తం చేశాయి.

ట్రంప్ తొలిసారి అధ్యక్షుడైనప్పటి నుంచే నాటో రక్షణ భారమంతా అమెరికా నెత్తిన వేయరాదని చెబుతున్నారు. కూటమిలోని 32 సభ్య దేశాలు తమ రక్షణ కేటాయింపులను పెంచాలని పట్టుబడుతూ వస్తున్నారు. 2024కల్లా తమ జీడీపీలో రెండు శాతాన్ని రక్షణకు ప్రత్యేకిస్తామని 2014లో నాటో దేశాలు తీర్మానించాయి. 2035కల్లా దాన్ని ఏకంగా అయిదు శాతానికి పెంచాలని తాజా సదస్సులో నిశ్చయించడంతో ట్రంప్ ఒత్తిడి పనిచేసినట్లు తేలుతోంది. రష్యా వల్ల తమకు పొంచి ఉన్న ప్రమాదాన్ని, ఉగ్రవాద ముప్పును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని నాటో భేటీ వివరించింది. 2024లో అమెరికా తన బడ్జెట్లో 3.38 శాతాన్నే రక్షణకు కేటాయించింది. ప్రస్తుతం నాటోలోని పోలాండ్ ఒక్కటే 4.2శాతం జీడీపీని రక్షణపై వెచ్చిస్తోంది. స్పెయిన్, స్లోవేకియాలు మాత్రం వాటి జీడీపీలో రక్షణకు అయిదు శాతాన్ని కేటాయించడం తమ వల్లకాదని చేతులెత్తేశాయి. రక్షణ వ్యయం పెంచాలంటే ప్రజలపై ఎక్కువ పన్నులు విధించి, సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు కోత పెట్టాల్సి వస్తుందని స్పెయిన్ మైనారిటీ ప్రభుత్వం వాదించింది. ఇతర నాటో దేశాలు కూడా బడ్జెట్లో ఏటా అయిదు శాతాన్ని రక్షణకు కేటాయించాలంటే, ఎక్కడో ఒక చోట కోత పెట్టాల్సి వస్తుంది. అనేక ఐరోపా దేశాల్లో అధికారంలో ఉన్న మైనారిటీ, సంకీర్ణ ప్రభుత్వాలకు ఇది రాజకీయంగా ప్రతికూలంగా మారవచ్చు.




ఆయుధాలు కొంటాయా?

నాటో దేశాలు తమ రక్షణ వ్యయాన్ని 2035కల్లా రెండు నుంచి 3.5శాతానికి పెంచి, 1.5శాతాన్ని సైబర్ భద్రత, సైనిక వాహనాల కదలికలకు అనువుగా రోడ్లు, వంతెనలను తీర్చిదిద్దడంపైన ఖర్చుచేస్తాయని నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రట్ చెబుతున్నారు. ఏతావాతా హేగ్ సభలో రక్షణ వ్యయంపై డొనాల్డ్ ట్రంప్ నానా యాగీ చేయకుండా సంతృప్తి పరచడానికే నాటో దేశాలు అయిదు శాతం లక్ష్యానికి సంసిద్ధత తెలిపినట్లు తేలిపోతోంది. ప్రధాన దేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్స్‌లు అయిదు శాతం లక్ష్యాన్ని చేరుకుంటామని ఇప్పటికే ప్రకటించాయి. హేగ్ సదస్సు నిర్ణయం వల్ల నాటో దేశాలు ఏటా 1.9 లక్షల కోట్ల డాలర్లను అదనంగా రక్షణపై ఖర్చు చేయనున్నాయి. ఆ డబ్బుతో అవి తమ నుంచి అత్యాధునిక ఆయుధాలు కొంటాయని ఆశిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. దానికి అనుగుణంగానే అణ్వస్త్రాలను ప్రయోగించగల 12 ఎఫ్-35 విమానాలను అమెరికా నుంచి కొనదలచినట్లు బ్రిటన్ ప్రకటించింది. ఐరోపా నుంచి అమెరికా దళాలను చాలావరకు ఉపసంహరిస్తామని ట్రంప్ రెండోసారి అధ్యక్షుడైనప్పటి నుంచే చెబుతున్నారు. ఆ సేనలను ఇండో-పసిఫిక్, ఇతర ప్రాంతాల్లో మోహరించాలన్నది ఆయన ఆలోచన. కానీ, ఐరోపాలో అమెరికా సేనలను తగ్గించుకుంటే రష్యాను ఎదుర్కోవడానికి సిబ్బంది, ఆయుధ సంపత్తి పరంగా నాటోకు కొరత ఏర్పడుతుంది. ఉక్రెయిన్‌పై పుతిన్ భీకరంగా విరుచుకుపడుతున్న ప్రస్తుత సమయంలో రష్యాను ఎదుర్కొనడానికి నాటో పక్కా కార్యాచరణను ప్రకటించలేకపోయింది. పైగా అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో రష్యాపై కొత్త ఆర్థిక ఆంక్షలు విధించే ఆలోచన ఏదీ లేదన్నారు.

ఉక్రెయిన్‌కు ఊరట

నాటోలోని ఏ సభ్యదేశంపైనైనా దాడి జరిగితే మొత్తం 32 దేశాలు ఎదురుదాడి చేయాలని కూటమి నిబంధనావళి నిర్దేశిస్తోంది. ఉక్రెయిన్‌ను నాటోలో చేర్చుకుంటే దాన్ని తమపై యుద్ధ ప్రకటనగా భావిస్తామని పుతిన్ మొదటి నుంచీ స్పష్టం చేస్తున్నారు. ఉక్రెయిన్‌ను చేర్చుకోవడానికి నాటో ఇప్పటికీ సిద్ధంగా లేదని హేగ్ సభలో తేటతెల్లమైంది. అయితే, ఉక్రెయిన్‌కు ఆయుధ, ఆర్థిక సహాయాలను పెరగనున్న నాటో రక్షణ బడ్జెట్లో భాగంగా పరిగణిస్తామని హేగ్ సభానంతరం విడుదలైన సంయుక్త ప్రకటన పేర్కొంది. ప్రస్తుతం రష్యన్ క్షిపణులు, డ్రోన్ల దాడితో అతలాకుతలమవుతున్న ఉక్రెయిన్‌కు గగనతల రక్షణ వ్యవస్థను విక్రయించే విషయం పరిశీలిస్తామని జెలెన్‌స్కీతో సమావేశంలో ట్రంప్ సైతం సూచించడం ఊరటే. నాటో శిఖరాగ్ర సభ విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో చైనా గురించి ప్రస్తావనే లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ సదస్సు పశ్చిమాసియాలో శాంతి నెలకొనాలని పిలుపిచ్చింది. అందుకోసం ఏం చేయాలన్నది మాత్రం సూటిగా చెప్పలేదు. మొత్తానికి ఎన్ని పొరపొచ్చాలున్నా హేగ్‌లో సమైక్యతా ప్రదర్శనలో నాటో సఫలమైంది.

– వరప్రసాద్



(c) eenadu

సిండికేట్ చేసుంటే కేసు ఎందుకు పెట్టలేదు

ఈ నెల 9న మామిడి రైతులను పరామర్శించనున్న జగన్: పెద్దిరెడ్డి



తిరుపతి (జీవకోన), న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లాలో పల్ప్ పరిశ్రమలను సిండికేట్ చేసుంటే తనపై ఎందుకు కేసు పెట్టలేదంటూ మాజీమంత్రి, వైకాపా రీజినల్ కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. తిరుపతిలోని కార్యాలయంలో బుధవారం పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డితో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు అనేక ఇబ్బందులు ఎదురయ్యాయని, పంటలకు గిట్టుబాటు ధరలు దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. చిత్తూరులో ప్రసిద్ధి చెందిన మామిడిని కొనేవారేలేరని, రైతులు రోడ్డు పక్కన పడేస్తున్నారని, ఇంతటి దారుణమైన పరిస్థితులు తాను ఎన్నడూ చూడలేదన్నారు. మామిడి రైతులను పరామర్శించేందుకు ఈ నెల 9వ తేదీన చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మార్కెట్ యార్డుకు వై.ఎస్.జగన్ వస్తున్నట్లు వెల్లడించారు. కరుణాకరరెడ్డి మాట్లాడుతూ పల్ప్ ఫ్యాక్టరీలు చిత్తూరు జిల్లాలో 90% తెదేపా వారివేనని, ప్రభుత్వం తన తప్పు సరిదిద్దుకోకుండా మీడియా ద్వారా విమర్శలు చేయిస్తోందని ఆరోపించారు.

ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ పనితీరు సమీక్షకు కమిటీ

మంత్రి సత్యకుమార్ వెల్లడి

ఈనాడు, అమరావతి: కేవలం సిలబస్ తయారీ, పరీక్షల నిర్వహణకే పరిమితమైతే.. విశ్వవిద్యాలయం ఏర్పాటు స్ఫూర్తిని, లక్ష్యాన్ని నిర్లక్ష్యం చేసినట్లు అవుతుందని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పనితీరుపై తొలిసారిగా బుధవారం సమీక్ష నిర్వహించారు. లక్ష్యాలు, ప్రణాళికలతో పరిశోధనలు చేయకుండా, మొక్కుబడి పరిశోధనా ప్రాజెక్టులను చేపట్టడం సరికాదన్నారు. వైద్య కళాశాలల్లో తనిఖీలపైనా అసంతృప్తి వ్యక్తంచేశారు. మౌలిక సదుపాయాలు, బోధన తీరు, వైద్యులు, విద్యార్థుల హాజరుపై నిఘా పెంచాలన్నారు. 39 ఏళ్లగా విశ్వవిద్యాలయం పనితీరు, సాధించిన ఫలితాలు, లోపాలు, సవాళ్లపై సమీక్షించి.. చేపట్టాల్సిన సంస్కరణల దిశగా ఉన్నత స్థాయి నిపుణుల కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అనంతరం విదేశీ వైద్య విద్యార్థుల సమస్యలపై మంత్రి చర్చించారు. కొవిడ్ సమయంలో ఆన్‌లైన్ విద్య అభ్యసించిన వారు మన దేశంలో చేయాల్సిన ఇంటర్న్‌షిప్ కాలపరిమితి, విద్యార్థుల సమస్యలు ఎన్ఎంసీ దృష్టికి తీసుకెళ్లి సమస్యలకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. త్వరలో దిల్లీ వెళ్లి ఎన్ఎంసీ అధికారులతో చర్చిస్తామని ఆంధ్రప్రదేశ్ వైద్య సంఘం ఛైర్మన్ డాక్టర్ శ్రీహరిరావు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ తెలిపారు. సమీక్షలో విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ రాధికారెడ్డి, డీఎంఈ డాక్టర్ నరసింహం ఇతర అధికారులు పాల్గొన్నారు.

పిలిపించుకుని.. పరామర్శ

- సింగయ్య, జయవర్ధన్ కుటుంబాల్ని రప్పించుకుని మాట్లాడిన జగన్
- ఆయన సత్తెనపల్లి పర్యటనలో కారు కింద పడి మృతి చెందిన సింగయ్య
- తోపులాటలో ప్రాణాలు కోల్పోయిన జయవర్ధన్





రెంటపాళ్ల పర్యటన సందర్భంగా జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన సింగయ్య భార్య లూర్థు మేరీ, కుమారులు, కుటుంబ సభ్యులతో వైకాపా అధ్యక్షుడు జగన్ ★ తొక్కిసలాటలో మరణించిన వెంకట జయవర్ధన్‌రెడ్డి తల్లిదండ్రులు, సోదరుడితో వైకాపా అధ్యక్షుడు జగన్

ఈనాడు, అమరావతి: తన రెంటపాళ్ల పర్యటనలో మృతి చెందిన సింగయ్య, జయవర్ధన్‌రెడ్డిల కుటుంబసభ్యులను వైకాపా అధ్యక్షుడు జగన్ బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని పరామర్శించారు. ఇటీవల జగన్ సత్తెనపల్లి నియోజకవర్గం రెంటపాళ్ల పర్యటనకు వెళ్లినపుడు కారు కింద పడి సింగయ్య మృతి చెందగా.. తోపులాటలో జయవర్ధన్ మృతి చెందారు. వైకాపా ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, ప్రత్తిపాడు నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్.. సింగయ్య భార్య లూర్థు మేరీ, కుమారులు, ఇతర కుటుంబసభ్యులను జగన్ వద్దకు తీసుకువచ్చారు. జయవర్ధన్‌రెడ్డి తల్లిదండ్రులు సావిత్రి, భాస్కరరెడ్డి, సోదరుడు మణికంఠరెడ్డి, కుటుంబసభ్యులను సత్తెనపల్లి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి వెంటబెట్టుకొచ్చారు. వారితో మాట్లాడిన జగన్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు.

నాడు ఇంటికి వెళ్లి పరామర్శించడమే సంప్రదాయమన్న జగన్

తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మృతి చెందినప్పుడు ఆ వార్త విని తట్టుకోలేక కొంతమంది చనిపోయారని వారి ఇళ్ల వద్దకే వెళ్లి పరామర్శిస్తానని.. అదే సంప్రదాయమని గతంలో జగన్ చెప్పారు. 'మీరు సాయం చేయాలనుకుంటే బాధిత కుటుంబాలను ఒకచోటకు చేర్చి ఆర్థిక సాయం చేయొచ్చు కదా' అని అప్పటి కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ఆయనకు సూచించారు. 'అది సత్సంప్రదాయం కాదు, మృతుల ఇంటికే వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించాలి' అని ఆమెకు ఓదార్పు గురించి తమ దృష్టిలో ఉన్న విస్తృతార్థాన్ని వివరించినట్లు అప్పట్లో ప్రజలకు జగన్ బహిరంగ లేఖ రాయడం గమనార్హం.

సింగయ్య భార్యను బెదిరించి, అబద్ధాలు చెప్పిస్తున్నారు

- మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజం



ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్‌రెడ్డి అంత క్రూరమైన మనిషి మరొకరు ఉండరని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపడ్డారు. శవరాజకీయాల్లో ఆయన దిట్ట అని దుయ్యబట్టారు. పరామర్శ పేరుతో సింగయ్యను పొట్టనబెట్టుకోవడమే కాకుండా.. ఆయన భార్యను బెదిరించి, అబద్ధాలు చెప్పిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆమెను పిలిపించి మాట్లాడమని తాడేపల్లి పెద్దలు స్క్రిప్ట్ రాసి ఇచ్చారని బుధవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. 'నా భర్తను అంబులెన్స్‌లో చంపేశారంటూ సింగయ్య భార్య తొలుత అన్నారు. ఆసుపత్రిలో చేర్చిన తర్వాత తన భర్త మాట్లాడారనీ ఆమె చెప్పారు. వైకాపా వారు రాజకీయ ప్రయోజనాల కోసం ఆమెతో తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారు. ఆమెకు న్యాయం జరగకుండా కూడా అడ్డుపడుతున్నారు' అని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు. 'జగన్ క్రిమినల్ మైండ్‌కు సింగయ్య మృతే ఓ ఉదాహరణ. వైకాపా వారు తొలుత సింగయ్య అసలు జగన్ కారు కింద పడలేదు.. దెబ్బలు తగలలేదు. చక్కగా మాట్లాడుతున్నారని అన్నారు. తర్వాత నేరాన్ని డ్రైవర్‌పై మోపారు. వైకాపా నేతలు సింగయ్యను రోడ్డు పక్కన నిర్లక్ష్యంగా వదిలేస్తే ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించిన పోలీసులపైనా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు' అని మంత్రి మండిపడ్డారు.

స్క్రిప్ట్ రాసి.. చదివించారు: లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు

సింగయ్య విషయంలో వైకాపా అధినేత జగన్ మానవత్వం లేకుండా వ్యవహరించారని పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో సిద్ధం చేయించిన స్క్రిప్ట్‌ను మృతుడి భార్యతో చదివించారని లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు ధ్వజమెత్తారు. ఆమె అబద్ధాలు చెప్పలేక తడబడుతుంటే.. పక్కనున్న వైకాపా మూకలు లోకేశ్ మనుషులు వచ్చి బెదిరించారని చెప్పాలంటున్నారని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'ఏదైనా ప్రమాదం జరిగితే రూ.కోటి, రూ.రెండు కోట్లు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసే జగన్.. సింగయ్య కుటుంబానికి రూ.4 కోట్లు ఎందుకు ఇవ్వకూడదు? తన కారు కింద సింగయ్య పడితే జగన్ కనీసం స్పందించలేదు. మానవత్వం లేకుండా ఆయన్ను ముళ్ల కంపల్లో పడేశారు. పోలీసులు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. సింగయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. తెదేపా నాయకుడు కల్లూరి శ్రీను ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. వైకాపా వాళ్లు దీన్ని కూడా తప్పుబట్టే ప్రయత్నం చేస్తున్నారు' అని పిల్లి మాణిక్యరావు మండిపడ్డారు.

ప్రధాన సాక్షి మేరీని బెదిరించిన జగన్‌ను అరెస్ట్ చేయాలి: ఎమ్మెల్యే బూర్ల

గుంటూరు (పట్టాభిపురం), న్యూస్‌టుడే: జగన్ వాహనం కింద పడి మృతి చెందిన దళితుడు చీలి సింగయ్య భార్య మేరీని తాడేపల్లి ప్యాలెస్‌కు పిలిపించుకుని పరామర్శించడం చట్టారీత్యా నేరమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ధ్వజమెత్తారు. గుంటూరులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ కేసులో ఏ2గా ఉన్న జగన్ ప్రధాన సాక్షి, ఫిర్యాదుదారు మేరీని ఇంటికి పిలిపించడం. ప్రలోభపెట్టడం, బెదిరించడం, మీడియా ముందు మాట్లాడించడం నేరమన్నారు. కోర్టు, పోలీసులు దీన్ని సుమోటోగా తీసుకోవాలని జగన్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

'జడ్ ప్లస్' భద్రత మార్గదర్శకాలను మా ముందుంచండి: హైకోర్టు

ఈనాడు, అమరావతి: జడ్ ప్లస్ కేటగిరీ భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను తమ ముందుంచాలని పిటిషనర్లు, వైకాపా నేతలు లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిలను హైకోర్టు ఆదేశించింది. విచారణను గురువారానికి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. జగన్ నెల్లూరు పర్యటన సందర్భంగా రోప్ పార్టీతో భద్రత కల్పించాలని, హెలిప్యాడ్ ఏర్పాటుకు అనుమతివ్వాలని కోరుతూ అప్పిరెడ్డి, మరొకరు హైకోర్టులో వ్యాజ్యం వేసిన విషయం తెలిసిందే. దానిపై బుధవారం జరిగిన విచారణలో పోలీసుల తరఫున అదనపు పీపీ పాణిని సోమయాజి, ఏజీపీ బాలాజీ వాదనలు వినిపించారు. జగన్ నెల్లూరు పర్యటనను వాయిదా వేసుకున్నారని, అందువల్ల వ్యాజ్యం నిరర్థకం అవుతుందని తెలిపారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. జగన్‌కు జడ్ ప్లస్ భద్రత ఉన్నప్పటికీ పోలీసులు ఆ మేరకు రక్షణ కల్పించడం లేదన్నారు.

రజిని, అవినాష్‌లకు నోటీసులిచ్చి వివరణలు తీసుకోండి

పోలీసులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: జగన్ పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటనలో అధికారుల ఉత్తర్వులను ఉల్లంఘించారని ఆ గ్రామ వీఆర్వో ఫిర్యాదుపై నమోదైన కేసులో వైకాపా నేతలు విడదల రజిని, దేవినేని అవినాష్‌లకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులిచ్చి, వారి వివరణలు తీసుకోవాలని సత్తెనపల్లి గ్రామీణ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

జగన్ కారు కింద పడటం వల్లే సింగయ్య మృతి

- సింగయ్య భార్యను జగన్ ఇంటికి పిలిపించి మాట్లాడటంపై న్యాయసలహా తీసుకుంటాం
- గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



గుంటూరు (పట్టాభిపురం), న్యూస్‌టుడే: వైకాపా అధ్యక్షుడు జగన్ కారు కింద పడే చీలి సింగయ్య మృతి చెందారని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. అందుకు సంబంధించి పక్కా ఆధారాలు ఉన్నాయన్నారు. ఘటన జరిగిన రోజు తీసిన డ్రోన్ చిత్రాలు, వీడియో ఫుటేజీలను ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపించగా అవి నిజమైనవేనని నిర్ధారించినట్లు తెలిపారు. వీడియోలు ఎడిట్, మార్ఫింగ్ చేసినవి కాదని తేటతెల్లమైందన్నారు. బుధవారం రాత్రి ఆయన గుంటూరు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడారు. సింగయ్య భార్య లూర్థు మేరీ వైకాపా అధినేత జగన్‌ను కలిసిన తర్వాత చెప్పిన మాటలపై ఎస్పీ స్పందించారు. 'రోడ్డు ప్రమాదం కారణంగా సింగయ్య కుడి ఛాతీకి గాయమైందని, ఛాతీలో ఎముకలు విరిగి ఊపిరితిత్తుల్లోకి గుచ్చుకోవడం వల్ల ఛాతీలో కొంత రక్తం కూడా ఉందని, కాలేయం కూడా కొంత దెబ్బతిన్నట్లు శవపరీక్ష నివేదికలో తేలింది. సింగయ్య మృతిపై అనుమానాలు ఉన్నట్టు ఆయన భార్య పోలీసులకు చెప్పలేదు. ఆమె వాంగ్మూలాన్ని కూడా రికార్డు చేశాం. ఇప్పుడు ఆమె ఎందుకు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారో తెలియదు. ఈ కేసులో ప్రతి విషయాన్ని సాంకేతికంగా క్షుణ్ణంగా పరిశీలించి, దర్యాప్తు చేస్తున్నాం. ఆధారాలు సేకరించి న్యాయస్థానంలో ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తాం. పోలీసులు ఎవరినీ ఒత్తిడి చేయలేదు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేశాం. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ సీఎం జగన్ ఇంటికి మృతుడి భార్యను పిలిపించుకుని మాట్లాడటంపై న్యాయ నిపుణుల సలహా తీసుకుని ముందుకెళ్తాం. ఈ విషయాన్ని అవసరమైనప్పుడు కోర్టు దృష్టికి తీసుకువెళ్తాం' అని ఎస్పీ వివరించారు.

సింగయ్య మృతి కేసు విచారణపై స్టే ఎందుకు?

కోర్టు నిర్ణయం విస్మయం కలిగించింది: వర్ల

ఈనాడు, అమరావతి: వైకాపా అధినేత జగన్ పర్యటనలో ఆయన కారు కిందపడి దళితుడు చీలి సింగయ్య మృతి చెందిన ఘటనపై నమోదయిన కేసులో న్యాయస్థానాలు పూర్వాపరాలు పూర్తిగా విచారించకుండా.. తదుపరి చర్యలొద్దంటూ స్టే విధించడం విస్మయం కలిగిస్తోందని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య వ్యాఖ్యానించారు. దర్యాప్తు చేస్తే కోర్టుకు అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడారు. 'ఆంధ్రప్రదేశ్ మోటార్ వెహికల్ యాక్ట్‌ను కూడా పరిగణనలోకి తీసుకోకుండా.. పూర్తి విచారణపై స్టే ఇవ్వడం చట్టబద్ధమా? ఎందుకు స్టే విధించారో అర్థం కావడం లేదు. జగన్ మీద ఏ కేసూ ఉండకూడదా? కోర్టు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా దర్యాప్తు చేయమని ఆదేశించొచ్చు. అంతే కానీ దర్యాప్తే ఆపండి అనడం సబబా? ఓ పౌరుడిగా, సామాన్యుడిగా అడుగుతున్నాను' అని వర్ల రామయ్య ప్రశ్నించారు. సింగయ్య మరణం వెనక కుట్ర ఉందనేది తమ అభిప్రాయమన్నారు. హైకోర్టు ఉత్తర్వులపై అప్పీలుకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు.

కుట్ర బయటపడుతుందని జగన్ భయం

ఈ కేసులో దర్యాప్తు చేస్తే సింగయ్య మృతిలో తన కుట్ర బయటపడుతుందని జగన్ భయంతో వణికిపోతున్నారని మండిపడ్డారు. 'డ్రైవర్ మీదే నేరం తోసేయాలని చూస్తున్నారు. ఫ్రంట్ సీటులో డ్రైవర్ పక్కన కూర్చొన్న వ్యక్తిగా మీకు బాధ్యత లేదా? మీ కార్యకర్తలే సింగయ్యను బరబరా లాక్కెళ్లి ముళ్లపొదల్లో పడేస్తుంటే వారిని ఎందుకు వారించలేదు? అంబులెన్స్‌ను ఎందుకు పిలిపించలేదు? లేకపోతే మీ కారులోనే ఆసుపత్రికి ఎందుకు తీసుకువెళ్లలేదు? ప్రథమచికిత్స ఎందుకు అందించలేదు? మీరు వెంటనే స్పందించి ఉంటే సింగయ్య బతికేవారు. ఆయన ప్రాణాలు పోవడానికి కారణం మీరే. దర్యాప్తు చేస్తే ఇవన్నీ బయటకు వస్తాయి. అందుకే పెద్దపెద్ద లాయర్లను పెట్టి దర్యాప్తు ఆపమంటూ కోర్టుపై ఒత్తిడి తెస్తున్నారు. దర్యాప్తు చేసుకోండి.. నా తప్పు ఉంటే తేల్చండి అనడం వేరు. అసలు దర్యాప్తే వద్దు అనడం వేరు' అని జగన్‌ను నిలదీశారు.



(c) eenadu

నేడు ప్రైవేటు పాఠశాలల బంద్

- అధికారుల ఏకపక్ష చర్యలకు నిరసన
- యాజమాన్యాల సంఘాలు వెల్లడి

ఈనాడు, అమరావతి: ప్రైవేటు పాఠశాలలపై తీసుకుంటున్న ఏకపక్ష చర్యలకు నిరసనగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలను మూసివేసినట్లు ఏపీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘాలు ప్రకటించాయి. ఈ నిర్ణయం తమ ఆవేదనను తెలిపేందుకే తప్ప ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని వెల్లడించాయి. "కొందరు క్షేత్రస్థాయి అధికారుల నుంచి వచ్చే అగౌరవకరమైన సందేశాలు, హెచ్చరికలు మమ్మల్ని ఆవేదనకు గురిచేస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలలను నిత్యం తనిఖీలు చేయడం, యాజమాన్యాలపై అతిగా స్పందించడం దురదృష్టకరం. ఆర్టీఈ ప్రవేశాల్లో తగిన ధ్రువీకరణ లేకుండా చేర్చుకోవాలని బలవంతం చేస్తున్నారు. పాఠశాలలను షోకాజ్ నోటీసులతో వేధించడం సహా గుర్తింపు రద్దు చేస్తామని బెదిరించడం లాంటి చర్యలకు ప్రతిస్పందనగా రాష్ట్రంలో అన్ని ప్రైవేటు పాఠశాలలను ఒక రోజు మూసివేయాలని నిర్ణయించాం" అని ప్రైవేటు యాజమాన్యాలు పేర్కొన్నాయి.

పట్టణాల్లో ఘన వ్యర్థాల నిర్వహణకు అనుమతి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 53 పట్టణ స్థానిక సంస్థల్లో ఇళ్ల నుంచి సేకరించిన ఘన వ్యర్థాల నిర్వహణలో భాగంగా పలు కార్యక్రమాలకు అనుమతిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ బుధవారం ఉత్తర్వులిచ్చింది. వాటిని పట్టణ స్థానిక సంస్థల నిధులతో చేపట్టాలని పేర్కొంది.

మత్స్యకారుడిని లాక్కెళ్లిన చేప

కొమ్ముకోనాం చేప ధాటికి సముద్రంలో గల్లంతు



యర్రయ్య

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: సముద్రంలో చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు భారీ మత్స్యాన్ని చేజిక్కించుకునే యత్నంలో ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి గల్లంతయ్యారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడకకు చెందిన చోడపల్లి యర్రయ్య (26).. ఆయన తమ్ముడు కొర్లయ్య, వాసుపల్లి యల్లాజి, గనగళ్ల అప్పలరాజులు బుధవారం తెల్లవారుజామున సముద్రంలో చేపలవేటకు వెళ్లారు. తీరానికి దాదాపు 30 కిలోమీటర్ల దూరంలో వేట సాగిస్తుండగా.. గేలానికి సుమారు 100 కిలోల బరువుండే కొమ్ముకోనాం చేప చిక్కింది. దాన్ని యర్రయ్య తాడుతో బోటులోకి లాగే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో చేప యర్రయ్యను బలంగా నీటి లోపలికి లాక్కెళ్లిపోయింది. కళ్లముందే యర్రయ్య గల్లంతు కావడంతో కన్నీటిపర్యంతమైన ఆయన సోదరుడు కొర్లయ్య గ్రామస్థులకు సమాచారం అందించారు. గ్రామస్థులు పడవల్లో సాయంత్రం వరకు గాలించినా యువకుడి ఆచూకీ తెలియరాలేదు. దీంతో పూడిమడక గ్రామంలో విషాదం నెలకొంది. తల్లి కోదండమ్మ కన్నీరుమున్నీరుగా విలపించారు.

బస్సుల పరిస్థితి ఎలా ఉంది?

జిల్లాల నుంచి నివేదిక కోరిన ఆర్టీసీ యాజమాన్యం

ఈనాడు, అమరావతి: ప్రస్తుతం ఉన్న బస్సుల్లో పూర్తిగా కండిషన్‌లో ఉన్నవి ఎన్ని? నిర్దిష్ట కిలోమీటర్లు తిరిగిన దూర ప్రాంత సర్వీసుల్లో పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ సర్వీసులుగా మార్చేందుకు వీలున్నవి ఎన్ని..? తదితర వివరాలను ఆర్టీసీ యాజమాన్యం సిద్ధం చేస్తోంది. ఆగస్టు 15 నుంచి కూటమి ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేస్తున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న బస్సులు, వాటి పరిస్థితి, విడిభాగాలు తదితర వివరాలతో నివేదిక తయారు చేస్తోంది. అందులో భాగంగా జిల్లాల వారీగా వివరాలను వెంటనే పంపాలని ఆర్టీసీ యాజమాన్యం.. అన్ని జిల్లాల ప్రజా రవాణా అధికారులను ఆదేశించింది.

■ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసిన తర్వాత.. మార్గమధ్యలో నిలిచిపోయే బస్సులు ఉండకూడదని.. ఇందుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధంచేసి వెంటనే పంపాలని యాజమాన్యం ఆదేశించింది.

విమానాశ్రయాల అభివృద్ధికి ప్రాధాన్యం


- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు
- ఓర్వకల్లు-విజయవాడ సర్వీసు ప్రారంభం

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో విమానాశ్రయాల అభివృద్ధికి అన్నిరకాల చర్యలూ తీసుకుంటున్నట్లు విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు చెప్పారు. ఓర్వకల్లు నుంచి విజయవాడకు ప్రత్యేక విమాన సర్వీసును ఆయన బుధవారం వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ... 'ఓర్వకల్లును పారిశ్రామిక హబ్‌గా సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇక్కడికి పరిశ్రమలూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఓర్వకల్లు నుంచి విజయవాడకు విమాన సర్వీసును ప్రారంభించాం' అని చెప్పారు. వారంలో మూడు రోజులపాటు సర్వీసు నడుస్తుందన్నారు. ఓర్వకల్లు విమానాశ్రయానికి అదనపు కనెక్టివిటీల కోసం సహాయ, సహకారాలు అందిస్తామని, ఇక్కడ రాత్రివేళల్లోనూ విమానాలు దిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఓర్వకల్లు విమానాశ్రయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, టీజీ భరత్, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, ఇన్‌ఛార్జి కలెక్టర్ నవ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భీమప్ప అనే ప్రయాణికుడికి మొదటి బోర్డింగ్ పాస్‌ను అందించారు. విమానంలో వసతులను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు మంత్రి టీజీ భరత్ అదే సర్వీసులో విజయవాడ వెళ్లారు.

ఐదేళ్లూ నేనే సీఎం!

ధీమా వ్యక్తం చేస్తున్న కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

ప్రస్తుతానికి సీటు పదిలం!



డీకే శివకుమార్, సిద్ధరామయ్య,

ఈనాడు, బెంగళూరు: కన్నడనాట కుర్చీలాట ఆసక్తికర మలుపులు తిరుగుతోంది. ఓ వైపు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్‌సింగ్ సూర్జేవాలా పార్టీ అంశాలపై విరామం లేకుండా చర్చిస్తుండగా.. ఆ చర్చల ఫలితమేనా అన్నట్లు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ బయట స్పష్టత ఇస్తూ రాజకీయ రణాన్ని మరింత ఆసక్తిగా మారుస్తున్నారు. మొన్న రణ్‌దీప్‌సింగ్ అధికారపంపిణీ లేదని తేల్చగా... నాయకత్వ మార్పు ప్రస్తుతానికి అవసరం లేదంటూ డీకే శివకుమార్ మంగళవారం మరింత స్పష్టత ఇచ్చారు. ఇక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బుధవారం తన స్థానంపై కొండంత విశ్వాసాన్ని ప్రకటించారు.

ఏమైనా సందేహమా?

ఎవరి కుర్చీకి ఎసరు వస్తుందని అందరూ చర్చించుకుంటున్నారో.. ఆయనే తాను ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉంటానని తేల్చి చెప్పారు. చిక్కబళ్లాపుర సమీప నంది కొండల్లో ప్రత్యేక మంత్రివర్గ సమావేశం సందర్భంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ 'ఐదేళ్లూ నేనే ముఖ్యమంత్రిగా ఉంటాను. మీకేమైనా సందేహమా?' అంటూ ధీమాగా చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సుస్థిరంగా అధికారంలో ఉంటుందన్నారు. విపక్ష నేతలు ఆర్.అశోక్, బి.వై.విజయేంద్ర మిమ్మల్ని ముఖ్యమంత్రి స్థానం నుంచి దించుతారట కదా అంటూ ప్రశ్నించగా.. 'వారిద్దరూ ఏమైనా మా అధిష్ఠానమా?' అంటూ ఎదురుప్రశ్న వేశారు. 'వారు అధికారంలో ఉన్నన్నాళ్లు ఏం చేశారు? జేడీఎస్‌తో కలిసి.. మరోసారి ఒంటరిగా అధికారంలో ఉన్నా ఏమీ చేయలేదు. నీటిపారుదల, ప్రజాపనులు, గ్రామీణాభివృద్ధి, విద్య, ఆరోగ్యం.. ఇలా ఏ రంగంలో భాజపా మంచి పనులు చేసిందో చెప్పాలి. అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించడమే భాజపాకు చేతనైన పని' అంటూ ముఖ్యమంత్రి దుయ్యబట్టారు. ఇక మంత్రివర్గంలో చేరేందుకు పెరుగుతున్న ఆశావహుల గురించి ప్రశ్నించగా ఉన్న '140 మందిలో 34 మందికే అవకాశం ఉంటుంది. ఎవరినైనా తొలగించాలన్నా, ఉంచాలన్నా అధిష్ఠానమే చూసుకుంటుంది' అని చెప్పారు.

విపక్షాల దాడి

అధికారపక్షంలో పరిణామాలపై విపక్ష నేతలు మరోసారి విమర్శలతో దండెత్తారు. ముఖ్యమంత్రిని రాజీనామా చేయించేందుకే ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి రణ్‌దీప్‌సింగ్ సూర్జేవాలా రాష్ట్రంలో సమావేశాలు నిర్వహిస్తున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర ఆరోపించారు. ఆయనకు ఇన్ని రోజులు బెంగళూరులో పనేంటని ప్రశ్నించారు. అవినీతిమయమైన ప్రభుత్వంపై దృష్టిసారించని రణ్‌దీప్ సింగ్.. ఎమ్మెల్యేల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నారన్నారు. ప్రభుత్వంపై సొంత ఎమ్మెల్యేలే తిరగబడుతుంటే ఏం చేయాలో తెలియక వారి అభిప్రాయం రణ్‌దీప్ సింగ్ సు రాష్ట్రానికి పంపించిన, చేయి దాటిపోయిన పార్టీని సిద్ధరామయ్య రాజీనామాతోనే రక్షించే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

ప్రస్తుతానికి సురక్షితమేనా?

సిద్ధరామయ్యను సీఎం పీఠం నుంచి దించేంత సాహసం అధిష్ఠానం చేయబోదన్న అభిప్రాయం రాజకీయవర్గాల నుంచి వినిపిస్తోంది. ఇందుకు కారణాల్లో ఒకటి బిహార్ ఎన్నికలు. దానికి ముందు రాష్ట్రంలో నాయకత్వ మార్పు శ్రేయస్కరం కాదు. మరోవైపు రాష్ట్రంలో 65శాతానికి పైగా ఉన్న అహిందలకు నాయకుడిగా ఉన్న సిద్ధరామయ్యను గద్దె దించితే సంభవించే హరాత్పరిణామాలను నియంత్రించే సత్తా తర్వాతి నాయకుడికి లేకపోవటం, ఒక వేళ డీకేను ముఖ్యమంత్రిని చేస్తే దిల్లీలో అరవింద్ కేజ్రీవాల్ మెడకు చుట్టుకున్న అవినీతి కేసులు వెంటాడి.. తద్వారా పార్టీకి జాతీయ స్థాయిలో మచ్చపడే అవకాశం ఉండటం, సిద్ధరామయ్య తర్వాత దళిత ముఖ్యమంత్రి ప్రతిపాదనతో పార్టీలో వర్గపోరు తప్పదన్న అంచనాతో అధిష్ఠానం తక్షణమే నాయకత్వ మార్పునకు సాహసించట్లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది.

క్యాబ్ ఛార్జీలు ప్రియం

- రద్దీ వేళల్లో బేస్ ధరపై రెట్టింపు వరకు పెంచుకునేందుకు ప్రభుత్వ అనుమతి
- 3 నెలల్లోగా మార్గదర్శకాలు జారీ చేయనున్న రాష్ట్ర ప్రభుత్వాలు



దిల్లీ: రోజువారీ పనుల కోసం క్యాబ్‌లలో ప్రయాణిస్తున్న వారికి షాక్ కలిగించే పరిణామమిది. రద్దీ వేళ్లలో బేస్ ఛార్జీపై రెట్టింపు వరకు వసూలు చేసుకునేందుకు ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి క్యాబ్ అగ్రిగేటర్లకు రహదారి మంత్రిత్వ శాఖ అనుమతి ఇచ్చింది. ఇప్పటివరకు ఇది 1.5 రెట్లుగా ఉంది. రద్దీ లేని వేళల్లో ఛార్జీ.. బేస్ ధరలో కనీసం 50 శాతంగా వసూలు చేసుకోవచ్చు. తాజాగా విడుదల చేసిన 'మోటార్ వెహికల్స్ అగ్రిగేటర్ గైడ్‌లైన్స్ 2025'లో ఈ అనుమతులను మంత్రిత్వ శాఖ ఇచ్చింది. డెడ్ మైలేజీని భర్తీ చేసేందుకు కనీసం మూడు కిలోమీటర్ల వరకు బేస్ ఛార్జీ వసూలు చేస్తారు. 'ప్రయాణికుడు లేకుండా ప్రయాణించిన దూరం, ప్రయాణికుడిని ఎక్కించుకోవడానికి ప్రయాణించిన దూరానికి వాడిన ఇంధనాన్ని' డెడ్ మైలేజీగా పరిగణిస్తారు. సంబంధిత విభాగం లేదా మోటార్ వాహనాలను బట్టి రాష్ట్ర ప్రభుత్వాలు నోటిఫై చేసిన ఛార్జీయే, అగ్రిగేటర్ నుంచి సేవలు పొందే ప్రయాణికులకు వసూలు చేసే బేస్ ఛార్జీ అవుతుంది. 3 నెలల్లోగా సవరించిన మార్గదర్శకాలను అమలు చేయాల్సిందిగా రాష్ట్రాలను కేంద్రం సూచించింది. మరిన్ని మార్గదర్శకాలు ఇలా..

■ క్యాన్సిలేషన్స్ విషయానికి వస్తే.. సహేతుకమైన కారణం లేకుండా అంగీకరించిన ప్రయాణాన్ని డ్రైవర్ రద్దు చేస్తే, ఛార్జీలో 10 శాతం అపరాధ రుసుము విధించొచ్చు. ఇది రూ.100కు మించకూడదు. ఇదే విధమైన జరిమానా ప్రయాణికుడిపైనా విధిస్తారు. సహేతుక కారణాలను అగ్రిగేటర్ నిర్ణయిస్తారు.

అగ్రిగేటర్లకు వేగంగా అనుమతులు

అగ్రిగేటర్ లైసెన్స్ కోసం వచ్చే దరఖాస్తులకు వేగంగా అనుమతులు ఇచ్చేందుకు ప్రభుత్వం కొత్త పోర్టల్‌ను అభివృద్ధి చేయనుంది. లైసెన్స్ కోసం అగ్రిగేటర్ రూ.5 లక్షల ఫీజు చెల్లించాలి. లైసెన్స్ జారీ తేది నుంచి అయిదేళ్ల కాలవ్యవధికి ఇది పనిచేస్తుంది. డ్రైవర్లకు రూ.5 లక్షల ఆరోగ్య బీమా, రూ.10 లక్షల టెర్మ్ ఇన్సూరెన్స్‌ను తప్పనిసరిగా అగ్రిగేటర్లు అందించాలి. అగ్రిగేటర్లు ఒక గ్రీవియెన్స్ అధికారినీ నియమించాలి.

■ ప్రారంభ రిజిస్ట్రేషన్ తేదీ నుంచి 8 ఏళ్లు పూర్తి చేసుకున్న వాహనాలను అగ్రిగేటర్లు క్యాబ్‌గా అంగీకరించకూడదు. ప్రయాణికుల భద్రత కోసం వాహనాల్లో లొకేషన్, ట్రాకింగ్ పరికరాలను అమర్చాలి. ఇవి అన్ని వేళల్లోనూ పనిచేసేలా చూడాలి. ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి. ఇందులో ఆంగ్లంతో పాటు స్థానిక భాష వినియోగం తప్పనిసరి. వాటి ఫోన్ నంబర్, ఇ-మెయిల్ చిరునామాలను వెబ్‌సైట్, యాప్‌లో ప్రదర్శించాలి.

■ యాప్‌లో చూపిన మార్గాన్ని డ్రైవర్ అనుసరించేలా అగ్రిగేటర్ చూడాలి. ఇందుకు భిన్నంగా వెళ్తే, కంట్రోల్ రూంనకు హెచ్చరికలు చేరాలి. వెంటనే వారు డ్రైవర్, ప్రయాణికులతో మాట్లాడాలి.



6 గేట్ల నుంచి దిగువకు ప్రవాహం

తుంగభద్ర నుంచి దిగువకు జలాలు

హొసపేటె, న్యూస్‌టుడే: తుంగభద్ర పరవళ్లు తొక్కుతుండటంతో బుధవారం సాయంత్రం జలాశయంలోని 6 గేట్లను రెండడుగుల మేర పైకెత్తారు. 17,635 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి సుమారు 33 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. జలాశయ నిల్వలు ప్రస్తుతం 77.14 టీఎంసీలకు చేరాయి. రాయచూరు, కొప్పళ జిల్లాలను తడిపే ఎడమ కాలువకు బుధవారం 2,000 క్యూసెక్కుల జలాలు వదిలారు. ఏపీకి కీలకమైన హెచ్చెల్సీ, ఎల్లెల్సీలకు 10వ తేదీ నుంచి విడుదల చేయనున్నారు.

ఇన్ఫోసిస్ ఉద్యోగి వక్రబుద్ధి

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: ఐటీ సంస్థ ఇన్ఫోసిస్‌లో పనిచేసే ఓ ఉద్యోగి చర్య బెంగళూరులో సంచలనం రేపింది. ఈ సంస్థకు చెందిన ఎలక్ట్రానిక్ సిటీ శాఖ ప్రాంగణంలోని ఓ మరుగుదొడ్డిలో సహ ఉద్యోగిని కాలకృత్యాలు తీర్చుకుంటున్న సమయంలో స్వప్నిల్ నాగేశ్ మాలి అనే సీనియర్ అసోసియేట్ కన్సల్టెంట్ కెమెరా సాయంతో చిత్రీకరించిన విషయం వెలుగుచూసింది. ఆ యువకుడు అలా చిత్రీకరిస్తుండగా.. అటు నుంచి అతడి నీడ తలుపుపై పడడంతో ఆమె గట్టిగా కేకలు వేసింది. సహోద్యోగులు రావడంతో ఆ యువకుడు దొరికిపోయాడని దర్యాప్తు అధికారులు వివరించారు. అతడు ఇలాగే దాదాపు 30 మంది మహిళల వీడియోలు చిత్రీకరించాడని పోలీసులు బుధవారం తెలిపారు.

కాకినాడలో వైకాపా నేత భూమాయ!



వివాదాస్పద స్థలంలో వైకాపా నేత నిర్మించిన బహుళ అంతస్తుల భవనం

- నకిలీ పత్రాలతో రూ.10 కోట్ల విలువైన స్థలంలో భవనం
- మాజీ మేయర్ భర్త విద్యాసాగర్, ఆయన సోదరుడిపై కేసు

ఈనాడు, కాకినాడ; న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్: గత ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని కాకినాడలో వైకాపా నేతలు సాగించిన దౌర్జన్యాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా కాకినాడ మాజీ మేయర్ సుంకర శివప్రసన్న భర్త, వైకాపా నేత విద్యాసాగర్, ఆయన సోదరుడు మాధవకృష్ణతో పాటు అనసూరి సుబ్రహ్మణ్యం చేసిన భూమాయపై సర్పవరం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి కాకినాడ నగర వైకాపా ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అండతో విద్యాసాగర్ భూ ఆక్రమణకు పాల్పడ్డారని బాధితుడు అనసూరి వెంకటరమణ రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీంతో డొంక కదిలింది. కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీఓ విచారణ చేపట్టారు. నకిలీ పత్రాలు సృష్టించడం నిజమేనని మే 24న నివేదిక ఇచ్చారు.

ఇదీ కథ..: కాకినాడ నగరపాలక సంస్థ పరిధి గైగోలుపాడులో సర్వే నంబరు 162/1,2,3, 163/1,2,3లో ఉమ్మడి ఆస్తిగా ఉన్న 1.50 ఎకరాల్లో సుమారు 2 వేల గజాలను భూ అభివృద్ధి పేరుతో విద్యాసాగర్ తీసుకున్నాడు. భూమి ఉమ్మడి కుటుంబానిది కావడంతో అందులో ఒకరైన అనసూరి సుబ్రహ్మణ్యంను తన వైపు తిప్పుకొని నకిలీ పత్రాలు సృష్టించి, రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.10 కోట్ల విలువైన ఈ స్థలంలో బహుళ అంతస్తుల భవనం నిర్మించారు. ఇక్కడ 85 గజాల స్థలాన్ని రహదారికి ఇచ్చినట్లు చూపి, రూ.కోటి విలువైన టీడీఆర్ బాండ్లు కొట్టేశారు.

డిసెంబరు 26న ఖమ్మంలో సీపీఐ శత వసంతోత్సవ కార్యక్రమం

- సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

ఈనాడు, దిల్లీ: సీపీఐ శత వసంతోత్సవాలను డిసెంబరు 26న ఖమ్మం వేదికగా ఘనంగా నిర్వహించబోతున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రకటించారు. అంతకుముందు రెండురోజులపాటు డిసెంబరు 24, 25 తేదీల్లో విజయవాడలో ప్రపంచ కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులతో అంతర్జాతీయ సెమినార్ నిర్వహిస్తామని చెప్పారు. దిల్లీలో జరగనున్న సీపీఐ నేషనల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన పార్టీ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల కార్యదర్శులు రామకృష్ణ, కూనంనేని సాంబశివరావులతో కలిసి ఆయన బుధవారం ఇక్కడ ఏపీ భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. పార్టీ 25వ కాంగ్రెస్‌ను వచ్చే సెప్టెంబరులో చండీగఢ్‌లో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. దేశాన్ని కాపాడాలంటే భాజపాను అధికారం నుంచి దూరంగా ఉంచాలన్నారు. రాజ్యాంగ పీఠిక నుంచి లౌకికవాదం, సామ్యవాదం అన్న పదాలను తొలగించడానికి ఆరెస్సెస్ కుట్ర చేస్తోందని.. అందుకు అనుగుణంగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ సహా కొందరు కేంద్రమంత్రులు మాట్లాడుతున్నారని ఆరోపించారు. రాజ్యాంగంపై ఆయన చేసిన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్‌ల మద్దతుపై ఆధారపడే ప్రస్తుతం కేంద్రంలో మోదీ ప్రభుత్వం నడుస్తోందన్నారు. విభజన హామీలను నెరవేర్చని కేంద్ర ప్రభుత్వానికి చంద్రబాబు ఎందుకు మద్దతిస్తున్నారో అర్థం కావడంలేదన్నారు.

పర్యాటక, ఆర్థికాభివృద్ధిలో విశాఖది కీలకపాత్ర

- కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్
- నగరానికి చేరుకున్న క్రూజ్ నౌక
- జెండా ఊపి ప్రారంభించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు





విశాఖ పోర్టుకు వచ్చిన క్రూజ్ లైనర్ ఎంవీ ఎంప్రస్ పర్యాటక నౌక ★ క్రూజ్ నౌక పైనుంచి అభివాదం చేస్తున్న మంత్రి దుర్గేష్, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ తదితరులు

విశాఖపట్నం (వన్‌టౌన్), న్యూస్‌టుడే: పర్యాటకాభివృద్ధి, ఆర్థిక ప్రగతిలో విశాఖ నగరం కీలకపాత్ర పోషిస్తోందని కేంద్ర పోర్టులు, నౌకాయానం, జలరవాణా శాఖల మంత్రి సార్బానంద సోనోవాల్ పేర్కొన్నారు. విశాఖ పోర్టులోని అంతర్జాతీయ క్రూజ్ టెర్మినల్‌కు విలాసవంతమైన 'క్రూజ్ లైనర్' ఎంవీ ఎంప్రస్ నౌక బుధవారం చేరుకుంది. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో కలిసి ఈ పర్యాటక నౌక (కార్డేలియా)ను దిల్లీ నుంచి వర్చువల్‌గా కేంద్ర మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా క్రూజ్ పర్యాటకం అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందన్నారు. కేంద్ర సహాయ మంత్రి శాంతను ఠాకుర్ మాట్లాడుతూ.. క్రూజ్ పర్యాటకాన్ని అభివృద్ధి చేయడంలో ఏపీ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక సర్క్యూట్లు, హబ్‌ల అభివృద్ధిపై దృష్టి సారించిందన్నారు. భవిష్యత్తులో విశాఖకు చాలా క్రూజ్ నౌకలు వస్తాయని చెప్పారు. ప్రస్తుతం చెన్నై-విశాఖ-పుదుచ్చేరి మధ్య క్రూజ్ సేవలు అందుబాటులోకి వచ్చాయని వివరించారు.

ఇది చారిత్రక ఘట్టం

కేంద్ర పోర్టులు, నౌకాయానం, జలరవాణా శాఖ కార్యదర్శి టీకే రామచంద్రన్ మాట్లాడుతూ.. 'ఎంవీ ఎంప్రస్' నౌక ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమం ఏపీ క్రూజ్ పర్యాటకంలో ఒక చారిత్రక ఘట్టమని వెల్లడించారు. ఇది స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని చెప్పారు. రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ మాట్లాడుతూ విశాఖ పోర్టుకు మరిన్ని క్రూజ్ లైనర్లు రావాలని, అందుకు ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. విశాఖ పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ కేంద్ర మంత్రిత్వ శాఖలతో కలిసి తక్కువ దూరాలకు సైతం ఏపీకి ప్రత్యేక 'క్రూజ్ డైలాగ్' నిర్వహించాలనే ప్రణాళిక ఉందని వెల్లడించారు. అనంతరం క్రూజ్‌లో ప్రయాణించే వారికి మంత్రులు, ప్రముఖులు బోర్డింగ్ పాసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పోర్టు కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ సబ్‌జైలు నుంచి వంశీ విడుదల



జైలు నుంచి బయటకు వస్తున్న వంశీ

విజయవాడ (గాంధీనగర్), నూజివీడు, న్యూస్‌టుడే: నకిలీ ఇళ్ల పట్టాల కేసులో బెయిల్ మంజూరు కావడంతో... వైకాపా నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ బుధవారం విజయవాడ సబ్ జైలు నుంచి విడుదలయ్యారు. హైదరాబాద్‌లో ఉన్న ఆయనను ఫిబ్రవరి 16న పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వంశీపై 11 కేసులు నమోదవడంతో 140 రోజులుగా జైల్లో ఉన్నారు. అన్ని కేసుల్లోనూ బెయిల్ వచ్చింది. జైలు నుంచి బయటకు వచ్చిన వంశీ.. మీడియాతో మాట్లాడకుండా కారు ఎక్కి వెళ్లిపోయారు. వంశీ భార్య పంకజశ్రీ, మాజీ మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ జైలు వద్దకు వచ్చారు.

పూచీకత్తులు చెల్లించి... : 2016లో మల్లవల్లి పారిశ్రామిక వాడ భూముల సేకరణలో పరిహారం అందకుండా చేశారని ఓ రైతు చేసిన ఫిర్యాదుపై, 2023లో బాపులపాడు మండలం ఆరుగొలనులో తెదేపా నేతకు చెందిన ఫెర్టిలైజర్ షాపు పోరంబోకు స్థలంలో ఉందంటూ కూల్చివేయించిన ఘటనకు సంబంధించి వంశీపై కేసులున్నాయి. ఈ రెండింటిలోనూ గతంలోనే నూజివీడు న్యాయస్థానంలో బెయిల్ లభించింది. విజయవాడ జైలు నుంచి విడుదలైన వంశీ... ఈ రెండు కేసులకు సంబంధించి షరతుల ప్రకారం న్యాయస్థానంలో లొంగిపోయి, పూచీకత్తులు సమర్పించి వెళ్లారు.



జైలు బయట భార్య పంకజశ్రీని పలకరిస్తున్న వంశీ. చిత్రంలో పేర్ని నాని తదితరులు

ఐపీఎస్‌కు రాజీనామా: పూర్తిగా నా వ్యక్తిగత నిర్ణయం

- ఐపీఎస్ అధికారి సిద్ధార్థ్ కౌశల్ స్పష్టీకరణ

ఈనాడు, అమరావతి: ఇండియన్ పోలీసు సర్వీస్ (ఐపీఎస్) నుంచి వైదొలగాలన్నది పూర్తిగా తన వ్యక్తిగత, స్వచ్ఛంద నిర్ణయమని ఐపీఎస్ అధికారి, ప్రస్తుతం డీజీపీ ఆఫీసులో ఏఐజీ (శాంతిభద్రతలు)గా పనిచేస్తున్న సిద్ధార్థ్ కౌశల్ స్పష్టంచేశారు. తన రాజీనామాకు రాజకీయ వేధింపులు, ఒత్తిళ్లు కారణమంటూ కొన్ని పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. "ఐపీఎస్‌కు రాజీనామా చేయాలన్నది పూర్తిగా వ్యక్తిగత కారణాలతో తీసుకున్న నిర్ణయం. నా దీర్ఘకాలిక జీవిత లక్ష్యాలను చేరుకునేందుకు, కుటుంబసభ్యుల ఆకాంక్షల మేరకు చాలా ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నాను" అని బుధవారం ఆయన ఓ ప్రకటనలో స్పష్టంచేశారు. 2012 బ్యాచ్‌కు చెందిన సిద్ధార్థ్ కౌశల్ కొన్ని రోజుల క్రితం స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు దరఖాస్తు చేశారు. ప్రస్తుతం అది పరిశీలనలో ఉంది. ఈ నేపథ్యంలో ఐపీఎస్‌కు రాజీనామా చేయడంపై వాస్తవాల్ని వక్రీకరిస్తూ వస్తున్న వార్తలపై సిద్ధార్థ్ కౌశల్ స్పందించారు. "నా రాజీనామా నిర్ణయంపై ఇటీవల కొందరు పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అదంతా ప్రజలను తప్పుదారి పట్టించేందుకు చేస్తున్న నిరాధార ప్రచారమని నిర్ద్వంద్వంగా చెబుతున్నాను. ఆ నిర్ణయాన్ని నేను పూర్తి స్వతంత్రంగా, వ్యక్తిగతంగా, స్వచ్ఛందంగా తీసుకున్నానని స్పష్టం చేస్తున్నాను" అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఐపీఎస్ అధికారిగా పనిచేయడం తన జీవితంలో ఎంతో సంతృప్తినిచ్చిన, అద్భుత ప్రయాణంగా ఆయన తెలిపారు. "ఈ రాష్ట్రంలో పనిచేయడాన్ని గర్వకారణంగా భావిస్తాను. ఆంధ్రప్రదేశ్‌ను ఎప్పుడూ నా సొంత రాష్ట్రమే అనుకున్నాను. ఇక్కడి ప్రజలు నాపై చూపించిన అభిమానం, ఆప్యాయత నా గుండెల్లో చిరస్థాయిగా ఉంటాయి" అని తెలిపారు.

మేఘ విస్ఫోటం ముందే పసిగట్టేలా..!

- 6 నెలల్లో అందుబాటులోకి వచ్చేలా కొత్త వ్యవస్థ
- వస్సార్ ల్యాబ్స్‌తో జలవనరుల శాఖ ఒప్పందం

ఈనాడు, అమరావతి: తుపాన్లు, వర్షాలు, భారీ వర్షాలపై వాతావరణశాఖ ఇప్పటికే పౌరులకు సమాచారం ఇస్తోంది. పిడుగులు పడే ప్రాంతాలనూ గుర్తించి ఏపీ ప్రభుత్వం ఆర్టీజీఎస్ ద్వారా ప్రజలకు సంక్షిప్త సందేశాలు పంపుతోంది. ఇన్ని చేస్తున్నా.. అనూహ్య వాతావరణ పరిస్థితుల వల్ల ఒక్కోసారి మేఘ విస్ఫోటం చెంది అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. తక్కువ వ్యవధిలో వాగులు, నదులు పొంగి ప్రాణ, ఆస్తి నష్టం సంభవిస్తోంది. ఇలాంటి పరిస్థితి రాకుండా ఉండేందుకు.. అతి భారీ వర్షాల సమాచారమూ ముందే రాబట్టి, అవసరమైన జాగ్రత్తలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమైంది. ఇందుకు రాష్ట్ర జలవనరులశాఖ, వస్సార్ ల్యాబ్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. మొత్తం ఐదేళ్ల ఈ ప్రాజెక్టు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వర్షాకాలం వెళ్లే లోపు మొత్తం వ్యవస్థను రూపొందించి సమాచారం అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

● వస్సార్ ల్యాబ్స్, జలవనరులశాఖ సంయుక్తంగా ఈ ప్రాజెక్టుపై కసరత్తు చేయనున్నాయి. ఇందులో భాగంగా వాతావరణశాఖ రాడార్ నుంచి సేకరించే సమాచారాన్ని యథాతథంగా తీసుకుంటారు. ఇందుకు భారత వాతావరణశాఖ డైరెక్టర్ జనరల్‌కు జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ లేఖ రాశారు. అదే సమయంలో హెలికాప్టర్లు వెళ్లే మార్గంలో మేఘాల ఉష్ణోగ్రత సమాచారం ఏవియేషన్ నుంచి తీసుకుంటారు. వీటన్నింటినీ క్రోడీకరించి.. విశ్లేషించి మేఘ విస్ఫోటం అంచనా వేస్తారు. వచ్చిన సమాచారాన్ని ఆర్టీజీఎస్‌కు అనుసంధానిస్తారు. ఆ తర్వాత యంత్రాంగం, పౌరులనూ అప్రమత్తం చేస్తారు.

మరింత పటిష్ఠంగా వెబ్‌సైట్

రాష్ట్ర నీటివనరుల నిర్వహణపై జలవనరుల శాఖ https://apwrims.ap.gov.in/ అనే వెబ్‌సైట్ నిర్వహిస్తోంది. తాజా ప్రాజెక్టులో భాగంగా ఈ వెబ్‌సైట్‌లో మరింత మార్పులు చేయనున్నారు. రాష్ట్రంలోని 108 జలాశయాలను, వెయ్యి పెద్ద చెరువుల నిర్వహణను దీనికి అనుసంధానిస్తారు. ఆయా నీటి వనరుల సమాచారాన్ని రోజుకు 3 సార్లు నవీకరించాల్సి ఉంటుంది.

(c) eenadu

ముందే బేరం.. ముడితేనే పందేరం

- 25 శాతమిస్తేనే ఓఅండ్‌ఎం పనులు అప్పగింత
- చక్రం తిప్పుతున్న కీలక పదవిలో ఉన్న వ్యక్తి

ఈనాడు - అమరావతి

ఉమ్మడి కృష్ణాలో సాగునీటి కాలువల ఓఅండ్‌ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) పనుల్లో ముందస్తు ముడుపుల ముచ్చట సాగుతోంది. పనులు చేశాక కమీషన్లు తీసుకోవడం పరిపాటి.. ఇక్కడ మాత్రం కాంట్రాక్టు కావాలంటే కమీషన్లు ఇవ్వాలని హుకుం జారీ చేశారు. కీలక పదవిలో ఉన్న వ్యక్తి వ్యవహారం నడిపిస్తున్నారు. గుత్తేదారులు పనులు చేసేందుకు బెంబేలెత్తిపోతున్నారు. ఫలితంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి.


ఇప్పటికీ పనులు చేపట్టక అధ్వానంగా ఉన్న బందరు కాలువ

అంతా మా ఇష్టం

ఉమ్మడి జిల్లాలో కాలువల నిర్వహణ పనులకు ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది. 666 పనులు చేయాలి. కాలువలు శుభ్రం చేసి శివారు ప్రాంతాలకూ నీరివ్వాలనేది లక్ష్యం. దీనికి జిల్లాలో కీలక పదవిలో ఉన్న ఓ నాయకుడు తూట్లు పొడుస్తున్నారు. ఎక్కువ నిధులు కేటాయించిన పనుల విషయంలో కొత్త రకం దోపిడీకి తెర తీశారు. ముందుగా మొత్తం పనికి వచ్చే నిధుల్లో 25 శాతం కమీషన్‌గా సమర్పిస్తేనే పనులు అప్పగిస్తామని సొంత రాజ్యాంగం రాశారు. కొందరు గుత్తేదారులకు రూ.కోట్ల విలువైన పనులు అప్పగించి ఇప్పటికే భారీగా దండుకున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఇష్టమైతే చేయండి లేదంటే మానుకోండని ఆయన కుమారుడు చెప్పేస్తున్నారు.

గుత్తేదారుల వెనుకంజ..

ఓఅండ్‌ఎం పనులు చేసినా... బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియదు. ఇప్పుడు బిల్లులు పెడితే ఏడాదిన్నరలోగా వస్తే గొప్పే. పనులు చేయడానికి పెద్ద మొత్తంలో ఖర్చవుతుంది. దీంతో 90 శాతం గుత్తేదారులు ముందస్తు కమీషన్ ఇచ్చేందుకు ముందుకు రాలేదు. కొందరు 5 శాతం ముందుగా ఇచ్చి మిగతాది బిల్లులు వచ్చాక ఇస్తామన్నా ససేమిరా అన్నారు. ఇంత కమీషన్ ఇచ్చి ఖర్చులు పోగా మిగిలేది ఎంతని కొందరు గుత్తేదారులు లెక్కలేసుకున్నారు. ఆ మొత్తం రూ.5 లక్షలు దాటడం లేదు. ఈ మాత్రానికి ఈ తతంగం ఎందుకని చాలా మంది తప్పుకొన్నారు. వెరసి చాలా తక్కువ మంది గుత్తేదారులకు ఎక్కువ పనులు అప్పగించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ బేరాల వల్లే నీరు వదిలి రెండు వారాలైనా ఇప్పటికీ పనులు పూర్తిచేయలేదు.

తూతూమంత్రం.. రైతన్నకు కష్టం

ఈ స్థాయి కమీషన్లు, పెట్టుబడి పెట్టి చేస్తే మిగిలేది లేదని గుత్తేదారులు తూతూమంత్రంగానే పనులు చేస్తున్నారు. తూడు మొత్తం తొలగించి గట్టు మీద వేయాల్సి ఉన్నా దాదాపు ఎక్కడా అలా జరగడం లేదు. గడ్డి మందు చల్లి పైపైన తొలగించి సరిపెడుతున్నారు. గుర్రపుడెక్క, తూటికాడ ప్రవాహంలో కొట్టుకుపోగానే పనులు పూర్తయినట్లు బిల్లులు చేసుకుంటారు. కానీ ఆ వ్యర్థాలన్నీ అదే కాలువలో ఉండి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతాయి. దీంతో నీటి విడుదల ఎంత ఉన్నా శివారు ప్రాంతాలకు నీరు చేరదు.. ముంపు ప్రాంతాల్లో నీటి ఉద్ధృతి పెరిగి గండ్లు పడే ప్రమాదాలున్నాయి. ఏది జరిగినా అవస్థలు పడేది అన్నదాతలే.

తిరువూరులో 18.6 మి.మీ. వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో తెలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. బుధవారం ఉదయం నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. తిరువూరు 18.6 మి.మీ., విస్సన్నపేట 16.2, గంపలగూడెం 14, ఎ.కొండూరు 10.4, రెడ్డిగూడెం 9.2, వత్సవాయి 7.4, వీరులపాడు 7.2, మైలవరం 6.4, కంచికచర్ల 4.8, జి.కొండూరు 4, జగ్గయ్యపేట 3.8, పెనుగంచిప్రోలు 3.6, ఇబ్రహీంపట్నం 3.4 మిల్లీ మీటర్ల మేర వర్షం పడింది.

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
గురువారం జులై 3, 2025

విజయవాడ ఎగ్జిబిషన్.. మళ్లీ ఆరంభం!

ఈనాడు, అమరావతి: విజయవాడలో అత్యంత ఆదరణతో మూడు దశాబ్దాలకు పైగా కొనసాగిన ఎగ్జిబిషన్‌ను మళ్లీ వచ్చే దసరా నుంచి ఆరంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 2013 వరకు నగరంలోని స్వరాజ్యమైదానంలో ఎగ్జిబిషన్‌ను ఘనంగా నిర్వహించారు. ఆ తర్వాత గత 13 ఏళ్లుగా ఆగిపోయింది. కృష్ణా ఇండస్ట్రియల్ అండ్ అగ్రికల్చరల్ ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వహించే వాళ్లు. సొసైటీకి అధ్యక్షుడిగా కలెక్టర్.. పోలీసు కమిషనర్, నగర ప్రజాప్రతినిధులు, సభ్యులు కమిటీలో ఉండేవారు. ఒకప్పుడు విజయవాడకే తలమానికంగా ఉండే ఈ ప్రదర్శన అనుకోని కారణాలతో ఆగిపోయింది. తాజాగా మళ్లీ సొసైటీని పునరుద్ధరించి, ఎగ్జిబిషన్‌ను గతంలో మాదిరిగానే నిర్వహించేందుకు ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), కమిటీ సభ్యులు కలిసి కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశతో విజయవాడలో బుధవారం సమావేశమయ్యారు. సొసైటీకి పూర్వవైభవం తెచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలూ చేపట్టాలని, వచ్చే దసరా నుంచి వేడుకలా నిర్వహించాలని నిర్ణయించారు. ప్రస్తుతం స్వరాజ్యమైదానంలో అవకాశం లేకపోవడంతో గొల్లపూడి ప్రాంతంలో 25 ఎకరాల్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇందుకు అవసరమైన స్థలాన్వేషణ చేయనున్నారు. విజయవాడ ఫెస్టివల్ పేరుతో ఎగ్జిబిషన్‌ను ఇక నుంచి నిర్వహించాలనే యోచనలో ఉన్నారు. ఎగ్జిబిషన్‌ను అధికారికంగా సొసైటీ ఆధ్వర్యంలో దసరా నుంచి ఏర్పాటు చేసేలా అవసరమైన అన్ని చర్యలూ చేపడుతున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడించారు.


సమావేశమైన ఎంపీ చిన్ని, కలెక్టర్ లక్ష్మీశ, అధికారులు, ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు


కేడబ్ల్యూ హెడ్ రెగ్యులేటర్ వద్ద పూజా కార్యక్రమాలు

పశ్చిమ ప్రధాన కాల్వకు సాగునీరు విడుదల

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు బుధవారం 305 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు కేడబ్ల్యూ ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అందుతుంది. బ్యారేజీ తాడేపల్లి వైపు ఉన్న కేడబ్ల్యూ హెడ్ రెగ్యులేటర్ వద్ద జలవనరుల శాఖ అధికారులు పూజా కార్యక్రమాలు నిర్వహించి, నీటిని విడుదల చేశారు. కేడబ్ల్యూ ఈఈ సుధాకరరావు, దుగ్గిరాల డీఈఈ శ్రీనివాసరావు, ఏఈఈ లక్ష్మీనారాయణ, బ్యారేజీ ఏఈఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలకు 5,938 క్యూసెక్కులు.. కృష్ణా డెల్టా పరిధిలోని కాలువలకు బ్యారేజీ నుంచి 5,938 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 5,633, కేడబ్ల్యూ ప్రధాన కాలువకు 305 క్యూసెక్కులు విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 3,003, ఏలూరు 1,021, బందరు 956, కేఈబీ (దివిసీమ) కాల్వకు 653 క్యూసెక్కుల చొప్పున నీటిని ఇస్తున్నారు.

కలిసే దందా.. కనబడుతోందా?!

- క్లోక్‌రూంలో పక్కా ప్రణాళికతో భక్తుల బ్యాగుల చోరీ
- సీసీ ఫుటేజీలో తేలినా.. రాజీ

ఈనాడు, అమరావతి

దుర్గగుడిలో సామగ్రి దాచుకునే క్లోక్‌రూం విషయంలో అధికారులు అత్యంత కఠినంగా ఉండాలని ఈ చోరీ ద్వారా అర్థమవుతోంది. రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ఆలయం. రూ.100 కోట్లకు పైగా ఆదాయం వస్తోంది. ఇలాంటి ఆలయంలో ఇంత దారుణంగా.. క్లోక్‌రూంలో పెట్టిన బ్యాగ్‌లను తరచూ ఎత్తుకుపోవడం ఏంటి.? తాజా ఘటనలపై సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించగా.. పక్కా ప్రణాళికతో కొందరు [illegible] భక్తుల బ్యాగ్‌లు లూటీ చేస్తున్నట్లు అర్థమవుతోంది.

కన్నేసి.. నిమిషాల్లో కాజేసి...

సీసీ కెమెరా ఫుటేజీలో వంశీకృష్ణ బ్యాగ్ పెట్టేందుకు క్లోక్‌రూం వద్దకు రావడం, తన జేబులోని ఫోన్, డబ్బులు బ్యాగ్‌లో పెడుతుండగా అతని వెనకే కొద్ది దూరంలో దొంగ నిలబడి ఉన్నాడు. బ్యాగును క్లోక్‌రూం సిబ్బంది ర్యాక్‌లో పెడుతుండగా... ఎక్కడ పెడుతున్నారని గమనించాడు.

★ వంశీకృష్ణ.. బ్యాగ్ పెట్టి మెట్ల దారిలో దర్శనానికి వెళ్లగానే.. ఐదు నిమిషాల్లోనే ఆ వ్యక్తి నేరుగా వచ్చి బ్యాగ్‌ను ర్యాక్ నుంచి తీసుకెళ్లాడు.

★ క్లోక్‌రూం సిబ్బంది వంశీకృష్ణ బ్యాగ్ తీసుకుని టోకెన్ ఇచ్చారు. ఆ టోకెన్‌పై పెన్నుతో.. 0.3/1 నంబర్ వేశారు. అదే నంబరు బ్యాగ్‌పైనా రాశారు. అలాంటప్పుడు.. అదే నంబరు ఉన్న టోకెన్‌ను బ్యాగ్ ఎత్తుకెళ్లిన వ్యక్తి ఎలా తెచ్చాడు. ఆ నంబరు అతనికెలా తెలిసింది. పైగా.. టోకెన్లపై పెన్నుతో నంబర్లు రాసివ్వడం ఏంటి?



వంశీకృష్ణ కౌంటర్ వద్ద బ్యాగు ఇస్తుండగా దూరం నుంచి పరిశీలిస్తున్న దొంగ

ఉదయం 11.25 దుర్గగుడిలోని కనకదుర్గానగర్ క్లోక్‌రూంలో సోమవారం ఉదయం నెల్లూరు వాసి పాలోజి వంశీకృష్ణ తన బ్యాగ్ ఉంచాడు. దానిలో బీమా పత్రాలు, రూ.5 వేలు, ఖరీదైన చరవాణి, పవర్ బ్యాంక్, కొన్ని వస్తువులు ఉంచాడు.



కాసేపటి తర్వాత నేరుగా లోపలకు వచ్చి బ్యాగు తీసుకెళ్తున్న చోరుడు

ఉదయం 11.30 ఓ వ్యక్తి నేరుగా క్లోక్‌రూం వద్దకు వచ్చాడు. దర్జాగా భక్తుల బ్యాగ్‌లు ఉంచిన క్లోక్‌రూం లోపలికి వెళ్లాడు. వంశీకృష్ణ బ్యాగ్‌ను ర్యాక్‌లో నుంచి తీసుకున్నాడు. క్లోక్‌రూం ఎంట్రీ వద్ద కూర్చున్న వ్యక్తికి టోకెన్ చూపించి.. బ్యాగ్‌ను భుజానేసుకుని వెళ్లిపోయాడు.

★ భక్తుల బ్యాగ్‌లను కౌంటర్‌లో సిబ్బంది తీసుకుని.. క్లోక్‌రూంలోని ర్యాక్‌లలో, నేలపై పెడుతున్నారు. వాటిని టోకెన్ చూపించగానే.. సిబ్బందే తెచ్చివ్వాలి. కానీ.. నేరుగా భక్తులే వచ్చి తీసుకునే అవకాశం ఇవ్వడమేంటి.?

విషయం బయటకు రాకుండా...

తాజాగా చోరీపై.. సీసీ ఫుటేజీ, 'ఈనాడు'లో వార్త రావడంతో వ్యవహారం ఎక్కడ బయటకొస్తుందోనని రాజీ ప్రయత్నాలు ఆరంభించారు. బాధితుడు వంశీకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. దానిని వెనక్కి తీసుకోమని చెప్పి.. అతనికి పరిహారం ఇస్తామని బుధవారం పిలిపించారు. రూ.30 వేలు, ఒక పాత మొబైల్ ఫోన్‌ను ఇచ్చి.. రాజీ చేసుకున్నారు.

★ పైగా క్లోక్‌రూం నిర్వాహకుల వద్ద పాత మొబైల్ ఫోన్లు ఎక్కడివి.?

★ సీసీ కెమెరాలో స్పష్టంగా కనిపిస్తున్న నిందితుడిని పట్టుకోకుండా.. ఈ బేరాలు చేసి.. చేతులు దులిపేసుకోవడం చూస్తే.. సందేహాలు వెల్లువెత్తుతున్నాయి.





పండుగ చేస్కో... రైతన్నా

ఈనాడు, అమరావతి



ఉమ్మడి జిల్లాలో పెద్దఎత్తున ఉద్యాన పంటల వృద్ధికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. 2025-26 ఆర్థిక ఏడాదిలో 5,500 ఎకరాల్లో కొత్తగా పండ్లు, పూలతోటలు ఏర్పాటు చేస్తారు. దీని కోసం ఉపాధి హామీ పథకం నుంచి రూ.60.5 కోట్ల నిధులు కేటాయించారు. ఉద్యాన పంటల అభివృద్ధి, కొత్త పంటలతో రైతులకు ఆదాయం పెంచేందుకు ఈ పథకం దోహద పడనుంది. గతేడాది ఉమ్మడి జిల్లాలో 2వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు అభివృద్ధి చేయగా ఈ ఏడాది రెట్టింపు లక్ష్యం నిర్దేశించుకున్నారు.

జిల్లా	ఏర్పాటు చేసే తోటల విస్తీర్ణం	గుర్తించింది (ఎకరాల్లో)
ఎన్టీఆర్	4,000	2,700
కృష్ణా	1,500	407
మొత్తం	5,500	3,107

3,107 ఎకరాలు గుర్తింపు: ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 23 రకాల పండ్ల తోటలు, రెండు రకాల పూల తోటలు సాగు చేయవచ్చు. ఉమ్మడి జిల్లాలో ఆయా ప్రాంతాల నేల స్వభావం, నీటి లభ్యత అంచనా వేసి ఎన్టీఆర్ జిల్లాలో 13, కృష్ణాలో 17 పంటలు, గులాబీ, మల్లె తోటలు వేయడానికి అనుకూలం అని అధికారులు ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 3,107 ఎకరాల్లో రైతులు పంటలు వేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు గుర్తించారు. ఐదెకరాల్లోపు భూమి ఉన్న రైతులే అర్హులు కావడంతో చిన్నా, సన్నకారు రైతులకు ఇది మంచి అవకాశం. పథకం ప్రయోజనాలు పొందాలంటే జాబ్‌కార్డు తప్పనిసరి. వర్షాధారిత, సాగునీటి వసతి ఉండాలి.

ఎంపిక చేసిన పంటలివే.. మామిడి, జామ, సపోటా, నేరేడు, చింత, సీతాఫలం, బత్తాయి, డ్రాగన్‌ఫ్రూట్, అవకాడో, అంజీర, యాపిల్‌బేర్, మునగ, కాజు, స్వీట్ ఆరెంజ్, దానిమ్మ పంటలు ఈ జాబితాలో ఉన్నాయి.

ఎకరానికి రూ.1.10 లక్షల సాయం: భూసార పరీక్షల మొదలు మూడేళ్ల వరకు భారమంతా ప్రభుత్వమే చూసుకుంటుంది. ఎకరానికి దుక్కి ఖర్చు రూ.1250 చెల్లిస్తారు. ఆ తోటలో అంతర పంటలు సాగు చేసుకుంటే దానికి దుక్కి ఖర్చు ఇస్తారు. గుంతలు తీయడం, మొక్కలు నాటడం ఉపాధి శ్రామికులతో లేదా సొంతంగా చేసుకున్నా ఆ మొత్తం చెల్లిస్తారు. రైతులు కొనుగోలు చేస్తే రవాణా ఖర్చు మొక్కకు రూ.8 చొప్పున కేటాయించారు. ఏడాదికి 45 తడుల చొప్పున మొక్కకి రూ.5.45 జమ చేస్తారు. కలుపు తీయడం, కాపలా, ఇతర పనులకు కలిపి మొక్కకు రూ.16 చొప్పున చెల్లిస్తారు. ఏడాదికోసారి మొక్కకు రూ.25 చొప్పున ఎరువుల కోసం జమ చేస్తారు. ఇలా ఒక్కో ఎకరానికి మూడేళ్లలో రూ.1.10లక్షల సాయం చేస్తున్నారు.. 'ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తులను ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు, ఏపీవో, క్షేత్ర సహాయకులకు అందజేయాలని డ్వామా పీడీ రాము తెలిపారు.

అభివృద్ధి.. సంక్షేమం కళ్లుగా సుపరిపాలన



ఎంపీ కేశినేని శివనాథ్, బుద్ధా వెంకన్న, నాగుల్‌మీరా, తెదేపా నాయకుల ర్యాలీ

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: సుపరిపాలనలో కూటమి ప్రభుత్వం తొలి అడుగు వేసిందని, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నడిపిస్తున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. పాతబస్తీ పంజా సెంటర్, వించిపేట ప్రాంతాలలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్ పథకాలను జెట్ స్పీడ్‌తో ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. తల్లికి వందనం కార్యక్రమం ద్వారా ప్రతి విద్యార్థి కుటుంబంలో సంతోషాన్ని నింపామన్నారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకు వీలుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, త్వరలో పీ-4 లింక్ ద్వారా మహిళలకు భృతి ఇస్తామన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్ మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వం అభివృద్ధి విస్మరించిందని, సంక్షేమ పథకాలలో కోతలు పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అందరికీ సంక్షేమం అందిస్తూ, మరోవైపు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందన్నారు. కార్యక్రమంలో తెదేపా నేతలు సోలంకి రాజుజైన్, తెదేపా ముస్లిం మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ఫతావుల్లా, నేతలు సుకాశి కిరణ్, సయ్యద్ రఫీ, తెలుగు మహిళా నేతలు సుకాశి సరిత, ఆశా, తదితరులు పాల్గొన్నారు.





సాంకేతిక దన్ను.. విరిచే అక్రమాల వెన్ను..

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

ముఖ గుర్తింపు ద్వారా పౌష్టికాహారం పంపిణీ

పౌష్టికాహారం పంపిణీలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా సాంకేతిక పరిజ్ఞానం వినియోగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో అర్హుల ముఖ గుర్తింపు(ఫేస్ రికగ్నిషన్) ద్వారా పౌష్టికాహారం అందించేందుకు అర్హుల వివరాలు సంబంధిత యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ విధానం ద్వారా మంగళవారం నుంచి పంపిణీ ప్రక్రియ అమల్లోకి వచ్చింది.



పక్కదారి పట్టకుండా

పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లోని గర్భిణులు, బాలింతలు.. చిన్నారులకు అందిస్తున్న బలవర్ధకమైన ఆహారం పలుచోట్ల పక్కదారి పడుతోంది. దీన్ని వ్యాపారంగా మలచుకున్నవారు భారీగా అక్రమాలకు తెరలేపి కోడిగుడ్లు, నిత్యావసరాలు, బాలామృతం వంటి వాటిని దారి మళ్లిస్తున్న ఉదాంతాలు కోకొల్లలు. వీటికి అడ్డుకట్ట వేసేందుకే కేంద్ర ప్రభుత్వం ముఖ గుర్తింపు విధానాన్ని అమల్లోకి తెచ్చింది.

★ అంగన్‌వాడీ కేంద్రాల్లోని గర్భిణులు, బాలింతలు, బాలల ముఖచిత్రాలను చరవాణి ద్వారా అంగన్‌వాడీ సిబ్బంది చిత్రీకరిస్తున్నారు. పోషణ్ ట్రాకర్ అప్లికేషన్‌లో ఎప్పటికప్పుడు వాటిని అప్‌లోడ్ చేయాలి. అవి స్త్రీ, శిశు సంక్షేమశాఖ డైరెక్టరేట్‌కు అనుసంధానం అవుతున్నాయి.

	కృష్ణా	ఎన్టీఆర్
ఐసీడీఎస్ ప్రాజెక్టులు	8	6
అంగన్‌వాడీ కేంద్రాలు	1,707	1,475
గర్భిణులు	6,990	8,823
బాలింతలు	6,928	7,209
6 నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు	34,807	44,633
3 నుంచి 5 ఏళ్ల పిల్లలు	17,937	18,813

ఈ గణాంకాల ఆధారంగా బడ్జెట్ విడుదలవుతుందని అధికారులు వివరించారు. 'ఉమ్మడి జిల్లాలో వీటికి సంబంధించి ఇప్పటి వరకు 90శాతం పైగా ప్రక్రియ పూర్తయింది. లబ్ధిదారుల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. అందరికీ కొత్త విధానంలో 100శాతం పంపిణీ చేస్తాం' అని ఉమ్మడి జిల్లా ఐసీడీఎస్ పీడీలు ఎంఎన్ రాణి, ఎస్కే రుక్సానా సుల్తానాబేగం తెలిపారు.

సాంకేతిక సమస్యలపైనా కసరత్తు

గర్భిణులు, బాలింతలు ముఖ కవళికలు.. దేహదారుఢ్యంలో మార్పులు వచ్చే అవకాశం ఉండడంతో ఎఫ్ఆర్ఎస్‌లో ఏమైనా సమస్యలు తలెత్తితే తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు దృష్టి పెట్టారు. అలాంటి పరిస్థితుల్లో పంపిణీ ఎలా చేయాలో మార్గదర్శకాలు జారీ చేశారు. ముఖ గుర్తింపు నమోదు కానివారికి పౌష్టికాహారం అందించడంపైనా యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

ఒక్కో కిట్టులో..

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతి నెలా బాలింతలు.. గర్భిణులకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేస్తారు. ఒక్కో కిట్టులో 2 కిలోల రాగిపిండి, కిలో అటుకులు, 250 గ్రాముల చొప్పున బెల్లం, ఎండు ఖర్జూరం, చిక్కీలు ఉంటాయి. ఇవికాకుండా కిలో కందిపప్పు, మూడు కిలోల బియ్యం, అర లీటరు నూనె, 5 లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు ఇస్తారు. మూడేళ్లలోపు పిల్లలకు 2.5 లీటర్ల పాలు.. 25 గుడ్లు.. 2.5 కిలోల బాలామృతం, ప్రీస్కూల్లో చదువుతున్న 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలకు రోజూ గుడ్డు ఇస్తారు.



(c) eenadu

వర్షాకాలం.. విద్యుత్తుతో జరభద్రం

జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అధికారులు



సూర్యారావుపేట, న్యూస్‌టుడే: వర్షాకాలంలో విద్యుత్తు ప్రమాదాలకు ఆస్కారం ఉంది. గాలి వానలకు చెట్లు విరిగిపోవడం, విద్యుత్తు తీగలు తెగిపోవడం జరుగుతుంటాయి. ఈ క్రమంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా విద్యుదాఘాతం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ ఎస్‌ఈ తోట శ్రీనివాసరావు సూచిస్తున్నారు. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

ఇవి పాటించండి..!

- తడిసిన కరెంట్ స్తంభాలను పట్టుకోకూడదు.
- విద్యుత్తు లైన్లకు తగిలే చెట్లను ముట్టుకోకూడదు.
- లైన్లపై చెట్ల కొమ్మలు పడి ఉంటే.. స్థానిక విద్యుత్తు అధికారికి సమాచారం అందించాలి.
- ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులు, కరెంటుకు సంబంధించిన వస్తువులను తడి చేతులతో ముట్టుకోకూడదు.
- ఆరుబయట ఉన్న లైట్లు నీటితో తడవకుండా చూసుకోవాలి.
- చిన్న పిల్లలు విద్యుత్తు వస్తువుల వద్దకు రాకుండా చూసుకోవాలి. స్విచ్ బోర్డులు వారికి అందుబాటులో లేకుండా చూడాలి.
- ఇనుప తీగలపై తడి బట్టలు ఆరవేయకూడదు.
- గాలి దుమారం, వర్షం వచ్చినప్పుడు తెగిన విద్యుత్తు తీగలను తాకరాదు.
- వాటర్ హీటర్ వాడేటప్పుడు స్విచ్ ఆఫ్ చేసి, ప్లగ్ నుంచి తీసిన తర్వాతే నీళ్లు పెట్టిన వస్తువును ముట్టుకోవాలి.
- ఉరుములు, మెరుపులతో వర్షం పడేటప్పుడు డిష్ కనెక్షన్ తీసేయండి.
- వర్షం పడేప్పుడు టీవీ, రిఫ్రిజిరేటర్, వాటర్‌హీటర్, కంప్యూటర్లకు స్విచ్‌లను ఆఫ్ చేయండి. లేదంటే షార్ట్‌సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంది.
- కరెంటు లైను కింద నిలబడి మాట్లాడరాదు.
- ఇంటిలో ఉన్న విద్యుత్తు సర్వీస్ వైరు పాడైపోతే.. వెంటనే అధికారి దృష్టికి తీసుకువెళ్లి మార్పించుకోవాలి.
- ప్రతి కరెంటు వస్తువుకు ఎర్త్ తప్పనిసరిగా ఉండాలి.

ఫిర్యాదు చేయండిలా..

విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు, ఫిర్యాదులు ఉంటే విద్యుత్తు శాఖ టోల్‌ఫ్రీ నంబరు 1912కు లేదా 94408 17561కు ఫోన్ చేసి చెప్పి సమస్యలు పరిష్కరించుకోవాలని ఎస్‌ఈ తెలిపారు.

మూషికం రాసిన మృత్యు గీతం

పదేళ్లు దాటినా అందని సాయం

సీఎం స్పందించాలని బాధితురాలి వేడుకోలు

కృష్ణలంక(విజయవాడ), న్యూస్‌టుడే: సీఎం ఇచ్చిన హామీలు అమలు చేయాలని బాధితురాలు వేడుకుంటోంది. పది రోజుల పసికందు గుంటూరు జీజీహెచ్‌లో ఎలుకలు కొరకడంతో మృతి చెందిన ఘటన అప్పట్లో కలకలం సృష్టించింది. చిన్నారి మృతి చెందిన తర్వాత మాత్రం నిధి కదిలించింది. అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని సుమారు పదేళ్లుగా తిరుగుతున్నా.. ఫలితం లేకుండా పోతోంది. విజయవాడలోని కృష్ణలంక మెట్ల బజారుకు చెందిన చావలి లక్ష్మి 2015, ఆగస్టు 17న విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. శిశువుకు శస్త్రచికిత్స అవసరం కావడంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఆగస్టు 23న శస్త్రచికిత్స అనంతరం పసికందును ఎన్‌ఐసీయూలో ఉంచారు. 26వ తేదీ రాత్రి బాబును ఎలుకలు కొరికాయి. 26వ తేదీన మృతి చెందాడు. బిడ్డ పది రోజులకే పరలోకానికి వెళ్లిపోవడంతో ఆమె ఆవేదన అంతులేకుండా పోయింది. ఆ ఘటన అప్పటి సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లింది. బాధిత కుటుంబానికి ఇల్లు, ఉద్యోగం, నష్టపరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. కొద్దిరోజులకు నష్టపరిహారం కింద రూ.5 లక్షలు అందించారు. మిగతా రెండు హామీలు నెరవేర్చలేదు. బాధితురాలు 2019, జనవరి 28న ప్రజా వేదికకు వెళ్లి అప్పటి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి లోకేశ్‌కు పరిస్థితి వివరించారు. ఆయన జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలిచ్చారు. కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశిస్తూ ఆయన లేఖ ఇచ్చారు. తరువాత ఎన్నికల కోడ్ రావడం, కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఆ లేఖ మరుగున పడింది. తర్వాత జగన్ ప్రజా దర్బార్‌కు బాధితురాలు వెళ్లి పరిస్థితిని వివరించారు. గత ప్రభుత్వంలో జరిగిన ఘటన కావడంతో తామేమీ చేయలేమని అధికారులు చెప్పడంతో మిన్నకుండిపోయారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో జూన్ నెల 9న కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. భర్త, ఇద్దరు పిల్లలను పోషించడానికి ఇబ్బంది పడుతున్నామని బాధితురాలు వాపోతున్నారు. తన భర్త నాగ గతంలో ఉద్యోగం చేసేవారని, అనారోగ్యంతో పని మానేశారని వివరించారు. కుటుంబ పోషణ నిమిత్తం చిన్న బడ్డీ నిర్వహిస్తున్నా, వచ్చే ఆదాయం సరిపోవడం లేదని, సీఎం స్పందించి ఇల్లు, ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని ఆమె కోరుతున్నారు.



ఇద్దరు పిల్లలతో చావలి లక్ష్మి

చూసేలోపే కసిరావే.. మురిసేలోపే విసిరావే..

నడిరోడ్డుపై రక్తస్రావంతో శిశువు



చిట్టినగర్, న్యూస్‌టుడే: విజయవాడలో అమానవీయ సంఘటన చోటుచేసుకుంది. అప్పుడే పుట్టిన అమ్మ పొత్తిళ్లలో వెచ్చగా ఒదిగి ఉండాల్సిన శిశువు అర్ధరాత్రి నడిరోడ్డుపై వణుకుతూ గుక్కపెట్టి ఏడుస్తూ పడి ఉన్నాడు. ఎలుకలు కొరికి రక్తస్రావంతో విలవిలలాడిన శిశువు తల్లడిల్లి పోయాడు. స్థానికులు గుర్తించి ఆస్పత్రికి తరలించారు. కొత్తపేట, శ్రీనివాస మహల్ వెనుక పోలీస్ సొసైటీ, వినాయక దేవాలయం సమీపంలో అప్పుడే జన్మించిన మగ శిశువును ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డుపై వదిలేసి వెళ్లారు. అర్ధరాత్రి దాటిన అనంతరం వసంతాల దిన స్థానికుడు నగుదలపుడి సోమరాజు కుటుంబ సభ్యులు బయటకు వచ్చి చూశారు. బొడ్డు కూడా ఊడని మగ శిశువు, కాలిని ఎలుకలు కొరుకుతుండగా రక్తం కారుతుండగా గుక్కపెట్టి ఏడుస్తున్న దృశ్యం చూసి కలత చెందారు. వెంటనే అక్కున చేర్చుకుని సపర్యలు చేసి చికిత్స నిమిత్తం పాత ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. స్థానిక అంగన్‌వాడీ సిబ్బంది భోగిరెడ్డి రామలక్ష్మి ఆసుపత్రికి వెళ్లి మగ శిశువును పరిశీలించి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారానికి దరఖాస్తులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇచ్చే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం - 2025కు గురువులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు తెలిపారు. పదేళ్ల సర్వీస్ పూర్తి చేసిన వారు అర్హులని, ఆసక్తి గలవారు http://nationalawardstoteacher.education.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 13వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పీజీ దంత వైద్య సీట్ల భర్తీకి పచ్చజెండా

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు దంత వైద్య కళాశాలల్లో పీజీ (ఎండీఎస్) డిగ్రీ/డిప్లొమా కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అభ్యర్థులు ఈ నెల రెండో తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుంచి 6వ తేదీ రాత్రి 9 గంటల్లోగా వర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు నింపి ఆన్‌లైన్‌లో పంపాల్సి ఉంటుంది. అపరాధ రుసుముతో 7వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 8వ తేదీ రాత్రి 9 గంటల్లోగా పంపడానికి అవకాశం ఉంది. ఇంటర్న్‌షిప్ కటాఫ్ తేదీ ఈ ఏడాది జూన్ 30గా నిర్ణయించారు. నీట్ పీజీ ప్రవేశ పరీక్షలో జనరల్ కేటగిరీకి 960 మార్కులకు గాను 261, ఎస్సీ/ఎస్టీ/బీసీకి 227 కటాఫ్ మార్కులుగా నిర్ణయించారు. వారే దరఖాస్తుకు అర్హులు. ఇతర వివరాలకు 89787-80501, 79977-10168 నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో రూ.ల్లో)

విజయవాడ: బ్రాయిలర్ ఫారం కోళ్లు 40 కిలోలకు పైన 115, స్కిన్ లెస్ 167, విత్ స్కిన్ 190. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం ధర 108, 119 లైవ్, స్కిన్ లెస్ 190 విత్ స్కిన్ 200.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 590 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

పరిశ్రమలు, వ్యవసాయానుబంధ రంగాలపై దృష్టి



సమావేశంలో అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనకు నియోజకవర్గాల వారీగా ప్రణాళికలు దోహదం చేస్తాయని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. నియోజకవర్గాల గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీడీపీ)తో పాటు స్థూల విలువ జోడింపు, తలసరి ఆదాయం పెంచేందుకు వీటిని సద్వినియోగం చేసుకోవాల్సి ఉందన్నారు. ప్రజా జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు, ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం దార్శనిక ప్రణాళిక లక్ష్యమని వివరించారు. నగరంలోని కలెక్టరేట్‌లో జిల్లా, నియోజకవర్గాల దార్శనిక కార్యాచరణ ప్రణాళికలపై బుధవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాల్లో సేవా రంగంపై, గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు, వ్యవసాయానుబంధ రంగాలైన పశుపోషణ, ఉద్యాన, మత్స్య సంపద తదితరాలపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం జిల్లా తలసరి ఆదాయం రూ.3.52 లక్షలు ఉండగా, 2047 నాటికి రూ.55 లక్షలకు చేర్చాలన్నదే లక్ష్యమన్నారు. దీనికి స్పష్టమైన ప్రణాళికలతో పాటు, వాటి అమలుకు సమష్టి కృషి చేయాలని కోరారు. పేదరిక నిర్మూలన (పీ-4)లో భాగంగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు దాతగా రోటరీ క్లబ్ సభ్యులు ముందుకు వచ్చారని, ఇదే స్ఫూర్తితో మిగతా వారు భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జేసీ ఎస్.ఇలక్కియా, వీఎంసీ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా అధికారిణి జి.జ్యోతి, సీపీవో వై.శ్రీలత, డీపీవో పి.లావణ్యకుమారి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.వి.సతీష్, ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి ఎ.రవీంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి, సామాజిక భద్రతకు 'ఈఎల్ఐ' పథకం



మాట్లాడుతున్న అబ్దుల్ ఖాదర్

సీతారాంపురం, న్యూస్‌టుడే: అన్ని రంగాల్లో ఉపాధి కల్పనకు మద్దతివ్వడానికి, ఉపాధి అవకాశాలు, సామాజిక భద్రత పెంపొందించడానికి ప్రభుత్వ ఉపాధి ఆధారిత ప్రోత్సాహక (ఈఎల్ఐ) పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రూపొందించిందని ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ అబ్దుల్ ఖాదర్ తెలిపారు. దుర్గా అగ్రహారంలోని కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఈ పథకం కింద మొదటి సారి ఉద్యోగంలో చేరిన ఉద్యోగులు ఒక నెల వేతనం గరిష్ఠంగా రూ.లక్షలోపు వారికి ఏడాదికి రూ.15వేలు ప్రోత్సాహకంగా అందించనుందన్నారు. రెండేళ్ల పాటు ఈ ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. తయారీ రంగానికి చెందిన యాజమాన్యాలకు మరో రెండేళ్లు అదనంగా ఈ ప్రయోజనాలు కల్పిస్తుందన్నారు. దీని కోసం 2024-25 కేంద్ర బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించారని తెలిపారు. ఈఎల్ఐ పథకం ద్వారా రూ.99,446 కోట్ల వ్యయంతో దేశంలో రెండు సంవత్సరాల కాలంలో 3.5కోట్లకు పైగా ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో ప్రోత్సాహకాలు అందించనుందన్నారు. 1.92 కోట్ల మంది తొలి సారి ఉద్యోగంలో చేరనున్నారని వివరించారు. 2025, ఆగస్టు ఒకటి నుంచి 2027, జులై 31వ తేదీ మధ్య కాలంలో కల్పించిన ఉద్యోగాలకు ఈ పథకం ప్రయోజనాలు వర్తిస్తాయన్నారు. తొలి సారిగా ఉద్యోగంలో చేరి ఈపీఎఫ్‌వోలో నమోదు చేసుకున్న ఉద్యోగులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని ఆయన వెల్లడించారు.

రన్నింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించండి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: రైల్వే లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సిబ్బందికి సరైన విశ్రాంతి లేకపోవడంతో తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారని చెప్పారు. కుటుంబ సభ్యులతో గడిపేందుకు వీలుగా నిర్ణీత పని గంటలు అమలు చేయాలని కోరారు. రైల్వే మల్టీ డిసిప్లీనరీ కమిటీ నివేదికలు.. సిబ్బంది హక్కులకు భంగం కలిగేలా ఉన్నాయని ధ్వజమెత్తారు. అసోసియేషన్ డివిజనల్ అధ్యక్షుడు ఎం.వెంకటేశన్, కార్యదర్శి ఆర్.వి.రాము మాట్లాడుతూ.. రైల్వే ప్రైవేటీకరణ నిలిపివేయాలని, నూతన పింఛను విధానాన్ని రద్దు చేయాలని, లోకో రన్నింగ్ సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని, 8గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారుల విభాగం ఎస్ఈగా శంకరరెడ్డి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ఏపీఆర్‌డీసీ కర్నూలు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న డి.శంకరరెడ్డి జాతీయ రహదారుల విభాగం విజయవాడ సర్కిల్ ఎస్ఈగా ఉద్యోగోన్నతిపై వచ్చారు. విజయవాడ డివిజన్ పీఏ, ఈఈగా విధులు నిర్వహిస్తున్న గోవిందరాజులనాయుడు విజయవాడ ఆర్అండ్‌బీ సర్కిల్ ఈఈ, డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతిపై నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

తిరుపతమ్మకు ఆషాఢ సారె సమర్పణ



పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని తిరుపతమ్మ అమ్మవారికి పెనుగంచిప్రోలు భక్తులు సారె సమర్పించారు. గ్రామానికి చెందిన వేలాది మంది మహిళలు ముందుగా అమ్మవారి రంగుల మండపం వద్ద సారెకు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భారీ ఊరేగింపుతో ఆలయానికి చేరుకున్నారు. వారికి ఆలయ ఈవో కిశోర్‌కుమార్, ఈఈ రమాదేవి, పాలకవర్గ సభ్యుడు బెజవాడ శ్రీనివాసరావు, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలో అమ్మవారికి సారె సమర్పించి పూజలు చేశారు. అనంతరం దేవాలయంలో మహిళలకు సారె పంచారు. అన్నదానం నిర్వహించారు.

అందరి జీవితాల్లో యోగా భాగమైతే మేలు



కలెక్టర్ లక్ష్మీశ తదితరుల సాధన

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: అందరి జీవితాల్లో యోగా భాగమైతే ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. యోగాంధ్ర-2025 ద్వారా జిల్లాలో తొమ్మిది లక్షల మందికి యోగాను చేరువ చేశామని, ఆ విజయంలో అమరావతి యోగా, ఏరోబిక్స్ అసోసియేషన్ కీలక పాత్ర పోషించిందని కొనియాడారు. స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని అమరావతి యోగా, ఏరోబిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 24 నుంచి జూన్ 12వ తేదీ వరకు నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ శిబిరంలో పాల్గొన్న 108 మందికి బుధవారం ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అమరావతి యోగా, ఏరోబిక్స్ సంఘం జిల్లాకు సంపద అని పేర్కొన్నారు. ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి మంచి ఆలోచనలు అవసరమని అన్నారు. గొప్ప ఆలోచనలకు ఆస్కారం కల్పించేలా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే సత్తా యోగాకు ఉందని వివరించారు. నిత్య సాధన వల్ల నెగిటివ్ ఆలోచనలు దూరమై. . మనసంతా సానుకూల దృక్పథంతో నిండిపోతుందని చెప్పారు. ఫలితంగా ఆరోగ్య సమాజం సొంతం అవుతుందని చెప్పారు. జిల్లాలోని ఖాళీ స్థలాలు, పార్కుల్లో యోగా సాధనకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలంటే యోగాతోనే సాధ్యమని పేర్కొన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు మిరియాల వెంకటేశ్వరరావు, దాసరి కాశీవిశ్వనాథ్, విశ్రాంత డీసీపీ హరికృష్ణ, కార్యదర్శి పీవీ రమణ, కోశాధికారి ఎ.లావణ్యకుమార్, గురువు అంకాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెండు వాహనాలను ఢీకొట్టిన లారీ



నుజ్జునుజ్జయిన లారీల ముందు భాగాలు



క్రేన్ ద్వారా పక్కకు తీస్తూ..

కృష్ణలంక, న్యూస్‌టుడే: మితిమీరిన వేగంతో వచ్చిన లారీ, రెండు వాహనాలను ఢీకొట్టిన ఘటన విజయవాడలోని కృష్ణలంక వద్ద జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన బొమ్మిడి నాగార్జున మంగళవారం రాత్రి కాకినాడలో సన్‌ఫ్లవర్ ఆయిల్ లోడు చేసుకొని గొల్లపూడిలో దింపేందుకు వెళ్తున్నారు. మితిమీరిన వేగంతో వస్తున్న లారీ కృష్ణలంక సత్యం హోటల్ సెంటర్ వద్ద అదుపు తప్పి ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. తరువాత లారీని పక్కకు తప్పించే క్రమంలో డివైడర్ ఎక్కి రహదారి అవతలి భాగం వైపునకు వెళ్లి.. ఆ సమయంలో బస్టాండ్ వైపు నుంచి వారధి వైపునకు వెళ్తున్న ఐషర్ వాహనాన్ని ఢీకొట్టింది. రెండు వాహనాల ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. డ్రైవర్లు, క్లీనర్లు క్యాబిన్లలో ఇరుక్కుపోయారు. ట్రాఫిక్ పోలీసులు.. స్థానికుల సాయంతో ఇద్దరిని వెలుపలికి తీసినప్పటికీ.. మరో ఇద్దరు లోపల ఉండిపోయారు. రెండు క్రేన్లను తెప్పించి వారిని కూడా బయటకు తీశారు. క్షతగాత్రులను 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఐషర్ వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్ తాడేపల్లిగూడెంకు చెందిన ఆరిమిల్లి వెంకటేశులు కాగా... గొల్లపూడిలో స్టీల్‌సామాన్లు లోడ్ చేసుకుని తణుకు వెళ్తున్నట్లు చెప్పారు. గాయపడిన క్లీనర్లు గొల్ల వంశీకృష్ణ, గుడిపూడి వెంకటేశ్వర్లుగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

91.9 FM Vijayawada

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

यूनियन बैंक ऑफ इंडिया / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా – భారత ప్రభుత్వ రంగ సంస్థ

సూర్యారావుపేట బ్రాంచి, 35-25-35, సన్‌రైజ్ హాస్పిటల్ ఎదురుగా, సూర్యారావుపేట, విజయవాడ-520002. Mail id:ubin0912263@unionbankofindia.bank

డిమాండ్ నోటీసు

DEMAND NOTICE ISSUED U/S.13(2) OF SARFAESI Act, 2002
Notice under sec.13(2) read with Sec.13(3) of Securitisation and Reconstruction of Financial Assets and Enforcement of Security Interest Act, 2002.

ఋణగ్రహీత: 1. మెస్సర్స్ ఓంకార విజయలక్ష్మి స్ట్రిప్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ. కోట భాను ప్రసాద్, నమోదిత చిరునామా: డి.నెం.76-18-45, ప్లాట్ నెం.45, ఐరన్ యార్డ్, భవానీపురం, విజయవాడ, కృష్ణాజిల్లా-520012. **హామీదారులు: 1. శ్రీ కోట భాను ప్రసాద్,** కేరాఫ్ కోట సాంబశివ ప్రసాద్, చిరునామా: 76-8/1-13, లలితా నగర్ రోడ్డు, భవానీపురం, ఆల్ఫా హోటల్ ఎదురుగా, విజయవాడ (అర్బన్), కామకోటి నగర్, కృష్ణాజిల్లా-520012. **2. శ్రీమతి కోట శ్రావణి,** కేరాఫ్ కోట భాను ప్రసాద్, చిరునామా: 76-8/1-13, లలితా నగర్ రోడ్డు, భవానీపురం, ఆల్ఫా హోటల్ ఎదురుగా, విజయవాడ (అర్బన్), కామకోటి నగర్, కృష్ణాజిల్లా-520012. **3. శ్రీ పి. వెంకట నరసింహ,** తండ్రి: లక్ష్మీ నారాయణ, చిరునామా: డి.నెం.12-2-26/1, బి.ఆర్.పి.రోడ్డు, జెండా చెట్టు సెంటర్ దగ్గర, ఇస్లాంపేట, విజయవాడ అర్బన్, కృష్ణాజిల్లా-520001. **4. శ్రీ కోట పృథ్వీ వెంకట తేజ,** కేరాఫ్ కోట భాను ప్రసాద్, చిరునామా: 76-8/1-13, లలితా నగర్ రోడ్డు, భవానీపురం, ఆల్ఫా హోటల్ ఎదురుగా, విజయవాడ (అర్బన్), కామకోటి నగర్, కృష్ణాజిల్లా-520012. **5. శ్రీ కోట రాహుల్ సాయి బాలాజీ,** కేరాఫ్ కోట భాను ప్రసాద్, చిరునామా: 76-8/1-13, లలితా నగర్ రోడ్డు, భవానీపురం, ఆల్ఫా హోటల్ ఎదురుగా, విజయవాడ (అర్బన్), కామకోటి నగర్, కృష్ణాజిల్లా-520012. **6. మెస్సర్స్ లక్ష్మీ స్టీల్ పైప్స్ అండ్ ట్యూబ్స్,** సూరంపల్లి, ప్రాతినిధ్యంవహిస్తున్న ప్రొప్రయిటర్, శ్రీమతి కోట శ్రావణి, చిరునామా: డి.నెం.8-99, 8-100 & 8-101, సూరంపల్లి గ్రామం, ఏలియాప్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ దగ్గర, గన్నవరం, కృష్ణాజిల్లా. **7. మెస్సర్స్ శ్రీ విజయలక్ష్మి స్టీల్ ట్రేడర్స్,** ప్రాతినిధ్యంవహిస్తున్న ప్రొప్రయిటర్ శ్రీ కోట భాను ప్రసాద్, చిరునామా: డి.నెం. 76-18-45, ప్లాట్ నెం.45, ఐరన్ యార్డ్, భవానీపురం, విజయవాడ-520012.

నేచర్ ఆఫ్ లిమిట్	ఎన్.పి.ఏ తేది నాటికి అంటే 23.06.2025 బకాయి మొత్తం	వర్తించని వడ్డీ	జరిమానా వడ్డీ (వర్తిస్తుంది)	బ్యాంక్ చేసిన ఖర్చు, ఛార్జీలు	23.06.2025 నాటికి బకాయి మొత్తం (రూ.)
CCSUV - 122625010000002	Rs. 24,41,18,210.89	Rs. 10,52,255.00	2%	Rs. 0/-	Rs. 24,51,70,465.89
TL - 122626390000001	Rs. 38,19,843.90	Rs. 23,097.58	2%	Rs. 0/-	Rs. 38,42,941.48
Total	Rs. 24,79,38,054.79	Rs. 10,75,352.58			Rs. 24,90,13,407.37

ఋణగ్రహీతలు చెల్లించాల్సిన లేదా భవిష్యత్తులో చెల్లించవలసిన మొత్తాలకు భద్రత కల్పించడానికి, క్రింది వ్యక్తులు/సంస్థలు ది.13.03.2024న పత్రాలపై ద్వారా సంతకం చేసి, ఈ క్రింది విధంగా భద్రతా ఆసక్తిని సృష్టించారు:
ఎ) శ్రీ. కోట భాను ప్రసాద్, ప్రాపర్టీ నెం.1కి యజమానిగా.
బి) మెస్సర్స్ లక్ష్మీ స్టీల్ పైప్స్ అండ్ ట్యూబ్స్, సూరంపల్లి (ప్రొప్రయిటర్ శ్రీమతి కోట శ్రావణి ద్వారా ప్రాతినిధ్యం వహించబడుతోంది), వీరు ఆస్తి నెం.2లోని ఐటెమ్ నెం.1 మరియు 2లకు యజమాని. అలాగే శ్రీమతి కోట శ్రావణి ప్రాపర్టీ నెం.2లోని ఐటెమ్ నెం.3కి యజమాని.
సి) మెస్సర్స్ ఓంకార విజయలక్ష్మి స్ట్రిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ (మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కె. భాను ప్రసాద్ గారి ద్వారా ప్రాతినిధ్యం వహించబడుతోంది), వీరు ఆస్తి నెం.3లోని ఐటెమ్ నెం.1కి యజమాని. అలాగే మెస్సర్స్ శ్రీ విజయలక్ష్మి స్టీల్ ట్రేడర్స్, విజయవాడ (ప్రొప్రయిటర్ శ్రీ కోట భాను ప్రసాద్ గారి ద్వారా ప్రాతినిధ్యం వహించబడుతోంది), వీరు ఆస్తి నెం.3లోని ఐటెమ్ నెం.2కి యజమాని.
ఈ భద్రతా ఆసక్తి ఈ క్రింది వాటికి సృష్టించబడింది:
ఎ) స్టాక్ హైపోథికేషన్: **ది.09.06.2025** నాటి తాజా స్టాక్ స్టేట్‌మెంట్ ప్రకారం స్టాక్‌ను హైపోథికేట్ చేయడం ద్వారా.
బి) ప్లాంట్ మరియు మెషినరీ హైపోథికేషన్: మెస్సర్స్ ఓంకార విజయలక్ష్మి స్ట్రిప్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మంజూరు చేసిన టర్మ్ లోన్ నిధుల నుండి కొనుగోలు చేసిన ప్లాంట్ మరియు మెషినరీని హైపోథికేట్ చేయడం ద్వారా.
సి) దిగువ వివరించిన ఆస్తుల తనఖా (మోర్ట్‌గేజ్) ద్వారా.

దిగువ వివరించిన స్థిరాస్తుల వివరములు:

ఆస్తి నెం.1: ఎన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, విజయవాడ-520012, మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, ఇది 16వ వార్డు, బ్లాక్ నెం-12, ప్లాట్ నెం.45, ఐరన్ యార్డ్, భవానీపురం పరిధిలో ఆర్.ఎస్.నెం. 16/ఏ, 14/బి, 24/1, 25/1ఎ, 49/1బి, 15/2, 50/3ఏ3, 50/2, 50/3ఏ1, 14/2, 16/5ఈ, 16/3, 16/2బి, 16/1ఈ, 11, 15/1, 50/1, 15/2, 49, 53/డి1ఎ, 13/4ఎ, 24/2, 14/1బి, 16/1డి, 16/3ఎ, 16/2ఎ & 16/3ఈ, డి.నెం. 76-18-45 (పన్ను రసీదు ప్రకారం), సమీపంలోని డోర్ నెం. 76-18-130 (అమ్మకపు దస్తావేజు ప్రకారం), లో 471.00 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఆర్‌సిసి వాణిజ్య భూమి మరియు భవనం. ఆస్తి యజమాని శ్రీ కోట భాను ప్రసాద్ గారు. **ఆస్తికి హద్దులు: తూర్పు:** తేలప్రోలు రాజు గారి ఆస్తి ప్లాట్ నెం. 46, **దక్షిణం:** ఇతరుల ఆస్తి, **పడమర:** గ్రంధి రామారావు, కె.ఎ.ఎల్. నరసింహారావు గార్ల ఆస్తి ప్లాట్ నెం.43 & 44, **ఉత్తరం:** మున్సిపల్ రోడ్డు.

ఆస్తి నెం. 2: దిగువ పేర్కొన్న ఐటమ్‌లలో డోర్ నెం. 8-99, 8-100 మరియు 8-101 కలిగిన పారిశ్రామిక భూమి మరియు భవనం (షెడ్) యొక్క మొత్తం భాగాన్ని, దిగువ పేర్కొన్న ఐటమ్‌లను కలిపి ఆస్తికి ప్రాప్యతతో సహా. **ఐటెమ్ నెం.1:** కృష్ణాజిల్లా, గన్నవరం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం అధికార పరిధిలో, సూరంపల్లి గ్రామం, ఏలియాప్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ దగ్గర, ఆర్.ఎస్.నెం. 143/3లో 84 సెంట్లు లేదా 4065 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న స్థలం. ఈ ఆస్తికి మెస్సర్స్ లక్ష్మీ స్టీల్ పైప్స్ అండ్ ట్యూబ్స్, సూరంపల్లి (ప్రొప్రయిటర్ శ్రీమతి కోట శ్రావణి ద్వారా ప్రాతినిధ్యం వహిస్తున్న) యజమాని. **హద్దులు: తూర్పు:** కోయి రాధాకృష్ణ గారి ఆస్తి, **పడమర:** విక్రేత యొక్క మిగిలిన ఆస్తి, **ఉత్తరం:** విక్రేత యొక్క ఆస్తి, **దక్షిణం:** డొంక. **ఐటెమ్ నెం.2:** కృష్ణాజిల్లా, గన్నవరం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం అధికార పరిధిలో, సూరంపల్లి గ్రామం, ఏలియాప్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ దగ్గర, ఆర్.ఎస్. నెం. 143/3లో 17 సెంట్లు లేదా 822.80 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న స్థలం. ఈ ఆస్తికి మెస్సర్స్ లక్ష్మీ స్టీల్ పైప్స్ అండ్ ట్యూబ్స్, సూరంపల్లి (ప్రొప్రయిటర్ శ్రీమతి కోట శ్రావణి ద్వారా ప్రాతినిధ్యం వహిస్తున్న) యజమాని. **హద్దులు: తూర్పు:** విక్రేత యొక్క ఆస్తి, **పడమర:** మెస్సర్స్ శ్రీ లక్ష్మీ స్టీల్ పైప్స్ అండ్ ట్యూబ్స్ యొక్క ఆస్తి, **ఉత్తరం:** విక్రేత యొక్క ఆస్తి, **దక్షిణం:** మెస్సర్స్ శ్రీ లక్ష్మీ స్టీల్ పైప్స్ అండ్ ట్యూబ్స్ యొక్క ఆస్తి. **ఐటెమ్ నెం. 3:** కృష్ణాజిల్లా, గన్నవరం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం అధికార పరిధిలో, సూరంపల్లి గ్రామం, ఏలియాప్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ దగ్గర, ఆర్.ఎస్.నెం.142/2 మరియు 138, ప్లాట్ నెం.1లో 968 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న స్థలం. ఈ ఆస్తికి శ్రీమతి కోట శ్రావణి యజమాని. **హద్దులు: తూర్పు:** కొంతవరకు ప్లాట్ నెం.2 మరియు కొంతవరకు 40 అడుగుల వెడల్పు రోడ్డు, **పడమర:** మెస్సర్స్. శ్రీ లక్ష్మీ స్టీల్ పైప్స్ అండ్ ట్యూబ్స్ యొక్క ఆస్తి, **ఉత్తరం:** విక్రేత యొక్క మిగిలిన ఆస్తి, **దక్షిణం:** కోయి రాధాకృష్ణ గారి ఆస్తి.

ఆస్తి నెం. 3: దిగువ ఐటెమ్ నెం.1 మరియు 2లుగా పేర్కొన్న స్థలాలలో నిర్మించిన పారిశ్రామిక భూమి మరియు భవనం యొక్క మొత్తం భాగం. **ఐటెమ్ నెం.1:** ఎన్.టి.ఆర్ జిల్లా, విస్సన్నపేట సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం అధికార పరిధిలో, రెడ్డిగూడెం మండలం, ముచ్చనపల్లి గ్రామం, ఆర్.ఎస్.నెం. 348లో ఎకరా 1-00 సెంట్లు లేదా 4840 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఆస్తి. ఈ ఆస్తికి మెస్సర్స్ ఓంకార విజయలక్ష్మి స్ట్రిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కోట భాను ప్రసాద్) గారు యజమాని. **హద్దులు: తూర్పు:** పెనుగొండ పుల్లారావు గారి భూమి, **దక్షిణం:** యలమంచిలి వంశీకృష్ణ గారి భూమి, **పడమర:** విస్సన్నపేట నుండి ఎ. కొండూరు రోడ్డు, **ఉత్తరం:** మెస్సర్స్ శ్రీ విజయలక్ష్మి స్టీల్ ట్రేడర్స్ యొక్క భూమి. **ఐటెమ్ నెం. 2:** ఎన్.టి.ఆర్ జిల్లా, విస్సన్నపేట సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, రెడ్డిగూడెం మండలం, ముచ్చనపల్లి గ్రామం, ఆర్.ఎస్.నెం. 348లో ఎకరా 1-00 సెంట్లు లేదా 4840 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఆస్తి. ఈ ఆస్తికి మెస్సర్స్ శ్రీ విజయలక్ష్మి స్టీల్ ట్రేడర్స్, విజయవాడ (ప్రొప్రయిటర్ శ్రీ కోట భాను ప్రసాద్ ద్వారా ప్రాతినిధ్యం వహిస్తున్న) యజమాని. హద్దులు: **తూర్పు:** పెనుగొండ పుల్లారావు గారి భూమి, **దక్షిణం:** మెస్సర్స్ ఓంకార విజయలక్ష్మి స్ట్రిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క భూమి, **పడమర:** విస్సన్నపేట నుండి ఎ. కొండూరు రోడ్డు, **ఉత్తరం:** పాలంకి కరుణాకర రెడ్డికి విక్రయించిన భూమి.

గౌరవనీయులైన సర్/మేడమ్

విషయం: ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము ప్రకారము నోటీసు - మీరు మా నుండి పొందిన ఋణ సౌకర్యములకు సంబంధించి- నిరర్థక ఆస్తులుగా వర్గీకరణ.

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా మీరు చెల్లించవలసిన లోన్ అకౌంట్స్ క్రింద మా **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సూర్యారావుపేట బ్రాంచి** వద్దనున్న మీ ఋణ బకాయిలను / వడ్డీని చెల్లించుటలో విఫలమైనందున మీ ఖాతాను **ది.23-06-2025**న నిరర్థక ఆస్తిగా **(NPA)** వర్గీకరించబడింది. ఎగువ తెలిపిన తేదిన మీ ఋణ ఖాతాల బకాయిలు **ది. 23-06-2025** నాటికి మొత్తము **రూ. 24,90,13,407.37** (అక్షరాలా ఇరవై నాలుగు కోట్ల తొంభై లక్షల పదమూడు వేల నాలుగు వందల ఏడు రూపాయల ముప్పై ఏడు పైసలు మాత్రమే) అనేక మార్లు విన్నపములు చేసినప్పటికీ, మీరు మీ ఖాతాలోని బకాయి మొత్తములను చెల్లించలేదు/మీ ఋణములను చెల్లించలేదు. అందువలన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13 (2) ప్రకారము మీ యొక్క బకాయి మరియు ఋణ పత్రములో అంగీకరించబడిన నియమ నిబంధనలలో ఉన్న ఒప్పంద రేటు ప్రకారము పైన తెలుపబడిన బకాయి తదుపరి నెలవారి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా ఈ నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంక్‌కు హామీ ఇచ్చిన ఆస్తులపై సదరు చట్టం ప్రకారం లభించు ఏవేని లేదా అన్ని హక్కులను ప్రయోగించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.

1) మీరు సదరు బకాయిలను 60 రోజులలోగా తిరిగి చెల్లించుటలో విఫలమైనచో, బ్యాంక్ వారు సదరు చట్టం ప్రకారం వారికి సంక్రమించిన అన్ని హక్కులను వినియోగించి హామీ ఇవ్వబడిన ఆస్తుల విక్రయ ధనముతో బకాయిలను పూర్తిగా చెల్లించబడనప్పుడు, మిగిలిన బకాయి సొమ్ము మీ నుండి రాబట్టుకొనుటకు, న్యాయస్థానము/డెట్ రికవరీ ట్రిబ్యునల్ నందు తగు న్యాయపరమైన చర్యలు తీసుకోబడునని తెలియజేయడమైనది.
2) సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (13) ప్రకారము ఈ నోటీసు పొందిన అనంతరం మీరు పైన చెప్పబడిన ఆస్తులను సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంక్ వారి అనుమతి
లేకుండా విక్రయించరాదు. మరియు లావాదేవీలు జరుపరాదు సదరు సెక్షన్‌లో నిబంధనలలో ఏ విధమైన అతిక్రమణ జరిగిన తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.
3) SARFAESI చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువు లోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.

తేదీ : 24-06-2025 అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా పేరు గవర్నమెంట్ రికార్డ్స్ ప్రకారము నా కరెక్ట్ పేరు కోన అంజలిదేవి (కొత్త పేరు), కోన అంజలీదేవి కాదు (పాత పేరు) అని తెలియజేయడమైనది. ఇట్లు: కోన అంజలిదేవి, డోర్ నెం: 32-11-26/B, చర్చ్ స్ట్రీట్, మొగల్‌రాజపురం, విజయవాడ.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవలకు, ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 95052 76677, 82474 49036.

REAL ESTATE

LAND FOR SALE

మెగా ★అవకడో ★ఫామ్‌ల్యాండ్‌లో 11 సెంట్లు ★ 5 లక్షలకే ★ 5వ సంవత్సరం నుండి సంవత్సరంకి 2 లక్షల ఆదాయం పొందండి. ఫోన్: 9133574455

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

NTR **జిల్లా**, నందిగామ మండలంలోని కొత్త బెల్లంకొండవారిపాలెం ఊరిలో 2.5 ఎకరాల పొలం అమ్మబడును. వివరాలకు Ph: 9000654713.

JOBS

Wanted Experienced Technician For Fitness Equipment Showroom. Please Contact Pawan. ✆ 79813 88951/ 94403 56731.

కరెంటు మీటర్లు మార్చుటకు అనుభవం గల ఎలక్ట్రీషియన్స్ కావలెను. విద్యార్హత లేకపోయినా పర్వాలేదు. వీక్లీ పేమెంట్స్ ✆ 97035 51122, 94929 40505.

విజయవాడ పటమట ఫన్‌టైమ్స్ క్లబ్ రోడ్డులోని Corn Club రెస్టారెంట్ నందు పనిచేయుటకు బిల్లింగ్ ఆపరేటర్ మరియు చెఫ్ (2 Pm to 10 Pm) కావలెను. ✆ 91001 92046.

విజయవాడలోని ప్రముఖ మొబైల్ షోరూం నందు పనిచేయుటకు మొబైల్ ఫీల్డ్‌లో అనుభవం గల Front ఆఫీస్ ఎగ్జిక్యూటివ్/ మేనేజర్, Stock పర్సన్ కావలెను. ✆ 70932 66678.

Wanted Teachers (Ladies) with U.G. or P.G. Qualification & Good English and Teacher for Science in High School. CIS - School, VJA-1. ✆ 81799 90508.

Wanted P.E.T Teacher with B.P.Ed to Seventh Day Adventist High School, Bander Road, Vijayawada. Ph: 90528 77533.

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. భో+వ+ మంచి జీతం+ ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.

శ్రీ సాయి శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ & డెవలపర్స్ తాడేపల్లి వారి వినుకొండ దగ్గర్లో 22 ఎకరాల వెంచర్, మహాగని వెంచర్‌లో ప్లాట్లు అమ్ముటకు ఏజెంట్స్ కావలెను. ✆ 80081 93109, 95050 93432.

VJA 1 టౌన్ బ్రాహ్మణవీధిలో దుర్గా రెసిడెన్సీలో రిసెప్షనిస్ట్‌గా పనిచేయుటకు పురుష అభ్యర్థి కావలెను. 12 గం|| డ్యూటీ, 14 వేలు జీతం. ✆ 90305 52222.

శివకార్తికేయ హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు ఇంటి/ వంట పనిచేయుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 20K. ✆ 99120 11499, 99120 11899.

ప్రముఖ ఆటోఫైనాన్స్ ఆఫీస్ నందు అనుభవంగల కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ Age: 25 - 30Y, Sal: 20K-22K. Qul: డిగ్రీ, సొంత ఇల్లు, బైక్ కావలెను. ✆ 99495 58181, 90325 58181.

జి.డి.యం.యం. నర్సింగ్ కళాశాల, నందిగామ, ఎన్టీఆర్ జిల్లా. బి.ఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు బోధించుటకు M.Sc., B.Sc. (Nursing) అర్హతలు కలిగిన అధ్యాపకులు కావలెను. మరియు Boys హాస్టల్‌లో వార్డెన్ కావలెను. భోజనం, హాస్టల్ వసతి కల్పించబడును. వివరాలకు సంప్ర: మీ బయోడేటా ఇమెయిల్ gdmmcon@gmail.com లేదా వాట్సాయాప్ నెంబర్‌కు పంపగలరు 98492 02841, 99851 03566.

SECURITY GUARDS

హనుమాన్‌జంక్షన్ దగ్గర ఆరుగొలనులో పనిచేయుటకు 3 సం||లు అనుభవం గల సెక్యూరిటీ ఆఫీసర్ (45 సం||లోపు) కావలెను. జీతం: 25,000/- Ex ఆర్మీ, సివిలియన్ సంప్ర: 95737 01777.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

కొండపల్లి: 8008574656 మైలవరం: 80085 74705

◆ కొండపల్లి శివశక్తి థియేటర్ సమీపంలోని ఆవాదుమెంట్ల ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు రాములు తెలిపిన సమస్యపై వీధి దీపాలు పర్యవేక్షకుడు వాసు స్పందించారు. సిబ్బందితో ఆ ప్రాంతంలోని తీగలను సరి చేయించి దీపాలను వెలిగించారు. – న్యూస్‌టుడే, కొండపల్లి

◆ స్థానిక చెరువు బజారులో నెలల తరబడి మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడంతో అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన సోమవారం సమస్యగా ప్రచురించగా అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి పాతకట్ల సిబ్బందితో పూడిక తీయించి బ్లీచింగ్ చల్లించారు. – న్యూస్‌టుడే, జి.కొండూరు

◆ పట్టణంలోని కల్లూరు రోడ్డులో పిచ్చి మొక్కలు పెరిగి అపరిశుభ్రంగా ఉందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి పురపాలిక కార్మికులతో రహదారి పక్కన పిచ్చి మొక్కలు లేకుండా తొలగించి వేశారు. ◆ పట్టణంలోని 15వ వార్డులోని డ్రైనేజీలో పూడిక తీయాలని స్థానికులు చేసిన ఫిర్యాదుకు శానిటరీ అధికారికి తెలుపగా స్పందించారు. కార్మికులతో పూడికను శుభ్రం చేయించారు. – న్యూస్‌టుడే, తిరువూరు

విద్యా సామగ్రి వితరణ

జి.కొండూరు, న్యూస్‌టుడే: కవులూరు గ్రామంలోని మోడల్ ప్రాథమిక పాఠశాలలో 90 మంది విద్యార్థులకు తాటికొండ నారాయణరావు, చెరుకూరి శ్రీనివాసరావుల ఆర్థిక సాయంతో బుధవారం రాత పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు, అట్టలు తదితర సామగ్రి వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతస్థాయి ఎదగాలని సూచించారు. పాఠశాలలకు ఎటువంటి సాయం కావాలన్నా చేయడానికి సిద్ధంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కళానిధి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై అవగాహన ప్రదర్శన

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ అవగాహన ప్రదర్శన రెడ్డిగూడెంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెదేపా మండల అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకానికి కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సదుపాయాల గురించి వివరించారు. మేటలు, సిబ్బంది పాల్గొన్నారు.

సరకులు సక్రమంగా అందించాలి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక పంచాయతీ పరిధిలోని 12, 13 నంబర్ల రేషన్ షాపులను తహసీల్దార్ జి.సుశీలాదేవి బుధవారం తనిఖీ చేశారు. కార్డుదారులకు అందజేస్తున్న సరకుల సరఫరా వివరాలు లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అందరికీ సక్రమంగా సరకులు అందజేయాలని డీలర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో విస్సన్నపేట పీడీఎస్ డీటీ శివ నాగరాజు, ఆర్‌ఐ. జి.పుల్లయ్య, వీఆర్వో జానీసాహెబ్‌లు పాల్గొన్నారు.

హత్య కేసులో అనుమానితుడి ఆచూకీ లభ్యం

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని చెవుటూరు గ్రామంలో మంగళవారం హత్యకు గురైన మహిళ కేసులో పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్న ఉమ్మడి వేణు ఆచూకీ లభ్యమైనట్లు బుధవారం జి.కొండూరు ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు. హత్యకు గురైన హైమావతికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉండగా.. పెద్ద కుమారుడి కొడుకు(మనవడు)ని ప్రధానం అనుమానితుడిగా భావించారు. మంగళవారం ఉదయం నుంచి అతడు కనిపించకపోవడంతో పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో గుర్తించి అదుపులోకి తీసుకున్నామని గురువారం ఉదయానికి జి.కొండూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారణ జరుపుతామని వెల్లడించారు.



రికార్డులు పరిశీలిస్తున్న డా.సుహాసిని, పక్కన ప్రసన్నరాణి తదితరులు

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

జి.కొండూరు, న్యూస్‌టుడే: పుట్టిన శిశువుకు 24 నెలలు వచ్చే వరకు క్రమం తప్పకుండా టీకాలు వేయాలని డీఎంహెచ్‌వో డా.సుహాసిని సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించి సిబ్బంది హాజరు పరిశీలించారు. అనంతరం సచివాలయం-1లో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వైద్యాధికారిణి కె.ప్రసన్నరాణి, ఆశా, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

చెంతనే బడి.. ఆనందమేనండి

పల్లె విద్యార్థులకు చేరువగా ఉన్నత పాఠశాల

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

పల్లె విద్యార్థులకు తమ గ్రామంలోనే ఉన్నత విద్యను అందించాలనే సంకల్పంతో ప్రాథమిక పాఠశాలల స్థాయిని పెంచింది. దీంతో 8వ తరగతి వరకు చదివిన బడిలోనే ఇక నుంచి 9, 10 తరగతుల వరకు చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. దీంతో ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం కోటికలపూడి, చిలుకూరు, పశ్చిమ ఇబ్రహీంపట్నం ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా స్థాయిని పెంచింది. ఇప్పటికే దీనిపై రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఆదేశాలు అందడంతోపాటు ప్రతి పాఠశాలకు ఏడుగురు ఉపాధ్యాయులను ఒక గెజిటెడ్ హోదా ఉన్న ప్రధానోపాధ్యాయుడిని కూడా ఆయా పాఠశాలలో నియమించింది. ఈ విద్యాసంవత్సరం ఈ బడులలో 9వ తరగతి ప్రవేశాలు పూర్తిచేసి తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో బడి బయటి విద్యార్థులు దూరంగా బాలబాలికలు ఉండకూడదనే ప్రభుత్వ సంకల్పం నెరవేరనుంది.



మార్పు చేసిన కోటికలపూడి ప్రాథమికోన్నత పాఠశాల

తగ్గనున్న దూరాభారం

గ్రామాల్లో ఎంపీపీ పాఠశాలల ద్వారా చిన్నారులు 5వ తరగతి వరకు చదువుకున్నారు. ఆ తర్వాత యూపీ పాఠశాలలు మూడు నాలుగు గ్రామాలకు ఒకటి చొప్పున ఉండేవి. ఆపైన 9, 10 చదవాలంటే కనీసం 3 నుంచి 5 కి.మీ దూరంలోని ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి ఉండేది. ఫలితంగా కొందరు తల్లిదండ్రులు తప్పక పంపిస్తుండగా.. భద్రత దృష్ట్యా ఇంటివద్దే చాలా మంది తమ పిల్లలను ముఖ్యంగా ఆడపిల్లలను అంత దూరం పంపలేక బడి మాన్పించేస్తున్నారు. దీని వల్లే డ్రాపౌట్ సంఖ్య పెరుగుతోంది. అధికారుల గుర్తించి సమస్య తీవ్రత ఉన్న చోట్ల ప్రాథమికోన్నత పాఠశాలల్లో 75 మంది విద్యార్థులున్న పాఠశాలలను గుర్తించి 10 వరకు పెంచారు. దీనివల్ల దూరభారం తగ్గడంతోపాటు బడి మానేసే బాలబాలికల సంఖ్య గణనీయంగా తగ్గనుందని అధికారులు అంటున్నారు.

బడుల వివరాలు	గతంలో	ఇప్పుడు
గ్రామీణ మండలంలో	2	4
కొండపల్లి పురపాలిక	3	4

సంతోషంగా ఉంది



మా ఊరిలో 8వ తరగతి పూర్తయిన తర్వాత హైస్కూల్‌కు ఐదు కి.మీ. దూరంలోని మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు మా బడినే హైస్కూల్ చేయడంతో సంతోషంగా ఉంది.

- ఎన్.వైశాలి, 9వ తరగతి, కోటికలపూడి

ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవు



9, 10 తరగతులకు మూలపాడు ఉన్నత పాఠశాలకు పోవాల్సి వచ్చేది. ప్రస్తుతం మా బడిలో ఆ తరగతులు ఉండడంతో దాదాపు జాతీయ రహదారి వెంట ప్రయాణం చేయడం, ట్రాఫిక్ ఇబ్బందులు తప్పాయి.

- ఎం.శ్రీకాంత్, 9వ తరగతి, చిలుకూరు

విద్యార్థుల సౌకర్యార్థమే

గ్రామీణ మండలంలో 10వ తరగతి చదివే పిల్లలు లేక బాలికలు బడి మానేస్తున్నారు. వీరికి అందుబాటులో ఉన్నతపాఠశాలలు లేకపోవడంతో సమస్య తలెత్తిందని ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని వల్ల బాలికలు కనీసం పదో తరగతి వరకు చదవగలుగుతారు. తద్వారా బాల్య వివాహాలు అడ్డుకునే వీలుంటుంది.

- పుష్పలత, ఎంఈవో, ఇబ్రహీంపట్నం

మునేశ్వరరావు సేవలు ఆదర్శప్రాయం

ఇబ్రహీంపట్నం(గ్రామీణం), న్యూస్‌టుడే: గుంటుపల్లి గ్రామాభివృద్ధికి గ్రామ కార్యదర్శి మునేశ్వరరావు చేసిన సేవలు ఆదర్శప్రాయంగా ఉన్నాయని పలువురు వక్తలు కొనియాడారు. ఉద్యోగ విరమణ చేసిన మునేశ్వరరావు దంపతులను బుధవారం పంచాయతీ కార్యాలయంలో గ్రామస్థులు, పాలకవర్గ సభ్యులు అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచి భూక్యా శంకర్, తెదేపా నాయకులు, వివిధ గ్రామాల కార్యదర్శులు, అధికారులు, పంచాయతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పాస్ పోర్టు పోయినది

NTR జిల్లా, గంపలగూడెం (మండలం), సత్యాలపాడు కాపురస్థులైన గుర్రాల వెంకటసుబ్బారెడ్డి S/o. పిచ్చిరెడ్డి తెలియజేయునది ఏమనగా.. B3609345 అను నెంబరు గల నాయొక్క పాస్‌పోర్టు ది. 20-5-2025 మంగళవారం మా స్వగృహమునుంచి గంపలగూడెం జిరాక్స్ కోసం బైక్ మీద వెళుతుండగా మార్గ మధ్యలో పోయినది. దొరికినవారు క్రింది నెంబరుకు తెలియజేయగలరు.

✆ 63002 77826

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే సుపరిపాలన



తిరువూరు: కోకిలంపాడులో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తెదేపా నాయకులు



గొల్లపూడి: మాజీ మంత్రి దేవినేని ఉమా ఆధ్వర్యంలో



మైలవరంలో ..



గంపలగూడెంలో..

కోకిలంపాడు(తిరువూరు), గొల్లపూడి, మైలవరం, కొండపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందిస్తోందని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని కోకిలంపాడులో బుధవారం సాయంత్రం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించి కరపత్రాలు పంపిణీ చేశారు. ◆ రాష్ట్రంలో అభివృద్ధి పనులు, ప్రజలకు సంక్షేమ పథకాలను అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో కూటమి నాయకులు కార్యకర్తలు ఇంటింటా తిరిగి గత ఏడాదిలో అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.



ఎ.కొండూరు: మత్రియ తండాలో

శ్రీరమ్య తల్లిదండ్రులకు ఎమ్మెల్యే పరామర్శ



పుట్రేల(విస్సన్నపేట), న్యూస్‌టుడే: హైదరాబాద్ సమీప ఔషధ పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదంలో దుర్మరణం చెందిన మండలంలోని పుట్రేలకు చెందిన రామాల శ్రీరమ్య తల్లిదండ్రులు నారయ్య, పద్మ, సోదరి జ్యోత్స్నలను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు బుధవారం రాత్రి పరామర్శించారు. మంగళవారం సదరు యువతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించగా అర్ధరాత్రి స్వస్థలమైన పుట్రేలకు తీసుకువచ్చారు. బుధవారం ఉదయం అంత్యక్రియలు పూర్తి చేశారు. ఎమ్మెల్యే ఆమె చిత్రపటానికి నివాళులర్పించి తల్లిదండ్రులను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యేను చూడగానే తల్లిదండ్రులు, సోదరి విలపించడంతో ఆయన కూడా భావోద్వేగానికి గురయ్యారు. ఆ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఐక్యతకు ప్రతీక పీర్ల పండగ

ఇబ్రహీంపట్నం(గ్రామీణం, న్యూస్‌టుడే: పీర్ల పండగ వంటి ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు మన సమాజంలో ఐక్యతను పెంచుతాయని మాజీ మంత్రి దేవినేని ఉమా పేర్కొన్నారు. బుధవారం కేతనకొండలో నిర్వహించిన పీర్ల ఊరేగింపులో ఆయన పాల్గొన్నారు. గ్రామస్థులు నిర్వహించిన సంప్రదాయ నృత్యాలు, ఊరేగింపులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మైనారిటీ నాయకులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు అయిన గుంటూరు జిల్లా, తాడేపల్లి గ్రామం, పార్క్ విల్లా, విల్లా నెం. 61, డోరు నెం.12-353/2/6 రు కాపురస్తులు మండలపు కోదండయ్య గారి కుమారుడు మండలపు హనుమంతరావు గారి సంజాయిషీ మేరకు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తులను NTR జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, కొటికలపూడి గ్రామ కాపురస్తులు బండి వెంకయ్య గారి కుమారుడు బండి శ్రీనివాసరావు అనువారు, తమ స్వాధీన హక్కుభుక్తములో వున్నటువంటి NTR జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, దాములూరు గ్రామ పంచాయతీలో చేరిన సర్వే నెంబరు 92-13 దాఖలా య. 1-43 సెంట్లు మరియు సర్వే నెంబరు 92-12బి దాఖలా య. 0-16 సెంట్లు వెరశి మొత్తము య॥ 1.59 సెంట్లు గల క్రింది షెడ్యూల్ భూమిని నా క్లయింట్ కొనదలచి బయానాగా యాభై వేల రూపాయలు చెల్లించి యున్నారు. ఈ ఆస్తిని బండి శ్రీనివాసరావు గారు, ఆయన సోదర సోదరీమణులైన NTR జిల్లా, కంచికచర్ల మండలం, గండేపల్లి గ్రామ కాపురస్తులు 1) తురక సుందరరావు గారి భార్య తురక భాగ్యమ్మ, 2) రెంటపల్లి మిఖేల్ గారి భార్య రెంటపల్లి అరుణ, 3) తళమలా మెర్లిన్ గారి భార్య తళమలా రమాదేవి మరియు NTR జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, కొటికలపూడి గ్రామ కాపురస్తుడు 4) బండి వెంకయ్య గారి కుమారుడు బండి గోపాలరావు గార్ల ద్వారా జాయింటు హక్కుకు హక్కు విడుదల దస్తావేజును పొంది ఇబ్రహీంపట్నం సబ్ రిజిష్టారు ఆఫీసులో 27-06-2025 తేదీన దస్తావేజు నెం. 3937/2025 గా య. 1-59 సెంట్లు రిజిష్టర్ కాబడిన హక్కు విడుదల దస్తావేజ రీత్యా వారికి సంక్రమించి సర్వ స్వాధీన హక్కు భుక్తములో క్రింది షెడ్యూల్ ఆస్తులను అనుభవించుచున్నారని తెలియజేయుచున్నారు మరియు ఈ ఆస్తిని తమ తండ్రిగారైన బండి వెంకయ్య గారికి, పూర్వార్జితముగా సంక్రమించిన ఆస్తులను వారున్నూ, వారి సోదరులున్నూ కలిసి సుమారు 1985వ సం॥నకు పూర్వమే రైత్వారీ పద్ధతి ప్రకారం మూజువాణి విభాగములు చేసుకొనగా లభించి, ఆయన తదనంతరము వారి భార్య మరియు పై వారికి తల్లిగారైన బండి తులశమ్మ గారికి సంక్రమించి, ఆమె తదనంతరం వారసత్వ చట్ట రీత్యా వారి కన్నబిడ్డలైన పై వారికి సంక్రమించినదని తెలియజేయుచున్నారు. కావున బండి శ్రీనివాసరావు గారికి సర్వ స్వాధీన హక్కు భుక్తములో వున్నటువంటి క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తులపై ఎవరైననూ, ఏవిధమైన అన్యాక్రాంతములు గాని, తనఖాలు, కోర్టు జప్తులు, హామీలు, భాగలబ్ధి తగాయిదాలు, ఇరతత్రా ఏమైనా హక్కులు వగైరాలు వున్న యెడల ఈ ప్రకటన తేదీ నుంచి 15 రోజుల లోపుగా తమ అభ్యంతరములను మండలపు హనుమంతరావు గారు, S/o.కోదండయ్య, డోరు నెం. 40-1/1-25/1, శ్రీ నిలయం, నారా చంద్రబాబునాయుడు కాలనీ, బెంజ్ సర్కిల్, విజయవాడ-520001, సెల్ నెం. 70130 32951 అనే చిరునామాకు వ్రాత పూర్వకముగా రిజిష్టర్ పోస్ట్ తిరుగు టపా ద్వారా పంపవలెను. సదరు గడువు లోపల ఎవరినుండైనా ఏవిధమైన అభ్యంతరములు, వగైరాలు రానియెడల నా క్లయింట్ ఈ దిగువ షెడ్యూల్ ఆస్తులను నిర్వివాద ఆస్తిగా భావించి, నా క్లయింట్ పేరున గానీ, వారు కోరిన వారి పేరున గాని విక్రయ దస్తావేజును పొందగలరు. గడువు అనంతరం వచ్చు అభ్యంతరములు నా క్లయింట్‌ను గాని, సదరు ఆస్తిని గాని ఏవిధముగా బెండు చేయజాలవు.

షెడ్యూలు: NTR జిల్లా, ఇబ్రహీంపట్నం సబ్ రిజిష్టారు వారి యిలాకా, ఇబ్రహీంపట్నం మండలం, దాములూరు గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన దాములూరు గ్రామం దాఖలా **1వ అయిటం:** రీ సర్వే నెం. 92-13 దాఖలా య.1-43 సెంట్లకు హద్దులు: తూర్పు: మల్నీడి వెంకటేశ్వరరావు గారి భూమి, దక్షిణం: 2వ అయిటం మరియు ఎద్దూరి పూర్ణచంద్రరావు గారి భూమి, పడమర: మల్నీడి గోవిందయ్య మరియు జొన్నలగడ్డ బుచ్చయ్య గార్ల భూమి, ఉత్తరం: బండి వెంకటేశ్వరరావు గారి భూమి. **2వ అయిటం:** రీ సర్వే నెం. 92-12B దాఖలా య.0-16 సెంట్లకు హద్దులు: తూర్పు: 1వ అయిటం దాఖలా భూమి, దక్షిణం: ఎద్దూరి పూర్ణచంద్రరావు గారి భూమి, పడమర: మల్నీడి గోవిందయ్య మరియు జొన్నలగడ్డ బుచ్చయ్య గార్ల భూమి, ఉత్తరం: 1వ అయిటం దాఖలా భూమి. **వెరశి మొత్తము భూమి య. 1-59 సెంట్లు.**

ఇట్లు: షేక్ ఇంతియాజ్,
B.Com, LL.B (గోల్డ్ మెడలిస్ట్),
D.I.T., LL.M (Corporate and Security Law)
హై కోర్టు న్యాయవాది, విజయవాడ.
సెల్: 7799 732 786

తెగినా.. పట్టించుకోరా



మునగపాడు గ్రామంలో పెద్ద చెరువు కింద మాగాణి పొలాల్లో విద్యుత్తు తీగలు తెగి కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. ఈ పొలాల్లో నిత్యం రైతులు, పశువుల కాపరులు సంచరిస్తుంటారు. ఇది గమనించిన స్థానికులు అప్రమత్తమై విద్యుత్తు సిబ్బందికి తెలపడంతో రెండు రోజుల కిందట సరఫరా నిలిపివేశారు. ఆ పొలాల్లో తిరిగే వాళ్లు తెలియక ఆ తీగలను చూసి భయపడుతున్నారు. తక్షణమే విద్యుత్తు సిబ్బంది మరమ్మతులు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, జి.కొండూరు

బూడిద కళ్లలో పడుతోంది..!



జాతీయ రహదారి(65) పక్కన నిల్వచేశారిలా..

ఇబ్రహీంపట్నం బూడిద మయంగా మారుతోంది. ఇంటా, బయటా ఎక్కడ చూసిన వాటి నిల్వలే. తాజాగా పశ్చిమ ఇబ్రహీంపట్నం జాతీయ రహదారి పక్కన ఆ నిల్వలు వెలిశాయి. చెరువు నుంచి కాలువ ద్వారా వచ్చిన బూడిదను ఎన్టీటీపీఎస్ యాజమాన్యం జేసీబీల ద్వారా ఎత్తి రహదారి పక్కన నిల్వ చేసింది. రెండు రోజులైనా వాటిని తొలగించకపోవడంతో అటుగా రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పగటి వేళ వీచే గాలులకు బూడిద లేచి ప్రయాణికుల కళ్లల్లో పడుతోందని వాపోతున్నారు. ఎన్టీటీపీఎస్ యాజమాన్యం స్పందించి బూడిద నిల్వలను తొలగించాలని, లేని పక్షంలో పురపాలిక సిబ్బందైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం

నిలిచిన నీటితో ఇక్కట్లు

స్థానిక పంచాయతీలోని 1, 2వార్డుల వైపు నుంచి కూడలి వైపు వచ్చే తారురోడ్డుపై వర్షంనీరు నిలుస్తుండంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో పాదచారులు, ద్విచక్రవాహన చోదకులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రదేశంలో తారురోడ్డు పల్లంగా ఉండడంతో కొద్దిపాటి వర్షం పడినా నీరంతా అందులోకే చేరుతోంది. దీంతో అటుగా వెళ్లలే గ్రామస్థులు తిప్పలు పడుతున్నారు. ఇప్పటికైనా వర్షం నీరు రహదారిపై నిల్వకుండా డ్రెయినేజీల్లోకి వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, రెడ్డిగూడెం



ఆక్రమణతో అవస్థలు



ఇలా వరిగడ్డి వామి అడ్డుగా పెట్టారిలా

మండలంలోని మొర్సుమిల్లిలో చెరువు నుంచి నీటి సరఫరా చేసే కాలువకట్ట ఆక్రమణ రైతులకు ఇబ్బందిగా మారింది. రాకపోకలను నిలువరించేలా ఏళ్లుగా వరిగడ్డి వాములతో ఆక్రమిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. చెరువు నుంచి రైతుల పొలాలకు నీటిని సరఫరా చేసే కాలువపై ఆక్రమణలను ఇటీవల నిర్వహించిన అభివృద్ధి పనుల్లో భాగంగా కొన్ని తొలగించారు. అయితే ఒక రైతు తొలగించేందుకు ససేమిరా అనడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై చాలా కాలంగా ప్రజాప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా, తొలగింపు చర్యలు కానరావటంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తొలగింపు చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, మైలవరం

గ్రామీణ ప్రాంతాల నుంచీ ఆస్ట్రోనాట్‌లు తయారవ్వాలి



కుంటముక్కల గురుకులంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన జాహ్నవి

జి.కొండూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల నుంచి మరింత మంది ఆస్ట్రోనాట్‌లు తయారై దేశానికి గర్వకారణంగా నిలవాలని జాహ్నవి దంగేటి సూచించారు. కుంటముక్కలలోని డా.బీఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను ఆమె బుధవారం సందర్శించి విద్యార్థినులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం గురుకుల సిబ్బందితో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏఎంవో అశోక్‌బాబు, డీసీవో మురళీకృష్ణ, ప్రిన్సిపల్ బ్యూలా, సర్పంచి వంగూరి కుమారి తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి, న్యూస్‌టుడే: ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రతి విద్యార్థి అహర్నిశలు శ్రమించాలని ఆస్ట్రోనాట్ జాహ్నవి దంగేటి అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన జాహ్నవి.. టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్ అంతరిక్ష యాత్రకు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ లక్ష్మీశ..జాహ్నవితో విద్యార్థుల ముఖాముఖి కార్యక్రమాన్ని కొండపల్లి ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా జాహ్నవి మాట్లాడుతూ..అంతరిక్షం ఓ అద్భుతం.. దాని గురించి ఎంత వివరించినా తనివి తీరదన్నారు. స్పేస్‌లోకి వెళ్లాలన్న తన లక్ష్యానికి అందరూ సహకరించారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ఎస్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ, సమగ్ర శిక్ష ఏఎంవో అశోక్‌బాబు, శిరీషరాణి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



సత్కారం అందుకున్న రామినేని రాజశేఖర్‌తో నాయకులు, కార్యకర్తలు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: జూపూడిలో బుధవారం జరిగిన ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం తెదేపా విస్తృతస్థాయి సమావేశంలో కొండపల్లి పురపాలిక ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం తెదేపా అధ్యక్షుడు రామినేని రాజశేఖర్‌లను సత్కరించారు. నూతనంగా ఏర్పడ్డ కొండపల్లి పురపాలికలో పార్టీ బలోపేతానికి చిట్టిబాబు తన వంతు కృషి చేయాలని కోరారు. అనంతరం జరిగిన పార్టీ సమావేశంలో పరిశీలకులు జగ్గయ్యపేట నియోజకవర్గానికి చెందిన నాగేశ్వరావు గ్రామీణ మండలానికి పార్టీ అధ్యక్షుడి ఎన్నిక విధి విధానాలు వివరించారు. ఆసక్తిగల వారి పేర్లను ప్రతిపాదించాలని సూచించగా పలువురు కొన్ని పేర్లు చెప్పారు. దీంతో ఆయన మాట్లాడుతూ విషయాన్ని పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

కొండపల్లి బొమ్మల విశిష్టత పర్యాటకులకు తెలియాలి



ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి బొమ్మల విశిష్టతను పర్యాటకులకు చాటి చెప్పేందుకే ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కొండపల్లి బొమ్మలకాలనీలో రూపు దిద్దుకుంటున్న ఎక్స్‌పీరియన్స్ సెంటర్ పనులను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొయ్య బొమ్మల విశిష్టత పర్యాటకులకు తెలియాలన్నారు. బొమ్మల కళా నైపుణ్యం కళ్లకు కట్టినట్లుగా తెలిసేలా సెంటర్ ఉండాలని పేర్కొన్నారు. అందుకు సంబంధించిన పెయింటింగ్ పనులు పూర్తి అయ్యాయని..మిగిలిన పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో చైతన్య, పర్యాటక శాఖ జిల్లా అధికారి శిల్ప తదితరులు ఉన్నారు.

అవీ ఇవీ

ఉపాధ్యాయులకు సత్కారం

మునుకుళ్ల(తిరువూరు), మండలంలోని మునుకుళ్ల జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులు బి.వీరభద్రం, బాబాసాహెబ్, ఎం.రాంబాబు, రేణుకను బుధవారం హెచ్ఎం జక్కేపల్లి మురళీకృష్ణ ఆధ్వర్యంలో సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు వారంతా చేసిన కృషిని అభినందించారు.

సమ్మె నోటీసు అందజేత

రాజుగూడెం, చౌటపల్లి(తిరువూరు), న్యూస్‌టుడే: దేశ వ్యాప్తంగా ఈ నెల 9న జరగనున్న సమ్మెలో తాము కూడా పాల్గొంటున్నామని మండలంలోని చౌటపల్లి, రాజుగూడెం వైద్యాధికారులకు ఆశ కార్యకర్తలు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు.

నాలుగు నెలలుగా వేతనాలు లేవు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండలంలోని ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న వంట ఏజెన్సీ సభ్యుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఏఐటీయూసీ జిల్లా నాయకుడు ఎం.త్యాగరాజు ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. గత 4 నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరకు అనుగుణంగా వంట సామగ్రి కొనుగోలుకు

సమస్యలు తీర్చాలని ఆందోళన

కొండపల్లి: మున్సిపల్ కార్మికుల వేతనాలు జీవో నంబర్-36 ప్రకారం పెంచాలని సీఐటీయూ మండల అధ్యక్షులు మహేష్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో భాగంగా సీఐటీయూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆందోళనను కొండపల్లి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద మున్సిపల్ కార్మికులు బుధవారం నిర్వహించారు.

జూదరుల అరెస్టు

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని అశోక్‌నగర్‌లో జూదమాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 15,900 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కేవీ జీవీ.సత్యనారాయణ బుధవారం తెలిపారు.

ఇసుక టిప్పర్ స్వాధీనం

గంపలగూడెం, న్యూస్‌టుడే: కృష్ణా నది ఇసుకను తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను గంపలగూడెం పోలీసులు మంగళవారం రాత్రి మండల పరిధిలోని ఊటుకూరు సరిహద్దులో పట్టుకున్నారు. ఎస్సై శ్రీను తెలిపిన వివరాల మేరకు..తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెం సమీప రేవు నుంచి ఇసుక లోడు చేసుకున్న టిప్పర్ నూజివీడు, రెడ్డిగూడెం, గంపలగూడెం మండలాల మీదుగా కల్లూరు మండలం చిన్నకోరుకొండి వైపు సరైన పత్రాలు లేకుండా వెళుతుండగా ఊటుకూరు సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. ఉయ్యూరుకు చెందిన లారీ యజమాని పిట్ల సాంబయ్యపై వాల్టా చట్టం కింద కేసు నమోదు చేసి టిప్పర్‌ను గంపలగూడెం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు.

గజలక్ష్మీదేవికి సారె సమర్పణ



పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను శివారు మెట్టగుట్ట శేషాచల శ్రీనివాస ఆలయంలోని గజలక్ష్మి అమ్మవారికి బుధవారం ఖమ్మం జిల్లా మధిర, మర్లపాడు, ఇనగాలికి చెందిన శ్రీనివాస భక్తబృందం ఆధ్వర్యంలో ఆషాఢ సారె సమర్పించారు. ఆలయ అర్చకులు యోగానందాచార్యులు మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి అలంకరించగా భక్తులు దర్శించుకున్నారు.

పార్వతీ దేవికి..

ఇబ్రహీంపట్నం(గ్రామీణం, న్యూస్‌టుడే: కాచవరం గ్రామానికి చెందిన మహిళలు రామలింగేశ్వరస్వామి దేవాలయంలో పార్వతీదేవికి బుధవారం ఆషాఢ సారె సమర్పించారు. శివారు సత్యనారాయణపురం, దొనబండ గ్రామాల నుంచీ మహిళలు ప్రదర్శనగా ఆలయానికి వచ్చి సారె సమర్పించారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616



ప్రయత్నం ఎంత నిలకడగా ఉంటే..

ప్రయత్నానికి, ఫలితానికి మధ్య కాలావధి ఉంటుంది. అది రోజుల్లో, వారాల్లో, నెలల్లో అవ్వొచ్చు. లేకపోతే- కొన్నేళ్లు కూడా కావొచ్చు. ఒక్క విషయం మాత్రం విస్మరించకండి. మీ ప్రయత్నం ఎంత నిలకడగా, ఎంత సుదీర్ఘంగా కొనసాగితే.. ఫలితం కూడా అంత గొప్పగా ఉండే అవకాశాలు పెరుగుతుంటాయి.

– చార్లెస్ మిల్లర్, కంటెంట్ క్రియేటర్

డిగ్రీలో డబుల్ మేజర్ విధానాన్ని తీసుకొచ్చి తక్షణమే ప్రవేశాలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కుల్లాయి స్వామి డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

కేటీఆర్, హరీశ్‌రావుల మధ్య అస్తిత్వ పోరుతోనే బనకచర్లపై వివాదం

- జగన్ సూచించే గన్‌ను ప్రజలు ఆయన మీదే ఎక్కుపెడతారు
- 'సుపరిపాలనలో తొలి అడుగు'లో మంత్రి పయ్యావుల కేశవ్



'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో సంక్షేమ పథకాల అమలు ప్రతిని మహిళకు చూపిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, న్యూస్‌టుడే: బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టమూ లేదని, సముద్రంలోకి వృథాగా పోతున్న జలాలను వినియోగించుకోవాలన్నది ఏపీ ప్రభుత్వ ప్రయత్నమని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా కూడేరు మండలం జయపురంలో బుధవారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారాసలో కేటీఆర్, హరీశ్‌రావుల మధ్య అస్తిత్వ పోరుకు రాజకీయ రంగును పులిమి, ఇదేదో ప్రాంతాల మధ్య సమస్యగా చూపిస్తున్నారని అన్నారు. హరీశ్‌రావు తన రాజకీయ ప్రాబల్యం పెంచుకోవడానికి బనకచర్ల మీద వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. బనకచర్ల ప్రాజెక్టును కలిసి ప్రారంభిద్దామని గతంలో తెలంగాణ, ఆంధ్రా మాజీ సీఎంలు కేసీఆర్, జగన్‌లు మాట్లాడుకున్న విషయం హరీశ్‌రావుకు గుర్తుకురావడం లేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ తిరుపతికి వచ్చినపుడు రాయలసీమకు నీళ్లిస్తామని చెప్పిన మాటలు, అదే అంశాన్ని ఆయన అసెంబ్లీలోనూ ప్రకటించిన విషయం హరీశ్‌రావుకు గుర్తులేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇదంతా ఆయన కేవలం రాజకీయ అస్తిత్వం కోసమే చేస్తున్న డ్రామాగా అభివర్ణించారు. తాము తెలంగాణకు వ్యతిరేకం కాదని, వృథాగా సముద్రంలోకి వెళ్లే జలాలను మాత్రమే వినియోగించుకోవాలన్నదే లక్ష్యమన్నారు.

ప్రజల దృష్టి మళ్లించడానికే...

'సామాజిక మాధ్యమాలను గన్‌గా వాడుకోవాలని మాజీ సీఎం జగన్ నాయకులు, కార్యకర్తలకు చెప్పడం విడ్డూరంగా ఉందని పయ్యావుల పేర్కొన్నారు. ఆయనకు నిద్రలో కూడా గన్ అరాచక పాలనే కనిపిస్తోందన్నారు. ప్రజల మధ్య అశాంతి, అభద్రత సృష్టించి వారిని భయపెట్టాలనుకోవడమే ఆయన నైజమని ఎద్దేవా చేశారు. ప్రజలను రెచ్చగొట్టడమే ఆయన లక్ష్యమన్నారు. భవిష్యత్తులో సామాజిక మాధ్యమాల వేదికగానే ఆయన సూచిస్తున్న గన్‌ను ప్రజలు ఆయన మీదనే ఎక్కుపెట్టనున్నారని తెలిపారు. రాష్ట్రంలో జగన్ రౌడీల రిక్రూట్‌మెంట్ బోర్డును ప్రారంభించారని ఆక్షేపించారు.

పేపరుమిల్లులో హైడ్రోజన్ పెరాక్సైడ్ లీకేజీ



లీకవుతున్న హైడ్రోజన్ పెరాక్సైడ్‌పై నీటిని పిచికారీ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాజమహేంద్రవరం (కంబాలచెరువు), ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆంధ్రా పేపరుమిల్లులో బుధవారం ఉదయం ప్రమాదకర హైడ్రోజన్ పెరాక్సైడ్ లీకేజీతో తీవ్ర కలకలం రేగింది. మిల్లు ఉత్తర ద్వారం మీదుగా 26 టన్నుల హైడ్రోజన్ పెరాక్సైడ్‌తో వచ్చిన లారీ సేఫ్టీ వాల్వ్ నుంచి రసాయనం లీకవుతుండడంతో పరిశ్రమ ప్రతినిధులు అప్రమత్తమై అగ్నిమాపక అధికారులకు సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని లీకవుతున్న హైడ్రోజన్ పెరాక్సైడ్‌పై నీటిని పిచికారీ చేస్తూ ప్రమాద తీవ్రతను తగ్గించారు. మూడు గంటల పాటు శ్రమించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

జగన్ ఇలాకాలోనే దొంగ పింఛన్లు అధికం

- పులివెందులలో 7,487 దివ్యాంగుల పింఛన్లలో 1,708 బోగస్‌వే
- తర్వాతి స్థానాల్లో ధర్మవరం, చంద్రగిరి, మచిలీపట్నం
- వైకాపా హయాంలో విచ్చలవిడిగా అనర్హులకు మంజూరు

ఈనాడు, అమరావతి: దివ్యాంగుల పింఛనుదార్లలో అనర్హులు కుప్పలుతెప్పలుగా బయటపడుతున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో అనర్హులకు పింఛన్లు మంజూరైనట్లు బట్టబయలవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 7.86 లక్షల మంది దివ్యాంగుల కేటగిరీ పింఛన్లు పొందుతున్నారు. 175 నియోజకవర్గాల్లోనూ ఇప్పటివరకు 4.76 లక్షల పింఛన్లను అధికారులు తనిఖీ చేయగా దాదాపు లక్షమంది అనర్హులని తేలింది. జగన్ నియోజకవర్గం పులివెందులలో బోగస్ పింఛన్లు ఎక్కువగా మంజూరైనట్లు బయటపడింది. బోగస్ దివ్యాంగ పింఛన్లు 100లోపు ఉన్న నియోజకవర్గాలు 9 అని వెల్లడైంది. కాకినాడ సిటీ పరిధిలో అత్యల్పంగా 19 బోగస్ పింఛన్లు ఉన్నట్లు గుర్తించారు. విశాఖ దక్షిణంలో 39, తాడికొండలో 55, విశాఖ ఉత్తరంలో 57, నిడదవోలులో 58, విశాఖ తూర్పులో 71, అద్దంకిలో 78, విజయవాడ పశ్చిమలో 83, విజయవాడ సెంట్రల్‌లో 88 మంది అనర్హులు పింఛన్లు పొందుతున్నట్లు బయటపడింది. 1,000 నుంచి 1300 వరకు బోగస్ పింఛన్లున్న నియోజకవర్గాలు 13 అని తేలింది. 88 నియోజకవర్గాల్లో 500 నుంచి 970 మంది వరకు అనర్హులకు పింఛన్లు మంజూరయ్యాయి. మిగతా 59 స్థానాల్లో 100 నుంచి 500 మధ్యలో బోగస్ పింఛన్లున్నట్లు బయటపడింది.

లోపం లేకున్నా...

అంధత్వం, రేచీకటి, వినికిడి లోపం, కాళ్లు, చేతులు వంకర లేకున్నా ఉన్నట్లు చూపి దొంగ పింఛన్లు మంజూరు చేశారు. తప్పుడు సదరం ధ్రువీకరణ పత్రాలు తీసుకుని పింఛన్లు పొందుతున్న వారు 50,540 మంది ఉన్నారు. కంటి చూపు సరిగా లేనట్లు ధ్రువీకరణ పొందిన వారు 23,200 మంది, చెవుడు లేపోయినా ఉన్నట్లు చూపిన 20 వేల మంది.. బోగస్ పింఛను తీసుకుంటున్నట్లు తేలింది.

నియోజకవర్గాల వారీగా దివ్యాంగుల కేటగిరీలో బయటపడిన బోగస్ పింఛన్లు

నియోజకవర్గం	మొత్తం పింఛన్లు	బోగస్ పింఛన్లు
పులివెందుల	7,487	1,708
ధర్మవరం	7,243	1,671
చంద్రగిరి	5,929	1,604
మచిలీపట్నం	5,680	1,539
జమ్మలమడుగు	5,628	1,451
శింగనమల	8,235	1,418

తనిఖీకి రాని వారికి మళ్లీ నోటీసులు

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 7.86 లక్షల మంది దివ్యాంగ కేటగిరీ పింఛనుదారుల్లో 5.10 లక్షల మందికి సదరం ధ్రువీకరణపత్రాల తనిఖీకి రావాలంటూ నోటీసులు జారీచేశారు. వీరిలో 4.76 లక్షల మంది.. వైద్యుల ముందు హాజరయ్యారు. మిగిలిన వారికి మరోమారు నోటీసులు జారీ చేసి అప్పటికీ హాజరు కాకపోతే తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

పట్టాభిరామ్‌కు ప్రముఖుల నివాళి

- జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు పూర్తి



పట్టాభిరామ్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న విజయ్‌కుమార్, వరప్రసాద్‌రెడ్డి ★ జనార్దన్‌రెడ్డి ★ లక్ష్మీనారాయణ

హైదరాబాద్, న్యూస్‌టుడే: గుండెపోటుతో మృతిచెందిన వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ఇంద్రజాలికుడు, రచయిత డా.బీవీ పట్టాభిరామ్‌కు పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఒమేగా ఆసుపత్రి నుంచి ఆయన భౌతిక కాయాన్ని బుధవారం ఉదయం ఆనంద్‌నగర్ కాలనీ సింధుర్ అపార్ట్‌మెంట్స్‌లోని నివాసానికి తీసుకువచ్చారు. ప్రముఖులు, మిత్రులు, బంధువులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు. పట్టాభిరామ్ సతీమణి జానకీరాణి, కుమారుడు బీవీఎస్ ప్రశాంత్‌లను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, విజయ్‌కుమార్, సీబీఐ మాజీ జేడీ వి.లక్ష్మీనారాయణ, శాంతా బయోటెక్ వ్యవస్థాపకుడు కేఐ వరప్రసాద్‌రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారులు ప్రభాకర్‌రెడ్డి, బి.జనార్దన్‌రెడ్డి, సినీ నటుడు జెన్నీ, సీనియర్ సంపాదకుడు కె.రామచంద్రమూర్తి, ఇంటెలిజెన్స్ ఓఎస్డీ శివకుమార్, రచయిత యండమూరి వీరేంద్రనాథ్, ఆధ్యాత్మికవేత్త సుఖబోధానందస్వామి, దైవజ్ఞశర్మ తదితరులు పట్టాభిరామ్‌కు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. అనంతరం మధ్యాహ్నం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఉద్యోగులకు మరో ఏడాది ఉచిత బస సదుపాయం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాలు, అసెంబ్లీ, హైకోర్టు, రాజ్‌భవన్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు షేరింగ్ ప్రాతిపదికన ఉచిత బస సౌకర్యాన్ని మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విభజన తర్వాత వీరిలో చాలామంది ఇప్పటికీ కుటుంబాలను హైదరాబాద్‌లోనే ఉంచి ఇక్కడ ఒంటరిగా ఉంటున్న ఉద్యోగుల సౌలభ్యం కోసం ప్రభుత్వం అపార్ట్‌మెంటులను అద్దెకు తీసుకుని ఉచిత బస సదుపాయం కల్పిస్తోంది. తాజాగా జూన్ 27తో గడువు ముగియడంతో 2026 జూన్ 26 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

విమాన సర్వీసులకు అంతరాయం

శంషాబాద్, న్యూస్‌టుడే: శంషాబాద్‌లో ప్రతికూల వాతావరణం కారణంగా బుధవారం విమాన సర్వీసుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శంషాబాద్ నుంచి ఇండోర్, దుబాయ్, హోచిమిన్ సిటీ, కొలంబోలకు, షార్జాతో పాటు జెడ్డాకు వెళ్లాల్సిన విమాన సర్వీసులు గంటన్నర ఆలస్యంగా బయలుదేరాయి. తెల్లవారుజామున 3.55 గంటలకు మస్కట్ వెళ్లాల్సిన సలామ్ ఎయిర్‌లైన్స్ సర్వీసును రద్దు చేశారు. బెంగళూరు, కోల్‌కతానుంచి శంషాబాద్‌కు చేరుకున్న నాలుగు దేశీయ విమాన సర్వీసులను దారి మళ్లించి బెంగళూర్, విజయవాడలో ల్యాండింగ్ చేశారు. రెండు గంటల అనంతరం వాతావరణం కుదుటపడిన తర్వాత ఆ 4 విమానాలు శంషాబాద్ చేరుకున్నాయని అధికారులు తెలిపారు.

కేంద్ర జలసంఘం పరిశీలనలో పోలవరం-బనకచర్ల అనుసంధానం పీఎఫ్ఆర్

కొన్ని సందేహాలు లేవనెత్తుతూ లేఖ

ఈనాడు, అమరావతి: పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ నివేదిక (పీఎఫ్ఆర్)ను కేంద్ర జలసంఘం పరిశీలిస్తోంది. ఏప్రిల్ నెలలో ఈ నివేదిక వారికి అందింది. ఈ నివేదికను ఆమోదిస్తే ఆ తర్వాత డీపీఆర్ రూపకల్పనకు సిద్ధమవుతారు. పీఎఫ్ఆర్‌ను పరిశీలిస్తున్న కేంద్ర జలసంఘం కొన్ని ప్రశ్నలు లేవనెత్తుతూ లేఖ పంపింది. గోదావరి వరద జలాల ఆధారంగా ఈ ప్రాజెక్టు చేపడుతున్నారని పేర్కొన్నారని.. గోదావరి నీటి వివాదాల ట్రైబ్యునల్ 1980 ప్రకారం వరద జలాలు పంపకం చేయలేదు కదా అని ప్రశ్నించింది. అలాగే స్టిమ్యులేషన్ అధ్యయనాలు చేశారా అని కూడా సందేహం వ్యక్తం చేసింది. ఈ రెండు అంశాలపై రాష్ట్ర జలవనరులశాఖ సమాధానాలు ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ ప్రాజెక్టులో వ్యాప్కోస్ హైడ్రాలజీ కన్సల్టెన్సీగా ఉంది. ఆ సంస్థ చీఫ్ డైరెక్టర్ విజయవాడ రానున్నారు. ఈ అంశంపై సమావేశమై కేంద్ర జలసంఘానికి తగిన సమాధానం పంపుతారు. డీపీఆర్ తయారీ క్రమంలో స్టిమ్యులేషన్ అధ్యయనం అవసరం తప్ప పీఎఫ్ఆర్ దశలో అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. కేంద్ర జలసంఘం ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చిన తర్వాత అధికారుల బృందం దిల్లీ వెళ్లి కేంద్ర అధికారులను కలిసి వారి సందేహాలను నివృత్తి చేయనున్నారు.

తిరుమలలో కళా ప్రదర్శన పేరుతో బురిడీ

నిందితుడు సూత్రపు అభిషేక్ అరెస్టు



సూత్రపు అభిషేక్

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో కళా ప్రదర్శన ఇచ్చేందుకు అవకాశం ఇప్పిస్తానని పలువురిని మోసగించిన వ్యక్తిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. తెలంగాణ రాష్ట్రం కాజీపేటకు చెందిన సూత్రపు అభిషేక్.. తిరుమలలోని ఆస్థాన మండపంలో 'శ్రీనివాస కళార్చన' పేరుతో రెండు రోజుల నాట్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పి తితిదే హిందూ ధర్మప్రచార పరిషత్ (హెచ్‌డీపీపీ) అనుమతి లేకుండానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 93 కళా బృందాల్లోని 2,900 మంది కళాకారులను నమ్మించాడు. వసతి, భోజనం, శ్రీవారి దర్శనం, ప్రసాదం, జ్ఞాపికల పేరుతో వారి నుంచి రూ.35 లక్షల వరకు వసూలు చేశాడు. దీనిపై ఫిర్యాదులు అందడంతో తిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ విజయ్‌శేఖర్ ఆదేశాలతో అభిషేక్‌ను మంగళవారం అరెస్టు చేసి రూ.14 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం తిరుపతి న్యాయస్థానంలో నిందితుడిని హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు.

వరద ముప్పు అడ్డుకునే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి

విజయవాడలో వరద కారణంగా ప్రాణాలు కోల్పోయారు

ఈనాడు, అమరావతి: వరద ముప్పును అడ్డుకునేందుకు వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని హైకోర్టు వ్యాఖ్యానించింది. గతేడాది విజయవాడలో వరదల కారణంగా ప్రాణనష్టం జరిగినందున అందుకు బాధ్యులైన అధికారులెవరో గుర్తించాలంది. విజయవాడ వరద విషయంలో ప్రజలను అప్రమత్తం చేయడంలో అధికారులు విఫలమయ్యారని, బాధ్యులపై చర్యలు తీసుకునేలా ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం(పిల్)లో కౌంటర్ వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు మరికొంత సమయం ఇచ్చింది. తదుపరి విచారణను అక్టోబరు 8కి వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. గతేడాది బుడమేరు పొంగడం వల్ల విజయవాడ వరద ముంపులో చిక్కుకున్న విషయం తెలిసిందే. వరదను కట్టడి చేయడంలో విఫలమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఒంగోలుకు చెందిన విశ్రాంత పాత్రికేయుడు భూపతి రావు గతేడాది హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. కృష్ణానది ఒడ్డున అనధికార నిర్మాణాలు, బుడమేరు, కొండవీటి వాగుల ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న ఆక్రమణలను తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

వ్యక్తిగతంగా లక్ష్యం చేసుకొని వాదనలు చెప్పొద్దు: ధర్మాసనం

బుధవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది కాసా జగన్‌మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ వరదలకు కృష్ణానది కరకట్ట వెంట అక్రమ నిర్మాణాలు ఓ కారణం అన్నారు. ఆ నిర్మాణాల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం ఉందన్నారు. వరదలకు సీఎం కారణం అన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రిని ప్రతివాదిగా పేర్కొన్నామని చెప్పారు. గతంలో సీఎంకు హైకోర్టు నోటీసు ఇవ్వలేదని, ప్రస్తుతం ఇవ్వాలని కోరారు. అందుకు ధర్మాసనం నిరాకరించింది. వ్యక్తిగతంగా లక్ష్యం చేసుకొని వాదనలు చెప్పొద్దని సూచించింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ప్రణతి వాదనలు వినిపిస్తూ.. వర్షం అధికంగా కురవడమే వరదలకు కారణం అన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు మరికొంత సమయం ఇవ్వాలని కోరారు.

అత్యాధునిక సాంకేతిక హంగులతో పోలీస్ అకాడమీ



మ్యాప్ పరిశీలిస్తున్న డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: అత్యాధునిక సాంకేతిక హంగులు, అన్ని వసతులతో దేశంలోనే మోడల్ పోలీస్ అకాడమీ నిర్మిస్తామని ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం నూగొండపల్లి, పిన్నమరెడ్డిపల్లి గ్రామాల పరిధిలో ఏపీ పోలీస్ అకాడమీ కేంద్రం నిర్మాణ ప్రతిపాదిత ప్రాంతాన్ని డీజీపీ బుధవారం పరిశీలించారు. అప్పా నిర్మాణ ప్రాంతాన్ని మ్యాప్, వీడియో, చిత్రాల ద్వారా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్, తహసీల్దారు పీఎస్వీ ప్రసాద్‌లు డీజీపీకి వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ... 94.49 ఎకరాల్లో ఏపీ పోలీస్ అకాడమీ కేంద్రం నిర్మించేందుకు సన్నాహాలు చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు డీజీపీ మధుసూదన రెడ్డి, ఐజీలు జి.వి.జి. అశోక్ కుమార్, ఎం.రవి ప్రకాశ్, డీఐజీ సత్య ఏసుబాబు, సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్, సీఐ కె.రామకృష్ణ, ఎస్సై కె.శుభశేఖర్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతి పనుల పురోగతిపై సంతృప్తి



సీఆర్‌డీఏ చేపట్టిన పనులను ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు బృంద సభ్యులకు వివరిస్తున్న కమిషనర్ కన్నబాబు

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : రాజధాని అమరావతి నిర్మాణ పనుల పురోగతిపై ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. వరుసగా మూడో రోజైన బుధవారం వారు విజయవాడ ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు, అదనపు కమిషనర్లు జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్, మల్లారపు నవీన్‌లు 'అర్బన్ గవర్నెన్స్'పై కార్యశాల నిర్వహించారు. వివిధ దేశాల్లో దీనిపై అమలవుతున్న అత్యుత్తమ విధానాలు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ప్రతినిధులు.. సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులతో చర్చించారు. అమరావతి నిర్మాణంలో ప్రాజెక్టుల పురోగతి, రాజధానిలో ల్యాండ్ మోనిటైజేషన్ గురించి అధికారులు వారికి వివరించారు. ఆర్థికాభివృద్ధి, రవాణా సదుపాయాల కల్పన, హౌసింగ్ ప్రాజెక్టులు, ప్రైవేట్ సెక్టార్ భాగస్వామ్యం, పౌరసేవల కల్పన తదితర అంశాల్లో సీఆర్‌డీఏ ప్రాతినిధ్యం వహిస్తోందని తెలిపారు. విపత్తు నివారణ కార్యకలాపాలు, సమగ్ర సదుపాయాలతో కూడిన రాజధాని నగర నిర్మాణం గురించి వివరించారు. దీనిపై బ్యాంకు ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సంతృప్తికర రీతిలో సమాధానం ఇచ్చారు. రాజధాని ప్రాంత నివాసితులకు అమలు చేస్తున్న సామాజిక సంక్షేమ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, కార్మికులు, మహిళల భద్రతకు అమలవుతున్న చర్యలు, విపత్తుల నిర్వహణకు చేపట్టిన కార్యకలాపాలపై బృంద సభ్యులు పూర్తి స్థాయిలో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీపార్థసారథి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రెండు టన్నుల ఆకు కూరలు.. నిమ్మకాయల విరాళం



రైతులకు అమ్మవారి ప్రసాదాలు అందజేస్తున్న దుర్గగుడి ఉద్యోగులు ప్రసాద్, పునీత్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఈనెల 8 నుంచి 10 వరకు నిర్వహించే శాకంబరి ఉత్సవాలకు కృష్ణా జిల్లా ఓగిరాల, నూజివీడు మార్కెట్లలో రైతులు, కూరగాయల వ్యాపారులు 2టన్నుల ఆకు కూరలు, నిమ్మకాయలు విరాళం ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. వారికి శాకంబరి ఉత్సవాల ఆహ్వాన పత్రిక, ప్రసాదాలను దేవస్థానం ఉద్యోగులు అందజేశారు. ఉత్సవాలకు 130 టన్నుల కూరగాయలు అవసరం అవుతాయని, విరాళంగా పొందేందుకు రైతులు, మార్కెట్టు వ్యాపారులను కలుస్తున్నట్లు దేవస్థానం ఉద్యోగులు వివరించారు. ఈకార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగులు ప్రసాద్, పునీత్ పాల్గొన్నారు.

కృష్ణమ్మా.. వచ్చేస్తున్నా..!

పట్టిసీమ నుంచి గోదావరి జలాల విడుదల నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే

పట్టిసీమ ఎత్తిపోతల పథకం (పోలవరం కుడి కాలువ) ద్వారా గోదావరి జలాలను ఈ నెల 3వ తేదీ గురువారం విడుదల చేయనున్నారు. సరిగ్గా ఏడాది క్రితం ఇదే తేదీన పట్టిసీమ ద్వారా నీటిని విడుదల చేశారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విడుదల చేయనున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సాగు అవసరాలకు కృష్ణా నది (పులిచింతల), గోదావరి (పట్టిసీమ) నీటిని రెండిటినీ వినియోగించుకునేలా ప్రణాళికతో ఉన్నారు. ఇప్పుడు పులిచింతల ప్రాజెక్టులో 21.67 టీఎంసీల నీటి నిల్వ ఉంది. రోజుకు 4,000 క్యూసెక్కుల వరకు ప్రకాశం బ్యారేజీకి విడుదల చేస్తున్నారు. స్థానిక వరదతో సహా బ్యారేజీకి 5,000 క్యూసెక్కులు వస్తుండగా, 6,000 క్యూసెక్కుల వరకు పంట కాలువలకు విడుదల చేస్తున్నారు. బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటి మట్టానికి గాను, ప్రస్తుతం 11.1 అడుగులు మాత్రమే ఉంది.

గత ఏడాదికంటే మెరుగు..

కృష్ణా నది పరిస్థితి గత ఏడాది కంటే ఈ ఏడాది కాస్త మెరుగ్గా ఉంది. గత ఏడాది పులిచింతల ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీ ఉండగా, నేడు 21.67 టీఎంసీలు ఉంది. గత ఏడాది బ్యారేజీ వద్ద 8.4 అడుగుల నీటి మట్టం ఉండగా, ఈ ఏడాది 11.1 అడుగుల మేర ఉంది. పట్టిసీమలో విడుదల చేసిన నీరు ప్రకాశం బ్యారేజీకి చేరడానికి 5 రోజుల సమయం పడుతుంది. పట్టిసీమ ప్రవాహం ద్వారా కాలువ మార్గ మధ్యంలోని ప్రాంతాలకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి. పోలవరం కుడి కాలువ ద్వారా వచ్చే గోదావరి జలాలు బుడమేరు మళ్లింపు కాలువ ద్వారా కృష్ణా నదిలో విలీనం అవుతాయి. వరద ముంపు నేపథ్యంలో బుడమేరు కట్టలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం వీటి మరమ్మతు పనులు జరుగుతున్నాయి. సాగునీటి అవసరాలు, మరమ్మతు పనులను సమన్వయం చేసుకుని తదనుగుణంగా నీటిని విడుదల చేయాల్సి ఉంది. గోదావరి జలాల విడుదల ద్వారా పట్టిసీమ పంపుల పరిస్థితిని కూడా తెలుసుకునే వీలుంది. ప్రకాశం బ్యారేజీ ద్వారా కృష్ణా డెల్టాలోని 13.08 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి : కేసు నమోదు

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్(హెచ్‌సీ)పై దాడి చేసిన సంఘటనపై చిలకలపూడి స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ అబ్దుల్‌నబీ కథనం ప్రకారం.. విజయవాడకి చెందిన పి.నవీన్‌కుమార్ బుధవారం మహిళా సంరక్షణ కార్యదర్శిగా పనిచేస్తున్న తన భార్యను జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్న బదిలీ కౌన్సెలింగ్‌కు తీసుకొచ్చారు. ఆమె కౌన్సెలింగ్ నిమిత్తం లోపలకు వెళ్లగా పోలీసు కార్యాలయం ప్రధాన గేటు సమీపంలో బైక్ పార్కింగ్ చేస్తున్న నవీన్‌కుమార్‌ను అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ బుజ్జిబాబు అక్కడ పార్కింగ్ చేయవద్దని సూచించారు. వినిపించుకోకుండా పార్కింగ్ చేయడంతో సెల్‌ఫోన్‌లో వీడియో తీసే ప్రయత్నం చేసిన హెచ్‌సీతో వాగ్వాదానికి దిగిన నవీన్‌కుమార్ శారీరక దాడికి పాల్పడ్డాడు. బాధితుడైన హెచ్‌సీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. సీసీ కెమెరాల పుటేజిని పరిశీలించిన పోలీస్ అధికారులు విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించడంతో పాటు పోలీస్ విధులకు ఆటంకం కల్పించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అయితే హెడ్‌కానిస్టేబులే అకారణంగా తనపై కర్రతో దాడి చేసి గాయపర్చాడని నవీన్‌కుమార్ ఆరోపించారు.

సమన్వయంతో జాతీయ రహదారుల అభివృద్ధి



చర్చిస్తున్న రెండు జిల్లాల కలెక్టర్లు, కమిషనర్

ఈనాడు, అమరావతి: విజయవాడ నుంచి గన్నవరం వరకు ఎన్‌హెచ్-16 అత్యధికంగా ప్రముఖులు ప్రయాణించే రహదారి.. సీఎం మొదలు మంత్రులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు... అందరూ ఈ మార్గంలో వెళుతుంటారు. రాజధాని అమరావతి పనులు ఊపందుకుంటున్న నేపథ్యంలో ఈ తాకిడి మరింత పెరిగింది. ఇంత ప్రాధాన్యం ఉన్న మార్గంలో పారిశుధ్యం, డ్రెయినేజీ, వాన నీరు నిలిచిపోవడం వంటి సమస్యలు వేధిస్తున్నాయి. వీటిని పరిష్కరిద్దామంటే.. ఈ మార్గం రెండు జిల్లాల పరిధిలో ఉండడం.. చాలా శాఖల సమన్వయంతో పని చేయాల్సి రావడంతో కొంత అశ్రద్ధ చేశారు. తాజాగా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లు లక్ష్మీశ, బాలాజీ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. వారిద్దరు సంబంధిత అధికారులతో బుధవారం రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

శాఖల సమన్వయంతో సాధ్యం: రామవరప్పాడు-కేసరపల్లి ముందు వరకు ఎన్టీఆర్ జిల్లాలో ఉంటుంది. అక్కడ నుంచి గన్నవరం వరకు కృష్ణా జిల్లాలో ఉంది. మొత్తం రహదారి నిర్వహణ ఎన్‌హెచ్ అధికారులు పర్యవేక్షించాలి. పచ్చదనం పెంచే బాధ్యత సీఆర్‌డీఏ, పారిశుద్ధ్య నిర్వహణ పురపాలక శాఖ చూడాలి. వీటి మధ్య సమన్వయం లేక దారి పొడవునా సమస్యలే. రహదారులు అక్కడక్కడా దెబ్బతినడం, విద్యుత్తు దీపాలు, స్తంభాల నిర్వహణలో లోపాలు, డ్రెయిన్లు, వంతెనలు, పారిశుద్ధ్య నిర్వహణలో సమస్యలు, రహదారి వెంట పచ్చదనం లోపాలు ఉన్నాయి. దీంతో ఈ విషయాలతో సంబంధిత శాఖలు ఎన్‌హెచ్ అధికారులతో సమన్వయం చేసుకుని యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని కలెక్టర్లు ఆదేశించారు. అమరావతికి ముఖద్వారమైన విజయవాడ రహదారుల్లో ట్రాఫిక్ సమస్య, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్‌హెచ్ పీడీ విద్యాసాగర్, కమిషనర్ ధ్యానచంద్ర, డీపీవో లావణ్యకుమారి తదితరులు ఉన్నారు.

పక్కా ప్రణాళికతో అద్విక మోసాలు

పటమట, న్యూస్‌టుడే

అద్విక ట్రేడింగ్ కంపెనీ మోసం ఒక్క రోజులో జరిగింది కాదు. పక్కా ప్రణాళికతో మూడేళ్ల నుంచి ప్రజలను నమ్మించి మోసం చేశారు. ఆదిత్యతో మరికొందరు కలిసి చేసిన మోసానికి వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వివిధ అవసరాలకు దాచుకున్న సొమ్ము కొందరు, రుణం తీసుకుని మరికొందరు అద్విక కంపెనీలో పెట్టుబడి పెట్టారు. ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని ఎన్టీఆర్ కాలనీలోని అద్విక కంపెనీ వద్ద బాధితులు లబోదిబోమంటున్నారు. రూపాయి వస్తుందని ఆశ పడితే తమ కష్టాన్ని దోచుకుపోయారంటూ కన్నీరు పెట్టుకుంటున్నారు. బుధవారం మరో ఐదుగురు బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో మొత్తం ఫిర్యాదుదారులు సంఖ్య 97కి చేరింది.

లెక్కలే లేవు..

అద్విక ట్రేడింగ్ కంపెనీ మోసం లెక్కలు ఇంకా తేలలేదు. ఆదిత్య ఎంతమంది నుంచి పెట్టుబడులు తీసుకున్నాడు... తిరిగి ఎంతమందికి చెల్లించాడో రికార్డులు లేవు. ఏజెంట్లు చెబుతున్న వివరాల ప్రకారం ఆదిత్య ఎంత మంది వద్ద నుంచి నగదు తీసుకున్నాడో పోలీసులు రికార్డు తయారు చేస్తున్నారు. తొలుత ఐదుగురు ఏజెంట్లతో మొదలై ఆ సంఖ్య 44కి చేరింది. దాదాపు 40 మంది ఏజెంట్లను పోలీసులు విచారించారు.

✦✦ పెట్టుబడి పెట్టిన వారికి ప్రతి నెల చెల్లించే వడ్డీ (పేఅవుట్) ఆలస్యంగా చెల్లిస్తున్నారని ఎవరైనా ఏజెంట్ గట్టిగా అడిగితే... వారికి ఆదిత్య సొమ్ము చెల్లించేవాడు కాదు. అతనిని పొగిడినా, సన్మానం చేసినా వెంటనే పేఅవుట్ చేసే వాడని ఏజెంట్ల దర్యాప్తులో తేలింది. ఏజెంట్ల ఖాతాల నుంచే నగదు ఎక్కువగా బదిలీ అయిన నేపథ్యంలో వారి ఖాతాలను ఫ్రీజ్ చేసేందుకు పోలీసులు సిద్ధమైనట్లు తెలుస్తోంది. కొంతమంది ఏజెంట్లు ఆ కేసుతో తమకు సంబంధం లేదని న్యాయస్థానంలో క్యాష్ పిటిషన్ దాఖలు చేశారు. అవి గురువారం విచారణకు రానున్నాయి.

✦✦ ఆదిత్య చేతిలో మోసపోయిన బాధితులు సుమారు 1500 మంది ఉన్నప్పటికీ ఇప్పటివరకు సుమారు 100 మంది మాత్రమే ఫిర్యాదు చేశారు. చాలామంది నల్లధనం పెట్టడంతో పాటు కేసు పెట్టినా ఉపయోగం లేదని ఆలోచనలో ఉన్నారు. ఆదిత్య బయటకు వచ్చిన తర్వాత తేల్చుకుంటామని కొంతమంది బాధితులు ఎదురుచూస్తున్నారు.

(c) eenadu



ఆ ఒత్తిడి వద్దంటున్నారు..!

కొందరు ఉద్యోగులకు ఉదయం తొమ్మిదికి మొదలైన పని... రాత్రి తొమ్మిదైనా పూర్తవదు. ఇంటికి వెళ్లాక కూడా దానిమీదే ధ్యాసంతా. అత్యవసరమైతే వేళకాని వేళల్లోనూ పనిచేయాల్సిందే. దీన్నే హసిల్ కల్చర్ అంటారు. ఇదంతా పాతతరం వాళ్ల సంగతి. 'మాకిదంతా వద్దు దేనికైనా హద్దులు ముఖ్యం లేదంటే ఎంత మంచి ఉద్యోగం అయినా మేం రాజీనామా చేయడానికి వెనకాడం' అంటున్నారు జెన్‌జీ యువ. దీన్నే 'సే నో టు హసిల్ కల్చర్'గా సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారు. రోజంతా పని వెనక పడి జీవితానికి, కుటుంబ సభ్యులకు దూరమై... ఓ యాభై ఏళ్లు వచ్చాక అయ్యో జీవితంలో చాలా మిస్ అయ్యామే అని బాధపడే బదులు... ఇప్పుడే స్వీయ సంరక్షణ, ఆత్మ పరిశీలన... ప్రతి సెకనునీ ఆస్వాదించా, ఆనందంగా అనుభవించడం ముఖ్యం అంటున్నారు జెన్‌జీ అమ్మాయిలు. హార్డ్ వర్క్ మంచిదే... కానీ ప్రతిదానికీ హద్దులు ఉండటమూ ముఖ్యం. అలా ఉంటేనే మానసిక, శారీరక ఆరోగ్యం సమతుల్యంగా ఉంటుంది అంటూ హసిల్ కల్చర్‌కు నో చెబుతున్నారట. ఇందుకు భిన్నంగా పరిస్థితులు ఉంటే లక్షల జీతం ఇచ్చే ఉద్యోగం అయినా తమకు వద్దు అంటున్నారని ఇటీవల చేసిన కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి.



బంగారం - వెండి
2న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,00,260	91,050	1,09,601
విజయవాడ	97,350	90,650	1,08,700
ప్రొద్దుటూరు	97,500	89,750	1,07,000
రాజమహేంద్రవరం	98,890	90,650	1,20,000
విశాఖపట్నం	98,540	90,650	1,12,000
తమిళనాడు	-----	90,650	1,20,000

కొత్తగా కెరియర్‌లో అడుగుపెడుతున్న అమ్మాయిలు పెద్ద కలలు కనాలి. లేని గ్లాస్ సీలింగ్‌లు ఊహించుకోవద్దు. ఒకవేళ నిజంగా ఉంటే వాటిని బద్దలుగొట్టడానికీ వెనకాడొద్దు. ఈ క్రమంలోనే లక్ష్యాల్ని చెప్పినప్పుడు మిమ్మల్ని నిరుత్సాహపరిచే వాళ్ల అభిప్రాయం సరికాదని నిరూపించడమూ మర్చిపోవద్దు.

- నైనాలాల్ కిద్వాయ్, ఛైర్‌పర్సన్, హెచ్‌ఎస్‌బీసీ ఇండియా





మోకాళ్ల మీద కూర్చోండి...

మోకాళ్ల మీద కూర్చుని దేవుడికి నమస్కరించడం చాలా సంప్రదాయాల్లో కనిపిస్తుంది. ఇది మహిళల మానసిక, శారీరక ప్రశాంతతకు మేలుచేస్తుంది అంటున్నారు నిపుణులు. రోజుకి 10-15 నిమిషాలు మోకాళ్ల మీద కూర్చోవడం వల్ల... వెన్ను సమస్యల నుంచి బయటపడొచ్చట. అంతేకాదు, దీనివల్ల జీర్ణవ్యవస్థ పనితీరూ బాగుంటుందట. మూలాల్లోకి రక్తప్రసరణ బాగా జరుగుతుంది. అంతేనా... మోకాలు, చీలమండలు, తుంటి వంటి భాగాల్లో కండరాలు సరైన ఆకృతికి చేరుకుంటాయి. పొత్తికడుపు సమస్యలు దూరమై, పెల్విక్ మజిల్స్‌కి శక్తి చేకూరుతుంది అంటున్నాయి కొన్ని అధ్యయనాలు. ఇది మానసిక సమస్యలకూ మేలు చేస్తుందట. ఆందోళన తగ్గి, ఒత్తిడి దూరమవుతుంది అంటున్నారు మానసిక నిపుణులు. బీపీ ఉన్నవాళ్లు రోజులో కనీసం 20 నిమిషాలు మోకాళ్ల మీద కూర్చుంటే... రక్తప్రసరణలోని హెచ్చుతగ్గులు నియంత్రణలోకి వస్తాయట. కాళ్ల వాపులు ఉన్నవాళ్లు ఇలాచేయడం వల్ల... రక్తం శరీరమంతటా సమంగా ప్రసరించి... వాపులు తగ్గుతాయి. కీళ్లు కూడా ఆరోగ్యంగా ఉంటాయట.

వసుంధర

vasundhara@eenadu.in

టెక్ రంగంలో నాయకత్వ హోదాల్లో కనిపించే మహిళలు తక్కువ. తెలుగు వారు ఇంకా అరుదు. అలాంటి చోట తనదైన ప్రతిభ చాటుతున్నారు వల్లి బొల్లవరం. ఈమె ప్రస్తుతం 'స్విస్ రి సొల్యూషన్స్'కు చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్. హైదరాబాద్ నుంచే సంస్థ గ్లోబల్ బృందాన్ని నడిపిస్తున్నారు. తన ప్రయాణం గురించి 'వసుంధర'కు వివరిస్తున్నారిలా...



వల్లి

పదేళ్లుగా ఏఐతో!

అమెరికాలో మాస్టర్స్ కోసం ప్రయత్నించగా అలబామా యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్‌లో సీటు, స్కాలర్‌షిప్ వచ్చాయి. 1993 ఆగస్టులో అమెరికాలో అడుగుపెట్టా. వెళ్లిన 15 రోజులకే తీవ్ర జ్వరం. కొద్దిరోజులు స్పృహలో లేను. వివర చూపులకు వచ్చే పరిస్థితి లేక నాన్నకు చెప్పారట. ఆయన వచ్చేసరికి తేరుకున్నా. నన్ను చూడాలని అమ్మ పట్టుబట్టడంతో నాన్నతో తిరిగొచ్చా. కొద్ది రోజులకే ఎం.ఎస్. పూర్తిచేయడానికి వెళ్లానంటే అద్భుతం అని చెప్పలేదు. నా జీవితానికి టర్నింగ్ పాయింట్ అదే.

అప్పుడే మల్టీ టాస్కింగ్...

నాన్న వెంకట మురళీధరరావు, అమ్మ శ్రీవాణి దేవి... హైదరాబాద్‌లోని అటామిక్ ఎనర్జీ సెంట్రల్ స్కూల్లో టీచర్లు. తమ్ముడూ, నేను ఇంటర్ వరకూ అక్కడే చదివాం. క్లాస్ టాపర్లలో ఒకరిగా ఉండేదాన్ని. ఉదయాన్నే ట్యూషన్, అక్కడి నుంచి వచ్చి ఇంటి పనుల్లో అమ్మకు సాయం చేయడం, ఆపైన స్కూల్. సాయంత్రం కాసేపు ఆటలు, కర్ణాటక సంగీతంలో క్లాసులు... చిన్నప్పుడే మల్టీ టాస్కింగ్ అలవాటైంది. ఈసెట్‌లో టాప్ ర్యాంకర్‌ని. ఎస్వీ యూనివర్సిటీలో బీటెక్ చేశా. అమెరికాలో యూనివర్సిటీలో క్లాసులు సాయంత్రం ఉండేవి. ఉదయపూట పార్ట్ టైమ్ జాబ్‌లు చేసేదాన్ని. 11 నుంచి మా ప్రొఫెసర్‌కి రిసర్చ్ అసిస్టెంట్‌గా ఉండేదాన్ని. మాస్టర్స్ అయ్యాక 1996లో ఇండియా వచ్చి పెళ్లి చేసుకుని తిరిగి వెళ్లా. మావారు రాజశేఖర్. జీఈలో పనిచేస్తూ రాసేటప్పుడే పరిచయం. నేనక్కడ హాస్పిటలైజ్ అయినప్పుడు తనే చూసుకున్నారు. ఆ స్నేహం పెళ్లికి దారితీసింది. 'నీ వెనక నేనున్నా, ఎంత దూరం పరిగెత్తగలవో పరిగెత్తు' అంటూ ప్రోత్సహిస్తారు. బిలియా సంస్థలో టెక్ కన్సల్టెంట్‌గా కెరియర్ ప్రారంభించి తర్వాత ఐటీ రంగానికి మారాను. బిజినెస్‌లోనూ అనుభవం కోసం రిస్క్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌గా పనిచేశా.

అమెరికా వదిలి వచ్చేశా!

అమెరికాలో 20 ఏళ్లున్నాక... భారతీయ జీవన విధానానికి దూరం కావడం లోటుగా అనిపించింది. 2012లో ఇండియా తిరిగొచ్చి ఇక్కడే సంస్థలో చేరా. మంచి అవకాశాల కోసం సంస్థలు మారుతూ వచ్చా. మైక్రోసాఫ్ట్‌లో ప్రిన్సిపల్ గ్రూప్ మేనేజర్‌గా చేస్తుండగా 'స్వాప్ ఏఐ'లో భారతీయ విభాగానికి నాయకత్వం వహించే అవకాశం వచ్చింది. 100 మంది సిబ్బంది ఉంటే ఆ సంఖ్యను 1200కి చేర్చాను. పైచదువులకు పిల్లలు అమెరికా వెళ్లారు. వాళ్లతోపాటు ఉండాలని కొన్నాళ్లు బ్రేక్ తీసుకున్నా. తిరిగొచ్చి కెరియర్‌ని కొనసాగించా. ప్రస్తుతం 'స్విస్ రి సొల్యూషన్స్' గ్లోబల్ విభాగానికి సీటీఓగా ఉన్నా. రీ ఇన్సూరెన్స్ విభాగంలో ఉన్న మా సంస్థ తరఫున ఐటీ ఉత్పత్తులు తెస్తాం. ఎలాంటి లోపాలూ లేకుండా ఉత్పత్తిని తేవాల్సి ఉంటుంది. ముఖ్యంగా భద్రత పరంగా జాగ్రత్తలు చూసుకోవాలి. ఏఐ వల్ల సాంకేతికంలో మార్పులెన్నో! గత దశాబ్దకాలంలో ఏఐ రంగంలో వస్తోన్న కొత్త అంశాలు నేర్చుకుంటూ వస్తున్నా. ఇష్టమైనవి నేర్చుకుంటూ బుర్రని పదును పెడితే ఇష్టమైనవే వచ్చేస్తాయి. అందుకే హరితక నేర్చుకుంటున్నా. జూనియర్స్ నుంచి ఎన్నో విషయాలు తెలుసుకుంటా. ఏఐ విప్లవం నేపథ్యంలో ఉద్యోగ భద్రత ఉండాలంటే విశ్లేషణ, కస్టమర్ జర్నీమీద ఫోకస్ చేసే నైపుణ్యాలు ఉండాలి. మార్కెటింగ్‌తోపాటు కోడింగ్‌నీ నేర్చుకోవాలి. ఏఐ అంశాలపైనా పట్టు సాధిస్తే ఏ సిస్టమ్‌ని మేనేజ్ చేసే ఉద్యోగావకాశాలు అపారం. నైపుణ్యాలు నేర్చుకుని మనదైన ప్రత్యేకతను చాటుకోవడమే దీనికి పరిష్కారం.

పదేళ్లలో మార్పు చూడాలి

మాకు కవలలు. అమ్మ అనస్థీషియాలో మాస్టర్స్, అనన్య బయోటెక్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ చేస్తున్నారు. స్టెమ్‌లో ప్రవేశిస్తున్న అమ్మాయిలు ఎక్కువే. అయితే పిరమిడ్‌లో పైస్థాయికి వెళ్లలేకపోతున్నారు. వీళ్లకి భావవ్యక్తీకరణ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం తదితర అంశాల్లో శిక్షణ అవసరం. పరిశ్రమ వర్గాలూ దీనిపైన దృష్టి పెట్టాలి. పెళ్లి తర్వాత మానేసే వారని, మెటర్నిటీ కోసం వెళ్లారని... అవకాశాలు ఇవ్వడానికి కంపెనీలు సందేహిస్తాయి. అవి తాత్కాలికమైన అంశాలని చెబుతూ వస్తున్నా. అమ్మాయిల్లోనూ మార్పు రావాలి. నెట్‌వర్క్ పెంచుకుని, 'నేను చేయగలను, చేయగలుగుతాను' అనుకోవాలి. పదేళ్లలో ఇలాంటి మార్పు చూడాలనేది నా ఆశ, ఆశయం.

ఆమె కుంచె పడితే క్రూరమృగాలు సైతం ప్రేమమూర్తులుగా దర్శనమిస్తాయి. నగిషీలు చెక్కకుండా.. ఉలి పట్టకుండానే బండరాళ్లు... భారీ కొండలు జంతువుల రూపాలుగా మారిపోతున్నాయి. ఈ సృష్టి అంతా... యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన నామోజు లావణ్యది. ఆమె కథ ఏంటో తెలుసుకునే ప్రయత్నం చేయగా...



రాళ్లపై చిత్ర 'లావణ్యం'



మాది యాదాద్రి భువనగిరి. నాన్న సురేందర్ సైన్‌బోర్డు ఆర్టిస్టుగా పనిచేసేవారు. అమ్మ అన్నపూర్ణ గృహిణి. నాకో తమ్ముడు శివ. కొవిడ్ దశలోకి అడుగుపెట్టేవరకూ ఉన్నంతలో హాయిగా గడిపేవాళ్లం. అయితే, కరోనా మా జీవితాల్ని తలకిందులు చేసింది. ముఖ్యంగా నాన్న మరణంతో ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడ్డాం. దాంతో బతుకుతెరువు కోసం నేను చిత్రకళను ఎంచుకున్నా. అలాగని నేనెక్కడా ప్రత్యేకంగా శిక్షణ తీసుకోలేదు. చిన్నప్పటి నుంచీ నాన్న బొమ్మలు గీస్తుంటే గమనించిన అనుభవంతోనే అయిదో ఏట నుంచే కుంచె పట్టుకున్నా. అలాగని చదువునీ నిర్లక్ష్యం చేయలేదు. కామర్స్‌లో డిగ్రీ పూర్తిచేశా. మార్షల్ ఆర్ట్స్‌లోనూ శిక్షణ తీసుకున్నా. 'అందరూ బీటెక్, ఎంటెక్‌లు చేస్తూ... లక్షల ప్యాకేజీలు తీసుకుంటుంటే... నువ్వు బొమ్మలు గీసుకుంటూ ఇలానే ఉండిపోతావా' అంటూ చాలామంది నిరుత్సాహపరిచారు. 'బండరాళ్లపై బొమ్మలు వేస్తే ఏం ప్రయోజనం? పెళ్లి చేసి పంపించేయండి' అని ఇంట్లోవాళ్లనూ మాటలతో బాధపెట్టేవారు. కానీ, నేనవి పట్టించుకోలేదు. కుటుంబ సభ్యులూ అండగా నిలిచారు.

ఒంటి చేత్తోనే అద్భుతాలు...

సుద్దముక్కతో మార్కింగ్ కూడా లేకుండానే నేను బొమ్మలేయగలను. ఇటీవలే యాదగిరిగుట్టలోని అరణ్య భవన్‌లో భారీ కొండలు, బండరాళ్లపై పులి, ఏనుగు, సింహం, ఎలుగుబంటి, ఖడ్గమృగం, రామచిలుక... వంటి పశుపక్ష్యాదుల్ని చిత్రీకరించా. వీటిని చూసిన భువనగిరి జిల్లా అటవీశాఖ అధికారిణి మెచ్చుకున్నారు. 'వైల్డ్‌లైఫ్' అనే అంశంపై మరిన్ని జంతువుల పెయింటింగ్స్ వేసే అవకాశం ఇచ్చారు. అదయ్యాక స్వర్ణగిరి ఆలయంలోని పద్మనాభస్వామి మూర్తిని లైవ్ బోర్డుపై చిత్రీకరించా. దాన్ని గుడికే కానుకగా ఇచ్చా. ఈ పెయిటింగ్స్ ఇన్‌స్టాలో వైరల్ అయ్యాయి. ఆపై ఖైరతాబాద్ గణేష్, వేయి స్తంభాల గుడి, భద్రాద్రి రామాలయం, చార్మినార్ వంటివీ చిత్రీకరించా. భవిష్యత్తులో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రయాణిస్తా. అక్కడి ప్రముఖ ఆలయాల్లోని దేవతామూర్తులు, స్థానిక వన్యప్రాణుల చిత్రాలు గీసి మన ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలనూ, అటవీ సంపదనూ కాపాడాలనే సందేశాన్ని వ్యాప్తి చేయాలనుకుంటున్నా. ఈ కళను విస్తరించేందుకు చిన్నారులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నా. నిజానికి ఈ రంగంలో మహిళలు తక్కువ. కానీ, ప్రస్తుతం నా పనికి వస్తోన్న ఆదరణతో ఈ రంగంలో మరింత ముందుకి వెళ్లాలనే ఉత్సాహాన్నిస్తోంది.

- మిరియాల గణేష్ కుమార్, నల్గొండ

సీ-సెక్షన్ అయ్యింది... బరువు తగ్గాలి!

నాకు 31ఏళ్లు. బరువు 70 కేజీలు. సిజేరియన్ అయ్యింది. బరువు తగ్గాలనుకుంటున్నా. ఎలాంటి డైట్ పాటించాలి?

- అరుణా రెడ్డి, హైదరాబాద్



డియర్ వసుంధర

డాక్టర్ లతాశశి
పోషకాహార నిపుణులు

సీ-సెక్షన్ డెలివరీ తర్వాత అన్ని ఆహారపదార్థాలను సమానంగా తీసుకున్నప్పుడు మాత్రమే హీలింగ్ ప్రక్రియ తొందరగా జరుగుతుంది. ఈ సమయంలో మీరు బిడ్డకు పాలు ఇవ్వాల్సి ఉంటుంది. అందుకే తినే ఆహారంలో కాల్షియం ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. తక్కువ మొత్తంలో మూడు గంటలకోసారి ఆహారాన్ని తీసుకుంటే బిడ్డకు పాలు సరిపడా ఉంటాయి. మీకూ శక్తి లభిస్తుంది. ముఖ్యంగా సీ-సెక్షన్ అయినవారిలో ఆర్డర్ ఆఫ్ డైటింగ్ తప్పనిసరి. అంటే ద్రవాలతో మొదలుపెట్టి సాఫ్ట్ డైట్ పాటించాల్సి ఉంటుంది. తర్వాత నెమ్మదిగా అందరూ తినే ఆహారాన్ని తినొచ్చు. దాంతోపాటు పాలు, పాల ఉత్పత్తులు.. పెరుగు, మజ్జిగ వంటివి 500 మి.లీ తక్కువ కాకుండా తాగాలి. వీటికోసం ఫ్యాట్ తక్కువగా ఉండే వాటిని ఎంచుకుంటే మంచిది. ఇంకా ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలకి మధ్యలో పండ్లు, గింజలు, ఓట్స్, రాగిజావ వంటివాటిని చిరుతిళ్లుగా చేర్చుకుంటే మేలు. కాల్షియం, ప్రొటీన్ ఎక్కువ ఉండే ఆకుకూరలను క్రమం తప్పక తినాలి. రోజూ రెండు రకాల సీజనల్ పండ్లను తీసుకోవాలి. ఈ డైట్ పాటిస్తున్నప్పుడు డెలివరీ సమయంలో పెరిగిన బరువు కంటే బేబీకి పాలిస్తున్నప్పుడు మొదటి ఆరునెలలూ బరువు పెరగకుండా జాగ్రత్త పడాలి. ఇందుకు రోజూ ఓ గంట వ్యాయామం చేయాలి. ఈ నియమాలతో పాటు కాఫీ, టీలను మితంగా తాగాలి. అంతేకాదు, రిఫైన్డ్ ఆయిల్స్, వనస్పతి, ఉప్పు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. చక్కెర, కొవ్వులు ఉండే ఆహారాన్ని పూర్తిగా నివారించాలి.

యూరిక్ యాసిడ్ ఎక్కువైంది!

నా వయసు 40ఏళ్లు. ఈమధ్య కీళ్లనొప్పులు మొదలయ్యాయి. కాళ్లు, చేతులు బాగా నొప్పులు వస్తున్నాయి. పరీక్ష చేయిస్తే యూరిక్ యాసిడ్ ఎక్కువయిందని చెప్పారు. పోషకాహారంతో దీన్ని తగ్గించుకోవచ్చా?

- ఓ సోదరి, ఖమ్మం

మన శరీరం సహజంగా విసర్జించే వ్యర్థ పదార్థాల్లో యూరిక్ యాసిడ్ ఒకటి. మనం తినే ఆహారంలో ప్యూరిన్ ఎక్కువ అవ్వడం వల్ల యూరిక్ యాసిడ్ ఏర్పడుతుంది. అయితే విసర్జన సరిగా జరగకపోతే యూరిక్ ఆమ్లాలు రక్తంలో కలిసిపోతాయి. క్రమంగా స్ఫటికాలుగా మారి కీళ్లు, కీళ్ల చుట్టూ ఉండే కణజాలాల్లో పేరుకుపోతాయి. దీన్నే గౌట్ లేదా హైపర్ యూరిసెమియా అని కూడా పిలుస్తారు. అయితే, జీవనశైలిలో మార్పులు, ఆహార నియమాలు పాటిస్తే ఈ సమస్య తీవ్రతరం కాకుండా జాగ్రత్త పడొచ్చు. దీన్ని అదుపులో ఉంచేందుకు తక్కువ ప్యూరిన్ ఉండే తృణధాన్యాలు, మొక్కల ఆధారిత ఆహార పదార్థాల్ని డైట్‌లో భాగం చేసుకోవాలి. రోజుకి రెండు కప్పుల ఓట్‌మీల్‌ని పండ్లతో కలిపి తీసుకుంటే మేలు. శరీరంలో నీటి స్థాయులను పెంచుకోవడానికి సీజనల్ ఫ్రూట్స్‌ని ఎక్కువగా తినాలి. కాయగూరల్లో గుమ్మడి, బ్రాకలీని ఉడికించి నిమ్మరసం కలిపి తీసుకోవాలి. నిమ్మరసం యూరిక్ ఆమ్లాన్ని తగ్గిస్తుంది. వారానికి 75గ్రా. చేపను మాత్రమే తినాలి. క్రీమ్ తక్కువ ఉండే పాలు, పెరుగు క్రమం తప్పకుండా తీసుకోవాలి. ప్రొటీన్ ఎక్కువ ఉండే రెడ్ మీట్, సీఫుడ్‌ని చాలా తక్కువగా తీసుకోవాలి. టీ, కాఫీలతో పాటు చక్కెర ఎక్కువగా ఉండే ఆహారాలకు దూరంగా ఉండాలి. ప్రాసెస్డ్, ప్యాకేజ్డ్ ఆహారాన్ని మానేయాలి. పండ్లు తినడం అలవాటు చేసుకోవాలి. రోజుకి రెండుమూడు లీటర్ల నీళ్లు తప్పనిసరి. దీనివల్ల యూరిక్ ఆమ్లాలతోపాటు ఇతర వ్యర్థాలూ బయటకు పోతాయి. వీటితోపాటు వంటలో నూనెను మితంగా వాడాలి. ఈ డైట్‌ను పాటిస్తూ శారీరక శ్రమ చేస్తే ఫలితం ఉంటుంది.

మీకు తెలుసా?



అన్నామణి... భారతీయ భౌతిక, వాతావరణ శాస్త్రవేత్త. ఓజోన్ స్థాయులను కొలవటానికి 'ఓజోన్‌సోండే' అనే పరికరాన్ని అభివృద్ధి చేశారీమె. ఫస్ట్ ఇండియన్ మేడ్ ఓజోన్‌సోండే పరికరం ఇదే. హానికర యూవీ రేడియేషన్ నుంచి భూమిని కాపాడటంలో ఓజోన్ పొర ప్రాముఖ్యతను తెలుసుకోవటానికి ఇది ఉపయోగపడింది. 'ది వెదర్ ఉమెన్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచారీమె.



నిద్రను దాచుకుందాం!

స్లీప్ బ్యాంకింగ్... అంటే భవిష్యత్ అవసరాలకోసం నిద్రను దాచుకోవడం అన్నమాట. ఇదేదో బాగుందే అనుకుంటున్నారా! అవును మరి, భవిష్యత్తులో వచ్చే నిద్రలేమి గురించి ముందుగానే నిద్రను ఆదా చేయడం. మనకి పని లేనప్పుడు ఎక్కువసేపు నిద్రపోయి, పని ఉన్నప్పుడు తక్కువసేపు నిద్రపోవడాన్నే స్లీప్ బ్యాంకింగ్ అంటారు. ఈ అదనపు నిద్ర... పని ఎక్కువైనప్పుడు శరీరం అలసిపోకుండా చేస్తుందంటున్నారు నిపుణులు.

దిల్లీలోని ఓ ప్రముఖ సంస్థ దీనిపై ఓ సర్వే నిర్వహించింది. అందులో భాగంగా కొంత మంది వారంలో రోజుకి పదిగంటలు నిద్రపోయారట. తర్వాత మూడుగంటలు మాత్రమే నిద్రపోయి పనిచేయాల్సి వచ్చింది. అయితే 7గంటలు మామూలుగా నిద్రపోయిన వాళ్లతో పోలిస్తే ఈ మూడు గంటలు నిద్రపోయినవాళ్ల పనితీరే మెరుగ్గా ఉందట. అందుకే ఫలానా రోజు ఎక్కువ పని ఉంటుంది. లేదా ఏదైనా అర్ధరాత్రి పెళ్లికి హాజరవ్వాలి అనుకున్నప్పుడు అందుకు 3-7 రోజుల ముందు నుంచీ రోజుకి 2-3 గంటలు ఎక్కువ సేపు నిద్రపోవాలి. అందునా పసిపిల్లల తల్లులు వీలయినప్పుడల్లా ఓ కునుకు తీస్తే మేలట. నిద్రించే ముందు కెఫీన్ ఉండే ఆహారాలకి, డిజిటల్ గ్యాడ్జెట్లకి దూరంగా ఉండాలంటున్నారు నిపుణులు. అప్పుడే మెరుగైన ఫలితాలు ఉంటాయని చెబుతున్నారు.

వాళ్లతో మాట్లాడటమే కష్టం..!

ఇంట్లోనే ఒక వైపు దుకాణం... మరో వైపు బ్యాంకు... పిల్లలే ఖాతాదార్లు, వినియోగదార్లు. ఉద్యోగులు కూడా వాళ్లే... ఏం చేస్తున్నారబ్బా అని ఆసక్తిగా చూస్తే కానీ తెలియదు. అది మాక్ బ్యాంక్, షాప్ అని. దీనిద్వారా గిరిజన పిల్లలకి ఆంగ్లం నేర్పుతోంది శ్రీజితా దాస్... ఈమె ఎవరంటే?





సుందర్‌గఢ్ జిల్లాలోని ఖుంట్‌గావ్ గ్రామంలోని గిరిజనులకు సంతాలీ, కోయ, ముండారి భాష తప్ప మరొకటి రాదు. తరాలుగా అక్కడి వారిది ఇదే పరిస్థితి. కాస్తోకూస్తో చదువుకున్న వాళ్లేమో ఒడియా తప్ప ఇంకేం మాట్లాడరు. ఒకవేళ ఆసక్తి ఉండి నేర్చుకోవాలి అనుకున్నా... రవాణా వసతులు లేక ఇంటికే పరిమితమయ్యారు అక్కడి పిల్లలు. ఈ ఇబ్బందులన్నీ దాటుకుని ఏడోతరగతి వరకూ వచ్చిన వాళ్లకి ఏబీసీడీలు కూడా రాకపోవడం గమనించారు శ్రీజితా దాస్. ఈమె కెమిస్ట్రీలో మాస్టర్స్, బీఈడీ చేశారు. 2017 నుంచీ అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ కోసం పనిచేసేవారు. కానీ అది పట్టణాలకే పరిమితమై ఉండటం గమనించి, దాని అనుసంధానంగా పనిచేస్తోన్న కొరూ సంస్థ గురించి తెలుసుకున్నారు. ఇది గిరిజన విద్యార్థుల కోసం స్థానికంగా నడుపుతోన్న స్వచ్ఛంద సంస్థ. కొరూలోనే వాలంటీర్‌గా ఆరేళ్ల నుంచీ సేవలందిస్తున్నారీమె. ముండా, భూయాన్, ఎస్సీ, ఎస్టీ తెగలకు ఒడియాతో పాటు ఆంగ్లం కూడా నేర్పుతున్నారు. 'మారుమూల ప్రాంతాలు కావడం వల్ల నిరుద్యోగం, పేదరికం ఎక్కువ. అక్షరాస్యత రేటు కూడా తక్కువే. ఈ కొండగుట్టల్లోంచి బయటికి వెళ్లి పనిచేసే వాళ్లకి తప్ప మిగతా వారెవరికీ స్థానిక భాష మినహా మరేదీ రాదు. మొదట్లో వాళ్లతో సైగల్లోనే ఏం కావాలో చెప్పాల్సి వచ్చింది. క్రమేణా అక్కడ భాష తెలిసిన వాళ్లని టీచర్లుగా నియమించాం' అంటారు శ్రీజిత.

పరిస్థితులే పాఠాలుగా...

అప్పటికే స్థానిక భాషలు వాళ్లకి అలవాటై ఉంటాయి. కాబట్టి మరోది మనం చెప్పినా అంత ఇష్టంగా నేర్చుకోరు. అదే సవాల్ అయింది శ్రీజితకి. ఇందుకోసం ఆమె కమ్యూనిటీ లర్నింగ్ విధానాన్ని ఎంపిక చేసుకుంది. తాను నేర్పాలనుకున్న అంశాల్ని పాఠాలుగా కాకుండా... ఆటలుగా చెప్పడం ప్రారంభించింది. చిన్న గదిలోనే ఓ వైపు దుకాణం... ఓ వైపు బ్యాంకు... వంటి వాటిని సెట్‌లను వేసి... పిల్లల్ని రెండు భాగాలుగా విభజించింది. దుకాణాలు, బ్యాంకులకు వెళ్లి తమకు కావాల్సింది ఎలా అడగాలో ఆమె ఆంగ్లంలో చెబితే... స్థానిక టీచర్లు ఒడియా, వారి ప్రాంతీయ భాషల్లో వివరిస్తారు. పిల్లలు దాన్ని ఇంగ్లిష్‌లో అడిగేలా... అవతలి వాళ్లు ఆంగ్లంలోనే చెప్పేలా చూస్తుంది. గ్రామర్, ఫొనెటిక్స్ కూడా టేబుళ్లు గీసి ఆటల్లానే చెబుతుంది. ఇది ఈ రెండు గ్రామాలకే పరిమితం కాకుండా... గిరిజన తెగలన్నీ అందిపుచ్చుకుని, బయటి ప్రపంచంలో రాణించాలన్నదే ఆమె ఆశ. దాన్ని సాధించడమే లక్ష్యంగా సాగిపోతుంది.

తెల్లటి పూలు... రంగుల సీతాకోక చిలుకలు!

గుత్తుల్లో, సన్నటి గొట్టాల్లో విరిసే ధవళ వర్ణపు పూలు... హాయినిచ్చే పరిమళం... ఈ పగటి మల్లె ప్రత్యేకం. మరి దీన్ని ఇంటి ముందు పెంచుకోవాలంటే మాత్రం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.







పగటి మల్లె శాస్త్రీయనామం సెస్ట్రం డైర్నమ్.. ఇది సోలనేసి కుటుంబానికి చెందిన పూల మొక్క. దీని జన్మస్థలం వెస్టిండీస్ అయినా... దీనికి ఉన్న ప్రత్యేక లక్షణాల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందింది. దీనికి డే జాస్మిన్, దిన్ కా రాజా, వైల్డ్ జాస్మిన్, చైనీస్ బెర్రీ, వైట్ చాక్లెట్ ప్లాంట్... ఇలా చాలా పేర్లు ఉన్నాయి. ఇది వేగంగా, గుబురుగా పెరిగే మొక్క. దీని ఆకులు ముదురు ఆకుపచ్చ రంగులో మృదువుగా ఉంటాయి. తెలుపు వర్ణంలో విరిసే ఈ పూలు పగటిపూట సువాసనని విడుదల చేస్తాయి. ఈ మొక్కలు సుమారు 5-19 అడుగుల ఎత్తు వరకు పెరుగుతాయి. పూర్తి ఎండతోపాటు పాక్షిక నీడలోనూ కుదురుకోగలవు. అయితే కనీసం రోజుకి 4-6 గంటల సూర్యకాంతి అవసరం. అలానే క్రమం తప్పకుండా నీళ్లు పోయాలి.

కత్తిరిస్తే కొత్తపూలు..

ఈ డే జాస్మిన్‌ని సారవంతమైన పొడి నేలల్లో నాటుకోవాలి. కుండీలో పెంచాలనుకుంటే కంపోస్ట్ కలిపిన మిశ్రమాన్ని ఎంచుకోవాలి. ఎండ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఇవి బాగా పెరుగుతాయి. ప్రతి 3-4వారాలకు ఒకసారి 10-10-10 నిష్పత్తిలో ఎన్‌పీకే సమగ్ర ఎరువును అందించాలి. అలానే ఎప్పటికప్పుడు కత్తిరించాలి. దీనివల్ల కొత్త పూలు బాగా వస్తాయి. సాధారణంగా ఈ మొక్కల్ని తెల్లదోమ, స్పైడర్ మైట్స్ ఎక్కువగా ఇబ్బంది పెడతాయి. సబ్బు నీళ్ల పిచికారి చేయడం ద్వారా వాటిని దూరం చేయొచ్చు. విత్తనాలతో కొత్త మొక్కలను ఉత్పత్తి చేయొచ్చు. ఈ పూలు తేనెటీగలు, సీతాకోకచిలుకలు వంటి పరాగ సంపర్క కీటకాలను ఆకర్షిస్తాయి. తోటకు సహజ సౌందర్యాన్ని జోడిస్తాయి.

(c) eenadu

సామాన్యుల్లో అసామాన్యురాలు!



ఇంటర్నెట్ డెస్క్: జపాన్ యువరాణి కకో అకిషినో సామాన్యులతో కలిసి విమాన ప్రయాణం సాగించిన వీడియో వైరల్‌గా మారడంతో ఆమె నిరాడంబరతపై ప్రశంసల వర్షం కురుస్తోంది. కకో తాజాగా బ్రెజిల్ పర్యటనకు వెళ్లారు. రెండు దేశాల మధ్య దౌత్య బంధానికి 130 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి ఆ దేశానికి పయనమయ్యారు. జపాన్ చక్రవర్తి నరుహితోకు మేనకోడలు అయిన కకో సాధారణ ప్రయాణికురాల్లా ఎకానమీ క్లాసులో వెళ్లారు. విమానం ఎక్కిన కాసేపటికే అలసటతో కిటికీని ఆనుకొని ఆమె కునుకు తీశారు. తోటి ప్రయాణికొకరు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టగా క్షణాల్లో వైరల్‌గా మారింది. కకో నిరాడంబరతపై ప్రశంసలు కురుస్తున్నా.. యువరాణి పర్యటన వీడియో లీక్ కావడంపై భద్రతా సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేశారు.

80వ పుట్టినరోజున స్కైడైవ్!



చండీగఢ్: సంకల్పం బలంగా ఉంటే వయసు అడ్డు కాదని నిరూపించారు డాక్టర్ శ్రద్ధా చౌహాన్. ఆమె తన 80వ పుట్టినరోజున స్కై డైవింగు చేసి అందరినీ అబ్బురపరిచారు. మాజీ బ్రిగేడియర్ సౌరభ్‌సింగ్ శెఖావత్ మాతృమూర్తి ఈమె. సర్వైకల్ స్పాండిలైటిస్, స్పైనల్ డిస్క్ సమస్యలతో బాధపడుతున్నారు. అయినప్పటికీ.. చిన్నప్పటి నుంచీ వెంటాడిన ఆకాశంలో పక్షిలా ఎగరాలనే తన కలను 80వ ఏట ఆమె నిజం చేసుకున్నారు. హరియాణాలోని నార్నౌల్ వైమానికతలంలో దాదాపు 10 వేల అడుగుల పైనుంచి ఈ స్కైడైవ్ చేశారు. అమ్మతో కలిసి ఈ సాహసం చేయడం ఎంతో ఆనందంగా ఉందని శెఖావత్ తెలిపారు. భారత్‌లో అత్యంత పెద్ద వయసులో స్కై డైవింగు చేసిన వ్యక్తిగా శ్రద్ధా చౌహాన్ చరిత్ర సృష్టించగా.. ఈ వీడియోను 'స్కైహై ఇండియా' తన అధికారిక ఇన్‌స్టాలో షేర్ చేసింది.

భోపాల్‌లో సైగల రెస్టారెంటు



ఈటీవీ భారత్: మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని ఓ రెస్టారెంటులో చేతి సైగలతోనే సిబ్బంది వందకు పైగా వెజ్, నాన్ వెజ్, మాక్‌టెయిల్స్ వెరైటీల్లో వినియోగదారులు కోరుకున్నది క్షణాల్లో ముందుంచుతారు. ఈ నిశ్శబ్ద రెస్టారెంటు పేరు 'ఎకోస్' అయినా.. అక్కడ ప్రతిధ్వనించేది చక్కటి సంగీతం మాత్రమే. టేబులుపై ఉన్న ఫుడ్ మెనూ డైరీని చూసి.. అవసరమైన భోజనాల కోడ్‌లు, ఎన్ని ప్లేట్లు కావాలనేది కస్టమర్లు పెన్నుతో రాస్తారు. సిబ్బంది వాటిని ఇట్టే వడ్డిస్తారు. ఇంతకీ ఎందుకీ సైగలు అనుకొంటున్నారా?.. ఇక్కడ పనిచేసేవారంతా మూగవారు, చెవిటివారు. "దివ్యాంగులకు ఉపాధిని కల్పించాలనే సంకల్పంతోనే ఈ రెస్టారెంటు పెట్టాం. వీరంతా దిల్లీలో ప్రత్యేక శిక్షణ తీసుకొని వచ్చారు" అని 'ఎకోస్' నిర్వాహకుడు శివాంశ్ కన్వర్ తెలిపారు.

హసీనాకు ఆరు నెలల జైలు శిక్ష

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆరు నెలల జైలు శిక్ష పడింది. కోర్టు ధిక్కరణ కేసులో బంగ్లాదేశ్‌లోని అంతర్జాతీయ నేర ట్రైబ్యునల్(ఐసీటీ) ఆమెను దోషిగా తేల్చింది. ఇదే కేసులో అవామీలీగ్ విద్యార్థి నేత షకీల్ అఖండ్ బుల్‌బుల్‌కు రెండు నెలల శిక్ష విధించింది. జస్టిస్ మహ్మద్ గోలం మోర్తజా మొజుందర్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం బుధవారం ఈ తీర్పును వెలువరించింది. గతేడాది ప్రధాని పదవిని కోల్పోయి, దేశం వీడిన షేక్ హసీనా భారత్‌లో తలదాచుకుంటున్న విషయం తెలిసిందే. ఆ సమయంలో షకీల్‌తో హసీనా ఫోను సంభాషణ లీక్ అవడంతో ఐసీటీ విచారణ చేపట్టింది. దీని ప్రకారం..."నాకు వ్యతిరేకంగా 227 కేసులు నమోదయ్యాయి. అంటే 227 మందిని అంతం చేసే హక్కు నాకు ఉంది" అని హసీనా అన్నట్లు ఆ ఆడియోలో ఉంది. దీనిపై విచారణ జరిపిన ఐసీటీ... "ఆమె వ్యాఖ్యలు సాక్షుల్లో భయాన్ని సృష్టించిందని తాము నమ్ముతున్నాం" అని పేర్కొంది.



మీ పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే..

'మా పిల్లల శ్రేయస్సు కోసం ఏం చేసేందుకైనా మేం సిద్ధమే' అని చాలామంది చెబుతుంటారు. కానీ అలాంటివారిలో అత్యధికులు- తరచూ అనారోగ్యకర ఆహారం తీసుకుంటుంటారు. అధిక బరువుతో బాధపడుతుంటారు. ఎప్పుడూ నీరసంగా కనిపిస్తుంటారు. ఔషధాలపై ఆధారపడి జీవిస్తుంటారు. పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే వారికి ప్రధానంగా కావాల్సింది- ఆరోగ్యవంతులైన, శక్తిమంతులైన తల్లిదండ్రులు. కాబట్టి తల్లిదండ్రులు ముందుగా తమ ఆరోగ్యంపై దృష్టిపెట్టాలి. పిల్లలకు వారు చేసే అతిపెద్ద మేలు అదే.

– ఎలీ జరోగ్, వైద్యుడు

శాంతియుత ప్రపంచమే భారత్ ఆకాంక్ష: మోదీ

- ప్రధాని వారం రోజుల విదేశీ పర్యటన ప్రారంభం
- ఘనా రాజధాని అక్రాలో ఘన స్వాగతం



అక్రా విమానాశ్రయంలో ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న ఘనా అధ్యక్షుడు జాన్ డ్రమానీ మహమ

దిల్లీ: బ్రెజిల్‌లో ఈ నెల 6, 7 తేదీల్లో జరగనున్న 17వ 'బ్రిక్స్' శిఖరాగ్ర సదస్సుపై భారత ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. శాంతియుతమైన బహుళ ధ్రువ ప్రపంచాన్ని భారత్ ఆకాంక్షిస్తోందని ఆయన స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాల మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే లక్ష్యానికి కట్టుబడి ఉంటామన్నారు. వ్యవస్థాపక దేశం హోదాలో ఆ కూటమి బలోపేతానికి అన్ని చర్యలను చేపడతామని మోదీ వెల్లడించారు. ఈ సదస్సు సందర్భంగా రియో డి జనీరోలో వివిధ దేశాల ప్రభుత్వాధినేతలతో ద్వైపాక్షిక అంశాలపై చర్చిస్తానన్నారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డసిల్వాతో జరిగే సమావేశంలో వర్ధమాన దేశాల బలోపేతంపై ముఖ్య చర్చ జరుగుతుందన్నారు. ప్రధాని మోదీ ఐదు దేశాల పర్యటన కోసం బుధవారం ఉదయం దిల్లీ నుంచి బయల్దేరారు. తొలుత ఘనా రాజధాని అక్రా చేరుకున్న భారత ప్రధానికి అరుదైన స్వాగతం లభించింది. ఘనా అధ్యక్షుడు జాన్ డ్రమానీ మహమ స్వయంగా విమానాశ్రయానికి వచ్చి మోదీని ఆత్మీయంగా స్వాగతించడం విశేషం. గత మూడు దశాబ్దాల్లో భారత ప్రధాని ఒకరు ఘనాను సందర్శించడం ఇదే ప్రథమం. ఘనా అధ్యక్షుడు జాన్ డ్రమానీ మహమతో ప్రధాని భేటీ అనంతరం రెండు దేశాల మధ్య నాలుగు ఒప్పందాలు కుదిరాయి. ఉభయ దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని విస్తృత స్థాయి భాగస్వామ్యంగా మార్చాలని నిర్ణయించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. మోదీ ఇక్కడి నుంచి గురువారం ట్రినిడాడ్ అండ్ టొబాగోకు వెళ్తారు. ఆ తర్వాత అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా దేశాల్లోనూ పర్యటించనున్నారు.

రష్యాతో వ్యాపారం చేస్తే 500 శాతం సుంకం

- భారత్‌ను హెచ్చరించిన అమెరికా

ఇంటర్నెట్ డెస్క్: రష్యాతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తే భారత్, చైనాలపై 500 శాతం సుంకం విధిస్తామని అమెరికా హెచ్చరించింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతుతో యూఎస్ సెనెట్‌లో దీనిపై బిల్లు తెస్తామని వెల్లడించింది. రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తూ, ఉక్రెయిన్‌కు సాయం చేయని దేశాల ఉత్పత్తులపై 500 శాతం సుంకం విధిస్తామని ప్రకటించారు. ఆ దేశం నుంచి చమురును భారత్, చైనాలు 70 శాతం కొనుగోలు చేస్తున్నాయని లిండ్సే తెలిపారు. ఆగస్టులో బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉందని, ఈ బిల్లుపై ట్రంప్ కూడా ఆమోదం తెలిపారని వెల్లడించారు. ఈ బిల్లు అమల్లోకి వస్తే రష్యా నుంచి పెద్దమొత్తంలో ముడి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఫలితంగా మన ఔషధాలు, వస్త్రాలు వంటి ఎగుమతులపై ప్రభావం చూపుతుంది. ఇక, ఉక్రెయిన్‌కు మద్దతు ఇచ్చే దేశాల కోసం లిండ్సే మరో ఒప్పందాన్ని ప్రతిపాదించనున్నట్లు సమాచారం.

కాల్పుల విరమణకు అంగీకరించండి

హమాస్‌కు ట్రంప్ ప్రతిపాదన

కైరో: గాజాలో 60 రోజుల పాటు కాల్పుల విరమణకు అవసరమైన షరతులకు ఇజ్రాయెల్ అంగీకరించిందని, దీనికి హమాస్ కూడా ఒప్పుకోవాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రతిపాదన కార్యరూపం దాల్చే సూచనలు కనిపించడం లేదు. ట్రంప్ ప్రతిపాదనపై ఇజ్రాయెల్, హమాస్‌లు తమ తమ పాత వైఖరులనే పునరుద్ఘాటిస్తూ పరస్పరం భిన్నంగా ప్రతిస్పందించాయి. కాల్పుల విరమణ ఒప్పందానికి సిద్ధమేనని తెలిపిన హమాస్...గాజాపై యుద్ధాన్ని శాశ్వతంగా ఇజ్రాయెల్ ముగిస్తామంటేనే సంధి చేసుకుంటామని స్పష్టం చేసింది. గాజా భూభాగాల నుంచి ఇజ్రాయెల్ సైన్యం పూర్తిగా వెనక్కు వెళితే దానికి బదులుగా మిగిలిన 50 మంది బందీలను విడుదల చేస్తామని తీవ్రవాద సంస్థ ప్రతినిధి తాహెర్ అల్-నును తెలిపారు. యుద్ధాన్ని ముగిస్తామంటే చర్చలకు సిద్ధమేనని వెల్లడించారు. అయితే, ఆయుధాలు అప్పగించి హమాస్ లొంగిపోవాలని, పాలస్తీనాను వీడి వెళ్లిపోవటానికి అంగీకరిస్తేనే 60 రోజుల కాల్పుల విరమణకు అంగీకరిస్తామని ఇజ్రాయెల్ తెలిపింది. యుద్ధానంతరం గాజాలో హమాస్ కనిపించడానికి వీల్లేదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పష్టంచేశారు.



ఐఏఈఏకు ఇక సహకరించం: ఇరాన్

దుబాయ్: తమ దేశంలో చేపట్టే అణు కార్యక్రమాలను తనిఖీలు చేయకుండా అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) ద్వారాలను ఇరాన్ మూసివేసింది. ఆ సంస్థకు ఇక సహకరించకూడదని పార్లమెంటు చేసిన బిల్లుకు ఇరాన్ దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ బుధవారం ఆమోదముద్ర వేశారు. తమ అణు స్థావరాలపై అమెరికా వైమానిక దాడుల నేపథ్యంలో ఇరాన్ ఈ నిర్ణయం తీసుకుంది. కాగా వియన్నాకు చెందిన ఐఏఈఏ చాలా కాలంగా ఇరాన్ అణు కార్యక్రమాలను పర్యవేక్షిస్తోంది. తాజా ప్రకటనపై ఐఏఈఏ స్పందించలేదు.

నా వారసత్వం కొనసాగుతుంది

- భవిష్యత్తు ఆధ్యాత్మిక గురువును ట్రస్టు మాత్రమే గుర్తిస్తుంది
- దలైలామా ప్రకటన



ధర్మశాల: తదుపరి దలైలామా ఎవరన్న ఊహాగానాలకు టిబెట్ ఆధ్యాత్మిక గురువు లామా టెంజిన్ గ్యాట్సో(14వ దలైలామా) తెరదించారు. తన మరణానంతరం దలైలామా వారసత్వం కొనసాగుతుందని ప్రకటించారు. భవిష్యత్తు గురువును (పునర్జన్మ పొందిన బాలుడిని) గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్టు మాత్రమే గుర్తిస్తుందని, మరెవరికీ ఈ విషయంలో జోక్యం చేసుకునే అధికారం లేదని పరోక్షంగా చైనాకు తేల్చిచెప్పారు. మరో మూడు రోజుల్లో ఆయన 90వ ఏట అడుగుపెట్టనుండటంతో హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాల సుగ్లాగ్‌ఖాంగ్ ఆలయంలో జన్మదిన వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తనకు కచ్చితంగా వారసుడు ఉంటాడని దలైలామా ఓ వీడియో సందేశంలో టిబెటన్లకు హామీ ఇచ్చారు. 1950లో టిబెట్‌ను చైనా ఆక్రమించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత నుంచి భారత్‌లోని ధర్మశాలలో దలైలామా ఆశ్రయం పొందుతున్నారు. టిబెట్‌ను గుప్పిట పెట్టుకోవడానికి తమ చెప్పుచేతల్లో ఉండే దలైలామాను వారసుడిగా ఎంపిక చేయాలని బీజింగ్ ఎప్పటినుంచో ఉబలాటపడుతోంది. చైనా ఎత్తుగడలను గమనించిన దలైలామా వారసుడిని ఎంపిక చేసే ప్రక్రియ తమదేనని తేల్చిచెప్పారు. దీనిపై స్పందించిన చైనా... దలైలామా వారసత్వ ప్రణాళికను తిరస్కరించింది. తర్వాతి దలైలామాను చైనా ప్రభుత్వ ఆమోదం ద్వారానే గుర్తిస్తామని వెల్లడించింది.

16 ఏళ్ల బాలుడిపై ఉపాధ్యాయురాలి లైంగిక దాడి

- పోక్సో కేసులో అరెస్టు

ముంబయి: మహారాష్ట్రలోని ముంబయిలో 16 ఏళ్ల విద్యార్థి ఒకరిని ఖరీదైన హోటళ్లకు తిప్పుతూ ఓ ఉపాధ్యాయురాలు (40) పదేపదే లైంగిక వేధింపులకు గురి చేసింది. పాఠశాలలో పరీక్షలు పూర్తయి ఆ విద్యార్థి వెళ్లిపోయినా లైంగిక వేధింపులను ఆపలేదు. చివరకు ఈ విషయాన్ని గుర్తించిన బాధితుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గత వారం ఆమెను పోక్సో కేసు పెట్టి అరెస్టు చేశారు. బుధవారం ఈ వివరాలను పోలీసులు వెల్లడించారు. ముంబయిలోని ఓ ప్రముఖ పాఠశాలలో నిందితురాలు ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. 2023 డిసెంబరులో పాఠశాలలో జరిగిన వార్షిక వేడుకల్లో విద్యార్థితో ఆమెకు పరిచయం ఏర్పడింది. వివాహం జరిగిన విషయం పక్కనపెట్టి అతడిని ఆకర్షించేందుకు ఆమె అనేక ప్రయత్నాలు చేసింది. ఆ తరువాత ఉపాధ్యాయురాలు ఖరీదైన హోటళ్లకు అతడిని తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడేది. బాలుడి ప్రవర్తనలో మార్పును గమనించిన తల్లిదండ్రులు అసలు విషయాన్ని తెలుసుకున్నారు. అయితే పదో తరగతి కొద్ది రోజుల్లోనే పూర్తి కావొస్తుండటంతో ఫిర్యాదు చేయకుండా ఆగిపోయారు. ఇంట్లో పని చేసే సిబ్బందితో మరోసారి విద్యార్థి కోసం ఆమె కబురు పంపడంతో చివరకు తల్లిదండ్రులు తమకు ఫిర్యాదు చేశారని పోలీసులు బుధవారం తెలిపారు. నిందితురాలి స్నేహితుడిపైనా కేసు నమోదైంది.

21 నుంచి నెల రోజులు కొనసాగనున్న పార్లమెంటు సమావేశాలు

దిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జులై 21న మొదలై ఆగస్టు 21 దాకా కొనసాగుతాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు బుధవారం వెల్లడించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించినట్లు తెలిపారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దిన వేడుకలు ఉన్నందున 13, 14 తేదీల్లో సమావేశాలు జరగబోవని మంత్రి 'ఎక్స్' ద్వారా ప్రకటించారు. ఇంతకు ముందు అనుకొన్న షెడ్యూలు ప్రకారం ఆగస్టు 12నే సమావేశాలు ముగియాల్సి ఉండగా, తాజా నిర్ణయంతో 21 వరకు కొనసాగనున్నాయి.

పార్లమెంటు వద్ద భద్రతా ఉల్లంఘన కేసు.. ఇద్దరు నిందితులకు బెయిల్



దిల్లీ: పార్లమెంటు వద్ద భద్రతా ఉల్లంఘన కేసులో నిందితులుగా ఉన్న నీలమ్ ఆజాద్, మహేశ్ కుమావత్‌లకు బుధవారం దిల్లీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. నిందితులు రూ.50,000 చొప్పున బెయిల్ బాండ్, పూచీకత్తులను సమర్పించాలని ఆదేశించింది. బెయిల్ షరతుల్లో భాగంగా నిందితులు దిల్లీ విడిచి వెళ్లకూడదని, ఈ కేసుకు సంబంధించి ఎటువంటి ఇంటర్వ్యూలు, బహిరంగ ప్రకటనలు చేయవద్దని న్యాయస్థానం పేర్కొంది. పార్లమెంటు శీతాకాల సమావేశాల సందర్భంగా 2023 డిసెంబరు 13న లోక్‌సభలోకి దుండగులు ప్రవేశించి ఎంపీల పైకి రంగు చల్లి గందరగోళం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి నీలమ్ ఆజాద్, మనోరంజన్, సాగర్‌శర్మ, లలిత్ ఝా, అమోల్ శిందే, మహేశ్ కుమావత్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తాజాగా ఈ కేసులో నీలమ్, మహేశ్ కుమావత్‌లకు బెయిల్ మంజూరైంది.

జిన్‌పింగ్ బ్రెజిల్ ఎందుకు వెళ్లడం లేదు?

- నాయకత్వం మార్పునకు సంకేతమా!
- తదుపరి దేశాధినేత వాంగ్ యాంగ్?

బీజింగ్: బ్రెజిల్‌లో ఈ వారం చివరిలో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరుకావడం లేదు. ఆ దేశ ప్రధాని లీ కియాంగ్ ఈ సదస్సుకు వెళ్తారని డ్రాగన్ అధికారికంగా వెల్లడించింది. జిన్‌పింగ్ అధికారం చేపట్టిన 12 ఏళ్లలో బ్రిక్స్ సదస్సుకు దూరంగా ఉండడం ఇదే తొలిసారి. చైనా అధ్యక్షుడు ఇటీవల కొంత కాలం అదృశ్యమయ్యారన్న వార్తల వేళ ఈ కీలక ప్రకటన వెలువడింది. బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో ఈ నెల 6 నుంచి 7 వరకు జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు భారత ప్రధాని మోదీ కూడా హాజరుకానున్నారు. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాలతో ఏర్పడిన ఈ కూటమిలో ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈలు ఆ తర్వాత చేరిన సంగతి తెలిసిందే. రష్యాలోని కజాన్‌లో గతేడాది జరిగిన బ్రిక్స్ సదస్సులో భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లు భేటీ అయ్యారు. ఇరుదేశాల మధ్య సరిహద్దు వివాదం నెలకొన్న ఆ సమయంలో రెండు దేశాల నేతలు సమావేశం కావడం అప్పట్లో ప్రాధాన్యం సంతరించుకుంది. అంతేకాకుండా పలు ద్వైపాక్షిక అంశాలపైనా ఓ అంగీకారానికి రావడంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు కాస్త మెరుగుపడ్డాయి. తాజాగా ఇదే సదస్సుకు జిన్‌పింగ్ దూరమవుతున్నారు.



జిన్‌పింగ్ శకం ముగియనుందా?

ఆధునిక చైనాకు పునాదులు వేసిన మావో జెడాంగ్ తర్వాత, అంతటి శక్తివంతమైన నేతగా గుర్తింపు పొందిన షి జిన్‌పింగ్ శకం త్వరలో ముగియనుందా? జిన్‌పింగ్ స్థానంలో మరో నేతను ఎన్నుకునేందుకు చైనా కమ్యూనిస్టు పార్టీ సన్నాహాలు మొదలు పెట్టిందా? మే 21 నుంచి జూన్ 5 వరకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కనిపించకుండా పోవడానికి కారణమేమిటి? ఎప్పుడూలేని విధంగా బ్రిక్స్ సదస్సుకు గైర్హాజరుకావాలనే నిర్ణయం దేనికి సంకేతం? వయోభారంతో జిన్‌పింగ్‌ను తప్పించనున్నారా? అధ్యక్షుడి మార్పునకు ఇది సంకేతమంటూ కొన్ని నిఘా సంస్థలు అంచనా వేస్తున్నాయి. సంస్కరణాభిలాషి, టెక్నోక్రాట్ అయిన వాంగ్ యాంగ్ తదుపరి అధ్యక్షుడు కావొచ్చంటూ ఊహాగానాలు వస్తున్నాయి. అయితే, జిన్‌పింగ్ ఇలా అదృశ్యం కావడం సాధారణమేనని, సమయం వస్తే అధినేతలనైనా చైనా కమ్యూనిస్టు పార్టీ పక్కనబెట్టడం రివాజేనని నిఘా సంస్థలు పేర్కొన్నాయి. జిన్‌పింగ్ బ్రెజిల్ ఎందుకు వెళ్లడంలేదని విలేకరులు బుధవారం బీజింగ్‌లో చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్‌ను ప్రశ్నించగా ఆమె సమాధానాన్ని దాటవేశారు.

రాహుల్‌పై పరువునష్టం కేసు.. విచారణ 14కు వాయిదా

సుల్తాన్‌పుర్(యూపీ): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై దాఖలైన పరువునష్టం కేసులో విచారణ ఈనెల 14కు వాయిదా పడింది. 2018 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై రాహుల్ గాంధీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ భాజపా నాయకుడు విజయ్ మిశ్ర ఈ దావా వేసిన సంగతి తెలిసిందే. సాక్షి ఒకరు కోర్టుకు హాజరు కానందున విచారణ వాయిదా వేయాల్సిందిగా పిటిషనర్ తరఫు న్యాయవాది కోరడంతో ఉత్తర్‌ప్రదేశ్‌లోని సుల్తాన్‌పుర్ ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు విచారణను వాయిదా వేసింది.

పహల్గాం దాడి బాధ్యులను శిక్షించాలి

- క్వాడ్ దేశాల పిలుపు

వాషింగ్టన్: పహల్గాం ఉగ్రదాడికి పాల్పడినవారిని, ప్రోద్బలం అందించినవారిని, ఆర్థిక సాయం చేసిన వారిని సత్వరం శిక్షించాలని క్వాడ్ దేశాల కూటమి పిలుపునిచ్చింది. ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలు ఇందుకు సహకారం అందించాలని కోరింది. ఈ కూటమిలో భాగస్వాములైన భారత్, ఆస్ట్రేలియా, జపాన్, అమెరికా దేశాల విదేశాంగ మంత్రులు మంగళవారం సమావేశమై ఈ సంవత్సరం భారత్‌లో జరగనున్న కూటమి వార్షిక శిఖరాగ్ర సదస్సుపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం దాడిని క్వాడ్ తీవ్రంగా ఖండించడంతోపాటు సరిహద్దుకు ఆవలి నుంచి వస్తున్న ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చింది. అయితే దీనిపై క్వాడ్ విడుదల చేసిన సంయుక్త ప్రకటన పాకిస్థాన్ పేరును గానీ, భారత పాకిస్థాన్‌ల మధ్య జరిగిన నాలుగురోజుల యుద్ధం గురించి గానీ ప్రస్తావించలేదు. విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఆస్ట్రేలియా మంత్రి పెన్నీ వాంగ్, జపాన్ మంత్రి తకేషి ఇయావాలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. "ఉగ్రదాడిలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేయడంతోపాటు గాయపడిన వారు త్వరలో పూర్తిగా కోలుకోవాలని ఆశిస్తున్నాం" అని సంయుక్త ప్రకటనలో విదేశాంగ మంత్రులు పేర్కొన్నారు. తూర్పు, దక్షిణ చైనా సముద్ర ప్రాంతాల్లో చైనా బలప్రదర్శనపై క్వాడ్ విదేశాంగ మంత్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "ఆ ప్రాంతంలో యథాతథ స్థితిని బల ప్రయోగం ద్వారా మార్చేందుకు జరిగే ఎలాంటి చర్యకైనా మేం వ్యతిరేకం" అని పేర్కొన్నారు.



క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశం సందర్భంగా అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో జైశంకర్

ఖనిజ రంగంలో క్వాడ్ సహకారం

ఖనిజ రంగంలో చైనా దౌర్జన్యాలపై, ఖనిజ ధరలపై దాని ఉడుం పట్టును క్వాడ్ కూటమి వ్యతిరేకిస్తోంది. ఈ రంగంలో చైనా ప్రమేయంపై ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో క్వాడ్ దేశాల కూటమి కీలక ఖనిజాలు క్వాడ్ సభ్యులందరికీ అందుబాటులోకి వచ్చి ఆయా దేశాల ఆర్థిక భద్రత బలోపేతమయ్యే దిశగా చర్యలు చేపట్టింది. నాలుగు దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

అమెరికా మంత్రులతో జైశంకర్ భేటీ

విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ బుధవారం అమెరికా ఇంధన మంత్రి క్రిస్ రైట్, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్‌లతో భేటీ అయ్యారు. ఇంధన రంగంలో మరింత లోతైన ద్వైపాక్షిక భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలపై అమెరికా ఇంధన మంత్రితో చర్చించారు. అమెరికా విదేశాంగ మంత్రి రూబియోతోపాటు రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్‌తో కూడా చర్చలు జరిపారు. భారత్‌కు అందించాల్సిన ప్రధాన ఆయుధాల అమ్మకాన్ని త్వరలో పూర్తి చేస్తామని అమెరికా రక్షణ మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.



పశ్చిమబెంగాల్‌లోని నదియా జిల్లా మాయాపుర్ ఇస్కాన్ దేవాలయంలో బుధవారం జగన్నాథుడికి సమర్పించిన 56 రకాల నైవేద్యాలు

అమెరికాలో ఇద్దరు చైనా జాతీయుల గూఢచర్యం!

వాషింగ్టన్: అమెరికాలో గూఢచర్యానికి పాల్పడుతున్న ఇద్దరు చైనా జాతీయులపై శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఫెడరల్‌కోర్టులో కేసు నమోదైంది. యూఎస్ నౌకాదళ ఛాయాచిత్రాలు తీయడంతో పాటు అనేక ఇతర అభియోగాలను నిందితులు ఎదుర్కొంటున్నారు.

బీరు తాగుతూ వాదనలు వినిపించిన న్యాయవాది

- గుజరాత్ హైకోర్టులో వర్చువల్ విచారణ వేళ ఘటన
- సుమోటోగా కేసు స్వీకరించిన ధర్మాసనం

అహ్మదాబాద్: బీరు తాగుతూ క్లయింట్ తరఫున వర్చువల్‌గా వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాదిపై గుజరాత్ హైకోర్టు చర్యలకు ఉపక్రమించింది. జూన్ 26న న్యాయమూర్తి జస్టిస్ సందీప్ భట్ ధర్మాసనం ఓ కేసులో విచారణ జరుపుతుండగా పిటిషనర్ తరఫున న్యాయవాది భాస్కర్ తన్నా వర్చువల్‌గా హాజరయ్యారు. చేతిలో మగ్గుతో బీరు సేవిస్తూనే ధర్మాసనానికి ఆయన వాదనలు వినిపించారు. దీనికి సంబంధించిన ఓ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆయన ప్రవర్తనను కోర్టు ధిక్కరణగా భావించి సుమోటోగా స్వీకరిస్తున్నట్లు గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎ.ఎస్.సుపేహియా, జస్టిస్ ఆర్.టి.వచ్ఛానీల ధర్మాసనం తాజాగా ప్రకటించింది. భాస్కర్‌కు ఉన్న సీనియర్ న్యాయవాది హోదాను పునఃపరిశీలిస్తామని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇక నుంచి తమ ఎదుట వర్చువల్‌గా వాదనలు వినిపించడానికి కుదరదని తెలిపింది. రెండు వారాల తర్వాత ఈ కేసులో వాదనలు వింటామని, ఆలోగా భాస్కర్ శైలిపై సమగ్ర నివేదికను సిద్ధంచేసి సమర్పించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. దీనితోపాటు వర్చువల్ విచారణ వేళ అభ్యంతరకర ప్రవర్తనపై భాస్కర్‌ను హైకోర్టు వివరణ కోరింది. వారం క్రితం మరో వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. అందులో ఓ వ్యక్తి టాయిలెట్ సీటుపై కూర్చొని గుజరాత్ హైకోర్టు ఎదుట వర్చువల్ విచారణకు హాజరయ్యాడు.

సైనికుడి మృతదేహ చిత్రంపై తలవాల్చి కిమ్ భావోద్వేగం

ఇంటర్నెట్ డెస్క్: రష్యా తరఫున యుద్ధంలో మరణించిన తమ సైనికుడి మృతదేహ చిత్రాన్ని చూసి ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ భావోద్వేగానికి గురయ్యారు. ఇటీవల రష్యా- ఉత్తర కొరియా మధ్య జరిగిన సైనిక ఒప్పందానికి ఏడాది పూర్తయిన సందర్భంగా తూర్పు ప్యాంగ్‌యాంగ్‌లోని గ్రాండ్ థియేటర్‌లో ఓ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఉత్తర కొరియా, రష్యా కళాకారులు పాల్గొన్నారు. యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన కొందరు ఉత్తర కొరియా సైనికుల చిత్రాలను ఈ కార్యక్రమంలో ప్రదర్శించారు. కిమ్ జోంగ్ ఉన్ వాటిపై చేతులు ఉంచి బాధాతప్త హృదయంతో నివాళులర్పిస్తున్న దృశ్యాలను ప్రభుత్వం విడుదల చేసింది. తన కుమార్తెతో కలిసి ఉన్న కిమ్ భావోద్వేగానికి గురైనట్లు వాటిలో కనిపించింది.

విమానంలో సాంకేతిక లోపం

36వేల అడుగుల నుంచి అకస్మాత్తుగా కిందకు..

ఇంటర్నెట్ డెస్క్: విమానాల్లో వరుసగా తలెత్తుతున్న సాంకేతిక లోపాలు ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. జూన్ 30న చైనాలోని షాంఘై నుంచి జపాన్ రాజధాని టోక్యోకు బయలు దేరిన జపాన్ ఎయిర్‌లైన్స్ విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో అకస్మాత్తుగా 36వేల అడుగుల ఎత్తు నుంచి 10,500 అడుగుల కిందికు దిగింది. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఈ ఘటన సమయంలో విమానంలో సిబ్బంది, ప్రయాణికులు సహా మొత్తం 191 మంది ఉన్నట్లు సమాచారం. చివరకు విమానాన్ని సురక్షితంగా దింపడంతో ప్రయాణికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆస్ట్రేలియా విమానంలో పాము కలకలం

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ విమానాశ్రయంలో మంగళవారం పాము కలకలం సృష్టించింది. దీంతో మెల్‌బోర్న్ నుంచి బ్రిస్బేన్‌కు వెళ్లాల్సిన వర్జిన్ ఆస్ట్రేలియా విమానం రెండు గంటలు ఆలస్యంగా బయల్దేరాల్సి వచ్చింది. ప్రయాణికులు విమానంలోకి వెళ్లే సమయంలో పామును గుర్తించారు. వెంటనే పాములు పట్టుకొనే వ్యక్తిని రంగంలోకి దింపారు. అరగంట శ్రమించి అతను పామును పట్టుకున్నారు. 60సెం.మీ (2 అడుగుల)పొడవు ఉన్న దీనిని.. చెట్లమీద ఉండే పసిరికపాముగా గుర్తించారు.



రక్షణ బంధ విస్తరణకు పదేళ్ల ఫ్రేమ్‌వర్క్

భారత్, అమెరికా అంగీకారం

దిల్లీ: భారత్, అమెరికా మధ్య రక్షణ బంధంతోపాటు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు పదేళ్ల ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాలని రెండు దేశాలు నిర్ణయించాయి. మంగళవారం రెండు దేశాల రక్షణ మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, పీట్ హెగ్సెత్‌ల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలో ఈ నిర్ణయం జరిగింది. దీనిపై బుధవారం పెంటగాన్ ఒక ప్రకటన విడుదల చేసింది. 'తదుపరి తమ మధ్య జరిగే సమావేశంలో రక్షణ బంధ విస్తరణకు సంబంధించిన పదేళ్ల ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించేందుకు ఒప్పందం కుదుర్చుకోవాలని హెగ్సెత్, రాజ్‌నాథ్ నిర్ణయించారు. భారత్‌కు అమెరికా విక్రయించనున్న ఆయుధాల అంశమూ ప్రస్తావనకు వచ్చింది. రక్షణ పరిశ్రమల మధ్య సహకారంపైనా చర్చించారు. దక్షిణాసియాలో భారత్‌ను అమెరికా తన వ్యూహాత్మక భాగస్వామిగా పరిగణిస్తోంది' అని పెంటగాన్ వెల్లడించింది. తేజస్ యుద్ధ విమానాల్లో వినియోగించే జీఈ ఎఫ్404 ఇంజిన్లను త్వరగా అందజేయాలని హెగ్సెత్‌కు రాజ్‌నాథ్ విజ్ఞప్తి చేశారు.

(c) eenadu

తొలి రోజు.. మనదే మళ్లీ

శుభ్‌మన్ సూపర్ సెంచరీ

- మెరిసిన జైస్వాల్
- రెండో టెస్టులో భారత్ 310/5



తొలి రోజు అదరహో.. నాలుగు రోజులు మనదే ఆధిపత్యం.. అయినా చివరి రోజు బౌలర్ల వైఫల్యంతో తొలి టెస్టును చేజార్చుకుంది టీమ్ఇండియా. గెలవాల్సిన, కనీసం డ్రా చేసుకోవాల్సిన మ్యాచ్‌లో ఓడడం జట్టుకు పెద్ద షాక్. మరి సిరీస్‌లో వెనుకబడ్డ స్థితిలో రెండో టెస్టును ఎలా ఆరంభిస్తారో అనుకుంటే.. శుభ్‌మన్‌సేన మరోసారి బ్యాటుతో రాణించింది. కెప్టెన్ ముందుండి నడిపించడంతో తొలి రోజు 310/5తో మెరుగైన స్కోరుకు బాటలు వేసుకుంది. సారథి అయ్యాక వరుసగా రెండో మ్యాచ్‌లోనూ శుభ్‌మన్ సెంచరీ సాధించగా.. యశస్వి జైస్వాల్ శతక సమాన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు.

7 శుభ్‌మన్ టెస్టు శతకాల సంఖ్య. అతడికిది 34వ టెస్టు. కెప్టెన్ అయ్యాక వరుసగా రెండో మ్యాచ్‌లోనూ అతను సెంచరీ చేశాడు.

బర్మింగ్‌హామ్

ఇంగ్లాండ్‌తో అయిదు టెస్టుల సిరీస్ తొలి మ్యాచ్‌లో అనూహ్య ఓటమి ఎదురైనప్పటికీ.. అది టీమ్ఇండియా ఆత్మవిశ్వాసాన్నేమీ దెబ్బ తీయలేదు. ఎనిమిది టెస్టులాడి ఒక్క విజయమూ సాధించని వేదిక అయినా.. యువ భారత్ కంగారు పడలేదు. రెండో టెస్టులో టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా.. తొలి రోజు ఆట చివరికి 5 వికెట్లకు 310 పరుగులు చేసింది. కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (114 బ్యాటింగ్; 216 బంతుల్లో 12×4) సిరీస్‌లో రెండో శతకంతో అజేయంగా నిలిచాడు. యశస్వి జైస్వాల్ (87; 107 బంతుల్లో 13×4) చక్కటి ఇన్నింగ్స్ ఆడాడు. గిల్‌కు తోడుగా రవీంద్ర జడేజా (41 బ్యాటింగ్; 67 బంతుల్లో 5×4) క్రీజులో ఉన్నాడు. ఈ జోడీ అభేద్యమైన ఆరో వికెట్‌కు 99 పరుగులు జోడించింది. ఇంగ్లిష్ బౌలర్లలో క్రిస్ వోక్స్ (2/59) సత్తా చాటాడు.

ఆరంభంలో.. ఆఖర్లో..: మళ్లీ ఇంగ్లాండ్‌దే టాస్.. భారత్‌కే బ్యాటింగ్! కానీ తొలి టెస్టులో మాదిరి ఈసారి భారత ఓపెనర్లు దూకుడు ప్రదర్శించలేకపోయారు. మొదటి టెస్టు ఓటమి తాలూకు ప్రభావం వల్ల కావచ్చు, పరిస్థితులు పేసర్లకు అనుకూలంగా ఉండడం వల్ల కావచ్చు జైస్వాల్, రాహుల్ ఉదయం ఆచితూచి బ్యాటింగ్ చేశారు. లీడ్స్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయిన సీనియర్ పేసర్ వోక్స్.. తన సొంత మైదానం ఎడ్జ్‌బాస్టన్‌లో మాత్రం ప్రమాదకరంగా కనిపించాడు. దీంతో భారత ఓపెనర్లు జాగ్రత్తగా ఆడాల్సి వచ్చింది. అయినా సరే.. వికెట్ ఆగలేదు. 9వ ఓవర్లో వోక్స్ బంతిని వికెట్ల మీదికి ఆడుకుని రాహుల్ (2) వెనుదిరిగాడు. తొలి గంటలో పెద్దగా పరుగులే రాలేదు. కానీ తర్వాత పరిస్థితి మారింది. అప్పటికే క్రీజులో కుదురుకున్న జైస్వాల్, కరుణ్ నాయర్ (31; 50 బంతుల్లో 5×4) స్ట్రోక్‌ప్లేను బయటికి తీశారు. ఇద్దరూ చక్కటి షాట్లు ఆడడంతో స్కోరు బోర్డు వేగం పుంజుకుంది. తొలి 11 ఓవర్లలో 21 పరుగులే చేసిన భారత్.. తర్వాతి 11 ఓవర్లలో 70 పరుగులు రాబట్టడం విశేషం. కాసేపట్లో లంచ్ అనగా.. భారత్ 95/1తో నిలిచింది. కానీ అంతలోనే కరుణ్ నాయర్ ఔటైపోయాడు. కార్స్ ఒంటి మీదికి సంధించిన బంతిని కాచుకోబోయిన అతను స్లిప్‌లో దొరికిపోయాడు. విరామానికి స్కోరు 98/2. తొలి సెషన్ ఆరంభంలో, చివర్లో తడబడ్డ భారత్.. మధ్యలో ఆధిపత్యం చలాయించింది.


జైస్వాల్ 87

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) జేమీ స్మిత్ (బి) స్టోక్స్ 87; రాహుల్ (బి) వోక్స్ 2; కరుణ్ నాయర్ (సి) బ్రూక్ (బి) కార్స్ 31; శుభ్‌మన్ బ్యాటింగ్ 114; పంత్ (సి) క్రాలీ (బి) బషీర్ 25; నితీశ్ (బి) వోక్స్ 1; జడేజా బ్యాటింగ్ 41; ఎక్స్‌ట్రాలు 9 **మొత్తం:** (85 ఓవర్లలో 5 వికెట్లకు) **310; వికెట్ల పతనం:** 1-15, 2-95, 3-161, 4-208, 5-211; **బౌలింగ్:** వోక్స్ 21-6-59-2; కార్స్ 16-2-49-1; టంగ్ 13-0-66-0; స్టోక్స్ 15-0-58-1; బషీర్ 19-0-65-1; రూట్ 1-0-8-0

నిలిచిన కెప్టెన్: లంచ్ తర్వాత భారత్‌దే పూర్తి ఆధిపత్యం. రెండో సెషన్లో భారత్ ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 84 పరుగులు చేసింది. ఆ వికెట్ కూడా యశస్వి చేజేతులా సమర్పించుకున్నదే. శతకం సాధించేలా కనిపించిన అతను.. ఆఫ్ స్టంప్‌కు దూరంగా వెళ్తున్న స్టోక్స్ బంతిని వెంటాడి మరీ వికెట్ కీపర్‌కు దొరికిపోయాడు. ఆ వికెట్ పడడానికి ముందు ఇంగ్లాండ్‌కు అసహనం తప్పలేదు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ శుభ్‌మన్.. దుర్భేద్యమైన డిఫెన్స్‌తో ఇంగ్లిష్ బౌలర్లను పరీక్షించాడు. మరో ఎండ్‌లో యశస్వి మెరుపు షాట్లు ఆడుతూ స్కోరు వేగం పడిపోకుండా చూసుకున్నాడు. తొలి 33 బంతుల్లో 8 పరుగులే చేసిన శుభ్‌మన్.. తర్వాత కొంచెం వేగం పెంచాడు. రెండుసార్లు ఔటయ్యే ప్రమాదం తప్పించుకున్న జైస్వాల్.. మైదానం నలుమూలలా షాట్లు ఆడాడు. ముఖ్యంగా ఆఫ్ సైడ్ అతనాడిన కట్ షాట్లు హైలైట్. సెంచరీ దిశగా సాగుతున్న జైస్వాల్‌ను ఔట్ చేసి కెప్టెన్ స్టోక్స్ ఇంగ్లాండ్‌కు ఉపశమనాన్నిచ్చినా.. రిషబ్ పంత్ (25)తో శుభ్‌మన్ మరో భాగస్వామ్యం నెలకొల్పడంతో 208/3తో భారత్ మెరుగైన స్థితికి చేరుకుంది.

నితీశ్‌కు నిరాశ: తిరుగులేని స్థితిలో తొలి రోజు ఆటను ముగించేలా కనిపించిన భారత్.. మూడో సెషన్లో స్వల్ప వ్యవధిలో 2 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. అప్పటికే స్పిన్నర్ బషీర్ బౌలింగ్‌లో లాంగాన్‌లో తనదైన శైలిలో భారీ సిక్సర్ బాదిన పంత్.. మళ్లీ అలాంటి షాటే ప్రయత్నించాడు. కానీ క్రాలీని లాంగాన్‌లో పెట్టి ఊరించేలా బంతి వేసిన బషీర్.. పంత్‌కు ఉచ్చుబిగించాడు. తర్వాతి ఓవర్లో నితీశ్ కుమార్ (1) ఔటైపోయాడు. సిరీస్‌లో తొలి అవకాశం దక్కించుకున్న నితీశ్.. వోక్స్ ఇన్‌స్వింగర్‌ను తప్పుగా అంచనా వేసి ఆడకుండా చేతులు పైకెత్తాడు. అనూహ్యంగా లోపలికి స్వింగ్ అయిన బంతి స్టంప్స్‌ను లేపేసింది. భారత్ 208/3 నుంచి 211/5కు చేరుకుంది. ఇంగ్లిష్ బౌలర్లు ఈ ఊపులో భారత్‌ను కుప్పకూల్చేస్తారా అన్న భయాలు అభిమానుల్లో కలిగాయి కానీ.. గిల్, జడేజా ఆ పరిస్థితి రానివ్వలేదు. ఇద్దరూ పట్టుదలతో క్రీజులో నిలిచి.. ఇంగ్లిష్ బౌలర్లకు కాచుకున్నారు. సమయోచితంగా షాట్లు కూడా ఆడుతూ స్కోరు వేగం పడిపోకుండా చూశారు. 90ల్లోకి వచ్చాక వరుసగా పార్ట్‌టైమ్ స్పిన్నర్ రూట్ బౌలింగ్‌లో రెండు ఫోర్లు కొట్టి గిల్ శతకం పూర్తి చేశాడు.

తుది జట్టు.. ఊహించని విధంగా

ఇంగ్లాండ్‌తో రెండో టెస్టుకు భారత తుది జట్టు అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. తొలి టెస్టులో ఆడిన జట్టులో మూడు మార్పులు చోటు చేసుకోవడం విశేషం. తొలి టెస్టు తర్వాత వారం రోజుల విరామం లభించినా సరే.. ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను ఈ మ్యాచ్‌లో ఆడించకూడదనే జట్టు యాజమాన్యం నిర్ణయించింది. ఎడ్జ్‌బాస్టన్‌లో అతను ఆడే అవకాశాలున్నట్లు ముందు రోజు వార్తలు వచ్చినా.. అది వాస్తవం కాదని మ్యాచ్ సమయానికి తేలిపోయింది. తొలి టెస్టులో బంతితో, బ్యాటుతో విఫలమైన శార్దూల్ ఠాకూర్‌పై అనుకున్నట్లే వేటు పడింది. అయితే లీడ్స్‌లో అరంగేట్రం చేసి, రెండో ఇన్నింగ్స్‌లో ఆకట్టుకున్న సాయి సుదర్శన్‌నూ తప్పించడం అనూహ్యం. బుమ్రా స్థానంలోకి లెఫ్టార్మ్ పేసర్ అర్ష్‌దీప్ వస్తాడనుకుంటే.. ఆకాశ్‌దీప్‌ను ఎంచుకున్నారు. శార్దూల్ స్థానంలో కుల్‌దీప్‌ను ఎంచుకోవాలని మాజీలు సూచిస్తే.. జట్టు యాజమాన్యం మాత్రం వాషింగ్టన్ సుందర్‌కు ఓటేసింది. నితీశ్‌కుమార్ రెడ్డికి తుది జట్టులో చోటివ్వడం న్యాయమే అనిపించినా.. సుదర్శన్‌పై ఒక్క మ్యాచ్‌కే ఓటు వేయడం మీద మాత్రం భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రెండో రౌండ్లో శ్రీకాంత్



కాల్గరి: కెనడా ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ రెండ్లోకి రౌండ్లో ప్రవేశించాడు. మూడు గేమ్‌ల హోరాహోరీ పోరులో శ్రీకాంత్ 18-21, 21-19, 21-14తో సహచర ఆటగాడు ప్రియాంశు రజవాత్‌ను ఓడించాడు. 6-6, 17-17 ఇలా నువ్వానేనా అన్నట్టుగా సాగిన తొలి గేమ్‌ను శ్రీకాంత్ కోల్పోయాడు. రెండో గేమ్ కూడా తొలి గేమ్‌నే తలపించింది. 18-18తో శ్రీకాంత్‌ను సమం చేసిన ప్రియాంశు విజయానికి చేరువయ్యాడు. అయితే అసాధారణంగా పుంజుకున్న తెలుగబ్బాయి 21-19తో ఆ గేమ్‌ను ముగించడంతో పాటు.. తర్వాతి గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. నిర్ణయాత్మక గేమ్‌లోనూ ఇద్దరు 14-14తో పోటాపోటీగా ఆడారు. ఆ తర్వాత వరుసగా 7 పాయింట్లు నెగ్గిన శ్రీకాంత్ మ్యాచ్ సొంతం చేసుకున్నాడు. గత వారం యుఎస్ ఓపెన్ టోర్నీ గెలిచిన యువ షట్లర్ ఆయుష్ శెట్టికి ఈ టోర్నీలో తొలి రౌండ్లోనే చుక్కెదురైంది. అయిదో సీడ్ ఆయుష్ 21-23, 12-21తో సుబ్రమణియన్ చేతిలో ఓడిపోయాడు.

మెరిసిన అమన్‌జ్యోత్

ఇంగ్లాండ్‌పై భారత మహిళలకు మరో విజయం


అమన్‌జ్యోత్

బ్రిస్టల్: పెద్దగా అంచనాల్లేకుండా ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లిన భారత మహిళల క్రికెట్ జట్టు.. వరుస విజయాలతో దూసుకెళ్తోంది. రెండో టీ20లో 24 పరుగులతో ఆతిథ్య జట్టును ఓడించిన భారత్.. 5 మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలో నిలిచింది. తొలి టీ20లో మాదిరి బ్యాటింగ్‌లో శుభారంభం దక్కక పోయినా.. ఆ మ్యాచ్‌లో సెంచరీ చేసిన స్మృతి మంధాన (13)తో పాటు షెఫాలి వర్మ (3), హర్మన్‌ప్రీత్ (1) విఫలమైనా రెండో టీ20లో భారత్ గెలవడం విశేషం. 31 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన భారత్‌ను.. జెమీమా రోడ్రిగ్స్ (63; 41 బంతుల్లో 9×4, 1×6), అమన్‌జ్యోత్ కౌర్ (63 నాటౌట్; 40 బంతుల్లో 9×4) అద్భుత పోరాటంతో ఆదుకున్నారు. రిచా ఘోష్ (32 నాటౌట్; 20 బంతుల్లో 6×4) సైతం మెరుపులు మెరిపించడంతో మొదట భారత్ 4 వికెట్లకు 181 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇంగ్లిష్ బౌలర్లలో లారెన్ బెల్ (2/17) ఆకట్టుకుంది. ఛేదనలో ఇంగ్లాండ్ 7 వికెట్లకు 157 పరుగులే చేయగలిగింది. 17/3తో కష్టాల్లో పడ్డ జట్టును టామీ బ్యూమాంట్ (54; 35 బంతుల్లో 8×4, 1×6), అమీ జోన్స్ (32; 27 బంతుల్లో 4×4) గాడిన పెట్టినా.. బ్యూమాంట్ రనౌట్ కావడంతో మ్యాచ్ భారత్ వైపు మొగ్గింది. శ్రీ చరణి (2/28)తో పాటు మిగతా బౌలర్లూ కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి జట్టును గెలిపించారు. మూడో టీ20 శుక్రవారం జరుగుతుంది.

ప్రపంచ నంబర్‌వన్ సబలెంక వింబుల్డన్‌లో శుభారంభం చేసింది. ఫైనల్లో ఆమెపై గెలిచి ఫ్రెంచ్ ఓపెన్‌ను చేజిక్కించుకున్న రెండో సీడ్ కొకో గాఫ్‌కు మాత్రం తొలి రౌండ్లో షాక్ తగిలింది. పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ అల్కరాస్, ఏడుసార్లు ఛాంపియన్ జకోవిచ్ రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు.

గాఫ్ ఔట్



సబలెంక, అల్కరాస్ ముందంజ

లండన్

టాప్ సీడ్ సబలెంక (బెలారస్) వింబుల్డన్‌లో రెండో రౌండ్లోకి ప్రవేశించింది. కానీ ఆమెకు గట్టి ప్రతిఘటన తప్పలేదు. బుధవారం మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో సబలెంక 7-6 (7-1), 6-4తో బౌజ్కోవా (చెక్)పై కష్టపడి గెలిచింది. సబలెంక తొలి సెట్‌ను కోల్పోవడానికి రెండు పాయింట్ల దూరంలో నిలిచింది. సెట్ కోసం సర్వ్ చేస్తూ బౌజ్కోవా 30-15తో నిలవగా.. సబలెంక పుంజుకుంది. బ్రేక్‌తో స్కోరును సమం చేసిన సబలెంక.. సెట్‌ను టైబ్రేక్‌కు తీసుకెళ్లింది. అక్కడ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ సెట్‌ను చేజిక్కించుకుంది. రెండో సెట్లో అయిదో గేమ్‌లో బ్రేక్‌తో ఆధిక్యంలోకి వెళ్లిన సబలెంక.. ఆఖరి వరకు ఆధిక్యాన్ని నిలబెట్టుకుని సెట్‌ను, మ్యాచ్‌ను గెలుచుకుంది. ఈ మ్యాచ్‌లో ఆమె 5 ఏస్‌లు, 41 విన్నర్లు కొట్టింది. మరోవైపు మంచి అంచనాలతో బరిలోకి దిగిన ఫ్రెంచ్ ఓపెన్ ఛాంపియన్ కొకో గాఫ్‌కు షాక్ తగలింది. ఈ రెండో సీడ్ అమెరికా అమ్మాయి తొలి రౌండ్లోనే బోల్తా కొట్టింది. ఆమె 6-7 (1-7), 1-6తో ఉక్రెయిన్‌కు చెందిన యాస్ట్రెమ్‌స్కా చేతిలో ఓడిపోయింది. గాఫ్ 9 డబుల్ ఫాల్ట్‌లు, 29 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకుంది. ఆరో సీడ్ మ్యాడిసన్ కీస్ (అమెరికా) రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. మొదటి రౌండ్లో ఆమె 6-4, 6-2తో దనిలోవిచ్ (సెర్బియా)ను ఓడించింది. మరో మ్యాచ్‌లో 13వ సీడ్ అనిసిమోవా (అమెరికా) 6-4, 6-3తో జరాజువా (మెక్సికో)పై నెగ్గింది. ఇతర మ్యాచ్‌ల్లో కార్టల్ (బ్రిటన్) 6-2, 6-2తో తొమోవా (బల్గేరియా)పై, సీగ్మండ్ (జర్మనీ) 6-2, 6-3తో లెలా ఫెర్నాండెజ్ (కెనడా)పై, బుక్సా (స్పెయిన్) 6-1, 6-3తో వెకిచ్ (క్రొయేషియా)పై, హదద్ మయా (బ్రెజిల్) 7-6 (9-7), 6-1తో గాల్ఫి (ఫ్రాన్స్)పై, మెర్టెన్స్ (బెల్జియం) 6-7 (5-7), 6-1, 6-2తో లి (అమెరికా)పై గెలిచారు.



జకోవిచ్ బోణీ: ఆరో సీడ్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా) వింబుల్డన్‌లో శుభారంభం చేశాడు. కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసిన అతడు పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో 6-1, 6-7 (7), 6-2, 6-2తో అలెగ్జాండర్ ముల్లెర్ (ఫ్రాన్స్)పై విజయం సాధించాడు. మ్యాచ్‌లో జకోవిచ్ 22 ఏస్‌లు, 50 విన్నర్లు కొట్టాడు. మూడో సెట్లో అతడు కడుపు నొప్పితో ఇబ్బందిపడ్డాడు. చికిత్స తీసుకోవాల్సివచ్చింది. వైద్యుడి మాత్రలు అద్భుతం చేశాయని, వెంటనే కోలుకున్నానని మ్యాచ్ అనంతరం జకోవిచ్ చెప్పాడు. ఫ్రెంచ్ ఓపెన్ గెలిచి ఊపుమీదున్న స్పెయిన్ స్టార్ అల్కరాస్ కూడా రెండో రౌండ్లో అడుగుపెట్టాడు. తొలి రౌండ్లో అతడు 6-1, 6-4, 6-4తో టార్వెట్ (బ్రిటన్)ను ఓడించాడు. ఈ మ్యాచ్‌లో అల్కరాస్ 3 ఏస్‌లు, 38 విన్నర్లు కొట్టాడు. 12వ సీడ్ టియోఫె (అమెరికా) కథ ముగిసింది. మొదటి రౌండ్లో అతడు 6-4, 4-6, 3-6, 5-7తో నోరీ (బ్రిటన్) చేతిలో కంగుతిన్నాడు. ఇతర మ్యాచ్‌ల్లో 14వ సీడ్ రుబ్లెవ్ (రష్యా) 6-7 (1-7), 6-4, 7-6 (7-5), 6-3తో లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా)పై, 17వ సీడ్ కచనోవ్ (రష్యా) 1-6, 7-6 (9-7), 4-6, 6-3, 6-4తో మొచిజుకి (జపాన్)పై, జారీ (చిలీ) 6-2, 6-2, 6-3తో టీన్ (అమెరికా)పై, దిమిత్రోవ్ (బల్గేరియా) 6-2, 6-3, 6-4తో నిషియోకా (జపాన్)పై విజయం సాధించారు.

రెండో రౌండ్లో రిత్విక్ జోడీ: పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాళ్లు రిత్విక్ బొల్లిపల్లి, యుకి బాంబ్రి.. తమ తమ భాగస్వాములతో రెండో రౌండ్లో ప్రవేశించారు. తొలి రౌండ్లో రిత్విక్, బరింటోస్ (కొలంబియా) జంట 4-6, 6-4, 7-6 (13-11)తో ముల్లెర్-గోఫిన్ (బెల్జియం) ద్వయంపై గెలిచింది. మరో మ్యాచ్‌లో యుకి, రాబర్ట్ గాలోవే (అమెరికా) జోడీ 7-6 (8), 6-4తో రొమైన్ అరెండో (మొనాకో), గినార్డ్ (ఫ్రాన్స్) జంటపై గెలిచింది. బోపన్న జోడీ తొలి రౌండ్లోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది.

అసలంక శతకం

శ్రీలంకదే తొలి వన్డే



కొలంబో: బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌ను గెలుచుకున్న శ్రీలంక మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లోనూ శుభారంభం చేసింది. కెప్టెన్ చరిత్ అసలంక (106; 123 బంతుల్లో 6×4, 4×6) చెలరేగడంతో బుధవారం తొలి వన్డేలో ఆతిథ్య జట్టు 77 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. బౌలింగ్ అనుకూల పిచ్‌పై మొదట శ్రీలంక 49.2 ఓవర్లలో 244 పరుగులకే ఆలౌటైంది. తస్కిన్ అహ్మద్ (4/47), తంజిమ్ (3/45) విజృంభించారు. లక్ష్యఛేదనలో ఒక దశలో 100/1తో మెరుగ్గా కనిపించిన బంగ్లాను స్పిన్నర్లు హసరంగ (4/10), కమిందు మెండిస్ (3/19) దెబ్బతీశారు. బంగ్లా 35.5 ఓవర్లలో 167 పరుగులకే ఆలౌటైంది. తంజిద్ హసన్ (62), జేకర్ అలీ (51) మాత్రమే ఆ జట్టులో పోరాడారు.

వైభవ్ విధ్వంసం

అండర్-19 వన్డేలో ఇంగ్లాండ్‌పై భారత్ విజయం



నార్తాంప్టన్: 14 ఏళ్లకే ఐపీఎల్ అరంగేట్రం చేసి విధ్వంసక ఇన్నింగ్స్‌లతో అందరి దృష్టినీ ఆకర్షించిన యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ.. అండర్-19 జట్టు తరఫున ఇంగ్లాండ్ పర్యటనలోనూ చెలరేగిపోతున్నాడు. వన్డే సిరీస్‌లో వరుసగా మూడో మ్యాచ్‌లోనూ అతను ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. వర్షం వల్ల 40 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో వైభవ్ (86; 31 బంతుల్లో 6×4, 8×6) మెరుపులతో.. 269 పరుగుల లక్ష్యాన్ని భారత అండర్-19 జట్టు 6 వికెట్లు కోల్పోయి 34.3 ఓవర్లలోనే ఛేదించింది. విహాన్ మల్హోత్రా (46), కనిష్క్ చౌహాన్ (43 నాటౌట్) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడారు. ఇంగ్లిష్ బౌలర్లలో అలెగ్జాండర్ వేడ్ (2/58) రాణించాడు. మొదట థామస్ ర్యూ (76 నాటౌట్; 44 బంతుల్లో 9×4, 3×6), డాకిన్స్ (62; 61 బంతుల్లో 8×4, 1×6) మెరవడంతో ఇంగ్లాండ్ 6 వికెట్లకు 268 పరుగులు చేసింది. ఈ విజయంతో 5 మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-1 ఆధిక్యంలోకి వెళ్లింది.

ఇరాక్‌పై భారత్ విజయం

చియాంగ్ మై (థాయ్‌లాండ్): మహిళల ఫుట్‌బాల్ ఆసియాకప్ 2026 క్వాలిఫయర్స్‌లో భారత్ బుధవారం 5-0తో ఇరాక్‌పై ఘనవిజయం సాధించింది. మ్యాచ్‌లో ఆద్యంతం భారత్ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. సంగీత (14వ), మనీషా (44వ)ల గోల్స్‌తో విరామ సమయానికి 2-0 ఆధిక్యంలో నిలిచింది. కార్తీక (48వ), నిర్మల దేవి (68వ), రత్నబాల దేవి (80వ) ద్వితీయార్ధంలో భారత్‌కు గోల్స్ అందించారు. 9 పాయింట్లతో భారత్ గ్రూప్-బిలో అగ్రస్థానంలో ఉంది. ఆ జట్టు ఇంతకుముందు మ్యాచ్‌ల్లో మంగోలియాపై 13-0తో, తిమోర్ లెస్టెపై 4-0తో నెగ్గింది.

జ్యోతికి గాయం..



దిల్లీ: ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌నకు ముందు భారత్‌కు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఆసియా ఛాంపియన్, 100 మీటర్ల హర్డిల్స్‌లో జాతీయ రికార్డు నెలకొల్పిన జ్యోతి యర్రాజి (ఆంధ్రప్రదేశ్) మోకాలికి గాయమైంది. దీంతో ఈ ఏడాది సెప్టెంబరులో టోక్యోలో జరగనున్న ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో జ్యోతి పాల్గొనడం అనుమానంగా మారింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్ అర్హత టైమింగ్ (12.73 సెకన్లు)ను జ్యోతి ఇంకా అందుకోలేదు. ఈ ఏడాది మేలో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో ఆమె 12.96 సెకన్ల టైమింగ్ నమోదు చేసింది. ర్యాంకింగ్ ప్రకారం ప్రపంచ ఛాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించగలిగే టాప్-16 అథ్లెట్లలో జ్యోతికి చోటు దక్కింది. ప్రస్తుతం 12వ స్థానంలో ఉన్న జ్యోతి.. ఆగస్టు 24 వరకు టాప్-16లోపు ర్యాంకింగ్‌ను కొనసాగిస్తే కోటా బెర్తు లభిస్తుంది. అయితే గాయంతో విరామం తీసుకోనున్న జ్యోతి కీలక టోర్నీలకు దూరమైతే ర్యాంకింగ్ పడిపోయే ప్రమాదముంది.

పంత్‌కు ఆరో ర్యాంకు


దుబాయ్: భారత వికెట్ కీపర్ రిషబ్ పంత్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో పురోగతి కనబరిచాడు. బుధవారం ప్రకటించిన ఐసీసీ టెస్టు బ్యాటింగ్ జాబితాలో పంత్ ఒక స్థానం మెరుగై ఆరో ర్యాంకు సాధించాడు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. బౌలింగ్‌లో స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా నంబర్‌వన్ ర్యాంకును నిలబెట్టుకున్నాడు. రవీంద్ర జడేజా 13వ స్థానంలో ఉన్నాడు. ఆల్‌రౌండర్లలో రవీంద్ర జడేజా నంబర్‌వన్ ఆటగాడిగా కొనసాగుతున్నాడు.

సెమీస్‌లో మీనాక్షి, పూజ

అస్తానా (కజకిస్థాన్): ప్రపంచ బాక్సింగ్ కప్‌లో భారత్‌కు రెండు పతకాలు ఖాయమయ్యాయి. మీనాక్షి (48 కిలోలు), పూజారాణి (80 కిలోలు) సెమీఫైనల్‌కు దూసుకెళ్లారు. బుధవారం క్వార్టర్‌ఫైనల్లో మీనాక్షి 5-0తో చైనీస్ తైపీకి చెందిన గౌ యి జువాన్‌పై విజయం సాధించింది. మరో క్వార్టర్స్‌లో పూజ 4-1తో గుల్సాయా ఎర్జాన్‌ను ఓడించింది. అంతకు ముందు 51 కిలోల విభాగంలో అనామిక క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించింది. అయ్సెన్ టస్కిన్ (టర్కీ)పై ఆమె నెగ్గింది.

హెట్‌మయర్.. అదే జోరు

సియాటెల్‌కు మరో విజయం



లాడర్‌హిల్: ఐపీఎల్‌లో నిరాశపరిచిన వెస్టిండీస్ విధ్వంసక బ్యాటర్ హెట్‌మయర్.. అమెరికాలో జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్ టోర్నీలో చెలరేగిపోతున్నాడు. అతను వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఛేదనలో మెరుపు ఇన్నింగ్స్ ఆడడంతో సియాటెల్ ఆర్కాస్ హ్యాట్రిక్ విజయం సాధించింది. మొదట శాన్ ఫ్రాన్సిస్కో యూనికార్న్స్ 5 వికెట్లకు 168 పరుగులు చేసింది. సంజయ్ కృష్ణమూర్తి (41; 28 బంతుల్లో 4×6), జేక్ ఫ్రేజర్ (35; 22 బంతుల్లో 4×4, 1×6) రాణించారు. అయాన్ దేశాయ్ (2/32), సికందర్ రజా (1/19) ప్రత్యర్థిని దెబ్బ తీశారు. అనంతరం షాయాన్ జహంగీర్ (36; 27 బంతుల్లో 3×4, 2×6) సియాటెల్‌కు అదిరే ఆరంభాన్నిచ్చినా.. బార్ట్‌లెట్ (2/24) ధాటికి తడబడిన ఆ జట్టు 89/5తో కష్టాల్లో పడింది. అయితే భీకర ఫామ్‌లో ఉన్న హెట్‌మయర్ (78 నాటౌట్; 37 బంతుల్లో 4×4, 7×6) విధ్వంసక ఇన్నింగ్స్‌తో జట్టుకు విజయాన్నందించాడు. సియాటెల్ 19.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. గత రెండు మ్యాచ్‌ల్లో హెట్‌మయర్ 64, 97 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు.

భారత ఫుట్‌బాల్ కోచ్ మార్క్వెజ్ ఔట్



దిల్లీ: భారత ఫుట్‌బాల్ కోచ్ మనోలో మార్క్వెజ్ బాధ్యతల నుంచి వైదొలిగాడు. ఇటీవల జాతీయ జట్టు పేలవ ప్రదర్శనతో విమర్శలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అతడు ఈ నిర్ణయం తీసుకున్నాడు. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్)తో ఓ అంగీకారానికి వచ్చిన మార్క్వెజ్.. పదవీకాలం మరో ఏడాది ఉండగానే రాజీనామా చేశాడు. త్వరలోనే కొత్త కోచ్‌ను నియమిస్తామని ఏఐఎఫ్ఎఫ్ డిప్యూటీ కార్యదర్శి సత్యనారాయణ చెప్పాడు. మార్క్వెజ్ గత ఏడాది జూన్‌లో రెండేళ్ల కాలానికి కోచ్‌గా నియమితుడయ్యాడు. అతడి హయాంలో ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో భారత్ ఒక్కటి మాత్రమే గెలిచింది.

(c) eenadu

అప్‌డేషన్.. అంతొద్దు!

హోటల్‌కో, రెస్టారెంట్‌కో వెళ్తే ఏం చేస్తాం..?
హాయిగా భోజనం చేస్తాం...
సరదాగా కబుర్లు చెప్పుకుంటాం...
కానీ కొంతమంది మాత్రం దీనికి భిన్నం..
ఆర్డర్ చేసినప్పుడు.. ఫుడ్‌ను సర్వ్ చేస్తున్నప్పుడు..
తినడం ప్రారంభించేటప్పుడు..
వీజీ వీజీగా ఫొటోలు తీస్తుంటారు..
ఎందుకంటే సోషల్‌మీడియాలో అప్‌డేట్ చేయడం కోసమని చెబుతారు..
ఇలా.. చేసే ప్రతి పనినీ అప్‌డేట్ చేసేయాలనే ఈ ధోరణి అనేక సమస్యలకు కారణమవుతోంది..



అమ్మో.. స్ట్రీక్ మిస్సయిందా..?

నేటి డిజిటల్ యుగంలో యువతరం సాంకేతిక పరిజ్ఞానంతో విడదీయరాని బంధాన్ని ఏర్పరచుకుంది. స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చాక, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు వారి దైనందిన జీవితంలో ఒక ముఖ్యభాగంగా మారాయి. ఈ వాడకం వ్యసనంగా మారితే మాత్రం సామాజిక, మానసిక సవాళ్లకు కారణమవుతుంది.

● స్నాప్‌చాట్ ద్వారా ఫొటోలను 'షేర్' చేసుకోవడం యువతకు అలవాటుగా మారింది. ఇలా పంపుకుంటే ఆ వివరాలు అప్‌డేట్ అవుతూ ఉంటాయి. ఆ సంఖ్యను స్ట్రీక్ అంటారు. షేరింగ్ వరకు బాగానే ఉన్నా 'స్ట్రీక్స్' పెంచుకోవాలనే లక్ష్యంతో కొందరు సమయాన్ని వృథా చేస్తున్నారు. వీరు జీవితంలో ఎంత వెనుకబడినా బాధపడరు గానీ.. ఒక్క స్ట్రీక్ మిస్సయినా సరే కుంగిపోతున్నారు.

● స్ట్రీక్ అప్‌డేట్ నంబర్‌ను చూసి.. జీవితంలో పెద్ద విజయమే సాధించినట్లు భావిస్తున్నారు. మిస్సయిన స్ట్రీక్‌ను సొమ్ము చెల్లించి మరీ రీస్టోర్ చేసుకుంటున్నారు. వీటికి ఏదైనా ఉపయోగమా అంటే? శూన్యమే. ఇలా చేస్తూ సమయాన్ని, డబ్బును వృథా చేసుకుంటున్నవారు చాలామంది ఉన్నారు.

స్టేటస్ కోసం తిప్పలు...



● సోషల్‌మీడియాలో చాలామంది స్టేటస్‌లను అప్‌డేట్ చేస్తూనే ఉంటారు. ఏదోటి పోస్టు చేస్తూనే ఉంటారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. అనుకున్నన్ని లైక్‌లు, ప్రతిస్పందనలు రాలేదంటే ఇక వారి మనసు ప్రతికూల ఆలోచనలతో నిండిపోతుంటుంది.

● 'నా స్టేటస్‌ను చూసి ఎవరూ స్పందించకపోతే, వారి దగ్గర విలువేంటి?' అంటూ వేదనకు గురవుతున్నారు.

● ఇతరుల రూపం, సంపద, విజయాలను పోల్చుకుని.. తమను తాము తక్కువ చేసుకుంటూ, అసంతృప్తికి లోనవుతున్న వారూ పెరుగుతున్నారు. పోస్టుల్లో చాలా వరకు నిజజీవితానికి దూరంగా ఉంటాయని గ్రహించలేకపోతున్నారు.

● కొంతమందికి వారి బంధాలపై అనుమానాలు రేకెత్తించే అంశంగా మారుతుంది. ఇతరుల మీద ద్వేషం పెంచుకునే వరకూ వెళ్తోంది.

ఈ ఛాలెంజ్‌లు.. చాలా ప్రమాదం!

● సామాజిక మాధ్యమాల వేదికగా యువత ప్రమాదకరమైన ఛాలెంజ్‌లు, రీల్స్ చేస్తున్నారు. ఒక్కవీడియో వైరల్ అయితే చాలు.. స్టార్ అయిపోవచ్చు.. పాపులర్టీని డబ్బుగా సంపాదించొచ్చనే ఆలోచనలతో వీళ్లు ఇలా చేస్తున్నారు.

● ఈ ధోరణి ప్రాణాలకు ప్రమాదాలను తెచ్చిపెడుతోంది. రైలు పట్టాలు, ఎత్తైన కొండలు, జలపాతాల వద్ద విన్యాసాలు చేస్తూ ప్రాణాలు కోల్పోతున్నారు.

ఎలా బయటపడాలి?

● మన ఫొటోలకు ఎవరో లైక్స్ కొట్టలేదు.. కామెంట్లు పెట్టలేదంటూ చిన్న చిన్న విషయాలకు మనసు పాడుచేసుకోవడం వల్ల ప్రశాంతత దూరం అవడం తప్ప, ఎలాంటి ఉపయోగం ఉండదు.

● మన విలువ లైక్స్‌కి, వ్యూస్ వల్ల కాదు.. వ్యక్తిత్వం వల్ల పెరుగుతుందని గుర్తించాలి.

● రోజూ మన భావాలను వ్యక్తీకరించాల్సిన అవసరం లేదు. మనసులో పుట్టే ప్రతి భావానికీ, బయట ప్రపంచం నుంచి స్పందన రావాలని కోరుకోవడమూ సబబు కాదు.

● ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని, జీవితాన్ని హాయిగా గడిపేందుకు ప్రయత్నించాలి. అనవసరమైన విషయాలను ఆలోచించకుండా దూరంగా ఉండాలి.

● ప్రతిరోజూ నిర్దిష్ట సమయంలోనే మొబైల్‌ను చూడటం.. కొత్త అలవాట్లు చేసుకోవడం.. స్నేహితులు, కుటుంబ సభ్యులతో మనస్ఫూర్తిగా మాట్లాడడం ద్వారా ఈ సమస్యల నుంచి బయటపడొచ్చు..!

- ఈనాడు ప్రత్యేక విభాగం

కృష్ణా బేసిన్‌లో జలకళ..

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా బేసిన్‌లోని రిజర్వాయర్లు జలకళను సంతరించుకొంటున్నాయి. ఆలమట్టి నుంచి నాగార్జునసాగర్ వరకు అన్ని రిజర్వాయర్లలోకి వరద కొనసాగుతోంది. ప్రస్తుత సీజన్‌లో శ్రీశైలంలోకి సుమారు 140 టీఎంసీలు వచ్చాయి. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు కూడా నీటి విడుదల మొదలైంది. గోదావరిలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఇప్పటివరకు నామమాత్రంగానే నీటి నిల్వలు పెరిగాయి. ఎగువన మహారాష్ట్రలోని జైక్వాడి నుంచి దిగువన ధవళేశ్వరం వరకు నామమాత్రంగానే ప్రవాహాలున్నాయి. కృష్ణాలో ఎగువన ఉన్న ఆలమట్టిలో 91 టీఎంసీల నిల్వ ఉండగా, 85 వేల క్యూసెక్కుల ప్రవాహం ఉంది. దీంతో 70 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దిగువన ఉన్న నారాయణపూర్ పూర్తిస్థాయి నీటిమట్టానికి దగ్గరగా ఉండటంతో వచ్చిన నీటిని వచ్చినట్లుగా కిందకు వదులుతున్నారు. ఇందులో ఆయకట్టు అవసరాలకు, కాలువలకు కూడా విడుదల చేశారు. తుంగభద్ర, జూరాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో శ్రీశైలం నుంచి కూడా దిగువన సాగర్‌కు నీటిని వదిలారు. శ్రీశైలం నిండటానికి మరో 50 టీఎంసీలు అవసరం. ప్రస్తుత ప్రవాహం కొనసాగితే మరో వారం రోజుల్లో నిండే అవకాశం ఉంది.

కృష్ణా బేసిన్‌లోని రిజర్వాయర్లలో నీటి నిల్వల వివరాలు.. (బుధవారం ఉదయానికి)

ప్రాజెక్టు	నీటినిల్వ సామర్థ్యం (టీఎంసీలలో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీలలో)	వస్తున్న ప్రవాహం (క్యూసెక్కులలో)	వదులుతున్న నీరు (క్యూసెక్కులలో)
ఆలమట్టి	129.72	91.08	85,537	70,780
నారాయణపూర్	37.64	30.69	69,810	69,810
జూరాల	9.66	6.97	79,995	82,946
తుంగభద్ర	105.79	77.14	32,767	1,997
శ్రీశైలం	215.81	164.75	98,552	49,652
నాగార్జునసాగర్	312.05	143.86	60,576	5,324
పులిచింతల	45.77	21.95	0	0



విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కారు నిలిపి.. మాట కలిపి

విద్యార్థులతో నడుస్తూ కలెక్టర్ చిట్‌చాట్

సారవకోట, న్యూస్‌టుడే: ఎప్పుడూ విధుల్లో తలమునకలై ఉండే కలెక్టర్.. విద్యార్థులను చూసి రోడ్డుపై వారితో పాటే నడుస్తూ మాటలు కలిపారు. శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలంలో పర్యటన ముగించుకుని వస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు నౌతళ కూడలిలో అప్పుడే పాఠశాల నుంచి వస్తున్న విద్యార్థులు కనిపించారు. వెంటనే ఆయన వాహనం దిగి వారితో ముచ్చటించుకుంటూ నౌతళ గ్రామం వరకు నడిచారు. పాఠశాలలో పుస్తకాలు, యూనిఫాం అందరికీ అందాయా, మధ్యాహ్న భోజనం బాగుందా.. అని ప్రశ్నలు వేసి, పిల్లల సమాధానంతో సంతృప్తి చెందారు. గ్రామంలో తల్లిదండ్రులతోనూ మాట్లాడారు. తల్లికి వందనం, ప్రభుత్వ పథకాల అమలుపై వాకబు చేశారు.

582 మార్కులు వచ్చినా.. ట్రిపుల్ ఐటీలో సీటు నిరాకరణ

న్యాయం చేయాలని తెదేపా కేంద్ర కార్యాలయంలో వినతి

ఈనాడు, అమరావతి: నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: 'మాది బేడ బుడగజంగం కులం. నాకు పదో తరగతిలో 582 మార్కులు వచ్చాయి. కుల ధ్రువీకరణ పత్రం లేకపోవడంతో నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు ఇవ్వడానికి అధికారులు నిరాకరించారు' అని పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గం యలమంద గ్రామానికి చెందిన వి.మల్లేశ్వరి అనే విద్యార్థిని వాపోయారు. సబ్జెక్టుల వారీగా సెక్షన్ కటాఫ్ మార్కులు చూసినా ఓపెన్ కేటగిరీ కన్నా ఎక్కువగా వచ్చాయని.. అయినా సీటు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీటు ఇప్పించి తన భవిష్యత్తును కాపాడాల్సిందిగా వేడుకున్నారు. ఈ మేరకు మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో తితిదే బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మికి బుధవారం వినతిపత్రం సమర్పించారు.

ఉగ్రవాదుల ఇంట్లో ఆర్డీఎక్స్

రాయచోటి, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా రాయచోటిలో కలకలం సృష్టించిన ఉగ్రవాదుల నివాసాల్లో మంగళవారం రాత్రి జరిపిన సోదాల్లో భారీగా మందుగుండు సామగ్రి పట్టుబడినట్లు అధికారవర్గాల తెలిసింది. కొత్తపల్లిలోని అబూబకర్ సిద్దిక్ నివాసంలో నాలుగు కిలోల ఆర్డీఎక్స్, డిటోనేటర్ వైర్లు, వాకీటాకీలను స్వాధీనం చేసుకున్నారు. మరో ఉగ్రవాది మహ్మద్‌అలీ నివాసంలో పేలుళ్లకు ఉపయోగించే వైర్లు ఉన్నట్లు గుర్తించారు. వీటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిసింది. మరో వ్యక్తి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు సమాచారం. పట్టుబడిన వారి సెల్‌ఫోన్ల ఆధారంగా వారితో తరచు మాట్లాడేవారు, కలిసి తిరిగినవారి కోసం పోలీసులు ఆరాతీస్తున్నారు. వాళ్ల పట్టణంలోని ఓ వ్యాపారితో పాటు ఓ ప్రజాప్రతినిధితోనూ ఫోన్లలో ఎక్కువగా మాట్లాడినట్లు గుర్తించారు.



మీపై విశ్వాసం పెరగాలంటే..!

బృంద సభ్యుల్లో మీపై విశ్వాసం పెరిగి, వారు మీకు విధేయులుగా ఉండాలంటే-

✦ తమ ఆలోచనలను పంచుకునేందుకు బృంద సభ్యులకు పూర్తి స్వేచ్ఛనివ్వండి. వారి మాటలను సావధానంగా వినండి.

✦ బృంద సభ్యులపై నమ్మకం ఉంచి, వారికి బాధ్యతలు అప్పగించండి. తద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంచండి.

✦ కృషికి తగ్గ ప్రోత్సాహకాలు అందిస్తూ వారిని సంతృప్తిపరచండి.

– అమన్ సహోటా, లీడర్‌షిప్ కోచ్

ఎసైన్డ్ భూములనూ వదల్లేదు

- జగనన్న కాలనీల కోసం స్థలాల సేకరణలో అక్రమాల పరంపర
- కొనుగోళ్లలో అడ్డగోలుగా వ్యవహరించిన వైకాపా సర్కారు
- రికార్డులు చూడకుండానే చెల్లింపులు

ఈనాడు, అమరావతి: జగనన్న కాలనీల కోసం ఎసైన్డ్ భూముల కొనుగోళ్లలోనూ వైకాపా ప్రభుత్వం భారీఎత్తున అక్రమాలకు పాల్పడింది. పేదలకు ఇంటి పట్టాల పంపిణీ పేరుతో చేపట్టిన స్థలాల కొనుగోలులో అడ్డగోలుగా వ్యవహరించింది. కూటమి ప్రభుత్వ ఆదేశాలతో ఈ అక్రమాలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జిల్లాల వారీగా వెలికితీయడంలో నిమగ్నమయ్యారు.

ఎసైన్డ్ భూములు వాస్తవంగా లబ్ధిదారుల పేర్లతో ఉన్నాయా? లేవా? తదితర వివరాలను చూడకుండానే వందల కోట్ల రూపాయలతో వైకాపా ప్రభుత్వం వాటిని కొనుగోలు చేసేసింది. పేదలకు వివిధ సందర్భాల్లో ప్రభుత్వాలు ఇచ్చిన ఎసైన్డ్ భూముల కొనుగోలుకు నిబంధనలు వర్తిస్తున్నా... ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన వారు లేదా వారి వారసుల నుంచే భూములను కొనాలి. ఇందుకు తగిన రుజువులు ఉండాలి. వీటిని పట్టించుకోకుండా స్థానిక నేతల ఒత్తిళ్లకు తలొగ్గి, నిశిత పరిశీలన లేకుండానే ఆ భూములను అధికారులు కొన్నారు. ఉమ్మడి కృష్ణా, తూర్పుగోదావరి, విశాఖ, విజయనగరం, గుంటూరు, నెల్లూరు తదితర జిల్లాల్లో పట్టణాలు, గ్రామాల శివారుల్లోని పలు భూములను జగనన్న కాలనీల కోసం నాటి ప్రభుత్వం కొనుగోలుచేసింది. వీటికి సమీపంలోనే కొన్నిచోట్ల ఎసైన్డ్ స్థలాలు ఉన్నాయి. వాటినీ తీసుకుంది. కొనుగోలుచేసే ముందు వారికి ఆ స్థలాలు ఏ విధంగా సంక్రమించాయి? ప్రస్తుతం ఎవరి పేరిట ఉన్నాయి? భూ రికార్డుల్లో, వెబ్‌ల్యాండ్‌లో వారి పేర్లున్నాయా? లేవా? అని సరిచూసుకోవాలి. కొన్నిచోట్ల రెవెన్యూ సిబ్బంది మామూళ్లకు కక్కుర్తిపడి, ఎసైన్డ్ అని కాకుండా ప్రైవేట్ భూములుగా వెబ్‌ల్యాండ్‌లో నమోదుచేశారు. యజమానుల పేర్లనూ మార్చేశారు.

కృత్రిమ డిమాండ్‌ను సృష్టించి...

జగనన్న కాలనీల కోసం ప్రభుత్వం కొనాలని భావించిన స్థలాలకు కృత్రిమ డిమాండ్‌ను సృష్టించి రేట్లు పెంచేసి, ముందస్తు ఒప్పందాలతో వైకాపా నేతలు లబ్ధి పొందారు. స్థలాల ఎంపిక దగ్గర నుంచి కొనుగోళ్లకు ధరల ఖరారు దాకా వారి పెత్తనమే సాగింది. తమ వారి భూములు ఎక్కడ అధికంగా ఉంటే అక్కడే కొనుగోళ్లు సాగేలా జాగ్రత్తలు తీసుకున్నారు.

లబ్ధిదారుల నుంచి వివరాల సేకరణ

జిల్లాల్లో ఎసైన్డ్ భూముల కొనుగోళ్లపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. ప్రభుత్వం నుంచి నష్ట పరిహారాన్ని అందుకున్న వారితో మాట్లాడుతున్నారు. ఎసైన్డ్ భూమిని ఎప్పుడు పొందారు? ప్రస్తుతం ఎవరి పేరిట ఉంది? భూములు చేతులు మారాయా? అమ్మకం తర్వాత చెల్లింపులు ఎలా జరిగాయన్న దానిపై వివరాలు సేకరిస్తున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా గన్నవరం చుట్టుపక్కల వెబ్‌ల్యాండ్‌లో అక్రమంగా పేర్లు మార్చిన ఎసైన్డ్ భూముల కొనుగోళ్లు జరిగినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులందాయి. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో ఆక్రమణల్లో ఉన్న ప్రభుత్వ భూములను నిబంధనలకు విరుద్ధంగా కొన్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. లోతుగా విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు బయటపడతాయని భావిస్తున్నారు.

ఆశావర్కర్‌కూ తప్పని డోలీ తిప్పలు!

గిరిజన గ్రామాల్లో ఎవరికి ఆరోగ్య సమస్య వచ్చినా మేమున్నామని వచ్చే ఆశా కార్యకర్తలకూ ఆసుపత్రికి వెళ్లడానికి తిప్పలు తప్పట్లేదు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం ఎగువ కాశాయివలసకు చెందిన ఆశా కార్యకర్త కూనేటి శ్యామల(45) జ్వరం, విరేచనాలు, వాంతులతో బుధవారం అపస్మారక స్థితికి వెళ్లారు. గ్రామానికి రహదారి లేకపోవడంతో 108 వాహనం రాలేని పరిస్థితి. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికులు డోలీలో దాదాపు 5 కి.మీ. కొండలు, గుట్టలతో పాటు, సువర్ణముఖి నది దాటుకుని కురుకుట్టి గ్రామానికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఓ ప్రైవేటు వాహనంలో సాలూరు ప్రాంతీయాసుపత్రికి తరలించారు. ప్రస్తుతానికి ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం



కొండ వాలుపై డోలీతో ఆశా కార్యకర్తను తీసుకొస్తున్న స్థానికులు

నాగభూషణం, రఘు, బాబీలకు తానా పురస్కారాలు

ఈనాడు, అమరావతి: ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) పురస్కారాలకు ముగ్గురు ఎంపికయ్యారు. వ్యవసాయ రంగంలో సేవలకు గాను భాజపా రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జి పాతూరి నాగభూషణం, ఫైనాన్షియల్ టెక్నాలజీలో చేసిన కృషికి విజయవాడకు చెందిన రఘు యార్లగడ్డ, వైద్యరంగంలో సేవలకు గాను అమెరికన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు బాబీ ముక్కామల పురస్కారాలకు ఎంపికయ్యారు. బాబీ ముక్కామల కృష్ణా జిల్లా వాసి. నోవైలో గురువారం నుంచి జరగనున్న తానా 24వ మహాసభల్లో వీరికి అవార్డులు ప్రదానం చేయనున్నారు.

ముగిసిన డీఎస్సీ పరీక్షలు

ఈనాడు, అమరావతి: జూన్ 6న ప్రారంభమైన మెగా డీఎస్సీ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. డీఎస్సీకి 3,36,307 మంది అభ్యర్థులు అన్ని పోస్టులకు కలిపి 5,77,694 దరఖాస్తులు సమర్పించారు. ఈ పరీక్షలకు 5,36,690 (92.90%) మంది హాజరయ్యారు.

వంశీ అక్రమ మైనింగ్ కేసులో దర్యాప్తు నివేదిక సమర్పించండి

- ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నిర్దేశం

ఈనాడు, దిల్లీ: గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై నమోదైన అక్రమ మైనింగ్ కేసులో ఇప్పటి వరకూ నిర్వహించిన దర్యాప్తు నివేదికను సీల్డ్‌కవర్‌లో సమర్పించాలని ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నిర్దేశించింది. ఈ కేసులో వంశీకి ముందస్తు బెయిల్ మంజూరుచేస్తూ ఏపీ హైకోర్టు మే 29న జారీచేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ రాష్ట్రప్రభుత్వం దాఖలుచేసిన ఎస్‌ఎల్‌పీపై బుధవారం విచారించిన జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి విచారణను ఈ నెల 17కు వాయిదా వేసింది. ఈ కేసులో ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ "నిందితుడు తనపై మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదైన విషయాన్ని బెయిల్ దరఖాస్తులో దాచిపెట్టారు. తొలుత ముందస్తు బెయిల్ అప్లికేషన్ హైకోర్టు ముందుకు మే 19న వచ్చింది. దాన్ని 20న విచారణకు స్వీకరించింది. ఆ రోజు మేం ఈ కేసులో ప్రొడక్షన్ వారంటు ఉందని, పిటిషనర్‌ను అరెస్టుచేయాలని చెప్పాం. అయితే కోర్టు తదుపరి విచారణ కోసం కేసును పెండింగ్‌లో పెట్టింది. ఇది రూ.195 కోట్ల అవినీతి కేసు. ఖనిజం, ఇసుకను అక్రమంగా విక్రయించారు. ఇలాంటి కేసులో రాష్ట్రప్రభుత్వ స్పందన సమర్పించడానికైనా అవకాశం ఇవ్వాల్సి ఉన్నా హైకోర్టు ఇవ్వలేదు. ఇతర కేసుల్లో సాక్షులను బెదిరించిన చరిత్ర ఈయనకు ఉంది" అని వాదించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎంఎం సుందరేష్ జోక్యం చేసుకుంటూ ఫిర్యాదులోనే విషయాలు సరిగా లేవు కదా? అని ప్రశ్నించారు. ఇందుకు సిద్ధార్థ లూథ్రా బదులిస్తూ ఫిర్యాదుతో పాటు 700 పేజీల దర్యాప్తు నివేదికను సమర్పించామని, అది చాలా పెద్దగా ఉన్నందున ఈ పిటిషన్‌తో పాటు దాఖలు చేయలేదని కోర్టుకు విన్నవించారు. అందుకు జస్టిస్ సుందరేష్ స్పందిస్తూ "మీరు దర్యాప్తు నివేదికను సమర్పించండి. తర్వాత పరిశీలిస్తాం" అని సూచించారు. అందుకు లూథ్రా అంగీకరించారు. విషయాలు బయటకు పొక్కకుండా తాము నివేదికను సీల్డ్‌కవర్‌లో సమర్పిస్తామని చెప్పడంతో అందుకు న్యాయమూర్తి అంగీకరిస్తూ తదుపరి విచారణను 17కు వాయిదా వేశారు. మరోవైపు ఒక ఆస్తి వివాదం కేసులో వల్లభనేని వంశీ తమను బెదిరించినందున ఆయనకు హైకోర్టు జారీచేసిన ముందస్తు బెయిల్ రద్దుచేయాలని కోరుతూ సుంకర సీతామహాలక్ష్మి అనే మహిళ దాఖలుచేసిన మరో పిటిషన్‌ను జస్టిస్ మనోజ్ మిశ్ర, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం కొట్టేసింది. ఇందులో వంశీ బృందం 2024 ఏప్రిల్ 26న దాడిచేసినట్లు ఆరోపించిన పిటిషనర్.. 2025 ఫిబ్రవరి 24న ఫిర్యాదు చేయడాన్ని దృష్టిలో ఉంచుకొని కోర్టు ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది.

కొబ్బరి 'ధర'హాసం

- మరింత పెరుగుతుందని అటకలపై నిల్వ చేస్తున్న రైతులు



గంగలకుర్రులో అటకపై కొబ్బరికాయలు

అంబాజీపేట, న్యూస్‌టుడే: కోనసీమలో మూడు నెలలుగా పచ్చి కొబ్బరికాయల ధరలు పెరగడంతో పాటు కురిడీలకూ డిమాండ్ రావడంతో రైతులు, వర్తకులు వాటిని పెద్దఎత్తున సేకరిస్తున్నారు. రానున్న పండగలకు మంచి ధర వస్తుందని నిల్వ చేస్తున్నారు. పచ్చికాయలను అటకలపై వేసి, ఆరు మాసాల పాటు ఉంచితే వాటిలోని నీరు ఇంకిపోయి కురిడీగా మారతాయి. వీటి ధరలు రానున్న రోజుల్లో మరింత పుంజుకునే అవకాశం ఉందని భావిస్తూ కాయలను పెద్దఎత్తున అటకలపై నిల్వ చేస్తున్నారు. ఏటా ఏప్రిల్, మే నెలల్లో రైతులు ఎక్కువగా పచ్చికాయలను కురిడీలుగా చేసేందుకు అటకలపై పోసేవారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో వ్యాపారులు పచ్చికాయలకు మంచి ధర ఇచ్చి కొనుగోలు చేయడంతో చాలామంది విక్రయించేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో పచ్చికాయలకు మునుపెన్నడూ లేనివిధంగా ధర వస్తున్నప్పటికీ.. అమ్మకుండా అటకలపై వేయడం చెప్పుకోదగ్గ పరిణామమని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. కోనసీమ కొబ్బరి మార్కెట్‌లో బుధవారం నాటి ధరలను పరిశీలిస్తే.. కొత్తకొబ్బరి క్వింటాకు రూ.24 వేలు పలుకుతోంది. ఇది రికార్డుగా ఉంది. కురిడీలు గండేరా రకం వెయ్యింటికి రూ.29,000, గటగట రకం రూ.26,000, కొత్తకాయలు కురిడీ గండేరా రకం 28,000, గటగట రకం రూ.25,000 పలుకుతున్నాయి. పచ్చి కాయల ధర వెయ్యింటికి రూ.19,000 నుంచి రూ.21,000గా ఉంది. ఈ ధరలు రికార్డుగా వ్యాపారులు చెబుతున్నారు.

జిల్లాకో 'మ్యాజిక్ డ్రైన్'

ప్రయోగాత్మకంగా అమలుకు ఏర్పాట్లు

ఈనాడు, అమరావతి: జిల్లాకో కాలనీలో మ్యాజిక్ డ్రైన్ నిర్మాణం చేపట్టనున్నారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం సోమవరం గ్రామంలో 450 మీటర్ల పొడవునా చేపట్టిన మ్యాజిక్ డ్రైన్‌కు స్పందన బాగుండటంతో రాష్ట్రవ్యాప్తంగా జిల్లాకో కాలనీలో ప్రయోగాత్మకంగా నిర్మించాలని నిర్ణయించారు. ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు పారడానికి రహదారుల పక్కన ఇప్పటి వరకు నిర్మిస్తున్న సాధారణ సిమెంట్ కాలువ స్థానంలో మ్యాజిక్ డ్రైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. వీటితో నీటిని భూమిలో ఇంకింపజేయొచ్చని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా కిలోమీటర్ సిమెంట్ కాలువ నిర్మాణానికి రూ.50 లక్షలు ఖర్చు చేస్తున్నారు. అదే కిలోమీటర్ మ్యాజిక్ డ్రైన్ నిర్మాణాన్ని రూ.9 లక్షలతో పూర్తి చేయొచ్చని ఇంజినీర్లు అంటున్నారు. జిల్లాకు ఒకటి చొప్పున కాలనీలను ఎంపిక చేసే బాధ్యత జిల్లా జల యాజమాన్య సంస్థ (డ్వామా) పథక సంచాలకులకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అప్పగించింది.



మ్యాన్‌హోల్‌లో ప్రమాదకరంగా దిగి కాలువ శుభ్రం చేస్తున్న కార్మికుడు



అధికారులకు దయ లేదు.. కార్మికులకు మరో దారి లేదు!

పూడికతీత పనులను చేపట్టిన నెల్లూరు నగరపాలకసంస్థ అధికారులు కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల ప్రాణాలను పణంగా పెడుతున్నారు. గ్లోవ్‌లు, మాస్కులు, షూస్ వంటి కనీస రక్షణ పరికరాలు ఇవ్వకుండా మ్యాన్‌హోల్స్ శుభ్రం చేయిస్తున్నారు. బుధవారం ఓ కార్మికుడు కలెక్టర్ కార్యాలయం ఎదుట మ్యాన్‌హోల్‌లో మురుగునీరు, మలమూత్రాల్లో మునిగి శుభ్రం చేస్తున్న చిత్రం ఇది.

– ఈనాడు-నెల్లూరు, న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

మేడారం మహాజాతర తేదీలు ఖరారు

తాడ్వాయి, న్యూస్‌టుడే: తెలంగాణ కుంభమేళాగా పేరొందిన మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతర తేదీలు ఖరారయ్యాయి. రెండేళ్లకోసారి నాలుగు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవం తేదీలను బుధవారం పూజారులు మేడారంలో ప్రకటించారు. మాఘశుద్ధ పౌర్ణమికి ముందు వచ్చే బుధవారం రోజున ఈ ఉత్సవం ప్రారంభమవుతుంది. ఎప్పుడూ ఫిబ్రవరి నెలలో వచ్చే ఈ జాతర ఈసారి పక్షం రోజుల ముందుగానే వచ్చింది.

జాతర తేదీలు: 28.01.2026 బుధవారం సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెకు రావడం, 29.01.2026 గురువారం సమ్మక్క దేవత గద్దెకు రావడం, 30.01.2026 శుక్రవారం భక్తులు మొక్కులు సమర్పించుకోవడం, 31.01.2026 శనివారం దేవతల వనప్రవేశం.

భూ అక్రమాలకు పాల్పడిన పూర్వ తహసీల్దార్‌పై అభియోగాల నమోదు!

ఈనాడు, అమరావతి: భూ అక్రమాలకు పాల్పడ్డ వైఎస్సార్ కడప జిల్లా సి.కె.దిన్నె మండలం పూర్వ తహసీల్దార్ బి.మహేశ్వరరెడ్డిపై రాష్ట్ర ప్రభుత్వం అభియోగాలు మోపింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆయన వైఎస్సార్ కడప జిల్లాలోని సి.కె.దిన్నె, అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలాలకు తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలో ప్రభుత్వ, ప్రైవేట్ భూముల విషయంలో భారీగా అక్రమాలకు పాల్పడ్డారు. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ, ప్రైవేట్ భూములను పరాధీనం చేశారు. వెబ్‌ల్యాండ్‌లో యజమానుల పేర్లను తన ఇష్టమొచ్చినట్లు మార్చేశారు. విధులను పూర్తిగా దుర్వినియోగం చేశారు. సి.కె.దిన్నె మండలం మామిళ్లపల్లి గ్రామంలో నిషిద్ధ జాబితాలో ఉన్న సర్వే నంబర్లు 455/5, 455/6లో 5.00 ఎకరాలు, 1.13 ఎకరాల విషయంలో నిబంధనలు ఉల్లంఘించి, తనకు అనుకూలురైన వ్యక్తుల పేర్లతో మార్చేశారు. దీనిపై జిల్లా అధికారుల నుంచి అందిన నివేదిక మేరకు మహేశ్వరరెడ్డిపై రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి అభియోగాలు నమోదుచేస్తూ బుధవారం ఉత్తర్వులిచ్చారు. 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని మహేశ్వరరెడ్డిని ఆదేశించారు. మరోవైపు, 2022లోనే మహేశ్వరరెడ్డి సస్పెన్షన్‌కు గురయ్యారు. అనంతరం 2 నెలలకే తిరిగి విధుల్లో చేరారు. ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్ హోదాలో నెల్లూరు సర్వజన ఆసుపత్రిలో అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తున్నారు.

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి హైకోర్టులో చుక్కెదురు

అరెస్టు నుంచి రక్షణ కల్పించేందుకు నిరాకరణ

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి హైకోర్టులో చుక్కెదురైంది. అరెస్టు నుంచి రక్షణ కల్పించేందుకు న్యాయస్థానం నిరాకరించింది. తీవ్రమైన ఆరోపణలున్న ఇలాంటి కేసులో అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వలేమని తేల్చి చెప్పింది. పోలీసులు అరెస్టు చేస్తారనే ఆందోళన ఉంటే హైకోర్టులో ముందస్తు బెయిలు పిటిషన్ దాఖలు చేసుకోవాలని సూచించింది. తనపై నమోదైన కేసును కొట్టేయాలని, నిందితుల జాబితా నుంచి తన పేరును తొలగించేలా ఆదేశించాలని మోహిత్ చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది. పిటిషన్‌పై విచారణను ఈ నెల 9కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

★ మద్యం కుంభకోణం కేసులో సీఐడీ పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి కుమారుడు, తుడా మాజీ ఛైర్మన్ మోహిత్‌రెడ్డి(ఏ39) హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. బుధవారం జరిగిన విచారణలో సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. ఓ వైపు పిటిషనర్‌ను కేసులో నిందితుడిగా పేర్కొంటూ మరో వైపు సాక్షిగా విచారణకు హాజరుకావాలని దర్యాప్తు అధికారి(ఐఓ) నోటీసు ఇచ్చారన్నారు. ఇలాంటి చర్య సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమన్నారు. ఈ వాదనలపై న్యాయమూర్తి స్పందిస్తూ.. దర్యాప్తులో భాగంగా వివరాలు తెలుసుకునేందుకు సాక్షిగా తన ముందు హాజరుకావాలని మోహిత్‌రెడ్డికి నోటీసు ఇచ్చే అధికారం ఐఓకు ఉందన్నారు. 'నందిని సత్పతి' కేసులో సుప్రీంకోర్టు ఈ విషయాన్ని స్పష్టం చేసిందని గుర్తుచేశారు. అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వలేమని తేల్చి చెప్పారు.

ఏపీపీఎస్సీ కేసులో మధుసూదన్‌కు రిమాండ్ పొడిగింపు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏపీపీఎస్సీ ప్రశ్నపత్రాల అవకతవకల కేసులో ఏ2గా ఉన్న మధుసూదన్ రిమాండ్‌ను పొడిగించారు. ఈ కేసులో ఏ1గా పీఎస్సార్ ఆంజనేయులు, ఏ2గా క్యామ్ షైన్ సంస్థ డైరెక్టర్ మధుసూదన్ ఉన్నారు. పీఎస్సార్ ఆంజనేయులు మధ్యంతర బెయిల్‌పై విడుదల కాగా మధుసూదన్ మాత్రం జైలులోనే ఉన్నారు. రిమాండ్ గడువు ముగియడంతో ఆయన్ను ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ముందు బుధవారం హాజరుపరిచారు. ఈ నెల 16 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

EENADU Vol: 51, Issue: 324 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

(c) eenadu

దోజ్ రాక్షసుడిలాంటిది

• మస్క్‌నూ తినేస్తుంది: ట్రంప్

ఇంటర్నెట్ డెస్క్: డోజ్.. మస్క్‌వైపు చూస్తుందని భావిస్తున్నానని, ఒకవేళ అదే జరిగితే మనం చాలా డబ్బు ఆదా చేసుకోవచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభిప్రాయపడ్డారు. 'మస్క్‌పై డోజ్‌ను ప్రయోగించాల్సి రావొచ్చు. డోజ్ అంటే ఏమిటో మీకు తెలుసు కదా.. అది రాక్షసుడు లాంటిది. అది తిరిగి వెళ్లి ఎలాన్ మస్క్‌ను తింటుంది. అది ఎంతో భయంకరమైనది' అని వ్యాఖ్యానించారు. ఫ్లోరిడా పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడారు.

మస్క్ వెనక్కి తగ్గినట్లేనా?

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, టెస్లా అధిపతి ఎలాన్ మస్క్‌ల మధ్య వివాదం కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో మస్క్‌ను దేశం నుంచి బహిష్కరించాలని వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో మస్క్ వెనక్కి తగ్గినట్లు కనిపిస్తోంది. మస్క్‌ను దేశం నుంచి బహిష్కరిస్తారా.. అని విలేకరులు ఇటీవల ట్రంప్‌ను ప్రశ్నించగా.. ఆయన పరిశీలిస్తున్నామని బదులిచ్చారు. ఆ తర్వాత ట్రంప్ మాట్లాడిన వీడియోను మస్క్ పోస్టు చేశారు. 'దీనిని మరింత పెద్దది చేయాలని ఉత్సాహంగా ఉంది. కానీ ప్రస్తుతం ఏమీ చేయదల్చుకోలేదు' అని మస్క్ పేర్కొన్నారు. దీంతో ఆయన వెనక్కి తగ్గినట్లు భావిస్తున్నారు.

8 గంటల ముందు చార్టులపై రైల్వేశాఖ ఆదేశాలు

దిల్లీ: రిజర్వేషన్ చార్టులను.. రైలు బయల్దేరడానికి ఎనిమిది గంటల ముందుగానే సిద్ధం చేయాలన్న నిర్ణయానికి సంబంధించి రైల్వే మంత్రిత్వశాఖ బుధవారం ఆదేశాలు జారీచేసింది. తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 2 లోపు బయల్దేరే రైళ్లకైతే ముందురోజు రాత్రి 9 గంటలకే చార్టులు రూపొందించాలని పేర్కొంది. ఈ మేరకు సిబ్బందికి తగిన సూచనలు జారీ చేయాలని జోన్లకు సూచించింది. మార్పు ఏ తేదీ నుంచి అమలయ్యేదీ పేర్కొనలేదు. 8 గంటల ముందుగా చార్టు సిద్ధమయ్యాక బెర్తులు ఖాళీగా మిగిలితే కరెంట్ బుకింగ్ కింద తీసుకోవచ్చని, రైలు బయల్దేరడానికి ఐదు నిమిషాల నుంచి అరగంటలోపు రెండో చార్టు తయారవుతుందని రైల్వే అధికారి ఒకరు తెలిపారు.

పద్మ అవార్డుల దరఖాస్తు గడువు జులై 31

దిల్లీ: గణతంత్ర వేడుకల సందర్భంగా 2026 సంవత్సరానికి సంబంధించి ప్రకటించే పద్మ పురస్కారాల కోసం దరఖాస్తుల గడువు జులై 31 వరకే ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మార్చి 15 నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలిపింది. నామినేషన్లు, సిఫార్సులను రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ https://awards.gov.in ద్వారా సమర్పించాలని కేంద్రం సూచించింది. నామినేషన్ లేదా సిఫార్సులో సంబంధిత వ్యక్తి పూర్తి వివరాలు ఉండాలని.. అవార్డుకు ప్రతిపాదిస్తున్న వ్యక్తి చేసిన విశిష్టమైన సేవ, కృషిని స్పష్టంగా తెలియజేయాలని కేంద్రం పేర్కొంది.

అనధికార వ్యక్తుల అభ్యర్థనలను పట్టించుకోం

• స్పష్టంచేసిన కేంద్ర ఎన్నికల సంఘం

దిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ)తో సమావేశం కావాల్సి ఉందంటూ వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తుల నుంచి పదేపదే అభ్యర్థనలు వస్తున్న నేపథ్యంలో ఈసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఆయా రాజకీయ పార్టీల అధ్యక్షుల నుంచి వస్తేనే ఇలాంటి అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించింది. బుధవారం దిల్లీలో అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. బిహార్ ఓటర్ల జాబితా సవరణపై చర్చించేందుకు ఎన్నికల సంఘంతో సమావేశం కావాల్సి ఉందంటూ రాజకీయ పార్టీలకు చెందినవారమంటూ పలువురు వ్యక్తులు అభ్యర్థనలు పంపుతున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఇలాంటి అనధికార వ్యక్తుల అభ్యర్థనలను పట్టించుకోరాదని నిర్ణయించింది. బిహార్ శాసనసభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు భాజపా.. అర్హులైన కొందరు పౌరులకు ఓటు హక్కును దూరం చేసేందుకు రాష్ట్ర యంత్రాంగాన్ని వినియోగించుకుంటోందని పలు ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై చర్చించేందుకు జులై 2న ఎన్నికల సంఘం అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలంటూ కాంగ్రెస్ పార్టీకి చెందిన న్యాయవాది ఒకరు కోరారు. ఈ విషయమై జూన్ 30న ఆయన ఓ ఈ-మెయిల్ పంపారు. తాను పలు పార్టీల తరఫున ఈ విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొన్న ఆయన ఇండియా కూటమిలోని దాదాపు అన్ని పార్టీల పేర్లను ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో అనధికార వ్యక్తుల అభ్యర్థనలను పట్టించుకోబోమని ఈసీ వెల్లడించింది.

గ్రామాల్లో 2 రోజుల ముందే వరద హెచ్చరిక

• కేంద్రీకృత వ్యవస్థ ప్రారంభం

దిల్లీ: గ్రామాల్లో రెండు రోజుల ముందే వరదల గురించి సమాచారం అందించే కేంద్రీకృత వరద హెచ్చరిక వ్యవస్థ.. 'సీ-ఫ్లడ్'ను బుధవారం కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ ప్రారంభించారు. ఇది వెబ్ ఆధారంగా పనిచేసే వ్యవస్థ. గ్రామ స్థాయిలో రెండు రోజుల ముందుగా వరదలకు సంబంధించిన హెచ్చరికలను చేస్తుంది. ఈ వ్యవస్థను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), సీడాక్, జాతీయ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (ఎన్ఆర్ఎస్సీ) కలిసి అభివృద్ధి చేశాయి. దానిని జాతీయ సూపర్‌కంప్యూటింగ్ మిషన్ (ఎన్ఎస్ఎం) నిర్వహిస్తుంది.

సెలవుపై వెళ్లిన వైద్యసేవ ట్రస్ట్ సీఈఓ

ఆయుష్ డైరెక్టర్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ సీఈఓ పి.రవిసుభాష్ సెలవుపై వెళ్లారు. జూన్ 30 నుంచి జులై 11 వరకు సీఈఓ సెలవుపై వెళ్లడంతో.. పూర్తి అదనపు బాధ్యతలను ఆయుష్ సంచాలకులు కె.దినేష్‌కుమార్‌కు అప్పగించినట్లు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఈ ఉత్తర్వులు అమలవుతాయని పేర్కొన్నారు. గత వారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ట్రస్ట్ పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. సీఈఓ రవిసుభాష్ పనితీరు, నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం, దస్త్రాల పరిష్కారంలో ఆలస్యం తదితర సమస్యలు చర్చకు వచ్చాయి. ఈయన పనితీరుపై వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు అసంతృప్తి వ్యక్తం చేయడంతో సెలవుపై వెళ్లారనే చర్చ నడుస్తోంది.

విద్యార్థి వీసాలకూ కాలపరిమితి!

• అమెరికా కొత్త మెలిక

ఇంటర్నెట్ డెస్క్: విద్యార్థి వీసాలపైనా అమెరికా మరిన్ని ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వీసాల జారీకి 'సోషల్ మీడియా వెట్టింగ్'ను కఠినంగా అమలు చేస్తున్న అగ్ర రాజ్యం.. తాజాగా మరో మార్పు తీసుకురావాలని భావిస్తోంది. ఈ వీసాలకూ కాల పరిమితి విధించాలని భావిస్తోంది. ప్రస్తుతం ఎఫ్-1 వీసాలపై అమెరికాలో ఉన్న అంతర్జాతీయ విద్యార్థులు, జే-1 వీసాలపై వచ్చిన ఎక్స్ఛేంజ్ విజిటర్లకు 'డ్యురేషన్ ఆఫ్ స్టేటస్' వెసులుబాటు ఉంది. అంటే.. వారు ఎంతకాలం చదవాలనుకుంటే, ఇంటర్న్‌షిప్‌లో పాల్గొనాలనుకుంటే.. అంతకాలం అగ్రరాజ్యంలో ఉండొచ్చు. ఎక్స్ఛేంజ్ విజిటర్లుగా వచ్చే విద్యార్థులు, ప్రొఫెసర్లు, స్కాలర్లు, స్పెషలిస్టులు, ట్రైనీలు, ఇంటర్న్‌లు, పిజిషియన్లకూ ఈ సదుపాయం వర్తిస్తుంది. ఈ విధానంలోనే మార్పులు తీసుకొచ్చి కాల పరిమితి విధించాలని హోంలాండ్ విభాగం ప్రతిపాదనను సిద్ధం చేసింది. 'పరిమిత కాల నివాస అనుమతి'తో కూడిన వీసాలను మంజూరు చేయాలని సూచించింది.

ట్రంప్‌పై 20 రాష్ట్రాల దావా

• లక్షల మంది మెడిక్‌ఎయిడ్ డేటాను డిపోర్టేషన్ అధికారులకు అందించారని ఫిర్యాదు

వాషింగ్టన్: లక్షల మంది మెడిక్‌ఎయిడ్ డేటాను డిపోర్టేషన్ అధికారులకు అందించిన వ్యవహారంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై 20 రాష్ట్రాలు దావా వేశాయి. ఫెడరల్ చట్టాలను ఈ చర్య ఉల్లంఘించిందని ఆరోపించాయి. తనతోపాటు 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్.. ఈ దావా వేశారని కాలిఫోర్నియా అటార్నీ జనరల్ రాబ్ బొంటా మంగళవారం వెల్లడించారు. ఆరోగ్యశాఖ మంత్రి రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ జూనియర్ సలహాదారుల.. ప్రైవేటు ఆరోగ్య సమాచారాన్ని డిపోర్టేషన్ అధికారులకు అందించారని వివరించారు. కాలిఫోర్నియా, ఇల్లినాయ్, వాషింగ్టన్, వాషింగ్టన్ డీసీల్లోని మెడిక్‌ఎయిడ్ డేటాను హోంలాండ్ అధికారులకు ఇచ్చారని తెలిపారు. ఈ రాష్ట్రాల్లో అమెరికాయేతర పౌరులు మెడిక్‌ఎయిడ్‌లో పేర్లు నమోదు చేసుకోవడానికి అవకాశముంది. డిపోర్టేషన్ అధికారులకు అందించిన డేటాలో.. చిరునామాలు, పేర్లు, సోషల్ సెక్యూరిటీ నంబర్లు, ఇమ్మిగ్రేషన్ స్టేటస్ తదితర వివరాలున్నాయి. దీనిద్వారా అక్రమంగా ఉంటున్న వారిని గుర్తించి స్వదేశాలకు పంపేందుకు అధికారులు చర్యలు తీసుకునే అవకాశముంది. ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య.. ఫెడరల్ హెల్త్ ప్రైవసీ ప్రొటెక్షన్ చట్టాలకు విరుద్ధమని బొంటా తెలిపారు. ఇందులో ఆరోగ్య బీమా పోర్టబిలిటీ, ఎకౌంటబిలిటీ చట్టం ఉంది.




ఫ్లోరిడాలో ఒబెవ్‌లోని వలసవాదుల నిర్బంధ కేంద్రాన్ని సందర్శిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

ట్రంప్‌నకు 1.6 కోట్ల డాలర్ల పరిహారం

• కమలా హారిస్ ఇంటర్వ్యూను ఎడిట్ చేసినందుకు చెల్లించనున్న పారామౌంట్ సంస్థ

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో అధ్యక్ష అభ్యర్థిగా పోటీ చేసిన కమలా హారిస్ ఇంటర్వ్యూను ఎడిట్ చేసి ప్రసారం చేసినందుకు పారామౌంట్ సంస్థ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. సీబీఎస్ ఛానల్‌లో '60 మినిట్స్'లో భాగంగా ప్రసారం చేసిన ఈ ఇంటర్వ్యూపై ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్ దావా వేశారు. దీంతో రాజీకొచ్చిన పారామౌంట్ సంస్థ.. ఆయనకు 1.6 కోట్ల డాలర్లు చెల్లించేందుకు అంగీకరించింది. అయితే ఈ డబ్బు.. ట్రంప్ సొంత ఖాతాలోకి వెళ్లదు. భవిష్యత్తులో ఆయన ఏర్పాటు చేయనున్న అధ్యక్ష లైబ్రరీకి వెళ్తుంది. రాజీలో భాగంగా తాము ఎటువంటి క్షమాపణలు చెప్పలేదని ఆ సంస్థ వెల్లడించింది. హారిస్ స్వరాన్ని మెరుగుపరచడానికి ఇంటర్వ్యూను ఎడిట్ చేశారని, తాను వేసిన దావాను కొట్టివేయడానికి ప్రయత్నించారని ట్రంప్ ఆరోపించారు. ఆ ఇంటర్వ్యూవల్ల ట్రంప్ మానసిక సంఘర్షణకు గురయ్యారని ఆయన న్యాయవాది తెలిపారు. ఈ ఒప్పందంపై శ్వేతసౌధం ఎటువంటి ప్రకటన చేయలేదు.

అమెరికా సరిహద్దుల్లో దొరికిన 10,382 మంది భారతీయులు



ఇంటర్నెట్ డెస్క్: అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తూ ఈ ఏడాది జనవరి నుంచి మే మధ్యలో 10,382 మంది భారతీయులు దొరికిపోయారు. వీరిలో పెద్దల రక్షణ లేని 30 మంది పిల్లలు కూడా ఉన్నారు. అక్రమంగా ప్రవేశించేందుకు యత్నించిన వారిలో కూడా అత్యధికంగా గుజరాత్ రాష్ట్రానికి చెందిన వారు ఉండటం గమనార్హం. ఈ వివరాలను అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విభాగం విడుదల చేసింది. జోబైడెన్ కాలంలో అమెరికా సరిహద్దుల్లో భద్రతా చర్యలు కట్టుదిట్టం కావడంతో అక్రమ వలసదారులను భారీ సంఖ్యలో అరెస్టు చేస్తున్నారు. గతేడాది ఇదే సీజన్‌లో మొత్తం 34,535 మంది భారతీయులను అక్రమంగా చొరబడుతూ పట్టుకున్నారు. ఈ లెక్కన ఈ ఏడాది సుమారు 70శాతం తగ్గుదల నమోదైంది. 2024 ఆర్థిక సంవత్సరంలో తల్లిదండ్రులు వదిలేసిన 500 మైనర్లను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అమెరికా-మెక్సికో, అమెరికా-కెనడా సరిహద్దుల్లో చాలా మంది తమ పిల్లలకైనా అగ్రరాజ్య పౌరసత్వం వస్తుందన్న ఆశతో వారిని వదిలేసి వెళ్లేవారు. కానీ.. ట్రంప్ అధికారం చేపట్టాక ఇలా పిల్లలను వదిలేయడాన్ని మరింత కఠినంగా వ్యవహరిస్తున్నారు. తరచూ ఇక్కడి అధికారులు గుర్తించే పిల్లల వయసు 12 నుంచి 17 ఏళ్ల మధ్యలో ఉంటోంది. ఏప్రిల్ 2024 నాటికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ లెక్కల ప్రకారం అమెరికాలో 2.2 లక్షల మంది భారతీయులు ఎటువంటి పత్రాలు లేకుండా జీవిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి 332 మందిని అక్కడి నుంచి వెనక్కి పంపారు.

దుష్ప్రవర్తన, లైంగిక ఆపేక్ష లేకుండా.. 'ఐ లవ్ యూ' చెప్పడాన్ని పోక్సో నేరంగా పరిగణించలేం

• బాంబే హైకోర్టులోని నాగ్‌పుర్ ధర్మాసనం తీర్పు

ఇంటర్నెట్‌డెస్క్: పోక్సో కేసులో దిగువ కోర్టు దోషిగా తేల్చి శిక్ష విధించిన వ్యక్తికి బాంబే హైకోర్టులో ఉపశమనం లభించింది. వెంటబడి వేధించడం, శరీర భాగాలను తాకడం, లైంగికపరమైన దురుద్దేశం వంటి చేష్టలు లేకుండా కేవలం 'ఐ లవ్ యూ' అని చెప్పడాన్ని పోక్సో చట్టం కింద నేరంగా పరిగణించలేమని నాగ్‌పుర్ ధర్మాసనానికి చెందిన జస్టిస్ ఊర్మిళా జోషి ఫాల్కే తెలిపారు. నిందితుడికి విధించిన శిక్షను రద్దు చేస్తూ అతని విడుదలకు ఆదేశించారు. పాఠశాల నుంచి తిరిగి వస్తున్న తనకు అడ్డుగా వచ్చి 'ఐ లవ్ యూ' చెప్పాడంటూ 17 ఏళ్ల బాలిక 2015లో ఫిర్యాదు చేయడంతో నిందితుడైన 25 ఏళ్ల యువకుడిపై పోక్సో, భారతీయ నేర శిక్షాస్మృతి కింద కేసు దాఖలైంది. యువకుడిని దోషిగా తేల్చిన నాగ్‌పుర్‌లోని అదనపు సెషన్స్ కోర్టు 2017లో మూడేళ్ల జైలు శిక్ష విధించింది. దీనిపై హైకోర్టులో అప్పీలు దాఖలు కాగా జస్టిస్ ఊర్మిళా జోషి ఫాల్కే తీర్పు వెలువరించారు. 'ఐ లవ్ యూ' చెప్పడంలో లైంగిక ఉద్దేశం ఉన్నట్లు నిరూపణ కాలేదని, నిందితుడు ఆ అమ్మాయిని తాకడం గానీ, అసభ్యకరమైన సైగలు చేసినట్లు గానీ, వెంటబడి వేధించినట్లు గానీ నిరూపణ జరగలేదని పేర్కొన్నారు.

వరద హెచ్చరికల స్థాయి దాటి పొంగి ప్రవహిస్తున్న 11 నదులు

• కేంద్ర జలసంఘం వెల్లడి

దిల్లీ: దేశవ్యాప్తంగా 11 నదులు వరద హెచ్చరికల స్థాయిని దాటి పొంగి ప్రవహిస్తున్నాయని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) బుధవారం వెల్లడించింది. ప్రమాదకర పరిస్థితి మాత్రం ఇంకా ఎక్కడా లేదని, సెంట్రల్ ఫ్లడ్ కంట్రోల్ రూము విడుదల చేసే రోజువారీ వరదల బులిటెనులో భాగంగా ఈ హెచ్చరిక చేస్తున్నట్లు కమిషను పేర్కొంది. అస్సాం, బిహార్, ఒడిశా, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో 12 చోట్ల సాధారణ స్థితిని మించి వరదల తీవ్రత ఉన్నా, పరిస్థితులు అదుపులోనే ఉన్నాయి. అస్సాంలో కుశియారా, బ్రహ్మపుత్ర నదులు ప్రమాదకర స్థాయికి చేరాయి. బిహార్‌లోనూ కోసీ, బాగ్‌మతీ, గండక్ నదుల నీటిమట్టాలు పెరిగాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లో గంగా, ఘాఘ్రా, గండక్ నదుల పరీవాహక ప్రాంతాలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఒడిశాలో సువర్ణరేఖ, తమిళనాడులో కావేరి నదులు ప్రమాద హెచ్చరికలను దాటాయి. కర్ణాటకలోని ప్రధాన జలాశయాలైన ఆల్మట్టి, నారాయణపుర్, తుంగభద్రల వద్ద ఇన్‌ఫ్లో అధికంగా ఉండటంతో నీటిమట్టాలు స్థిరంగా పెరుగుతున్నాయి.

మెదడుకు విద్యుత్ ప్రేరణతో గణిత సామర్థ్యం పెంచవచ్చు

• సరికొత్త అధ్యయనం

దిల్లీ: నొప్పి కలిగించని సురక్షిత స్థాయి విద్యుత్తు తరంగాలతో ఉత్తేజపరచిన మెదడు.. గణిత సమస్యల్ని మరింత సమర్థంగా పరిష్కరించడానికి సాయపడుతుందని బ్రిటన్‌లోని సర్రే విశ్వవిద్యాలయ అధ్యయనంలో తేలింది. కార్యనిర్వాహక జ్ఞాపకశక్తి, ప్రణాళికా రచన, నిర్ణయం తీసుకోవడం వంటి కార్యకలాపాలను మెదడులో 'డార్సోలేటరల్ ప్రీ ఫ్రంటల్ కార్టెక్స్' ప్రాంతం నియంత్రిస్తుంది. అక్కడ సురక్షిత స్థాయిలో విద్యుత్తు తరంగాలను ప్రసరింపజేయడం ద్వారా 18-30 ఏళ్ల వయసున్నవారిలో లెక్కలు చేయగలిగే సామర్థ్యం పెంపొందించవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. గణితంలో ప్రావీణ్య పెంపుదలపై బాహ్య కారణాల కన్నా మనిషి శరీర ధర్మమే అధిక ప్రభావం చూపుతుందని అధ్యయన సారాంశ రచయిత, సర్రే స్కూల్ ఆఫ్ సైకాలజీ అధినేత రాయ్ కోహెన్ కదోష్ తెలిపారు. చదువులో పనితీరుపై విద్యార్థి న్యూరో బయాలజీ ప్రభావం చూపగలదన్న విషయాన్ని ఇంతవరకూ పట్టించుకోనేలేదని చెప్పారు. అధ్యయనంలో భాగంగా 72 మంది యువకులకు ఐదు రోజుల పాటు గణిత శిక్షణ అందించారు. వీరిలో 24 మందికి మెదడు ముందు భాగంలో, మరో 24 మందికి వెనుక భాగంలో ప్రేరేపణ అందించారు. మిగిలిన 24 మందికి ఏమీ అందించలేదు. పోస్టీరియర్ పారియెటల్ కార్టెక్స్ భాగం మనిషి ఏకాగ్రత, అభ్యసన ప్రక్రియలను నియంత్రిస్తుంది. దీనికి, డార్సోలేటరల్ ప్రీఫ్రంటల్ కార్టెక్స్ భాగానికి మధ్య అనుసంధానం బలంగా ఉన్నవారు గణితంలో ప్రతిభ కనబరుస్తారని స్కాన్ నివేదికల ద్వారా నిరూపితమైంది. అనుసంధానం బలంగా లేనివారి మెదళ్లకు విద్యుత్తు తరంగాలతో ప్రేరణ కలిగిస్తే వారిలోనూ అభ్యసన సామర్థ్యాలు పెరుగుతాయని తేలింది.



అమర్‌నాథ్ యాత్ర తొలివిడత బృందానికి రక్షణగా వెళ్తున్న సైనిక వాహనాలు

కట్టుదిట్టమైన భద్రత మధ్య అమర్‌నాథ్ యాత్రకు బయల్దేరిన తొలి బ్యాచ్

• జెండా ఊపి యాత్రను ప్రారంభించిన ఎల్జీ మనోజ్ సిన్హా
• హరహర మహాదేవ్ నినాదాలతో మార్మోగిన ప్రాంగణం

జమ్ము: కట్టుదిట్టమైన భద్రత మధ్య అమర్‌నాథ్ యాత్రకు 5,880 మందికి పైగా భక్తుల తొలి బ్యాచ్ బుధవారం జమ్ము నుంచి బయల్దేరింది. తెల్లవారుజామున 4.30 గంటలకు భగవతీ నగర్ బేస్ క్యాంప్‌కు చేరుకున్న జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ) మనోజ్ సిన్హా జెండా ఊపి యాత్రను లాంఛనంగా ప్రారంభించారు. తొలి బ్యాచ్‌లో 1,115 మంది మహిళలు, 31 మంది చిన్నారులు ఉన్నారు. 38 రోజుల ఈ యాత్ర గురువారం నుంచి రెండు మార్గాల్లో (పహల్గాం, బాల్టాల్) ప్రారంభం కానుంది. వచ్చే నెల 9తో ముగియనుంది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈసారి భద్రతను మరింత పటిష్ఠం చేశారు. రాజ్‌భవన్, పోలీస్ కంట్రోల్ రూం నుంచి యాత్రను 24 గంటలూ పర్యవేక్షిస్తామని ఎల్జీ సిన్హా చెప్పారు. యాత్రను ప్రారంభించే ముందు సిన్హా పూజలు నిర్వహించారు. ప్రాంగణమంతా 'హర హర మహాదేవ్, భం భం భోలే' నినాదాలతో మార్మోగింది.

ఆగని మృత్యుఘోష

సిగాచీ ఘటనలో 38కి చేరిన మరణాలు

ఈనాడు, సంగారెడ్డి: తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన దుర్ఘటనలో మృతుల సంఖ్య పెరుగుతోంది. మంగళవారం నాటికి 36 మంది మృతి చెందినట్లు అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. సహాయక సిబ్బంది బుధవారం శిథిలాల కింద మరో రెండు మృతదేహాలను వెలికితీశారు. దీంతో మృతుల సంఖ్య 38కి చేరింది. గాయపడిన 35 మంది హైదరాబాద్ శివార్లలోని వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మియాపూర్‌లోని ప్రైవేటు ఆసుపత్రి నుంచి 8 మంది డిశ్చార్జి అయ్యారు. మిగతా 60 మంది కార్మికుల ఆచూకీ లభించిందని, మరో 10 మంది వివరాలు తెలియడం లేదని అధికారులు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేసిన నేపథ్యంలో పరిశ్రమ యాజమాన్యం స్పందించింది. మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం అందిస్తామని, బీమాపరంగా లభించే అన్ని రకాల సౌకర్యాలను వర్తింపజేస్తామని ప్రకటించింది. ఘటన కారణంగా మూడు నెలల పాటు కంపెనీని మూసి వేస్తామని, ప్రమాదానికి కారణాలపై చేపట్టిన విచారణకు సహకరిస్తామంది.

రికార్డు సృష్టించిన శివ-శక్తి

దిల్లీ: రిషీకేశ్-కర్ణప్రయాగ రైల్వే అనుసంధాన ప్రాజెక్టులో ఎల్అండ్‌టీ సంస్థ గడువుకన్నా ఒక రోజు ముందే లక్షిత సొరంగ మార్గ తవ్వకం పూర్తి చేసి రికార్డు సృష్టించింది. కఠినమైన రాతి నేలలోనూ సొరంగం తవ్వే టీబీఎం యంత్రం సాయంతో ఈ పని పూర్తి చేసింది. ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో రెండు శక్తిమంతమైన టీబీఎంలను ఎల్అండ్‌టీ ఉపయోగిస్తోంది. మొదటి టీబీఎంకు 'శక్తి' అని పేరు పెట్టారు. 'శక్తి'.. 2025 ఏప్రిల్ 16 నాటికి 10.47 కిలోమీటర్ల సొరంగాన్ని గడువు కన్నా 12 రోజుల ముందే తవ్వేసింది. రెండో టీబీఎం 'శివ' గడువుకన్నా ఒకరోజు ముందు జూన్ 29 నాటికి 10.29 కిలోమీటర్ల సొరంగ తవ్వకాన్ని పూర్తిచేసిందని ఎల్అండ్‌టీ డైరెక్టర్ ఎస్.వి.దేశాయ్ వెల్లడించారు. 'శక్తి' తవ్వనున్న మొదటి సొరంగం పొడవు 14.57 కిలోమీటర్లు కాగా.. 'శివ' సాయంతో 13.09 కిలోమీటర్ల పొడవున్న రెండో సొరంగం పూర్తిచేయనున్నారు. ఈ రెండూ దేశంలో అత్యంత పొడవైన రైల్వే సొరంగ మార్గాలు. 70 శాతం సొరంగాలను టీబీఎం యంత్రాలతో తొలిచారు. మిగతా పనిని ఆస్ట్రేలియా రూపొందించిన కొత్త సొరంగ తవ్వక విధానమైన డ్రిల్ అండ్ బ్లాస్ట్ పద్ధతిలో పూర్తిచేస్తారు.

విమానం గాల్లో ఉండగా ఊడిన కిటికీ ఫ్రేమ్



ముంబయి: పుణె నుంచి గోవా వెళ్తున్న విమానం గాల్లో ఉండగా కిటికీ ఫ్రేమ్ ఊడినట్లు విమానయాన సంస్థ స్పైస్‌జెట్ బుధవారం తెలిపింది. ప్రయాణికుల భద్రతపై ఇది ఎలాంటి ప్రభావం చూపలేదని పేర్కొంది. విమానం పుణెలో దిగిన తర్వాత ప్రామాణిక నిర్వహణ విధానాలకు అనుగుణంగా ఫ్రేమ్‌ను బిగించినట్లు వెల్లడించింది. 'క్యూ400 విమానంలోని ఒక కాస్మెటిక్(లోపలి) కిటికీ ఫ్రేమ్ వదులై ఊడినట్లు గుర్తించాం. అప్పుడు విమానంలో పీడనం సాధారణంగానే ఉంది. ఈ ఫ్రేమ్ కిటికీ వద్ద నీడ కోసం అమర్చింది. ప్రత్యేక నిర్మాణం కాదు. క్యూ400 విమానం బహుళ పొరల కిటికీ పలకలను కలిగి ఉంటుంది. వీటిలో బలమైన, ఒత్తిడికి తట్టుకునే బయటి పలక ఉంటుంది. ఇది ప్రయాణికుల భద్రత ఎప్పుడూ ప్రమాదంలో పడకుండా చూసుకుంటుంది' అని స్పైస్‌జెట్ ఓ ప్రకటనలో పేర్కొంది. మరోవైపు విమాన ప్రయాణ యోగ్యతను ప్రశ్నిస్తూ ఓ ప్రయాణికుడు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. దానికి విమానంలో ఊడిన కిటికీ ఫ్రేమ్ వీడియోను జోడించారు.

కోటిపల్లి-నరసాపురం రైల్వే ఎలైన్‌మెంట్ సర్వేకు పచ్చజెండా

• గతంలో ఇచ్చిన స్టే ఉత్తర్వులు ఎత్తేసిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: కోటిపల్లి-నరసాపురం మధ్య రైల్వేలైన్ ఎలైన్‌మెంట్‌కు సర్వే చేసేందుకు మార్గం సుగమమైంది. రైల్వేలైన్ రీ ఎలైన్‌మెంట్, భూసేకరణ ప్రక్రియను సవాలుచేస్తూ దాఖలైన వ్యాజ్యాల్లో ఇప్పటివరకు ఉన్న స్టే ఉత్తర్వులను హైకోర్టు ధర్మాసనం బుధవారం ఎత్తేసింది. సర్వే త్వరగా పూర్తిచేసి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని రైల్వే అధికారులను ఆదేశించింది. రైల్వే ట్రాక్ రీ ఎలైన్‌మెంట్ ద్వారా రాజకీయ నాయకులు, బడా వ్యక్తులెవరైనా లబ్ధిపొందుతున్నారా.. లేదా అనే విషయాన్ని సైతం పరిశీలించాలని అధికారులకు సూచించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సమీపంలోని భట్నవిల్లి-పేరూరు-గుడిమెల్లంక మధ్య ఎలైన్‌మెంట్‌ను మొదట నిర్ణయించారని, బడాబాబుల ప్రయోజనం కోసం దాన్ని మారుస్తున్నారంటూ హైకోర్టులో పలువురు వ్యాజ్యాలు దాఖలు చేశారు. అధికారులు ప్రతిపాదించిన కొత్త ఎలైన్‌మెంట్ ప్రకారం ఆర్థికభారం పడుతుందన్నారు. బుధవారం జరిగిన విచారణలో పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎ.సత్యప్రసాద్ వాదనలు వినిపించారు. 'ముందుగా ప్రతిపాదించిన ఎలైన్‌మెంట్‌ను మార్చేందుకు అధికారులు యత్నిస్తున్నారు. పాత ఎలైన్‌మెంట్ ప్రకారం రైల్వే అధికారులు ఇప్పటికే పనులు చేపట్టి, సొమ్ము ఖర్చుచేశారు' అని తెలిపారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి, రైల్వేశాఖ తరఫు న్యాయవాది రుద్రప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. 'ఎలైన్‌మెంట్ మార్పు కోసం కలెక్టర్ నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. సర్వేపై హైకోర్టు స్టే ఇవ్వడంతో ప్రక్రియ నిలిచిపోయింది. స్టే ఉత్తర్వులను ఎత్తివేయాలి' అని కోరారు. ఇరువైపుల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం రైల్వేలైన్ ఎలైన్‌మెంట్ మార్పు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని పేర్కొంది. సర్వే కొనసాగించేందుకు అధికారులను వెసులుబాటు ఇచ్చింది.

నా కారుకు జరిమానా విధించండి.. పోలీసు కమిషనర్‌కు మంత్రి లేఖ



లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్ సాంఘిక సంక్షేమశాఖ మంత్రి అసీమ్ అరుణ్ తన అధికారిక వాహనానికి జరిమానా విధించాలంటూ పోలీసు కమిషనర్‌ను స్వయంగా కోరారు. అరుణ్ ఇటీవల వారణాసిలో పర్యటించారు. ప్రొటోకాల్ ప్రకారం.. ప్రభుత్వ ఇన్నోవా కారును ఆయనకు కేటాయించారు. ఆ కారుపై అనధికార బుగ్గ లైట్లు అమర్చి ఉన్నాయి. ఈ విషయాన్ని గమనించిన మంత్రి ఆ కారులో ప్రయాణించడానికి నిరాకరించారు. "కోర్టు నిషేధం ఉన్నప్పటికీ.. చాలామంది తమ పరపతి చూపించుకోడానికి వాహనాలపై ఇలాంటి లైట్లు, స్టిక్కర్లు వాడుతున్నారు. ఇలాంటివాటిపై చర్యలు తీసుకోవాలి" అని మంత్రి పోలీసు కమిషనర్‌కు లేఖ రాశారు. అరుణ్ మాజీ ఐపీఎస్ అధికారి కావడం గమనార్హం. ఆయన తండ్రి సైతం గతంలో యూపీ డీజీపీగా బాధ్యతలు నిర్వర్తించారు.

గురుకులాల్లో ఒప్పంద ఉపాధ్యాయుల సేవలు పొడిగింపు

ఈనాడు, అమరావతి: ప్రస్తుత విద్యా సంవత్సరానికిగాను సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పని చేస్తున్న 760 మంది ఒప్పంద ఉపాధ్యాయుల సేవలను ప్రభుత్వం 2025 జూన్ 1 నుంచి 2026 ఏప్రిల్ 30 వరకు పొడిగించింది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వాలంటీర్ వొకేషనల్ ట్రైనర్ ఉద్యోగాలు అవాస్తవం: ఎస్పీడీ

ఈనాడు, అమరావతి: విద్యాంజలి-2.0 వాలంటీర్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో 2024-26 విద్యా సంవత్సరాల కోసం 'వాలంటీర్ వొకేషనల్ ట్రైనర్' పేరుతో ఉద్యోగాలు ఉన్నాయని కొందరు మోసాలకు పాల్పడుతున్నారని, వీటిని నమ్మి మోసపోవద్దని సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి నియామకాలు చేయలేదని, కేంద్ర ప్రభుత్వ పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం పేరుతో మోసపూరిత నియామకపత్రాలు అందించారని పేర్కొన్నారు. నిరుద్యోగులు ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దని సూచించారు.

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా సాయిప్రసాద్

ఈనాడు, అమరావతి: సంయుక్త కార్యదర్శిగా పని చేస్తున్న జీవీ సాయిప్రసాద్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా ప్రభుత్వం నియమించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయన ఇన్‌ఛార్జి కార్యదర్శిగా కొనసాగుతారని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించనున్న డైట్ సిబ్బంది

ఈనాడు, అమరావతి: జిల్లా డైట్ అధ్యాపకులు, విద్యార్థులు వారానికి రెండు రోజులు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని, ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరెసి, బోగస్ హాజరుపై పరిశీలించాలని పాఠశాల విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. క్లస్టర్ స్థాయి సమావేశాలను సైతం వీరి ద్వారా నిర్వహించనున్నట్లు సూచించారు. జిల్లా విద్యాధికారులతో రాష్ట్రస్థాయి నుంచి ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రతి విద్యార్థి కనీసం నాలుగు మార్కుల ప్రశ్నకు జవాబు రాసేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని, ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తల్లికి వందనంపై పిల్లలకు పోటీలు నిర్వహించాలని సూచించారు. ప్రతి ప్రాథమిక పాఠశాల విద్యార్థి రోజూ కనీసం నాలుగు లైన్లు రాసేలా ఉపాధ్యాయులు చూడాలని తెలిపారు.

ఏడుగురు ఇన్‌స్పెక్టర్లకు డీఎస్పీలుగా పదోన్నతి

ఈనాడు, అమరావతి: ఏడుగురు ఇన్‌స్పెక్టర్లకు డీఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖపట్నం రేంజి నుంచి జి.దుర్గాప్రసాద్, కె.సత్యనారాయణరావు, ఏలూరు రేంజి నుంచి డి.గోవిందరావు, గుంటూరు రేంజి నుంచి ఏ.కైలాస్‌నాథ్, పి.బాలమురళీకృష్ణ, జి.శ్రీనివాస్, కర్నూలు రేంజి నుంచి ఎంపీ ఇందిరకు డీఎస్పీలుగా పదోన్నతి కల్పించింది. ఈ మేరకు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి పోస్టింగుల కోసం వీరందర్నీ డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో రెగ్యులర్ ఎస్ఈల నియామకం ఎప్పుడో?

ఈనాడు, అమరావతి: తూర్పుగోదావరి జిల్లా గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) పర్యవేక్షక ఇంజినీర్ (ఎస్ఈ)గా అమలాపురం డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీర్ (ఈఈ) కృష్ణారెడ్డి ఏడాదిగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విశాఖపట్నం జిల్లా పర్యవేక్షక ఇంజినీర్‌గా అక్కడి కార్యనిర్వాహక ఇంజినీర్ వెంకట చౌదరి పూర్తి అదనపు బాధ్యతలు చూస్తున్నారు. వీరే కాదు.. 12 ఉమ్మడి జిల్లాల్లో రెగ్యులర్ ఎస్ఈలు లేకపోవడంతో ఈఈలే ఆయా బాధ్యతలను మోస్తున్నారు. దాదాపు ఏడాదిగా ఎస్ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కార్యనిర్వాహక ఇంజినీర్లకు పదోన్నతులు కల్పించి ఆ పోస్టులను భర్తీ చేయాలి. దీనిలో జాప్యం కారణంగా ఈఈలు ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ఎస్ఈల కొరత అభివృద్ధి పనుల పర్యవేక్షణ, పరిపాలనా వ్యవహారాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఎస్సీ వర్గీకరణ నిబంధనల మేరకు ఇంజినీర్లకు పదోన్నతుల కల్పనకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపడంలో మొదట్లో జాప్యం చేశారు. తాజాగా పంపినా.. అవి ప్రభుత్వ సాధారణ పరిపాలన విభాగానికి వెళ్లలేదు. అక్కడికి వెళితే తప్ప ఇంజినీర్ల పదోన్నతుల దస్త్రం.. శాఖాపరమైన పదోన్నతుల కమిటీకి వెళ్లదు. ఈ కారణంగా డీఈఈ నుంచి ఈఈ, ఈఈ నుంచి ఎస్ఈగా పదోన్నతులకు ముందడుగు పడటం లేదు. 'ఇంజినీర్ల పదోన్నతులకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. త్వరలోనే జిల్లాల్లో రెగ్యులర్ ఎస్ఈలను నియమిస్తాం' అని గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) గాయత్రీదేవి పేర్కొన్నారు.

(c) eenadu

మొహర్రం నెలతో హిజ్రీ నూతన సంవత్సరం ఆరంభమవుతుంది. ముహమ్మద్ ప్రవక్త (స) మక్కా నుంచి మదీనాకు వలస వెళ్లిన ఏడాది నుంచి హిజ్రీ క్యాలెండర్‌ను లెక్కగట్టారు. ముహర్రం మొదటి నెలగా సమకూర్చారు. అత్యంత పవిత్రంగా ఖురాన్ పేర్కొన్న నాలుగు నెలల్లో మొహర్రం కూడా ఒకటి. అల్లాహ్ నెలగా భావించే మొహర్రం నెలలోని పదో తేదీకి ఇస్లామిక్ చరిత్రలో ఎంతో ప్రాముఖ్యత ఉందని నమ్ముతారు. ప్రవక్త ఆదం (అలై) ఈ భూమిపైకి అడుగు పెట్టింది ఈ నెలలోనే. ఫిరౌన్ చక్రవర్తి పీడ విరగడయ్యింది ఈ నెల పదో తేదీనే. ముహమ్మద్ ప్రవక్త (స) మనవడు ఇమామ్ హుసైన్ అమరుడయ్యింది కూడా ఈ నెల పదో తేదీనే. ఇస్లామిక్ చరిత్రలో ఎన్నో విశిష్టతలతో కూడుకున్న మొహర్రం నెలలో మరింత ధర్మబద్ధంగా ప్రవర్తించాలని ఉలమాలు బోధిస్తారు.


మొహర్రం.. అల్లాహ్ నెల

ఇస్లామీయ క్యాలెండర్‌లో తొలి మాసం మొహర్రం. ఈ మాసాన్ని ప్రవక్త (స) అల్లాహ్ నెలగా పేర్కొన్నారు. ఒక శిష్యుడు ఉపవాసాల గురించి ప్రవక్తను అడిగినప్పుడు- 'రంజాన్‌నెల తర్వాత ఉపవాసాలు ఉండదలిస్తే మొహర్రం ఉత్తమమైనది. అది అల్లాహ్ నెల. అందులో ఒకరోజు అల్లాహ్ ఒక జాతి పశ్చాత్తాపాన్ని స్వీకరించాడు. ఇతరుల పశ్చాత్తాపాన్ని కూడా స్వీకరిస్తాడు' అని చెప్పారు. ఈ నెలను ఎంతో పవిత్రమైనదిగా భావిస్తారు. అందుకే యుద్ధాలు, జగడాలు వంటివేమైనా ఉంటే తర్వాతి నెలలకు వాయిదా వేసుకునేవారు.

పవిత్రత.. ప్రాధాన్యత..

ముహర్రం నెల 10వ తేదీని 'యౌమె ఆషూరా' అంటారు. దైవప్రవక్త (స) 'యౌమె ఆషూరా ఉపవాసం పాటించడం వల్ల గత ఏడాది చేసిన పాపాలన్నీ తుడుచుకుపోతాయి' అన్నారు. ఆషూరా అనే పదం అష్ర్ నుంచి వచ్చింది. అష్ర్ అంటే పది. ప్రవక్త ఆషూరా రోజున ఉపవాసం పాటించడం అలవాటుగా చేసుకుని, ఇతరులను కూడా అనుసరించమని చెప్పేవారు. ఇస్లామీయ విద్వాంసులు ఆషూరా రోజుతోపాటు దాని కంటే ముందు తొమ్మిదో తేదీన గానీ, ఆ తర్వాత పదకొండో తేదీన గానీ ఉపవాసాలు పాటించాలని పేర్కొన్నారు. ఈ విషయమై అల్లామా ఇబ్నె హమామ్ 'పవిత్ర రంజాన్‌మాసం, యౌమె ఆషూరాలకు తప్ప, మరే ఇతర ఉపవాసాలకు దైవప్రవక్త (స) అంతగా ప్రాముఖ్యత ఇచ్చేవారు కాదు' అన్నారు.

దైవప్రవక్తలకు, యౌమె ఆషూరాకు అవినాభావ సంబంధం ఉంది. చరిత్రలో ఆ రోజు ఎన్నో సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఇస్లామీయ చరిత్రలో పవిత్రత, ప్రాధాన్యత ఉన్న యౌమె



ఆషూరా రోజునే హజ్రత్ ఇమామె హుసైన్ (రజి) అమరగతి పొందడం యాదృచ్ఛికంగా జరిగింది. ఆయన పరివారమంతా ప్రజల పరిరక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి వీరోచితంగా పోరాడి అమరులయ్యారు. కర్బలా ఘటన మనకు త్యాగస్ఫూర్తి పాఠాన్ని నేర్పుతుంది.

బానిస చెర నుంచి విముక్తి

వేల సంవత్సరాల క్రితం ఇజ్రాయెల్ ప్రజలు ఫిరౌన్ అనే రాజు పీడనకు గురయ్యారు. ఏళ్ల తరబడి మహా దుర్భరం, అవమానకరమైన జీవితం గడిపారు. ఫిరౌన్ తానే దేవుణ్ణని విర్రవీగేవాడు. తన రాజ్యంలో పుట్టిన మగబిడ్డల్నందర్నీ చంపేసి, ఆడపిల్లల్ని మాత్రం బతకనిచ్చేవాడు. అలాంటి హీన స్థితిలో దేవుడు మహనీయ మూసా (అలైహిస్సలామ్)ను ప్రభవింపజేశాడు. ఫిరౌన్ దౌర్జన్యాలు, అత్యాచారాలపై, ఇజ్రాయెల్ సంతతివారి మగపిల్లలను చంపేసే దాష్టీకాలకు వ్యతిరేకంగా ప్రవక్త మూసా (అలై) గళం విప్పారు. అడుగడుగునా ప్రమాదాలు పొంచి ఉన్న ఆ కాలంలో సత్యాన్ని సమర్థించడానికి ఇజ్రాయెల్ ప్రజలు మూసా (అలై)ను దేవుని ప్రవక్తగా అంగీకరించారు. ఆయన ద్వారానే ఆ జాతి వారిని ఫిరౌనీయుల బానిస చెర నుంచి విడిపించాడు. ఒకానొక రాత్రివేళ రాజ్యంలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు బయల్దేరి దైవప్రవక్త మూసా (అలైహిస్సలామ్)తో కలిసి ఎర్రసముద్రం దిశగా సాగిపోవాలని నిర్ణయించుకున్నారు. కానీ ఈ పయన బృందం ఎర్రసముద్రం తీరానికి చేరుకుంటున్న సమయంలోనే ఫిరౌన్ చక్రవర్తి ఒక భారీ సేనా వాహినిని తీసుకుని వాళ్లను వెంబడిస్తూ వచ్చాడు. ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్నట్లు తయారయ్యింది పరిస్థితి. మూసా ప్రవక్త అనుయాయులు ఫిరౌన్ సేనల చేతికి దొరికేలా ఉన్నారు. వెనుక శత్రు సేనలు, ముందేమో ఎర్ర సముద్రం. దిక్కుతోచని పరిస్థితి. 'ప్రవక్త తమను తీసుకొచ్చి ఈ సముద్రం పక్కన ఎందుకు నిలబెట్టారు? ఈజిప్టులోని ఖననవాటికలు సరిపోలేదా?' అని వారంతా నిష్ఠూరంగా మాట్లాడుతున్న సమయంలోనే దైవ సహాయం అందింది. 'మూసా! నీ చేతికర్రను సముద్రానికి తాటించు' అని దైవ ఆదేశం అందింది. అలా చేయగానే సముద్రం రెండుగా చీలిపోయింది. అవి నీళ్లలా కాకుండా కొండల్లా కనిపించాయి. ఆ రెండు నీటి గుట్టల మధ్యన నీటి జాడే లేని ఒక మార్గం ఏర్పడింది. ఆ దారి గుండా వారు సాగిపోవడం గమనించిన ఫిరౌన్ తన సైనికులతో వెంబడించాడు. మూసా అనుయాయులు సముద్రం దాటే సమయానికి ఫిరౌన్ సేనలు ఆ దారి మధ్యన ఉన్నాయి. దైవ ఆదేశాన్ని అనుసరించి అప్పటివరకూ ప్రహరీ గోడల్లా నిశ్చలంగా నిలిచి ఉన్న ఆ రెండు నీటి భాగాలు పరస్పరం కలిసిపోయాయి. ఫిరౌన్, అతడి సేనలు సాగర గర్భంలో కలిసిపోయారు. దైవప్రవక్త మూసా (అలై) ఇజ్రాయెల్ సంతతితో సీనాయ్ ద్వీపకల్పంలో ప్రవేశించారు. అలా ప్రవక్త ఇజ్రాయెల్ జాతిని ఫిరౌన్ చెర నుంచి విడిపించారు. అందుకే ముస్లిములు ముహమ్మద్ ప్రవక్త (సఅసం) సంప్రదాయం ప్రకారం ముహర్రం నెల 10వ రోజును యౌమే ఆషూరాగా వేడుక చేసుకుంటారు. ఉపవాసం పాటిస్తారు. - ఖైరున్నీసాబేగం



జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించటానికీ, సర్వశుభాలు సమకూరటానికీ ఒకే ఒక్క సుగుణం క్షమ. ఎంతటి క్లిష్ట పరిస్థితినైనా తట్టుకునే సహనం, ఎలాంటి క్రూరులనైనా క్షమించే ఔన్నత్యంతో శ్రీరామచంద్రుడు, ధర్మరాజు, శమీకముని తదితరులు మనందరికీ ఆదర్శంగా నిలిచారు.

సర్వశుభ సోపానం.. సమున్నత లక్ష్యసాధనం

క్షమకు మరో రూపం భూమాత. తవ్వినా, తన్నినా, మురికి చేసినా భూమాత సహించి క్షమిస్తుంది. కణకణమండే నిప్పులు మరెక్కడ పడినా అగ్ని రగిలి బూడిదవుతుంది. కానీ నేల మీద మాత్రం కాసింత సేపు మండి చల్లారాల్సిందే తప్ప నేల చలించదు. అందుకే ధరణిలా క్షమను అలవరచుకుంటే ఎంతటి కోపజ్వాలలైనా, కుటిల కుయుక్తులైనా దహించలేవు.

ఎన్నెన్నో సద్గుణాల రూపం ఒక్క క్షమ. సహనం చూపి క్షమించడం అలవరచుకుంటే ఎంతటి దుర్మార్గుల్లోనైనా పశ్చాత్తాపం కలుగుతుంది, దుర్గుణాలూ, దురాగతాలూ అంతరిస్తాయని ఎందరో ఆధ్యాత్మికవేత్తలు ఎన్నో సందర్భాల్లో ప్రవచించారు. 'క్షమ కవచంబు, క్రోధమది శత్రువు..' అంటూ ఏనుగు లక్ష్మణ కవి రచించిన చక్కటి పద్యం ఉంది. క్షమించే గుణం ఉన్న వ్యక్తికి వేరే రక్షణ కవచం అవసరం లేదు. కోపోద్రేకాలతో ఎగసిపడేవానికి వేరే శత్రువులు ఉండనవసరంలేదు. దాయాదులు ఉంటే వేరే నిప్పు అవసరం లేదు. మంచి మిత్రులు ఉన్న వ్యక్తికి ఔషధాలేమీ అక్కరలేదు. దుష్టులు చెంతన ఉంటే ఇక భయంకరమైన విషసర్పాలు మాత్రం ఎందుకు? బాగా చదువుకున్నవారికి మరే సంపదలూ అక్కర్లేదు. లజ్జ ఉన్నవారికి ఎటువంటి ఆభరణాలూ ఉండాల్సిన అవసరం లేదు. ఉదాత్తమైన కవితాశక్తి ఉన్నవానికి రాజ్యం అక్కర్లేదు' అన్నది ఆ పద్య భావం. అంటే క్షమ రక్షిస్తుంది. కోపం నాశనం చేస్తుంది. దాయాదులు కీడు చేస్తారు. స్నేహితులు హితవు కోరి, మంచి దారి చూపిస్తారు. దుష్టులు హాని చేస్తారు. విద్య తరగని నిధిగా ఆదుకుంటుంది. లజ్జ.. అంటే యుక్తమైన ప్రవర్తనే అలంకారమవుతుంది. ఉదాత్తుడైన కవి పాలకులను మించిన కీర్తిని పొందుతాడు- అన్నది కవి భావన.

పెద్దలు సరిదిద్దాలి

క్షమ గలిగిన సిరి గలుగును క్షమ గలిగిన
వాణి గలుగు సౌఖ్యము లెల్లన్
క్షమ గలుగc దోన కలుగును క్షమ గలిగిన
మెచ్చు శౌరి సదయుండు దండ్రీ!

ఇది పోతన భాగవతంలోని పద్యం. పరశురాముడు కార్తవీర్యార్జునుణ్ణి సంహరించి కామధేనువును ఆశ్రమానికి తీసుకొచ్చి తన పరాక్రమాన్ని వివరించాడు. అప్పుడు జమదగ్ని పుత్రుడికి క్షమ ఉంటే సంపద కలుగుతుంది, విద్య అబ్బుతుంది, సుఖాలన్నీ కలుగుతాయి. క్షమ ఉంటే దయామయుడైన శ్రీహరి సంతోషిస్తాడు- అంటూ ఉపదేశించాడు. దైవం సంతోషించాడంటే ఆ భక్తుడికి ఇక కావలసిందేముంటుంది. ఈ ఒక్క మాటతో పరశురాముడిలో పశ్చాత్తాపం కలిగింది. చేసిన పాప ప్రక్షాళనకు తీర్థయాత్రలకు బయలు దేరాడు. క్షమ గురించి తెలియాలే కానీ శాంత గుణం, పశ్చాత్తాప తత్త్వం అలవాటు అవుతాయనటానికి ఇదొక ఉదాహరణ.

ఇలాంటి సుభాషితాలు, నీతి వచనాలు ప్రతి తరంలోనూ ఎవరో ఒకరు ముందుతరంలోని పెద్దలు పిల్లలకు చెపుతూ ఉండాలి. అటు వంటి ప్రయత్నం నిరంతరం సాగుతూ ఉంటుందనటానికి ఈ సుభాషితమే ఓ ఉదాహరణ. సుభాషిత త్రిశతి లోని ఒక శ్లోకానికి ఏనుగు లక్ష్మణ కవి తెలుగులో చెప్పిన పద్యమే ఇది. ఇది నేటి తరానికి ఆదర్శంగా కనిపిస్తుంది.

జులై 7 ప్రపంచ క్షమా దినోత్సవం

మోహించిన వాయుదేవుడు

క్షమ విలువను తెలిపే కథ ఒకటి రామాయణంలో ఉంది. తాటకి వధ కోసం రామలక్ష్మణులను అడవులకు తీసుకెళ్తున్న విశ్వామిత్రుడు తన వంశం గురించి చెబుతూ- కుశనాభుడనే రాజర్షికి నూరుగురు అతిలోక సౌందర్యవతులైన కుమార్తెలున్నారు. ఒకరోజు వాళ్లు వనవిహారానికి వెళ్లగా వాయుదేవుడు మోహించి.. అందరినీ తాను పెండ్లాడతానని, అందుకు సమ్మతిస్తే నిత్యయవ్వనం ఉండేలా వరమిస్తానని అన్నాడు. యువతులు తండ్రికి తెలియకుండా తాము ఏ పనీ చెయ్యమని, తమకు దూరంగా ఉండమన్నారు. సర్వవ్యాపి, సర్వస్పర్శి అయిన వాయుదేవుడు ఆ తిరస్కారాన్ని భరించలేక అక్కచెల్లెళ్లను అందవికారంగా మార్చేశాడు. వాళ్లు క్షమ ప్రదర్శించి నోరు మెదపలేదు.

కుమార్తెలు చూపిన సహనానికి ఆనందించిన కుశనాభుడు 'అమ్మాయిలూ!

క్షమా దానం క్షమా యజ్ఞః క్షమా సత్యం
హి పుత్రికాః
క్షమా యశః క్షమా ధర్మః క్షమయా
నిష్ఠితం జగత్

క్షమే దానం, క్షమే యజ్ఞం, అదే సత్యం, ధర్మం, కీర్తి. క్షమ ఆధారంగానే ఈ జగత్తు నిలిచి ఉంటోంది- అనేది ఈ శ్లోకానికి అర్థం.

క్షమ విశేష గుణం. పురుషులకైనా స్త్రీలకైనా అది గొప్ప ఆభరణం. దీన్ని అలవర్చుకోవడం ఒక్కోసారి దేవతలకు కూడా సాధ్యం కాదు. మీరంతా కలిసికట్టుగా వాయుదేవుణ్ణి క్షమించటం అనే మహత్కార్యంతో వంశం పేరు నిలబెట్టారు' అంటూ ప్రశంసించాడు.

చిత్రమేమంటే వారి క్షమ వాయుదేవుడిలో పశ్చాత్తాపం కలిగించింది. వాళ్లు పెళ్లి చేసుకున్నాక.. కురూపులుగా ఉన్నవారిని తిరిగి సర్వాంగసుందరీమణులు అయ్యేట్టు ఆశీర్వదించి వెళ్లాడు. క్షమ పరివర్తన కలిగిస్తుంది. క్షమాగుణానికి అంత శక్తి ఉంది కనుకనే కోపతాపాలను తగ్గించుకుని శాంతంగా, సహనంగా ఉండాలని, ప్రయత్నపూర్వకంగా నైనా క్షమను అలవరచుకోవాలని చెబుతారు పెద్దలు.

- డా.యల్లాప్రగడ మల్లికార్జున రావు, గుంటూరు

స్థిరమైన అడుగులు

క్రీస్తువాణి



దైవాన్ని హృదయపూర్వకంగా ఆరాధించాలని బైబిల్ చెబుతోంది. దేవుడు ప్రత్యక్షంగా కనిపించకున్నా ఆత్మ స్వరూపంలో ఉంటాడని గ్రహించాలి. కొందరు భౌతికంగా కనిపించే వాటినే నిజమని నమ్ముతారు. మనలో గట్టి విశ్వాసం ఉంటే ఏసు ఉనికిని గుర్తించగలం, ఆయన సన్నిధిని ఆస్వాదించగలం. 'నమ్మకం ఉంటే నిరీక్షణ ఫలిస్తుంది. అదృశ్యంగా, అగోచరంగా ఉన్నవి సాక్షాత్కరిస్తాయి. మన అడుగులు స్థిరంగా ఉంటాయి, గమ్యాన్ని చేరగలుగుతాం' అంటోంది బైబిల్. మనం తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నప్పుడు.. దేవుని పట్ల విశ్వాసం కోల్పోయేలా మాట్లాడతారు కొందరు. భక్తుడైన యోబు విషయంలో అదే జరిగింది. కనుక మనుషుల జ్ఞానం అల్పమని, దైవశక్తి అపారమని అర్థం చేసుకోవాలి. దేవుణ్ణి విశ్వసించి, ఆయన మీద భారం ఉంచి, జీవితమనే పరుగుపందెంలో శక్తికొద్దీ పరుగెత్తాలని, అప్పుడే అడుగులు స్థిరంగా పడతాయంటూ హితవు పలికారు హెబ్రీ గ్రంథ కర్త. కనుక దైవాన్ని నమ్మకంతో ప్రార్థించాలి. - బందెల స్టెర్జి రాజన్

అనఘః

వందే విష్ణుం!



విష్ణు సహస్ర నామావళిలో 146వది. అఘము అంటే పాపం. అనఘం అంటే పాపరహితం. అనఘుడంటే పాపరహితుడు, కల్మషం లేనివాడని భావం. ఆ స్వామి విషయంలో కొందరు పొరబడుతుంటారు. పరమాత్మునికి సంబంధించిన కథలను సరిగా అర్థం చేసుకోక.. ఎవరో ఏదో అంటే.. అదే నమ్మి.. ఆయన కొన్నిసార్లు ధర్మబద్ధంగా వ్యవహరిండు- అని పొరపడుతుంటారు. ఉదాహరణకు వాలిని సంహరించిన విషయంలో శ్రీరాముడు ధర్మవిరుద్ధంగా ప్రవర్తించాడు అనుకోవటం లాంటిది. నిజానికి ఆ సంఘటనలోని ధర్మసూక్ష్మాన్ని పరిశీలిస్తే శ్రీరామచంద్రమూర్తి ప్రవర్తన కార్యకారణ సంబంధమైంది. ఇలా ఆ స్వామి పాపరహితుడు, కల్మష రహితుడు అని ఈ నామం వివరిస్తుంది.

- సి.ఎ.వై.తన్వి

చర్మవ్యాధులను నివారించే ఉన్కేశ్వరుడు



పౌరాణిక కథను అనుసరించి- శరభంగుడనే రుషి ఉన్కేశ్వర్ పరిసరాల్లోని అడవుల్లో రామజపం చేసేవాడు. కొంతకాలానికి అతనికి చర్మవ్యాధి సోకింది. తీవ్ర బాధలోనూ రామనామాన్ని స్మరిస్తున్న భక్తుడి ఎదుట రాముడు ప్రత్యక్షమయ్యాడు. కానీ వ్యాధితో వికృతంగా తయారైన శరభంగుడు రాముణ్ణి దర్శించుకునేందుకు ఇబ్బందిపడ్డాడు. అప్పుడు రాముడు ఉన్కేశ్వర్‌వైపు రెండు బాణాలు సంధించాడు. వాటితో వ్యాధుల్ని నయంచేసే సరోవరం, శివలింగం వెలిశాయి. శ్రీరాముడు- శరభంగరుషిని వేడినీటి సరోవరంలో స్నానమాచరించి, శివలింగాన్ని పూజించమన్నాడు. దాంతో అతడి వ్యాధి నయమైంది. స్వస్థుడైన శరభంగరుషి రోగులకు వైద్యం చేస్తూ అక్కడే జీవసమాధి అయ్యాడు. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి 124 కిలోమీటర్ల దూరంలో ఉంది ఉన్కేశ్వర్ శివాలయం. శిథిలమైన ఈ ఆలయాన్ని తర్వాతి కాలంలో పునరుద్ధరించారు.

ఎందరో వ్యాధిగ్రస్తులు ఇక్కడికి వస్తుంటారు. ఆలయంలోని వేడినీటి సరోవరంలో స్నానం ఆచరిస్తే తీవ్రవ్యాధులు కూడా నయమవుతాయని భక్తుల నమ్మకం. ఆలయ నిర్వాహకులు ఇక్కడ ప్రకృతి వైద్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయానికి అనుబంధంగా ఉన్న ఆశ్రమంలో రోగులు ఉండేందుకు వసతి సదుపాయం ఉంది. ఇక్కడికి వచ్చిన భక్తులు వేడినీటి సరోవరంలోని నీటితో స్నానమాచరించి, దైవదర్శనం చేసుకుంటారు. అనారోగ్యం ఉంటే ప్రకృతి వైద్యాలయానికి వెళ్తారు. ఆలయ పరిసరాలు గాయత్రీ మంత్రంతో మారుమోగుతుంటాయి. - మాపూరు విజయలక్ష్మి

సౌమ్యనాథుడి దర్శనం... మహదానందభరితం



జులై 5న సౌమ్యనాథ స్వామి ఉత్సవాలు ప్రారంభం

అన్నమయ్య జిల్లా నందలూరులో బాహుదా నది తీరాన సౌమ్యనాథస్వామి ఆలయం ఉంది. ఇది అతి పురాతన ఆలయం. గర్భాలయంలో స్వామివారి విగ్రహం ఏడడుగుల ఎత్తులో ఉంటుంది. పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య కొంతకాలం ఇక్కడే ఉండి పలు సంకీర్తనలు రచించినట్లు చరిత్ర చెబుతోంది.

చోళరాజులు ఈ ఆలయాన్ని నిర్మించగా.. కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు గాలి గోపురం కట్టించాడు. అనంతరం పాండ్య రాజులు ఆలయాన్ని పునరుద్ధరించారు. సౌమ్యనాథస్వామి ఆలయం చుట్టూ 9 సార్లు ప్రదక్షిణలు చేసి మొక్కుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తులు విశ్వసిస్తారు. సంతానం లేనివారు ఇక్కడ ప్రత్యేక పూజలు చేస్తారు. జులై 5 నుంచి 14 వరకూ తితిదే ఆధ్వర్యంలో సౌమ్యనాథస్వామి వారి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి దిలీప్ తెలియజేశారు. జులై 5న ధ్వజారోహణం, 11న శ్రీదేవి-భూదేవి సమేత సౌమ్యనాథస్వామి కల్యాణం, 12న రథోత్సవం జరగనున్నాయి. 14న పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. నందలూరు ఆలయం కడప నుంచి 45 కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడి నుంచి బస్సులు, ప్రత్యేక వాహనాలు అందుబాటులో ఉంటాయి.

- ఇనుకొండ పెద్దబాబయ్య, ఈనాడు, కడప

విష్ణుమూర్తికి ప్రీతికరం

జులై 6 తొలి ఏకాదశి

తిథుల్లో ఏకాదశి విశిష్టమైంది. అందునా ఆషాఢశుద్ధ ఏకాదశి అత్యంత పుణ్యప్రదమైంది. ఈ తొలిఏకాదశి నుంచి కార్తికశుద్ధ ఏకాదశి వరకు విష్ణుమూర్తి యోగనిద్రలో ఉంటాడు. ఈ రోజు చేసే అర్చనలకు శ్రీమహావిష్ణువు ప్రీతిచెంది భక్తులను అనుగ్రహిస్తాడని పురాణవచనం. ఈ రోజున ప్రారంభించే పనులు విజయవంతం అవుతాయంటారు. పురాణ కథనాన్ని అనుసరించి- విష్ణువు మురాసురుడితో యుద్ధంచేస్తూ అలసిపోయి, సింహవతి అనే గుహలో సేదతీరుతున్నాడు. అది గమనించిన ఆ రాక్షసుడు మాయోపాయంతో దాడికి సిద్ధమయ్యాడు. అప్పుడు విష్ణువు శరీరం నుంచి యోగమాయ శక్తిరూపంలో వెలువడి మురాసురుణ్ణి



సంహరించింది. ఆ శక్తిస్వరూపానికి శ్రీహరి వరం అనుగ్రహించాడు. ఆ స్వామికి ప్రియమైన తిథిగా ఏకాదశి పేరిట పూజలందుకుంటోంది. విష్ణుమూర్తి యోగనిద్రలో ప్రవేశించే ఆషాఢ శుక్ల ఏకాదశి తొలి ఏకాదశి. స్వామి నిద్రించేరోజు కాబట్టి శయన ఏకాదశి అంటారు. ఈ ఏకాదశికి ఉపవాస, జాగారాలు పాటిస్తారు. ఉపవాసం వలన ఇంద్రియ నిగ్రహం అలవడటమే కాదు, జీర్ణ వ్యవస్థ ఉత్తేజితమవుతుందని ఆయుర్వేదం చెబుతోంది. ఏకాదశి ఉపవాసానంతరం ద్వాదశి నాడు ఉదయానే స్వామిని పూజించి.. తీర్థ ప్రసాదాలు స్వీకరించిన తర్వాత భోజనం చేస్తారు. తొలి ఏకాదశి రోజున పేలాల్లో బెల్లం, యాలకులు వేసి దంచి పిండిగా తయారు చేస్తారు. ఈ ప్రసాదాన్ని స్వామికి నివేదించి, ప్రసాదంగా సేవిస్తారు. ఇది ఆరోగ్య ప్రదాయని ఈ కాలంలో వచ్చే అనారోగ్యాలను శరీరం తట్టుకోగల శక్తిని కలిగిస్తుంది. వ్యాధి నిరోధకశక్తిని పెంచుతుంది. ఆషాఢశుద్ధ ఏకాదశి నుంచి దేవతలకు రాత్రి మొదలవుతుంది.ఏకాదశి నియమాలను పాటించేవారు జ్ఞానవంతులవుతారని, గతజన్మల పాపాలు తొలగుతాయని పెద్దలు చెబుతారు. - నూతి శివానందం

పండరీపురం పాండురంగ ఉత్సవం

మహారాష్ట్ర పండరీపురంలో వెలసిన పాండురంగస్వామికి ఆషాఢమాసంలో వచ్చే తొలి ఏకాదశి రోజున ఉత్సవం నిర్వహిస్తారు. ఆ స్వామిని మనం పాండు రంగస్వామిగా పూజిస్తే అక్కడ విఠోబాగా ఆరాధిస్తారు. ఈ స్వామి కథలన్నీ ఆయన భక్తుడు పుండరీకుడి చుట్టూ తిరుగుతాయి. ఇతడే విఠోబాను పండరీపురంకు రప్పించాడని విశ్వసిస్తారు.




ఆదిశంకరాచార్యులవారి పాండురంగాష్టకం స్తోత్రాన్ని బట్టి విఠోబా ఆరాధన అంతకు మునుపే ప్రారంభమైందని భావించవచ్చు. విఠోబా మూర్తికి ఎడమ వైపున రకుమాయి ఉంటుంది. రకుమాయి అంటే రుక్మిణీ మాత. రుక్మిణీదేవి కృష్ణుడి భార్య. కృష్ణుడు విష్ణువు అవతారం కనుక రకుమాయిని లక్ష్మీదేవిగా భావిస్తారు. పండరీపుర ఆలయ సముదాయంలో రకుమాయికి ప్రత్యేక ఆలయం కూడా ఉంది.

విఠోబా స్వామికి ఉదయం మూడు గంటలకు హారతితో మేలుకొలుపు ఉంటుంది. తర్వాత పంచామృత పూజ నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు దర్శనం ఉంటుంది. అలాగే మధ్యాహ్న పూజ, అపరాహ్న పూజ, రాత్రికి స్వామిని నిద్రపుచ్చే పవళింపు సేవ ఉంటాయి. పాండురంగ స్వామి లీలా విశేషాలతో పునీతమైన పుణ్యక్షేత్రం పండరీపురం. స్థానికులే గాక వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆషాఢ శుద్ధ ఏకాదశి నాడు పండరీపురానికి వెళ్లి విఠోబా స్వామిని దర్శించుకుంటారు. ఆషాఢ, కార్తీక మాసాల్లో జరిగే ఉత్సవాలు పౌర్ణమి దాకా కొనసాగి జ్యోతుల ఊరేగింపుతో ముగుస్తాయి. పౌరాణిక గ్రంథాలూ, శాసనాల్లో ఈ ఏకాదశి యాత్రల గురించిన ప్రస్తావన ఉంది.

- త్రినేత్ర

ఇంద్రుడు చేసిన పాపం



దేవగురువు బృహస్పతి అనుగ్రహాన్ని కోల్పోయిన ఇంద్రుడు రాజ్యాన్ని పోగొట్టుకుని అష్టకష్టాలు పడుతున్నాడు. దేవతలు బ్రహ్మ వద్దకు వెళ్లి కర్తవ్యాన్ని బోధించమని ప్రార్థించారు. 'సర్వ విద్యలూ నేర్చిన మహా జ్ఞాని బృహస్పతి. అతడే మీ అందరికీ సుస్థిర స్థానం కల్పించాడు. ఆ మహానుభావుణ్ణి అగౌరవ పరిచినందువల్లే పదవీ భ్రష్టులయ్యారు. తిరిగి గురువు అనుగ్రహం పొందితేనే మీకు రక్షణ' అంటూ బ్రహ్మదేవుడు వివరించాడు. అందుకు తగినవారెవరో చెప్పమని ప్రార్థించగా.. త్వష్ట ప్రజాపతి (హస్తకళలు, శిల్పాలకు అధిపతి) కుమారుడు విశ్వరూపుణ్ణి గురువుగా చేసుకోమని సూచించాడు. 'మీకంటే చిన్నవాడని సందేహం వద్దు. బ్రహ్మజ్ఞాని అయిన అతడు అనుగ్రహిస్తే తిరిగి రాజ్యం, సంపదలు ప్రాప్తిస్తాయి' అన్నాడు. దాంతో ఇంద్రాది దేవతలు విశ్వరూపుణ్ణి ఆశ్రయించారు. తిరిగి అమరావతిని చేజిక్కించుకున్నాక మాకు లభించే భోగభాగ్యాలు, ఇతర సంపదలు మీక్కూడా చెందుతాయి- అన్నారు. 'నాకు సిరిసంపదలతో పనిలేదు. పండిన ధాన్యాన్ని రైతులు తీసుకెళ్లిన తర్వాత పొలంలో రాలిపడిన గింజల్ని తెచ్చుకుంటాను. అవే సరిపోతాయి. మరెలాంటి కోరికలూ లేవు. ఒకరికి గురుత్వం వహించి, వారి వద్ద చేయి చాచాల్సిన అవసరం లేదు' అన్నాడు. 'బ్రహ్మదేవుడి సూచన మేరకు మీ వద్దకు వచ్చాం. మీరు మీ కోసం కాదు, రాక్షసుల వల్ల లోకానికి జరుగుతున్న కీడును నిరోధించేందుకు గురుత్వం వహించండి' అన్నారు వాళ్లు. ఎట్టకేలకు విశ్వరూపుడు అంగీకరించాడు. రాక్షసులు అంత శక్తిని ఎలా సంపాదించారో గ్రహించి ఇంద్రుడికి ముందుగా నారాయణ కవచం ఉపదేశించాడు. తిరిగి రాజ్యం పొందిన ఇంద్రుడు- తమతో పాటు ఐశ్వర్యాన్ని అనుభవించమని కోరాడు.

'శిష్యుల ధనాన్ని తనదిగా మార్చుకుందామని, వారి సంపదలు తీసుకుందామని గురువు ఎన్నడూ ప్రయత్నించడు. శిష్యులే ఆయన ఐశ్వర్యం. మీ వల్ల నా జీవితం చరితార్థమైందని ఎవరైనా శిష్యుడు చెబితే.. అదే గురువుకు అసలైన సంపద' అన్నాడు విశ్వరూపుడు. అనంతరం యజ్ఞయాగాది క్రతువుల్లో సమర్పించే నెయ్యి మొదలైన హవిస్సులు స్వీకరించి, ఇంద్రాది దేవతలకు ఇస్తుండేవాడు. విశ్వరూపుడి తల్లి రచన రాక్షస వంశానికి చెందినది. దీన్ని ఆసరాగా చేసుకుని రాక్షసులు 'మేం నీ మేనమామలమనే సంగతి విస్మరించి నువ్వు దేవతలకు గురుత్వం వహించావు. అందువల్లే రాజ్యాన్ని పోగొట్టుకున్నాం. మాకు న్యాయం జరగాలంటే.. ఇంద్రుడు చూడకుండా కొన్ని హవిస్సులను మాకు ఇస్తూ ఉండు' అన్నారు. అందరిలో, అన్నిచోట్లా బ్రహ్మదేవుడు ఉన్నాడని నమ్మిన విశ్వరూపుడు రాక్షసుల్లోనూ ఆయన ఉన్నాడని భావించి, వారికి హవిస్సులు ఇవ్వడం ప్రారంభించాడు. ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన ఇంద్రుడు వివేకం కోల్పోయి విశ్వరూపుడి మూడు తలలు నరికేశాడు. గురుహత్య బ్రహ్మహత్యతో సమానం. అంతటి ఘాతుకానికి ఒడిగట్టడంతో తెగిపడిన మూడు తలలూ పక్షులుగా మారి ఇంద్రుణ్ణి వెంటాడాయి. ఇంద్రుడు మళ్లీ పదవి కోల్పోయాడు. మనశ్శాంతి లేకుండా తిరిగాడు. చివరికి భూమి, చెట్లు, జలం, స్త్రీలు ఆ బ్రహ్మహత్యా మహాపాపాన్ని స్వీకరించడంతో ఇంద్రుడికి విముక్తి కలిగింది.

- మెర్ల సత్య వెంకట త్రిమూర్తులు

(c) eenadu

ఈనాడు సినిమా


'అఖండ 2'లో హర్షాలీ



'బజరంగీ భాయిజాన్'లో మున్నీ అనే చిన్నారిగా కనిపించి, ప్రేక్షకుల హృదయాల్ని కదిలించిన హర్షాలీ మల్హోత్రా. ఆమె 'అఖండ 2: తాండవం'తో తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయం అవుతోంది. జనని అనే పాత్రలో హర్షాలీ తెరపై సందడి చేయనుందని ప్రకటిస్తూ, చిత్రబృందం బుధవారం ఫస్ట్‌లుక్‌ని విడుదల చేసింది. బాలకృష్ణ కథానాయకుడిగా, బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'అఖండ 2: తాండవం'. సంయుక్త కథానాయిక. ఆది పినిశెట్టి ఓ కీలక పాత్రని పోషిస్తున్నారు. 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్నారు. ఎం.తేజస్విని నందమూరి సమర్పకులు. దసరా సందర్భంగా సెప్టెంబరు 25న పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. హర్షాలీ మల్హోత్రా పోషిస్తున్న జనని పాత్ర 'అఖండ 2' సినిమాకే కీలకమని చిత్రబృందం తెలిపింది. విజయవంతమైన 'అఖండ'కి కొనసాగింపుగా రూపొందుతున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: సి.రాంప్రసాద్, సంతోష్ డి.డెటాకే, కళ: ఎ.ఎస్.ప్రకాశ్, కూర్పు: తమ్మిరాజు, పోరాటాలు: రామ్ - లక్ష్మణ్.

భారీ సెట్లో కొత్త సినిమా సన్నాహాలు

కథానాయకుడు విజయ్ దేవరకొండ ఇప్పటికే 'కింగ్‌డమ్'ను పూర్తి చేశారు. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈలోగానే ఆయన మరో చిత్రాన్ని పట్టాలెక్కించేందుకు సిద్ధమయ్యారు. విజయ్ ప్రస్తుతం రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ చిత్రం ఈనెల రెండో వారం నుంచి చిత్రీకరణ ప్రారంభించుకోనుందని సమాచారం. దీనికోసం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఓ భారీ సెట్‌ను సిద్ధం చేస్తోంది చిత్ర బృందం. అందులోనే సినిమా సింహభాగం షూట్ చేసుకోనున్నట్లు తెలిసింది. ఇదొక పీరియాడిక్ యాక్షన్ డ్రామా చిత్రం. 1854 - 1878 మధ్య కాలంలో రాయలసీమ ప్రాంతంలో జరిగే కథగా ఉంటుంది. దీంట్లో విజయ్ శక్తిమంతమైన యోధుడిగా మునుపెన్నడూ చూడని సరికొత్త లుక్‌లో కనువిందు చేయనున్నారు. ఆయనకు జోడీగా రష్మిక నటించే అవకాశముంది. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.



విజయ్ దేవరకొండ

నేను లేకున్నా నా కలలు సజీవమే!

రెడీ ఇన్ ఓటీటీ

సిరీస్: 'ది శాండ్ మ్యాన్ సీజన్ 2'
నటీనటులు: టామ్ స్టురిడ్జ్, వివియన్నే అచెయాంపాంగ్
విడుదల: గురువారం
ప్లాట్‌ఫామ్: నెట్‌ఫ్లిక్స్



అందరికీ కలలు వస్తుంటాయి. వాటిలో మంచివి నిజమైతే బాగుండునని, చెడ్డవైతే అవి జరక్కూడదు అనుకుంటుంటారు. అలానే కొందరు ఎప్పటికీ సాధించలేని కలలు కంటూ ఊహాలోకంలో బతికేస్తుంటారు. కానీ ఆ ఊహాలోకమే నిజమైతే.. మన కలల్ని నిజం చేసుకునే శక్తి మనకుంటే ఆ లోకం చాలా అందంగా ఉంటుంది. అలాంటి ఓ ప్రపంచానికి రాజైన లార్డ్ మార్ఫియస్(టామ్ స్టురిడ్జ్) మంచి, చెడు కలల కర్మలను నియంత్రిస్తుంటాడు. తన కలల ప్రపంచంలో స్వేచ్ఛగా ఉండే ఆ వ్యక్తి క్షుద్ర శక్తుల అధీనంలో కొన్ని దశాబ్దాలపాటు బందీగా ఉంటాడు. ఆ తర్వాత అక్కడి నుంచి తప్పించుకుని తన రాజ్యానికి తిరిగి వస్తాడు. తాను కోరుకునే కలల ప్రపంచాన్ని తిరిగి నిర్మించుకోవడానికి ప్రయత్నిస్తాడు. రాజ్యానికి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి అతీంద్రియ శక్తులతో పోరాడతాడు. ఈ క్రమంలో తాను చేసే పోరాటానికి గతంలో చేసిన పొరపాట్లు, పరిష్కరించని సమస్యలు ఎదురవుతాయి. పాత శత్రువులను ఎదుర్కొనేటప్పుడు పరిస్థితులన్నీ మునుపటి కంటే భిన్నంగా మారతాయి. అందరూ మంచి కథని ఇష్టపడతారు.. కానీ ఆ కథలన్నీ ముగింపుకి వస్తాయంటూ రెండో సీజన్‌కు సిద్ధమైన ఈ సిరీస్‌ని నీల్ గైమాన్ రూపొందించారు. నేను లేకపోయినా నా కలలు జీవించే ఉంటాయి అంటోన్న కలల రాజు అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్‌తో ప్రేక్షకుల్ని ఆ ఊహాలోకంలోకి తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నాడు.

థియేటర్ ఆర్టిస్ట్‌తో అంధ సంగీతకారుడి ప్రేమ



శనయా కపూర్, విక్రాంత్ మాస్సే

'ట్వెల్త్ ఫెయిల్' సినిమాతో దేశవ్యాప్తంగా మంచి పేరు తెచ్చుకున్న బాలీవుడ్ నటుడు విక్రాంత్ మాస్సే. ఈయన ఇటీవలే నటించిన 'ఆంఖో కి గుస్తాఖియాన్' సినిమా ట్రైలర్‌ని మంగళవారం చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో బాలీవుడ్ సినీనటుడు సంజయ్ కపూర్ కుమార్తె శనయా కపూర్ కథానాయిక. ఈమెకిదే తొలి చిత్రం. ఈ చిత్రం రస్కిన్ బాండ్ రాసిన 'ది ఐస్ హావ్ ఇట్' అనే కథ ఆధారంగా రూపొందించబడింది. ఈ ట్రైలర్‌లో హీరో, హీరోయిన్ ఒకరితో ఒకరు కలిసి మంచి క్షణాలు గడుపుతారు. ఈ సమయంలోనే ఇద్దరూ ప్రేమలో పడతారు. శనయా కపూర్.. విక్రాంత్‌ని చెంపదెబ్బ కొట్టే సన్నివేశంతో ప్రారంభమైన ఈ ట్రైలర్.. వీరిద్దరి ప్రేమలో సంతోషం, బాధ రెండూ ఉంటాయని చూపించింది. ఈ చిత్రంలో శనయా థియేటర్ ఆర్టిస్ట్‌గా, విక్రాంత్ అంధ సంగీతకారుడి పాత్రలో కనిపించనున్నారు. సంతోష్ సింగ్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాకి విశాల్ మిశ్రా స్వరాలందించారు. శనయా కపూర్ చాలా కాలంగా ఎదురుచూస్తున్న తన తొలి చిత్రం 'ఆంఖో కి గుస్తాఖియాన్'. ఇది ఈ నెల 11న థియేటర్లలోకి రానుంది. ఈ ప్రాజెక్ట్‌తో పాటు శనయా 2026 ప్రేమికుల రోజున విడుదల కానున్న 'తూ యా మై' సినిమాలో కూడా కనిపించనుంది.

నాయికలకు అదే నిజమైన యుద్ధం



రష్మిక

చిత్ర పరిశ్రమలో నటీమణులు విజయాన్ని సాధించడం సులభమే.. కానీ దాన్ని నిలబెట్టుకోవడమే నిజమైన యుద్ధమని అంటోంది అందాల తార రష్మిక. ఓవైపు అగ్రతారల సరసన అదరగొడుతూనే.. మహిళా ప్రాధాన్య కథలతో మెప్పిస్తున్న కథానాయికీమె. ఇటీవలే 'మైసా' అనే మరో లేడీ ఓరియెంటెడ్ చిత్రాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ ప్రేక్షకుల్ని అలరిస్తున్న రష్మిక తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొని తన సినీ ప్రయాణం, ఎంచుకునే ప్రాజెక్టుల గురించి కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకుంది.

"ఈ కాలంలో అందరూ సినిమాల్లోకి రావాలని.. మంచి స్థాయిలో ఉండాలని ఆశపడుతున్నారు కానీ అప్పట్లో ముఖ్యంగా దక్షిణ భారత కుటుంబాలలో చిత్రపరిశ్రమలోకి రావడం తప్పుగా భావించేవారు. ఎందుకంటే వారికి సినీరంగంపై అవగాహన ఉండేది కాదు. నా కెరీర్ ప్రారంభంలో నా కుటుంబం కూడా అంగీకరించలేదు. నాన్న నన్ను మా వ్యాపారంలో చేరాలని అడిగారు. నిజం చెప్పాలంటే నటనను వృత్తిగా ఎంచుకోవాలని నా ప్రణాళికలో లేదు కానీ.. ఆందోళనలు, సందేహాలన్నీ పక్కకు నెట్టి సినీరంగంలోకి అడుగుపెట్టాను. మా కుటుంబంలోనే ఈ వృత్తిని ఎంచుకున్న మొదటి వ్యక్తిని నేను".

నా వ్యక్తిగత నిర్ణయమిది

"వ్యక్తిగతంగా ధూమపానాన్ని ఏ మాత్రం ప్రోత్సహించను. పాత్ర కోసం లేకపోతే.. మరేదైనా కావచ్చు దానికి సంబంధించిన పాత్రను నేను అంగీకరించను. ఇష్టపడను. ఒకవేళ పాత్రకు అనుగుణంగా అలాంటి సన్నివేశాల్లో నటించాల్సిన పరిస్థితే వస్తే.. ఆ సినిమాను వదులుకోవడానికి కూడా వెనకాడను. తెరపై ఎప్పటికీ అలాంటి పాత్రలో కనిపించను. ఎందుకంటే ధూమపానం అనేది నాకు నచ్చని అంశాల్లో ఒకటి. ఎవరి ఇష్టాలు వారివి కానీ.. ఇది నా వ్యక్తిగత నిర్ణయం మాత్రమే".

సినిమాను సినిమాలానే చూడాలి

"ఈ మధ్య కాలంలో చాలా మంది 'యానిమల్' సినిమాపై విమర్శలు చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. కానీ ఒక సినిమాను సినిమాలానే చూడాలి. ప్రతి ప్రేక్షకుడు తెరపై చూసిన దాని ద్వారానే ప్రభావితమవుతాడనే విషయాన్ని నమ్మను నేను. ఒకవేళ అలా అవుతారనుకుంటే.. మీకు నచ్చిన సినిమాలు మాత్రమే చూడండి. ప్రేక్షకులకు తాము ఏమి చూడాలనుకుంటున్నారో అనే దానిపై పూర్తి స్వేచ్ఛ ఉంది. ప్రతి మనిషిలో మరో కోణం ఉంటుంది. దానినే సందీప్ తెరపై ఆవిష్కరించారు. ప్రేక్షకులు దానిని ఎంజాయ్ చేశారు. నటీనటులుగా మేము ఆయా పాత్రలను పోషిస్తున్నాం. అంతే కానీ మా వ్యక్తిగత జీవితాలకు స్క్రీన్‌పై మీరు చూసేదానికి ఎలాంటి సంబంధం లేదు".

నన్ను నేను తీర్చిదిద్దుకుంటున్నా

"సినీరంగంలోకి అడుగుపెట్టి దాదాపు పదేళ్లు పూర్తి కావొస్తుంది. ఈ ప్రయాణం కష్టతరమైనదే కావచ్చు.. కానీ దానికి తగ్గ ఫలితాల్ని అందుకున్నా. ఈ క్రమంలో ఎన్నో ఎదురుదెబ్బలు, మంచి విషయాల్ని తెలుసుకున్నాను. వాటికి అనుగుణంగా నన్ను నేను తీర్చిదిద్దుకున్నాను. ముఖ్యంగా విజయాన్ని నిలబెట్టుకోవడంలో చాలా సవాళ్లు ఎదుర్కొంటున్నా. చిత్రసీమలో పురుషులతో పాటు మహిళలు కూడా దేన్నైనా సాధించగలరని నమ్ముతున్నా. హీరోల మాదిరిగానే నటీమణులు కూడా విజయాలు సాధిస్తున్నారు. కానీ నా దృష్టిలో నటీమణులకు ఆ విజయాన్ని చివరి దాకా కొనసాగించడమే నిజమైన యుద్ధం".

ప్రశ్నలే నావి... పనిలో జోక్యం చేసుకోను!

"విజయవంతమైన సినిమాలు తీసినన్ని రోజులే ఇక్కడ విలువ. నా ప్రయాణం మొదలై 22 ఏళ్లు అయ్యింది. ఇంకెన్నేళ్లు సినిమాలు నిర్మిస్తానో తెలియదు. చేసినన్ని రోజులు మంచి సినిమాల్ని ప్రేక్షకుల ముందుకు తీసుకు రావడంపైనే నా దృష్టంతా" అన్నారు ప్రముఖ నిర్మాత దిల్‌రాజు. తెలుగులో యాభైకిపైగా సినిమాల్ని నిర్మించిన అతి కొద్దిమంది నిర్మాతల్లో ఆయన ఒకరు. ఇటీవల శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై శిరీష్‌తో కలిసి 'తమ్ముడు' చిత్రాన్ని నిర్మించారు. నితిన్ కథానాయకుడిగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా దిల్ రాజు బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.



దిల్ రాజు

"కొత్తగా ఉండాలి.. కొత్తగా ఉండాలి... - సినిమాల విషయంలో ఈ మధ్య అందరి నోట వినిపిస్తున్న మాట ఇదే. దర్శకుడు శ్రీరామ్ వేణు అలాంటి ఓ కొత్త సినిమాని తీయాలనే సంకల్పంతోనే 'తమ్ముడు' స్క్రిప్ట్ రాసుకున్నాడు. థియేట్రికల్‌గా ప్రేక్షకుడికి ఓ గొప్ప అనుభూతిని పంచేలా శ్రీరామ్ వేణు 'తమ్ముడు' సినిమాని మలిచాడు. తెరపై సన్నివేశాల్ని చూస్తున్నప్పుడూ, థియేటర్‌లో సౌండింగ్ వింటున్నప్పుడూ ప్రేక్షకుడు ఆశ్చర్యపోతాడు. అక్కాతమ్ముడి మధ్య తిరిగే కథే ఇది. కానీ ఆ కథని కొత్త రకమైన స్క్రీన్‌ప్లేతో, యాక్షన్ ఘట్టాలతో మలిచిన తీరు ప్రేక్షకుల్ని మరింతగా అలరిస్తుంది".

- "తొలి 20 నిమిషాల సినిమా పూర్తయ్యాక... మిగతాదంతా కూడా ఒక్క రోజులో జరిగే కథే. అక్కాతమ్ముడి మధ్య ఓ సమస్య వచ్చినప్పుడు, దాన్ని పరిష్కరించేందుకు తమ్ముడు చేసిన సాహసాలు ఇందులో ఆసక్తికరం. దర్శకుడు శ్రీరామ్ వేణు 'ఆర్య' నుంచీ మా సంస్థలోనే ప్రయాణం చేస్తున్నాడు. ఆయన దర్శకత్వంలో వచ్చిన అన్ని సినిమాల్నీ మేమే నిర్మించాం. మా మధ్య ఉన్న అనుబంధం, ఆలోచనల్లో సారూప్యతే అందుకు కారణం. అనిల్ రావిపూడి, వంశీ పైడిపల్లి, హరీష్‌శంకర్.. ఇలా కొద్దిమంది దర్శకులతో మాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంటుంది. వాళ్లు కథలు చెబుతున్నప్పుడు కానీ, ఎడిటింగ్ టేబుల్ దగ్గర కానీ నాకొచ్చిన సందేహాలకొద్దీ ప్రశ్నలు అడుగుతుంటాను తప్ప... వాళ్ల పనిలో మాత్రం జోక్యం చేసుకోను. వాళ్ల ప్రతిభేంటో నాకు తెలుసు".
- "విడుదల రోజు ఉదయం ఆటే సినిమాల భవిష్యత్తుని ఖరారు చేస్తుంది. పైరసీ విషయంలో అయినా, వ్యతిరేక ప్రచారంతో కూడిన ట్రోలింగ్ చేస్తున్నప్పుడైనా, సమీక్షలు రాస్తున్నప్పుడైనా నిర్మాతల గురించి ఒక్క నిమిషం ఆలోచించాలి. ఒక సినిమాకి నష్టం జరిగిందంటే ఆ ప్రభావం అంతా నిర్మాతపైనే. ఇలాంటి విషయాలపై మాట్లాడితే నన్ను తప్పుగా చూస్తున్నారు. నాకు మంచి సినిమాని తీయడంపైనే దృష్టి తప్ప వేరే ఉద్దేశాలేమీ ఉండవు. ఇకపైన యూట్యూబ్ వ్యూస్ విషయంలోనే కాదు, వసూళ్ల విషయంలోనూ నిజాయతీగానే ఉంటాం. పైరసీని అరికట్టేందుకు పరిశ్రమ నుంచి చర్యలు మొదలయ్యాయి. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో పూర్తి సహకారం అందిస్తోంది. 'సింగిల్' సినిమాని థియేటర్‌లో కూర్చుని రికార్డ్ చేసిన నలుగురిని గుర్తించి ఇటీవలే పోలీసులు అరెస్ట్ చేశారు. పైరసీ, నెగెటివ్ ప్రచారం విషయంలో 'కుబేర', 'కన్నప్ప' బృందాలు తీసుకున్న చర్యలు మంచి ఫలితాల్ని ఇచ్చాయి. అలా ఒకరిని చూసి మరొకరు అనుసరిస్తూ ముందుకు వెళ్లడమే".
- "ప్రతిభావంతులకు అన్ని విభాగాల్లో తగిన అవకాశాలు ఇవ్వాలనే సంకల్పంతోనే దిల్‌రాజు డ్రీమ్స్ మొదలుపెట్టాం. నిర్మాణంవైపు కూడా చాలా మంది ఆసక్తి చూపించారు. కథ బాగుంటే మేమే పెట్టుబడి పెట్టి వాళ్లతో సినిమా చేయిస్తాం. వాళ్లే సినిమా నిర్మించినా విడుదల పరంగా మేం సహకారం అందిస్తాం. ఇలా కొత్త నిర్మాతలు పరిశ్రమలోకి వస్తారనేది మా నమ్మకం. ఎఫ్.డి.సి ఛైర్మన్‌గా తదుపరి నా దృష్టి బాలల చిత్రోత్సవాల్ని పునః ప్రారంభించడంపైనే! మా సంస్థలో ఈ ఏడాది నాలుగు సినిమాల్ని ప్రారంభిస్తాం. 'రౌడీ జనార్దన', 'ఎల్లమ్మ', 'దేత్తడి'తోపాటు, మరో ప్రాజెక్ట్ కూడా ఉంది. వచ్చే ఏడాది అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ చిత్రం, 'మార్కో' దర్శకుడు హనీఫ్‌తో ఒక సినిమా ఉంటుంది. జంతువుల నేపథ్యంలో ఓ సినిమా చేస్తాం. అందులో ఓ స్టార్ హీరో నటించాల్సి ఉంటుంది. ఇంకా ఇద్దరు కొత్త దర్శకులతో సినిమాలు ఖరారయ్యే దశలో ఉన్నాయి".


సోలో బాయ్ మధ్యతరగతి జీవితం

గౌతమ్‌కృష్ణ హీరోగా నవీన్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సోలో బాయ్'. రమ్య పసుపులేటి, శ్వేత అవస్తి కథానాయికలు. సెవెన్‌హిల్స్ సతీశ్ నిర్మాత. ఈ చిత్రం ఈ నెల 4న రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు. ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిత్ర దర్శకుడు మాట్లాడుతూ 'మధ్య తరగతి జీవితాల్ని ప్రతిబింబించే కథతో తెరకెక్కిన చిత్రమిది. పలు రకాల జానర్ల మేళవింపు ఈ సినిమా ప్రత్యేకత" అన్నారు. కార్యక్రమంలో రఘు కుంచె, కేఎల్ దామోదర్ ప్రసాద్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



గౌతమ్‌కృష్ణ, శ్వేత

బాబా రాడు.. కానీ కనిపిస్తాడు!



అనంత్ జోషి

'నేను మాఫియాలను మోకరిల్లి క్షమాపణ చెప్పేలా చేస్తాన'ని అంటున్నారు ఓ వ్యక్తి. మరి ఆయనెవరనేది తెలుసుకోవాలంటే 'అజయ్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఏ యోగి' సినిమా చూడాల్సిందే. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందుతున్న చిత్రమిది. రవీంద్ర గౌతమ్ దర్శకత్వం వహిస్తున్నారు. యోగి పాత్రలో బాలీవుడ్ నటుడు అనంత్ జోషి కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. చిన్న వయసులోనే సన్యాసం స్వీకరించి.. రాష్ట్రాన్ని నేర రహితంగా మార్చాలని ప్రయత్నించిన యోగి బాల్యాన్ని చూపిస్తూ సాగుతున్న ఈ టీజర్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. ఇందులో "బాబా ఈరోజు రాడు.. కానీ కనిపిస్తాడు.. కనిపించే సమయం కూడా ఆసన్నమైంది" లాంటి సంభాషణలు అలరిస్తున్నాయి. పరేశ్ రావెల్, పవన్ మల్హోత్రా, గరిమా విక్రాంత్ సింగ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమా ఆగస్టు 1న రానుంది.

ఎన్నెన్నో మలుపుల షో టైం



నవీన్‌చంద్ర

తక్కువ పాత్రలతో సాగే ఈ కథలో ఎన్నెన్నో మలుపులు ఉన్నాయని చెప్పారు నవీన్‌చంద్ర. ఆయన కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'షో టైం'. కామాక్షి భాస్కర్ల కథానాయిక. రాజారవీంద్ర ముఖ్యపాత్రని పోషించారు. మదన్ దక్షిణామూర్తి దర్శకుడు. కిశోర్ గరికపాటి నిర్మిస్తున్నారు. అనిల్ సుంకర సమర్పకులు. ఈ చిత్రం ఈ నెల 4న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం బుధవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసింది. నవీన్‌చంద్ర మాట్లాడుతూ "ఇది సీరియస్‌గా సాగే ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ కాదు. ఆ కథలకి భిన్నంగా, కడుపుబ్బా నవ్విస్తూనే కావల్సినంత థ్రిల్‌ని పంచుతుంది. రాజా రవీంద్ర, నరేశ్... ఒకరు పోలీసుగా, మరొకరు న్యాయవాదిగా మంచి పాత్రల్ని పోషించారు. వీళ్లు తెరపై కనిపించిన ప్రతిసారీ నవ్వులే నవ్వులు" అన్నారు.

రెండో చిత్రానికి శ్రీకారం



సంగీత్ శోభన్, నయన్ సారిక

నిర్మాతగా తొలి సినిమాతోనే విజయాన్ని అందుకున్నారు నిహారిక కొణిదెల. ఆమె సొంత సంస్థ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై గతేడాది నిర్మించిన 'కమిటీ కుర్రోళ్ళు' ప్రేక్షకుల మెప్పు పొందింది. ఆ విజయం అందించిన ఉత్సాహంతోనే తన రెండో చిత్రానికి శ్రీకారం చుట్టారు నిహారిక. సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటిస్తుండగా, మానసశర్మ దర్శకత్వం వహిస్తున్నారు. బుధవారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైందీ చిత్రం. ప్రముఖ దర్శకుడు నాగ్ అశ్విన్ ముఖ్య అతిథిగా హాజరై ముహూర్తపు సన్నివేశానికి క్లాప్‌కొట్టారు. దర్శకులు వశిష్ఠ కెమెరా స్విచ్ఛాన్ చేయగా, కల్యాణ్ శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు.

(c) eenadu

ఈనాడు బిజినెస్

టూత్‌పేస్ట్, దుస్తుల ధరలు తగ్గుతాయా?

జీఎస్‌టీని తగ్గించే యోచనలో ప్రభుత్వం

దిల్లీ: ఆదాయపు పన్ను రేట్ల రూపేణా మధ్యతరగతికి ఊరటనిచ్చిన కేంద్ర ప్రభుత్వం.. ఇప్పుడు మధ్య, అల్పాదాయ వర్గానికి జీఎస్‌టీ రూపేణా ఉపశమనం ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. జీఎస్‌టీ విధానంలో 12% శ్లాబును పూర్తిగా తొలగించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ శ్లాబులోని చాలా వస్తువులను 5% శ్లాబులోకి తెచ్చే అవకాశం ఉంది. మధ్య, అల్పాదాయ వర్గాలు ఎక్కువగా వాడే వస్తువులను 5 శాతం శ్లాబులోకి ప్రభుత్వం మార్చొచ్చని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఫలితంగా టూత్‌పేస్ట్, దుస్తులు, పాత్రల ధరలు తగ్గే అవకాశం ఉంది.

12% శ్లాబ్ కింద ఉన్న వస్తువుల్లో కొన్ని..

✦ టూత్‌పేస్ట్ ✦ టూత్ పౌడర్ ✦ గొడుగులు ✦ కుట్టు యంత్రాలు ✦ ప్రెజర్ కుక్కర్ ✦ గీజర్ ✦ అల్యూమినియం, స్టీల్‌తో తయారైన వంట పాత్రలు ✦ వాషింగ్ మెషీన్లు (తక్కువ సామర్థ్యం ఉన్నవి) ✦ ఎలక్ట్రిక్ ఇస్త్రీపెట్టె ✦ సైకిళ్లు ✦ సీటీ పిల్లర్లు, కుట్టు యంత్రాలు (విద్యుత్ అవసరం లేనివి) ✦ సోలార్ వాటర్ హీటర్లు ✦ వాక్యూమ్ క్లీనర్లు (తక్కువ సామర్థ్యం) ✦ రూ.1000కి పైగా ధర ఉన్న రెడీమేడ్ దుస్తులు ✦ రూ.500- 1000 మధ్య ధర ఉండే పాదరక్షలు ✦ స్టేషనరీ ఉత్పత్తులు ✦ పలు రకాల టీకాలు ✦ హెచ్‌ఐవీ, హెపటైటిస్, టీబీకి సంబంధించిన డయాగ్నస్టిక్ కిట్లు ✦ కొన్ని రకాల ఆయుర్వేదిక్, యునానీ ఔషధాలు ✦ జామెట్రీ బాక్స్‌లు, మ్యాప్‌లు, గ్లోబులు ✦ సిరామిక్ టైల్స్ (నాన్ ఆర్ట్ వేర్ యంటల్) ✦ రెడీమిక్స్ కాంక్రీట్ ✦ కొన్ని రకాల వ్యవసాయ పరికరాలు



ఆదాయం కోల్పోయేందుకు సిద్ధమే..: ఇందువల్ల ప్రభుత్వం రూ.40,000- 50,000 కోట్ల మేర జీఎస్‌టీ ఆదాయాన్ని కోల్పోవాల్సి రావొచ్చని సమాచారం. ఈ మొత్తాన్ని ఇతరత్రా రూపంలో భర్తీ చేసుకునే మార్గాలను ప్రభుత్వం అన్వేషిస్తోందని తెలుస్తోంది. గిరాకీ పెంచే ఉద్దేశంతోనే పన్ను రేట్ల హేతుబద్ధీకరణకు ప్రభుత్వం యోచిస్తోంది. ధరలు తగ్గితే విక్రయాలు పెరిగే అవకాశం ఉండటం ఇందుకు కారణం. ఫలితంగా దీర్ఘకాలంలో జీఎస్‌టీ వసూళ్లు పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

వాట్సప్‌పై వ్యాపార సందేశాలకు కొత్త ధరలు



మెటా ఆధ్వర్యంలోని వాట్సప్ తన వ్యాపార సందేశాలకు సంబంధించిన ధరల్లో కొన్ని నిర్మాణాత్మక మార్పులను చేసింది. ఇందువల్ల వినియోగదారులకు పలు సేవలను అందించేందుకు వాట్సప్‌ను వాడే సంస్థలకు సెంటర్ ఖర్చులు పెరగొచ్చు. ఈనెల 1 నుంచే ఈ ధరలను వాట్సప్ సవరిస్తోంది.

✦ ఇప్పటి వరకు వ్యాపార సంస్థ ఏదైనా సమాచారం కోరుతూ ఒక వినియోగదారుడు సందేశం పంపిస్తే.. ఆ మొత్తం సంభాషణ పూర్తయ్యే వరకు లేదా 24 గంటల వరకు ఒకే బిల్లింగ్ ఉండేది. ఇక నుంచి ప్రతి సందేశానికీ విడివిడిగా బిల్లింగ్ చేయనుంది. ఉదాహరణకు ఒక బీమా సంస్థ నుంచి సమాచారం తెలుసుకోవాలంటే.. బీమా కంపెనీ నంబరుకు 'హాయ్' అని సందేశం పంపిస్తే చాలు. అక్కడి నుంచి అన్ని రకాల సేవలకు సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు వీలుంటుంది. దీనికంతా కలిపి రూ.0.78 బిల్లింగ్ చేసేది. ఇప్పుడు ప్రతి సందేశానికీ రూ.0.78 చొప్పున వసూలు చేయనుంది.

సందేశాన్ని బట్టి..: కొత్త ధరలు అన్నీ ఒకే విధంగా ఉండకపోవచ్చు. సందేశాలను బట్టి, వేర్వేరు ధరలు వర్తిస్తాయి. ఉదాహరణకు వినియోగదారులకు ధన్యవాదాలు తెలిపే సందేశాలకు రూ.0.11 వసూలు చేస్తుంది. గతంలో 24 గంటల్లో అపరిమితంగా సందేశాలు పంపించే వీలుండేది. సంప్రదాయ సంక్షిప్త సందేశాల (ఎస్‌ఎంఎస్)కు వసూలు చేస్తున్న రూ.0.12- 0.15తో పోలిస్తే, ఇప్పటికే తమ కొత్త ధరలు తక్కువేనని వాట్సప్ పేర్కొంటోంది. నెలకు 30 కోట్లకు పైగా సందేశాలు పంపించే కంపెనీలకు, ఒక్కో సందేశానికి రూ.0.080 చొప్పున వసూలు చేస్తామని తెలిపింది.

వ్యాపారాలపై ప్రభావం..: ఈ కొత్త ధరల వల్ల వ్యాపార సంస్థలు వాట్సప్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవచ్చు. ఎస్ఎంఎస్, ఆర్‌సీఎస్ (రిచ్ కమ్యూనికేషన్ సర్వీసెస్)లాంటి వాటి వైపు మొగ్గు చూపొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే వ్యాపారాలకు ఈ కొత్త మార్పులతో సర్దుబాటయ్యేందుకు కొంత సమయం పట్టొచ్చు. వినియోగదారులకు వాట్సప్ ఒక ఆకర్షణీయ సమాచార ఛానెల్. కాబట్టి, వ్యాపార సంస్థలు వారి అవసరాలను తీర్చేందుకు దీన్ని ఉపయోగించక తప్పదనే అభిప్రాయమూ ఉంది. ఆదాయం పెంచుకునేందుకు, వినియోగదారుల అప్‌డేట్ విభాగంలో ప్రకటనలు ఇస్తామనీ వాట్సప్ ప్రకటించడం గమనార్హం.

ఆకర్షణీయంగా ఔషధ ఎగుమతులు

● ఏప్రిల్, మే నెలల్లో 4.96 బి.డాలర్లకు
● మున్ముందు మరింత వృద్ధి: ఫార్మెగ్జిల్

ఈనాడు, హైదరాబాద్: మనదేశం నుంచి ఔషధ ఎగుమతులు ఆకర్షణీయంగా నమోదవుతున్నాయి. ఈ ఏడాది మే లో 2.47 బిలియన్ డాలర్ల (సుమారు రూ.21,000 కోట్లు) ఎగుమతులు నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, మే నెలల్లో కలిపి 4.96 బి.డాలర్ల (రూ.42,000 కోట్లకు పైగా) ఎగుమతులు జరిగాయి. 2024-25 ఇదే కాలంలో నమోదైన ఔషధ ఎగుమతులతో పోల్చితే ఇవి 7.38% ఎక్కువని ఫార్మెగ్జిల్ (ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్) వెల్లడించింది. ఇంకా అధిక ఎగుమతులను సాధించేందుకు తగిన వ్యూహాలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపింది.



మే నెలలో చేసిన ఔషధ ఎగుమతుల్లో ఫార్ములేషన్లు, బయోలాజికల్స్ వాటా 75.74 శాతంగా ఉంది. బల్క్ డ్రగ్స్, డ్రగ్ ఇంటర్మీడియేట్స్ ఎగుమతులు 4.40% అధికంగా నమోదయ్యాయి. టీకాల ఎగుమతులు 13.64% వృద్ధితో 190.13 మిలియన్ డాలర్లకు చేరాయి. సర్జికల్స్ ఎగుమతులు 8.58%, ఆయుష్- హెర్బల్ ఉత్పత్తుల ఎగుమతులు 7.36% పెరిగాయి. భారత్ మొత్తం ఎగుమతుల్లో అమెరికా వాటా 34.50%.

సెప్టెంబరు 4-6 తేదీల్లో భారత్ హెల్త్: ఎగుమతులు పెంచుకునేందుకు ఈ ఏడాది సెప్టెంబరు 4-6 తేదీల్లో 'భారత్ హెల్త్' పేరిట ఐటెక్స్- 2025 నిర్వహిస్తున్నట్లు ఫార్మెగ్జిల్ తెలిపింది. ఔషధ పరిశ్రమ సత్తా, పరిశోధనా నైపుణ్యం, ఉత్పత్తి సామర్థ్యాలను ప్రపంచ దేశాలకు అర్థమయ్యేలా ఇందులో వివరిస్తామని, మన దేశానికి ఔషధ రంగంలో ఉన్న పరిశోధన- అభివృద్ధి సామర్థ్యం వల్లే, అధిక ఎగుమతులు సాధించగలుగుతున్నట్లు ఫార్మెగ్జిల్ ఛైర్మన్ నమిత్ జోషి స్పష్టం చేశారు. భారత్-యూకే దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) చర్చల్లో ప్రగతి, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు మనదేశం తీసుకుంటున్న చర్యలు, సీడీఎంఓ (కాంట్రాక్టు అభివృద్ధి, ఉత్పత్తి) సామర్థ్యాల వల్ల ఔషధ ఎగుమతులను గణనీయంగా పెంచుకునే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

దేశీయంగా ఐఫోన్ల తయారీ నెమ్మదిస్తుందా?

చైనా నిపుణులను వెనక్కి పిలిపిస్తున్న ఫాక్స్‌కాన్

దిల్లీ: మనదేశంలో ఐఫోన్ల అసెంబ్లింగ్ ప్రక్రియ నెమ్మదించే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. చైనాతో పాటు మనదేశంలోనూ ఐఫోన్ తయారీ/అసెంబ్లింగ్ ప్లాంట్లు నిర్వహిస్తున్న ఫాక్స్‌కాన్ టెక్నాలజీ గ్రూప్, చైనా దేశ ఇంజినీర్లు-సాంకేతిక నిపుణులను మాత్రం మనదేశం నుంచి వెనక్కి పిలిపిస్తున్నట్లు సమాచారం. 2 నెలల నుంచీ ఇది జరుగుతోందని, ప్రస్తుతం 300 మంది చైనా కార్మికులు, తైవాన్‌కు చెందిన సహాయ కార్మికులు మాత్రమే భారత్‌లోని ప్లాంట్లలో ఉన్నట్లు 'పేరు వెల్లడించానికి ఇష్టపడని' వ్యక్తులు తెలిపారని బ్లూమ్‌బర్గ్ వార్త సంస్థ పేర్కొంది. చైనాలో ఎప్పటినుంచో ఐఫోన్ల తయారీ/అసెంబ్లింగ్ జరుగుతున్నందున అక్కడి ఇంజినీర్లు/సాంకేతిక నిపుణులకు అధిక ప్రావీణ్యం ఉంది. మనదేశంలో కొత్తగా నెలకొల్పిన ఐఫోన్ ప్లాంట్లలోని భారత సిబ్బందికి వారితో శిక్షణ ఇప్పిస్తున్నారు. చైనా నిపుణులు వెళ్లిపోతున్నందున, మనదేశంలో ఐఫోన్ల తయారీ/సిబ్బందికి శిక్షణ నెమ్మదిస్తుంది. తయారీ సాంకేతిక పరిజ్ఞానాన్ని, నిపుణులను వేరే దేశాలకు అందుబాటులో లేకుండా చేయడం ద్వారా, తమ దగ్గరే తయారీ కొనసాగేలా చూడాలన్న చైనా ప్రభుత్వ ఆదేశాలతోనే ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని సమాచారం.

విష్ణు కార్స్‌కు జీఎస్‌టీ పురస్కారాలు



పురస్కారాన్ని స్వీకరిస్తున్న దీపా వెంకట్

చెన్నై, న్యూస్‌టుడే: జీఎస్‌టీ చెన్నై శాఖ ప్రకటించిన రెండు విభాగాల్లో పురస్కారాలను విష్ణు గ్రూప్ ఆఫ్ కంపెనీస్ జాయింట్ డైరెక్టర్ దీపా వెంకట్ అందుకున్నారు. టాప్ ట్యాక్స్ పేయర్‌గా విష్ణు కార్స్, ఉత్తమ మహిళా పారిశ్రామికవేత్తగా దీపా వెంకట్ ఎంపికయ్యారు. 8వ జీఎస్‌టీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జీఎస్‌టీ తమిళనాడు, పుదుచ్చేరి జోన్ ఆధ్వర్యంలో చెన్నైలోని కలైవాణర్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాలను దీపా వెంకట్ స్వీకరించారు. 15 ఏళ్లుగా నమ్మకానికి మారుపేరుగా నిలిచిన విష్ణు కార్స్‌ను రెండు విభాగాల్లో సీజీఎస్‌టీ గుర్తించడం ఆనందంగా ఉందని దీప అన్నారు.

మైక్రోసాఫ్ట్‌లో మరోసారి భారీ లేఆఫ్‌లు

రెడ్‌మండ్ (అమెరికా): మైక్రోసాఫ్ట్ మరోసారి లేఆఫ్‌లను ప్రకటించింది. బుధవారం నుంచే వేల మంది ఉద్యోగులకు నోటీసులను పంపడం మొదలుపెట్టింది. ఎంత మందిని తొలగిస్తున్నారనే విషయాన్ని వెల్లడించడానికి కంపెనీ నిరాకరించినా, మొత్తం ఉద్యోగుల్లో 4% కంటే తక్కువే ఉండొచ్చని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా పలు విభాగాల్లో ఉద్యోగాల కోత ప్రభావం ఉంటుందని పేర్కొంది. జూన్ చివరికి కంపెనీలో 2,28,000 మంది శాశ్వత ఉద్యోగులున్నారు. వీరిలో 4 శాతం అంటే 9,000 మంది వరకు ఇప్పుడు ఉద్యోగాలు కోల్పోవచ్చు. ఈ ఏడాదిలో ఇప్పటికే 3 సార్లు లేఆఫ్‌లను సంస్థ ప్రకటించింది. మే నెలలో 6,000 మందిని తొలగించింది.

కోడి గుడ్లు

3న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	575
వరంగల్	577
విజయవాడ	590
గోదావరి	570
విశాఖపట్నం	585
చిత్తూరు	633

ఆర్‌కామ్ రుణ ఖాతా మోసపూరితం

● ఎస్‌బీఐ నిర్ణయం ● ఆర్‌బీఐకి పంపే నివేదికలో అనిల్ అంబానీ పేరు ● పోలీసులకూ ఫిర్యాదు!



దిల్లీ: నష్టాల్లో చిక్కుకున్న టెలికాం సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) తీసుకున్న రుణాన్ని 'మోసపూరితం'గా వర్గీకరించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిర్ణయించింది. ఆ కంపెనీ డైరెక్టర్ అనిల్ అంబానీ పేరును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కు రిపోర్ట్ చేయనుంది. గత నెల 23న ఆ మేరకు తమకు ఎస్‌బీఐ నుంచి సమాచారం వచ్చినట్లు ఆర్‌కామ్ వెల్లడించింది. ఆర్‌కామ్‌కు రుణాలిచ్చిన ఇతర బ్యాంకులూ ఈ దిశగానే అడుగులు వేస్తాయని అంచనా.

మార్గదర్శకాలు ఏం చెబుతున్నాయ్: ఏదైనా ఒక బ్యాంకు, ఒక ఖాతాను 'మోసపూరితమైంద'ని వర్గీకరించాక, ఆ విషయాన్ని 21 రోజుల్లోగా ఆర్‌బీఐకి తెలపాలి. కేసును సీబీఐ/పోలీసులకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

ఏం మోసం జరిగింది?: ఎస్‌బీఐ సహా పలు బ్యాంకుల నుంచి ఆర్‌కామ్, దాని అనుబంధ కంపెనీలు రూ.31,580 కోట్ల రుణాన్ని తీసుకున్నాయి. రుణాలు దారి మళ్లినట్లు ఆర్‌కామ్‌కు రాసిన లేఖలో ఎస్‌బీఐ తెలిపింది. గ్రూప్‌నకు చెందిన పలు కంపెనీల మధ్య ఈ నిధుల ప్రవాహం సంక్లిష్టరీతిలో జరిగిందని పేర్కొంది. తాము పంపిన షోకాజ్‌కు కంపెనీ నుంచి వచ్చిన స్పందనలను పరిశీలిస్తే, రుణ నిబంధనలను ఆ కంపెనీ పాటించలేదని తేలిందని వివరించింది. దీంతో ఆర్‌కామ్ ఖాతాను బ్యాంకుకు చెందిన ఫ్రాడ్ ఐడెంటిఫికేషన్ కమిటీ 'ఫ్రాడ్(మోసపూరితం)'గా వర్గీకరించింది.

ఇపుడు ఏం చేస్తారంటే: రుణఖాతా వర్గీకరణ అనంతరం, ప్రమోటరు డైరెక్టర్, పూర్తికాల డైరెక్టర్లకూ ఆర్‌బీఐ నిబంధనలు వర్తిస్తాయి. రుణాల ఎగవేతతో పాటు ఖాతాలో మోసానికి పాల్పడినందుకు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకోకుండా వీరిపై అయిదేళ్ల పాటు నిషేధం విధిస్తారు. ఆ గడువు తర్వాతే కొత్త రుణాలు ఇవ్వాలా వద్దా అన్న నిర్ణయం తీసుకుంటారు. మోసపూరిత ఖాతాల పునర్నిర్మాణానికి లేదా అదనపు రుణాల జారీపైనా అపుడే నిర్ణయం ఉంటుంది.

ఆర్‌బీఐ, కోర్టు మార్గదర్శకాల ఉల్లంఘన ఇది: ఆర్‌కామ్ లాయర్లు: ఆర్‌కామ్ రుణ ఖాతాలను మోసపూరితమైనవిగా వర్గీకరించడాన్ని వ్యతిరేకిస్తూ అనిల్ అంబానీ న్యాయవాదులు ఎస్‌బీఐకి లేఖ రాశారు. ఆర్‌బీఐ మార్గదర్శకాలు, వివిధ కోర్టు ఆదేశాలను ఉల్లంఘించేదిగా ఎస్‌బీఐ నిర్ణయం ఉందని జులై 2 నాటి లేఖలో వారు పేర్కొన్నారు. షోకాజ్ నోటీసులపై వ్యక్తిగతంగా తన వాదన వినిపించడానికి కూడా అనిల్‌కు అవకాశం ఇవ్వలేదని వారు ఆరోపించారు.

పంటల కోసం ప్రత్యేక బీమా

క్షేమ జనరల్ ఇన్సూరెన్స్‌తో కేవీబీ భాగస్వామ్యం

ఈనాడు, హైదరాబాద్: గ్రామీణ, వ్యవసాయ ఆధారిత వర్గాలకు ప్రయోజనం చేకూరేలా క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ 'క్షేమ కిసాన్ సాథీ' అనే బీమా పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. పంటల బీమాతో పాటు, వ్యక్తిగత ప్రమాద బీమా అందించడం ఈ పాలసీ ప్రత్యేకత. దీన్ని గ్రామీణ ప్రాంతాల్లో విక్రయించేందుకు కరూర్ వైశ్యా బ్యాంక్ (కేవీబీ)తో బ్యాంకస్యూరెన్స్ భాగసామ్యాన్ని కుదుర్చుకుంది. కేవీబీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ రమేష్ బాబు మాట్లాడుతూ.. బ్యాంకింగ్‌తో పాటు, గ్రామీణులకు ఇతర సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ఇది తోడ్పడుతుందన్నారు. క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ ఛైర్మన్ నటరాజ్ నూకల మాట్లాడుతూ.. ఈ బీమాతో కుటుంబానికి రెండు రకాలుగా ఆర్థిక భద్రత లభిస్తుందన్నారు.

హెచ్‌డీబీ ఫైనాన్షియల్‌కు మా సహకారం కొనసాగుతుంది

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఈఓ



ముంబయి: పబ్లిక్ ఇష్యూ అనంతరమూ తమ అనుబంధ సంస్థ హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు సహకరిస్తూనే ఉంటామని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టరు, సీఈఓ శశిధర్ జగదీశన్ తెలిపారు. బుధవారం హెచ్‌డీబీ ఫైనాన్షియల్ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదైన సందర్భంగా ఆయన మాట్లాడారు. 'హెచ్‌డీబీ ఫైనాన్షియల్‌కు చారిత్రాత్మక రోజు ఇది. వృద్ధిని వేగవంతం చేసేందుకు సొంతంగా మూలధనాన్ని సమీకరించేందుకు, ప్రణాళికల అమలుకు ఈ ఐపీఓ కంపెనీకి ఉపయోగపడుతుంది. వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవడంలో, సవాళ్లను అధిగమించడంలో ఆ కంపెనీకి తమ సహకారం కొనసాగుతుంద'ని అన్నారు.

షేరు లాభారంభం: హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లు స్టాక్ మార్కెట్లో నమోదైన రోజే అదరగొట్టాయి. బుధవారం బీఎస్‌ఈలో ఈ కంపెనీ షేరు ఇష్యూ ధర రూ.740తో పోలిస్తే 12.83% అధికంగా రూ.835 వద్ద నమోదైంది. ఆ తర్వాత 14.92% పెరిగి రూ.850.45కి చేరినా, చివరకు 13.63% లాభంతో రూ.840.90 వద్ద ముగిసింది.

టీవీఎస్ ఐక్యూబ్‌లో కొత్త వెర్షన్



చెన్నై: టీవీఎస్ మోటార్ విద్యుత్ స్కూటర్ ఐక్యూబ్‌లో కొత్త వేరియంట్‌ను అధునాతన ఫీచర్లతో తీసుకొచ్చింది. దీని ధర రూ.1.03 లక్షలు (ఎక్స్-షోరూమ్ దిల్లీ). అదనపు భద్రత కోసం హిల్ హోల్డ్ అసిస్ట్ ఫీచర్‌ను అందించారు. 3.1 కిలోవాట్ అవర్ బ్యాటరీ ఒక్కసారి ఛార్జింగ్‌తో 123 కి.మీ ప్రయాణాన్ని అందిస్తుందని కంపెనీ తెలిపింది.

సంక్షిప్తంగా

✦ రంగుల తయారీ, విక్రయంలో తన గుత్తాధిపత్య స్థానాన్ని దుర్వినియోగం చేస్తోందనే ఆరోపణలపై **ఏషియన్ పెయింట్స్** మీద కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) దర్యాప్తునకు ఆదేశించింది. దీంతో ఈ కంపెనీ షేర్లు బుధవారం ట్రేడింగ్ ఆరంభంలో అమ్మకాల ఒత్తిడికి లోనై 1.78% నష్టపోయాయి. ఆ తర్వాత పుంజుకుని 2.15% లాభంతో రూ.2,419.85 వద్ద ముగిశాయి.

✦ వి హోటల్స్ లిమిటెడ్‌కు సంబంధించిన కేసు వ్యవహారంలో పూచీకత్తు కింద రూ.520 కోట్లు డిపాజిట్ చేయాల్సిందిగా **లోధా డెవలపర్స్‌**ను సుప్రీంకోర్టు ఆదేశించింది. గతేడాది వి హోటల్స్‌ను దివాలా పరిష్కార ప్రక్రియలో లోధా డెవలపర్స్ కొనుగోలు చేసింది.

✦ పాదరక్షల కంపెనీ స్కెచర్స్‌ను కొనుగోలు చేసేందుకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా అనుమతిని 3జీ కేపిటల్, సింగపూర్‌కు చెందిన జీబీసీ కోరాయి.

కార్యాలయ స్థలాల లీజింగ్‌లో జీసీసీల హవా

● 24% వృద్ధితో 3.18 కోట్ల చ.అ.కు
● 2024-25పై వెస్టియన్ నివేదిక



దిల్లీ: గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటు కోసం గత ఆర్థిక సంవత్సరంలో దేశంలోని 7 ప్రధాన నగరాల్లో 3.18 కోట్ల చదరపు అడుగుల స్థలాన్ని లీజుకు తీసుకున్నట్లు స్థిరాస్తి కన్సల్టెంట్ వెస్టియన్ వెల్లడించింది. 2023-24లో ఇందుకోసం లీజుకు తీసుకున్న 2.56 కోట్ల చ.అ.తో పోలిస్తే, ఇది 24% అధికమని పేర్కొంది. ఇందులో ఫార్చ్యూన్ 500 కంపెనీలే 1.35 కోట్ల చ.అ. స్థలాన్ని తీసుకున్నాయి. 2023-24లో ఇవి లీజుకు తీసుకున్న 1.09 కోట్ల చ.అ.తో పోలిస్తే ఇది 25% అధికం.

✦ కొత్త కార్యాలయ స్థలాల్లో జీసీసీల వాటా 41% నుంచి 42 శాతానికి పెరిగింది.

✦ బెంగళూరులో 83.4 లక్షల చ.అ. నుంచి 1.24 కోట్ల చ.అ.కు, ముంబయిలో 13.6 లక్షల చ.అ. నుంచి 36.8 లక్షల చ.అ.కు కొత్త జీసీసీల స్థలం పెరిగింది.

✦ దేశీయ కార్యాలయ స్థలాల విపణిలో డీఎల్ఎఫ్, ఎంబసీ గ్రూప్, సత్త్వ గ్రూప్, ప్రెస్టీజ్, ఆర్ఎంజెడ్ గ్రూప్, టాటా రియాల్టీతో పాటు మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్, బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రియల్ ఎస్టేట్ ట్రస్ట్, ఎంబసీ ఆఫీస్ పార్క్స్ రీట్‌లు ప్రముఖంగా ఉన్నాయి.

✦ సత్త్వ గ్రూప్, బ్లాక్‌స్టోన్ కలిపి దేశీయంగా మరో రీట్‌ను నమోదు చేసేందుకు సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేశాయి.

విదేశాల్లో గనుల కోసం ఎన్‌ఎండీసీ అన్వేషణ

ఈనాడు, హైదరాబాద్: విదేశాల్లో గనులు సొంతం చేసుకునేందుకు ఎన్‌ఎండీసీ ప్రయత్నాలు చేస్తోంది. సౌర పలకల తయారీ, పవన విద్యుత్తు టర్బైన్ల ఉత్పత్తి, ఈవీ తయారీ, విద్యుత్తు నిల్వ యూనిట్లకు కొన్ని కీలక లోహాలు ఎంతో అవసరం. దీన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్' అనే కార్యక్రమాన్ని చేపట్టింది. దీనికింద యాంటిమోనీ, బెరీలియమ్, బిస్మత్, కోబాల్ట్, రాగి, గల్లియమ్, లిథియమ్, నికెల్..వంటి 30 లోహాలను గుర్తించింది. ఈ లోహాల గనుల కోసం విదేశాల్లో ఎన్‌ఎండీసీ అన్వేషణ చేపట్టింది. ఆఫ్రికా, ఆస్ట్రేలియా, దక్షిణ అమెరికా దేశాల్లో ఈ గనులు కొనుగోలు చేసే ఆలోచనతో ఉన్నట్లు ఎన్‌ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. దుబాయ్‌లో ఎన్‌ఎండీసీ కార్యాలయాన్ని కొత్తగా ప్రారంభించారు.

నియామకాల్లో అ'ద్వితీయం'

చిన్న నగరాల్లో అధిక అవకాశాలు



ముంబయి: జూన్‌లో కార్యాలయ ఉద్యోగాల (వైట్‌కాలర్) నియామకాలు 20% పెరిగాయని ఫౌండిట్ ఇన్‌సైట్స్ ట్రాకర్ నివేదిక పేర్కొంది. రెండో అంచె నగరాల్లో అవకాశాలు భారీగా పెరగడం ఇందుకు దోహదం చేసిందని తెలిపింది. ఈ నివేదిక ప్రకారం..

✦ కోయంబత్తూరులో నియామకాల వృద్ధి 26 శాతంగా ఉంది. నాగ్‌పుర్, నాసిక్ 24% చొప్పున వృద్ధిని నమోదు చేశాయి. ఐటీ, బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా), తయారీ, ఎఫ్ఎమ్‌సీజీ వంటి రంగాల్లో అధిక అవకాశాలు లభించాయి.

✦ వృద్ధికి సానుకూలంగా, మౌలిక వసతులు మెరుగ్గా ఉన్న చిన్న నగరాల వైపు ఐటీతో పాటు మరిన్ని రంగాల కంపెనీలు దృష్టి సారించడంతో, ప్రారంభ స్థాయి నియామకాలు ఇక్కడ కనిపిస్తున్నాయి. తమ నివాస ప్రాంతానికి సమీపంలోనే ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవడానికి యువతకూ వీలవుతోంది. ఫలితంగా కంపెనీలకూ నిపుణుల లభ్యత ఉంటోంది.

✦ రెండో అంచె నగరాల్లో నియామకాలు 2024 జూన్‌తో పోలిస్తే గత నెలలో 28% వృద్ధి చెందగా.. దిల్లీ-ఎన్‌సీఆర్(5%), చెన్నై(18%), బెంగళూరు(16%) తక్కువ వృద్ధికే పరిమితం అయ్యాయి.

✦ ఐటీ రంగం ద్వితీయ శ్రేణి నగరాల్లో 53% వృద్ధిని కనబరచింది. జాతీయ సగటు(30%) కంటే అధికం.

✦ లాజిస్టిక్స్, ఇంధన రంగాలు వరుసగా 42%, 38% మేర నియామక వృద్ధిని నమోదు చేశాయి.

భారత్ బెంజ్‌లో కొత్త ట్రక్కుల శ్రేణి



చెన్నై: డైమ్లర్ ట్రక్ ఏజీ అనుబంధ డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్, భారత్ బెంజ్ వాహనాల్లో కొత్త శ్రేణిని విపణిలోకి విడుదల చేసింది. నిర్మాణ, గనుల రంగాల కోసం వీటిని ప్రత్యేకంగా డిజైన్ చేశారు. భారత్ బెంజ్ బ్రాండ్ కింద 'హెచ్ఎక్స్', 'టార్క్‌షిఫ్ట్' సిరీస్ ట్రక్కులను చెన్నై సమీపంలోని ఒరగడం ప్లాంట్ నుంచి ఉత్పత్తి చేస్తున్నారు. దేశీయ గనులు, నిర్మాణ పరికరాల రంగం ప్రస్తుత 16 బి.డాలర్ల స్థాయి నుంచి 2030కి 45 బి.డాలర్లకు చేరుతుందన్న అంచనాల నేపథ్యంలో.. గిరాకీకి అనుగుణంగా వీటిని రూపొందించినట్లు డైమ్లర్ ఇండియా ఎండీ, సీఈఓ సత్యకం ఆర్య పేర్కొన్నారు.

కనీస నిల్వ రుసుములు రద్దు: ఇండియన్ బ్యాంక్

ఈనాడు, హైదరాబాద్: ఇండియన్ బ్యాంక్ అన్ని పొదుపు ఖాతాల్లో కనీస నిల్వ రుసుములను రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. ఈనెల 7 నుంచి ఈ కొత్త నిర్ణయం అమల్లోకి రానుంది. విద్యార్థులు, వయోధికులు, చిన్న వ్యాపార యజమానులతో పాటు, గ్రామీణ ప్రాంత ఖాతాదారులకు ఇది మరింత ప్రయోజనకరంగా ఉంటుందని బ్యాంక్ తెలిపింది. దీంతోపాటు ఏడాది వ్యవధి నిధుల ఆధారిత రుణ వడ్డీ రేటు (ఎంసీఎల్ఆర్)ను 5 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. జులై 3 నుంచి ఈ వడ్డీ రేటు 9 శాతంగా ఉండనుంది.

సూచీలకు అమెరికా టారిఫ్ భయాలు

సెన్సెక్స్ ▼ 288 **83410** | నిఫ్టీ ▼ 88 **25453**


గడువు సమీపిస్తున్న నేపథ్యం

ఎఫ్ఐఐ అమ్మకాలు... రూ.1,562 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు... రూ.3,037 కోట్లు

సమీక్ష

జూన్ నెలకు సంబంధించి జీఎస్‌టీ వసూళ్లు - దేశీయ తయారీ రంగ వృద్ధి లాంటి సానుకూలతలున్నా.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన టారిఫ్‌ల అమలుకు గడువు (జులై 9) సమీపిస్తున్నందున మదుపర్లు జాగ్రత్తగా లావాదేవీలు నిర్వహించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్అండ్‌టీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ లాంటి దిగ్గజ షేర్లలో లాభాలు స్వీకరించడంతో, సూచీలు నష్టాలతో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 3 పైసలు తగ్గి 85.62 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు ధర 0.86% పెరిగి 67.70 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో చైనా, జపాన్, దక్షిణ కొరియా మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. హాంకాంగ్, సింగపూర్ సూచీలు రాణించాయి. ఐరోపా మార్కెట్లు మిశ్రమంగా ఆరంభమయ్యాయి.

✦ బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.45,000 కోట్లు తగ్గి రూ.460.81 లక్షల కోట్ల (5.38 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.



లాభాలతో ఆరంభం..: ఉదయం సెన్సెక్స్ (క్రితం ముగింపు 83,697.29తో పోలిస్తే) 93.43 పాయింట్ల లాభంతో ఆరంభమైనా, వెంటనే నష్టాల్లోకి జారుకుంది. ఒక దశలో 83,150.77 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 287.60 పాయింట్ల నష్టంతో 83,409.69 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 88.40 పాయింట్లు కోల్పోయి 25,453.40 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,608.10 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 25,378.75 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని ఈ సూచీ నమోదుచేసింది.

సగం.. సగం: సెన్సెక్స్ 30 షేర్లలో 15 కంపెనీల షేర్లు నష్టాల్లో, మరో 5 లాభాల్లో ముగిశాయి. బజాజ్ ఫిన్‌సర్వ్ 2.19%, ఎల్అండ్‌టీ 1.89%, బజాజ్ ఫైనాన్స్ 1.48%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.3%, బీఈఎల్ 1.23%, పవర్‌గ్రిడ్ 0.94%, ఎస్‌బీఐ 0.86%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 0.73% నష్టపోయాయి. టాటా స్టీల్ 3.72%, ఏషియన్ పెయింట్స్ 2.15%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.91%, మారుతీ సుజుకీ 1.46%, ట్రెంట్ 1.43%, ఎయిర్‌టెల్ 0.66% పెరిగాయి.

✦ **సిగాచీ ఇండస్ట్రీస్** షేరు వరుసగా మూడో రోజైన బుధవారం 7.34% తగ్గి, రూ.42.69 వద్ద స్థిరపడింది. గత 3 రోజుల్లో షేరు విలువ 22.63% పతనమైంది. హైదరాబాద్ ప్లాంటులో ప్రమాదం వల్ల భారీగా వ్యయాలు చేయాల్సి ఉండటమే ఇందుకు కారణం.

మెడి అసిస్ట్ చేతికి పారామౌంట్: పారామౌంట్ హెల్త్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ టీపీఏలో 100% వాటా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసినట్లు మెడి అసిస్ట్ ఇన్సూరెన్స్ తెలిపింది. అధికారకంగా విలీన ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ రెండు సంస్థలు విడివిడిగానే కార్యకలాపాలు నిర్వహించనున్నాయి. విలీనానంతరం దాదాపు రూ.4,000 కోట్ల విలువైన ఆరోగ్య ప్రీమియంలు మెడి అసిస్ట్ నిర్వహణ కిందకు వస్తాయి. పారామౌంట్‌ను రూ.311.80 కోట్ల విలువ వద్ద కొనుగోలు చేయనున్నట్లు గతేడాది ఆగస్టులో మెడి అసిస్ట్ ప్రకటించింది.

ఐపీఓ సమాచారం

✦ భారత్, మలేసియాల్లోని విమానాశ్రయాల్లో రెస్టారెంట్లను నిర్వహించే **ట్రావెల్ ఫుడ్ సర్వీసెస్** కంపెనీ ఐపీఓకు ధరల శ్రేణిగా రూ.1,045-1,100ను నిర్ణయించారు. పబ్లిక్ ఇష్యూ ఈ నెల 7న మొదలై 9న ముగియనుంది. ఈ ఇష్యూ ద్వారా రూ.2,000 కోట్లు సమీకరించాలన్నది కంపెనీ యత్నం.

✦ ఇండస్ట్రియల్ స్టీమ్, గ్యాస్ సరఫరా సంస్థ **స్టీమ్ హౌస్ ఇండియా** తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు అనుమతి కోరుతూ ముసాయిదా పత్రాలను కాన్ఫిడెన్షియల్ ప్రి-ఫిల్లింగ్ మార్గంలో సెబీకి సమర్పించినట్లు తెలుస్తోంది. ఐపీఓ ద్వారా రూ.500- 700 కోట్లు సమీకరించాలన్నది కంపెనీ యోచన.

✦ **సంభవ్ స్టీల్ ట్యూబ్స్** షేరు కూడా శుభారంభం చేసింది. ఇష్యూ ధర రూ.82 కంటే 34.26% అధికంగా రూ.110.10 వద్ద ఈ షేరు బీఎస్ఈలో నమోదైంది. ఒక దశలో 35.23% పెరిగి రూ.110.89కు చేరింది. చివరకు 19% లాభంతో రూ.97.58 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.2,875.40 కోట్లుగా నమోదైంది.

ఈనాడు ప్రతిభ
గురువారం, జులై 3, 2025
19 ♦ https://pratibha.eenadu.net ♦ https://eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!


అప్పు తీసుకుని కొంత కాలానికి అదనపు మొత్తాన్ని చేర్చి చెల్లించడం ఆర్థిక ప్రపంచంలో సాధారణ లావాదేవీ. ఆ అదనపు మొత్తాన్నే వడ్డీ అంటారు. అందులో బారువడ్డీని అసలు మీద మాత్రమే గణిస్తారు. వడ్డీపై వడ్డీ వేయడం ఉండదు. ఇది నిర్ణీత కాలానికి, నిర్ణీత వడ్డీరేటుతో లెక్కించే సరళమైన వడ్డీ పద్ధతి. సాధారణంగా స్నేహితులు, బంధువుల మధ్య ఇలాంటి విధానంలో ఇచ్చిపుచ్చుకోవడాలు జరుగుతుంటాయి. దాదాపు అన్ని రకాల పోటీ పరీక్షల్లోనూ దీనిపై ప్రశ్నలు వస్తున్నాయి. ఈ అధ్యాయంపై పట్టు సాధించాలంటే అసలు, వడ్డీ, వడ్డీరేటు మొదలైన ప్రాథమిక భావనల అర్థాలను అభ్యర్థులు స్పష్టంగా తెలుసుకోవాలి. బారువడ్డీ సూత్రాన్ని ఉపయోగించడం నేర్చుకోవాలి. వీలైనన్ని ఎక్కువ ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి.

బారువడ్డీ

★ బారువడ్డీనే సాధారణవడ్డీ/ సరళ వడ్డీ/ సామాన్య వడ్డీ అంటారు.

★ అసలు = P(100%) కాలం = T (సంవత్సరాలు)

వడ్డీరేటు = R% (ఒక సంవత్సరానికి నూటికి)





★ బారువడ్డీ $I = \frac{PTR}{100}$

$P = \frac{100\,I}{TR}$, $T = \frac{100\,I}{PR}$, $R = \frac{100\,I}{PT}$

★ బారువడ్డీ ప్రకారం మొత్తం $A = P + I$

$A = P\left(1 + \frac{TR}{100}\right)$



సరళం.. సామాన్యం.. సాధారణం!

మాదిరి ప్రశ్నలు

1. రూ.2,500 అసలుపై 6% వడ్డీరేటు చొప్పున 3 సంవత్సరాల కాలంలో లభించే వడ్డీ ఎంత?

1) రూ.400 2) రూ.450
3) రూ.500 4) రూ.550

వివరణ: అసలు P = రూ.2,500 వడ్డీరేటు, R = 6%, కాలం T = 3 సంవత్సరాలు

పద్ధతి-I: $I = \frac{PTR}{100}$

$I = \frac{2,500 \times 3 \times 6}{100}$ = రూ.450

లేదా

పద్ధతి-II: అసలు = 100%, 3 సంవత్సరాలకు వడ్డీ = 3 × 6 = 18 %

అసలు ⇒ 100 % → రూ.2,500

వడ్డీ ⇒ 18 % → ? = రూ.450 **జ: 2**

2. రూ.9,900 అసలుపై $9\frac{1}{11}$% చొప్పున వడ్డీరేటు 2 సంవత్సరాల కాలంలో లభించే వడ్డీ ఎంత?

1) రూ.1,200 2) రూ.1,600
3) రూ.1,800 4) రూ.2,000

వివరణ: $R = 9\frac{1}{11}\% = \frac{1}{11}$

అసలు = రూ.11
వడ్డీ = రూ.1 × 2 సంవత్సరాలు = రూ.2

అయితే అసలు ⇒ 11 → రూ. 9,900

వడ్డీ ⇒ 2 → ? = రూ.1800 **జ: 3**

3. ఒక వ్యక్తి కొంత సొమ్మును 6% వడ్డీ రేటు చొప్పున అప్పుగా తీసుకున్నాడు. అతడు 6 సంవత్సరాల, 6 నెలల కాలంలో రూ.3,900 వడ్డీగా చెల్లించాడు. అయితే అతడు తీసుకున్న అప్పు ఎంత?

1) రూ.5,800 2) రూ.7,800
3) రూ.10,000 4) రూ.12,000

వివరణ: R = 6%, T = 6 సంవత్సరాల 6 నెలలు,

వడ్డీ = 6 × 6% + 3% = 39%

వడ్డీ ⇒ 39% → 3,900

అసలు ⇒ 100% → ? రూ.10,000 **జ: 3**

4. ఒక వ్యక్తి కొంత సొమ్మును 8% సామాన్య వడ్డీకి అప్పుగా ఇచ్చాడు. నాలుగు సంవత్సరాల కాలంలో వడ్డీ అసలు కంటే రూ.680 తక్కువగా అయింది. అయితే అప్పుగా ఇచ్చిన సొమ్ము ఎంత?

1) రూ.1,500 2) రూ.1,200
3) రూ.2,000 4) రూ.1,000

వివరణ: R = 8%, T = 4 సంవత్సరాలు

అసలు = 100%, వడ్డీ = 4 × 8% = 32%

అసలు − వడ్డీ = 100% − 32% = 68%

68% → 680

100% → ? రూ.1,000 **జ: 4**

5. కొంత సొమ్మును సామాన్య వడ్డీకి అప్పు ఇస్తే 3 రెట్లు అవడానికి 8 సంవత్సరాల కాలం పడుతుంది. అయితే అదే వడ్డీ రేటు చొప్పున ఆ సొమ్ము 5 రెట్లు అవడానికి ఎంత కాలం పడుతుంది?

1) 40 సంవత్సరాలు
2) 20 సంవత్సరాలు



3) 16 సంవత్సరాలు
4) 24 సంవత్సరాలు

		అసలు	+	వడ్డీ
వివరణ: 3 రెట్లు	=	1	+	2
5 రెట్లు	=	1	+	4

2 వడ్డీకి → 8 సంవత్సరాలు

4 వడ్డీకి → ? 16 సంవత్సరాలు **జ: 3**

6. కొంతసొమ్ముపై సాధారణవడ్డీ దాని అసల్లో $\frac{4}{9}$వ వంతు, సంవత్సరాల సంఖ్య, వడ్డీరేటు సంఖ్యా పరంగా సమానమైతే వడ్డీరేటు ఎంత?

1) 6% 2) 4%
3) $6\frac{2}{3}$% 4) $4\frac{1}{6}$%

జనరల్ స్టడీస్
అరిథ్‌మెటిక్

వివరణ: $R\% = T \Rightarrow I = \frac{PTR}{100}$

I = 4, P = 9, T = R

$4 = \frac{9.R^2}{100}$

$R^2 = 100 \times \frac{4}{9}$

$R = 10 \times \frac{2}{3} = \frac{20}{3} = 6\frac{2}{3}\%$ **జ: 3**

7. ఒక వ్యక్తి A, B, C లకు రూ.15,860 మొత్తాన్ని అప్పుగా ఇచ్చాడు. 5 % వడ్డీ రేటు చొప్పున A, B, C లకు వరుసగా 2, 3, 4 సంవత్సరాల తర్వాత వారి వద్ద నుంచి సమాన వడ్డీ లభించింది. అయితే Bకి ఇచ్చిన అప్పు భాగం ఎంత?

1) రూ.4,880 2) రూ.3,660
3) రూ.7,320 4) రూ.6,420

వివరణ: $I = \frac{PTR}{100}$



వడ్డీలు సమానం ⇒ P, T లు విలోమ నిష్పత్తిలో ఉంటాయి. (R కూడా సమానంగా ఇచ్చాడు.)

T → 2 : 3 : 4

P → 6 : 4 : 3




పెట్టుబడుల మొత్తం 13 → 15,860

B భాగం వాటా 4 → ? 4,880 **జ: 1**

8. ఒక వ్యక్తి వద్ద రూ.16,000 ఉన్నాయి. అందులో కొంత భాగాన్ని 4%, మిగిలింది 5% చొప్పున సాధారణ వడ్డీకి ఇచ్చాడు. ఒక సంవత్సరంలో పొందిన మొత్తం వడ్డీ రూ.700 అయితే, 4% వడ్డీ రేటుకి ఇచ్చిన భాగం ఎంత?

1) రూ.12,000 2) రూ.8,000
3) రూ.10,000 4) రూ.6,000

వివరణ:



4% కి ఇచ్చిన భాగం విలువ = రూ.10,000

జ: 3

9. కొంత కాలానికి అసలు, మొత్తాలు 5 : 6 నిష్పత్తిలో ఉన్నాయి. 5 సంవత్సరాల తర్వాత అవి 4 : 7 నిష్పత్తిగా మారాయి. అయితే వడ్డీ రేటు ఎంత?

1) 11% 2) 10% 3) 11.5% 4) 13%

వివరణ: P : A P : A

I (5 : 6) × 4 ⇒ 20 : 24
II (4 : 7) × 5 ⇒ 20 : 35 } రూ.11 వడ్డీ

$I = \frac{PTR}{100} \Rightarrow 11 = \frac{20 \times 5 \times R}{100}$

R = 11% **జ: 1**

10. రూ.9,600 అసలుపై 9.25% వడ్డీ రేటు చొప్పున 'T' ఏళ్లలో రూ.10,480 మొత్తం అయింది. అయితే రూ.8,400 అసలుపై అదే వడ్డీరేటు చొప్పున 0.6 T కాలంలో లభించే వడ్డీ ఎంత?

1) రూ.462 2) రూ.484
3) రూ.440 4) రూ.444

వివరణ: రూ.10,480 − రూ.9,600

= రూ.880 వడ్డీ.

SI ∝ PTR (R సమానం)

SI, P×Tలు అనులోమానుపాతంలో ఉంటాయి.

9,600 × 7 : 8,400 × 0.6

40 : 21

40 → 880

21 → ? = 462 **జ: 1**

బారువడ్డీ వాయిదా లెక్క:

11. 10 % సాధారణ వడ్డీతో 5 సంవత్సరాల్లో చెల్లించాల్సిన మొత్తం రూ.4,200 అవుతుంది. అయితే వార్షిక వాయిదా సొమ్ము ఎంత?

1) రూ.750 2) రూ.650
3) రూ.700 4) రూ.600

వివరణ: వరుసగా ఐదు సంవత్సరాలు ఒక్కో సంవత్సరంలో 100 % + 110 %+ 120 % + 130 % + 140 % = 600 %

చెల్లించిన మొత్తం 600 % → 4,200



వాయిదా 100 % → ?

= రూ.700 **జ: 3**

రచయిత: పిరాది నరేష్

పాలిటీ

ప్రాక్టీస్ బిట్స్

1. మున్సిపల్ కార్పొరేషన్ (నగర పాలక సంస్థ)కు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) ప్రతి మున్సిపల్ కార్పొరేషన్‌ను పరిపాలనా సౌలభ్యం కోసం డివిజన్లు (వార్డులు)గా విభజిస్తారు.
బి) డివిజన్ల నుంచి ఓటర్లు నేరుగా కార్పొరేటర్లను ఎన్నుకుంటారు.
సి) కార్పొరేటర్లు తమలో నుంచి ఒకరిని మేయర్‌గా, మరొకరిని డిప్యూటీ మేయర్‌గా ఎన్నుకుంటారు.
డి) మేయర్, డిప్యూటీ మేయర్ల ఎన్నిక విధానం ప్రత్యక్షం.
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి


2. ఆంధ్రప్రదేశ్‌లోని మొదటి పురపాలక సంఘం ఏది?
1) మచిలీపట్నం 2) నెల్లూరు
3) భీమునిపట్నం
4) ఆముదాల వలస

3. భీమునిపట్నం పురపాలక సంఘానికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) ఇది విశాఖపట్నం జిల్లాలో ఉంది.
బి) దీన్ని 1861లో స్థాపించారు.
సి) దీనికి 2011లో, 150వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు.
డి) ఇది 2021లో నగర పంచాయతీగా మారింది.
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

4. పురపాలక సంఘం ఆర్థిక వనరులను గుర్తించండి.
ఎ) ఇంటి పన్ను, నీటి పన్ను, వీధి దీపాలపై పన్ను.
బి) దుకాణాలపై పన్ను, సినిమా టికెట్లపై పన్ను.
సి) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే గ్రాంట్లు.
డి) ఆదాయపు పన్ను.
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

సమాధానాలు: 1-1, 2-3, 3-1, 4-1.

మాక్ కౌన్సెలింగ్ 2025
ఈఏపీసెట్
నీట్



మస్కట్ విరాజ్.. అంబాసిడర్ కంగనా!



మాదిరి ప్రశ్నలు

1. ఎనర్జీ ట్రాన్సిషన్ ఇండెక్స్ (శక్తి పరివర్తన సూచీ) 2025 కి సంబంధించి కింది వాటిలో సరైంది?
ఎ) ఈ సూచీలో భారత్ 71వ స్థానంలో నిలిచింది. (స్కోర్ 53.3)
బి) ఈ సూచీలో తొలిస్థానం స్వీడన్‌ది.
సి) ఫిన్లాండ్, డెన్మార్క్, నార్వే, స్విట్జర్లాండ్ దేశాలు 2, 3, 4, 5 స్థానాల్లో నిలిచాయి.
డి) 2024లో ఈ సూచీలో భారత్ స్థానం 63.
1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి
3) ఎ, సి, డి 4) ఎ, బి, డి

2. ఏ దేశంలో భారత హైకమిషనర్‌గా దినేశ్ కె.పట్నాయక్ నియమితులయ్యారు?
1) కెనడా 2) సింగపూర్
3) మలేసియా 4) జింబాబ్వే

3. ప్యారిస్ డైమండ్ లీగ్-2025లో నీరజ్ చోప్రా జావెలిన్‌ను ఎన్ని మీటర్లు విసిరి విజేతగా నిలిచారు?



1) 92.18 మీ. 2) 88.16 మీ.
3) 90.12 మీ. 4) 89.12 మీ.

4. 'మోదీస్ లీగల్ రిఫార్మ్స్ – మోదీస్ నీతిశాస్త్ర' పుస్తక రచయిత?
1) అదిష్ సి.అగర్వాల 2) ముఖోపాధ్యాయ్
3) నిరంజన్ 4) నందితీదాస్

5. ఇటీవల ప్రధాని మోదీకి 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ మకారియోస్-3' పౌర పురస్కారం ఏ దేశం ఇచ్చింది?
1) క్రొయేషియా 2) సైప్రస్ 3) కెనడా 4) ఫిజీ

6. ఈ-స్పోర్ట్స్ ప్రపంచ కప్‌నకు ప్రపంచ రాయబారిగా కింది వారిలో ఎవరు నియమితులయ్యారు?
1) క్రిస్టియానో రొనాల్డో 2) సచిన్ తెందూల్కర్
3) విరాట్ కోహ్లీ 4) లియోనెల్ మెస్సీ

7. బ్రిక్స్‌లో 10వ భాగస్వామ్య దేశం ఏది?
1) సింగపూర్ 2) కంబోడియా
3) లావోస్ 4) వియత్నాం

నోట్: బ్రిక్స్‌లో 9వ భాగస్వామ్య దేశం నైజీరియా.

8. Memoir: A Different kind of power పుస్తక రచయిత?
1) హెలెన్ క్లార్క్ 2) బిల్ ఇంగ్లిష్
3) క్రిస్ హిప్కిన్స్ 4) జసిండా ఆర్డెర్న్

నోట్: జసిండా ఆర్డెర్న్ 2017 నుంచి 2023 వరకు న్యూజిలాండ్ ప్రధానమంత్రిగా పనిచేశారు. అతి చిన్న వయసులో (37) ఈమె ప్రధాని అయ్యారు.

9. ఇరాన్ నుంచి భారతీయులను తరలించడానికి భారత్-ఇజ్రాయెల్ చేపట్టిన ఆపరేషన్ పేరేమిటి?
1) ఆపరేషన్ కావేరి 2) ఆపరేషన్ గంగా
3) ఆపరేషన్ చీనాబ్ 4) ఆపరేషన్ సింధు

నోట్: * 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్' పేరుతో ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా దాడి చేసింది.
* ఇరాన్‌పై ఇజ్రాయెల్ 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో దాడి చేసింది.
* ఖతార్‌లోని అమెరికా మిలటరీ స్థావరాలపై ఇరాన్ దాడికి 'ఆపరేషన్ బషాయిర్ అల్ ఫతా' అని పేరుపెట్టారు.

10. 2019లో సంగీత నాటక అకాడమీ అవార్డు పొందిన 'మంగళభట్' ఇటీవల మరణించారు. ఆమె ఏ నృత్యకారిణి?
1) కూచిపూడి 2) భరతనాట్యం
3) ఒడిస్సీ 4) కథక్

11. ఇటీవల వార్తల్లో ఉన్న ఆండ్రేజ్ ప్లెన్‌కోవిక్ ఏ దేశ ప్రధానమంత్రి?
1) క్రొయేషియా 2) జోర్డాన్
3) సైప్రస్ 4) చిలీ

12. ఏ దేశంలో ఉన్న అమెరికా వైమానిక స్థావరం 'అల్-ఉదీద్'పై ఇటీవల ఇరాన్ దాడి చేసింది?
1) యూఏఈ 2) సౌదీ అరేబియా
3) ఖతార్ 4) కువైట్

13. ఇటీవల మరణించిన 'దిలీప్ దోషి' ఏ క్రీడకు సంబంధించినవారు?
1) హాకీ 2) క్రికెట్
3) ఫుట్‌బాల్ 4) టెన్నిస్

14. 'పయోనీరింగ్ ఇన్నోవేషన్ ఇన్ స్పేస్ టెక్. ఇండియాస్ జర్నీ టువార్డ్స్ గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్' అనే థీమ్‌తో జూన్ 25-27లో ఇండియా స్పేస్ కాంగ్రెస్ ఎక్కడ జరిగింది?
1) ముంబయి 2) బెంగళూరు
3) న్యూదిల్లీ 4) హైదరాబాద్

15. కింది వాటిలో సరైంది?
ఎ) వరల్డ్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ క్రీడలు 2025, సెప్టెంబరు 27 నుంచి అక్టోబరు 5 వరకు న్యూదిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతాయి.
బి) ఈ టోర్నీ మస్కట్-విరాజ్. ఇది బ్లేడ్ ప్రొస్థెటిక్ (కృత్రిమ అవయవం) ఉన్న యువ ఏనుగు.
సి) ఈ టోర్నీ అంబాసిడర్ కంగనా రనౌత్.
డి) ఇవి 12వ ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ క్రీడలు.
1) ఎ, బి, సి 2) బి, సి, డి
3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

16. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న 'టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్' 2025 సంవత్సరానికి విడుదల చేసిన 'యూనివర్సిటీ ఇంపాక్ట్ ర్యాంకింగ్' కు సంబంధించి సరైనవి?
ఎ) 98.7 స్కోర్‌తో ఆస్ట్రేలియాకు చెందిన వెస్ట్రన్ సిడ్నీ విశ్వవిద్యాలయం మొదటి ర్యాంకు సాధించింది.

సైబర్ నేరాలను నిలువరించేందుకు 'ఆపరేషన్ సెక్యూర్' పేరుతో ఇంటర్‌పోల్ రంగంలోకి దిగింది. వియత్నాం కలవడంతో బ్రిక్స్ భాగస్వామ్య దేశాల సంఖ్య పదికి చేరింది. సైప్రస్‌లో పర్యటించిన ప్రధాని మోదీ ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒక దానిని అందుకున్నారు. ఈ ఏడాది సెప్టెంబరులో దిల్లీలో వరల్డ్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఖరారయ్యాయి. క్యూఎస్ అత్యుత్తమ యూనివర్సిటీల జాబితాలో భారత్ నుంచి పలు విద్యాసంస్థలు చోటు దక్కించుకున్నాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తగ్గాయి. ఈ విధంగా అన్ని రంగాలకు సంబంధించిన జాతీయ, అంతర్జాతీయ వర్తమాన వ్యవహారాలు, ప్రాధాన్య అంశాలు, కీలక పరిణామాలను పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. వార్తల్లో నిలిచిన ప్రాంతాలు, వ్యక్తులు, పురస్కార గ్రహీతలు, నియామకాలు, నివేదికలు, ఇరాన్ - ఇజ్రాయెల్ యుద్ధం పర్యవసానాలు తదితరాలను గమనిస్తూ అవగాహన పెంచుకోవాలి.

కరెంట్ అఫైర్స్

బి) మాంచెస్టర్ విశ్వవిద్యాలయం (యూకే), క్యుంగ్ హీ నేషనల్ యూనివర్సిటీ (దక్షిణ కొరియా) 2, 3 స్థానాల్లో నిలిచాయి.
సి) తమిళనాడుకు చెందిన అమృత విశ్వవిద్యాపీఠం 92.9 స్కోర్‌తో 41వ ర్యాంకు సాధించింది.
డి) లవ్లీ ప్రొఫెషనల్ విశ్వవిద్యాలయం (పంజాబ్) 48వ, జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (కర్ణాటక) 56వ ర్యాంకులు సాధించాయి.
1) ఎ, డి 2) ఎ, సి, డి
3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

17. 'ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ ఇన్ ది డిజిటల్ ఎకానమీ' పేరుతో యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (యూఎన్‌సీటీఏడీ) విడుదల చేసిన నివేదిక ప్రకారం కింది వాటిలో సరైంది?
ఎ) భారత విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 2023 లో 28.1 బిలియన్ డాలర్ల నుంచి 2024 లో 27.6 బిలియన్ డాలర్లకు తగ్గాయి.
బి) ఈ నివేదికలో భారత్ 15వ ర్యాంకు సాధించింది.
సి) ఈ నివేదికలో అమెరికాది మొదటి స్థానం.
డి) సింగపూర్, హాంకాంగ్, చైనా, లక్సెంబర్గ్ వరుసగా 2, 3, 4, 5 స్థానాల్లో నిలిచాయి.
1) ఎ, బి, సి, డి 2) ఎ, బి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి

18. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న క్వాక్వరెల్లి సైమండ్స్ (క్యూఎస్) సంస్థ ప్రపంచ వ్యాప్తంగా 1500లకు పైగా యూనివర్సిటీలను వివిధ అంశాల వారీగా విశ్లేషించి 2026 సంవత్సరానికి విడుదల చేసిన జాబితాకు సంబంధించి సరైంది?
ఎ) మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అమెరికా) మొదటి ర్యాంకు సాధించింది.
బి) 192 విద్యాసంస్థలతో అమెరికా తొలిస్థానంలో నిలిచింది. 90 విద్యాసంస్థలతో బ్రిటన్ 2వ; 72 విద్యా సంస్థలతో చైనా 3వ; 54 విద్యాసంస్థలతో భారత్ 4వ స్థానాల్లో నిలిచాయి.
సి) ఇంపీరియల్ కాలేజ్ లండన్ (యూకే), స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం (యూఎస్ఏ), ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం (యూకే) వరుసగా 2, 3, 4 ర్యాంకులు సాధించాయి.
డి) భారత్ నుంచి ఐఐటీ దిల్లీ 123వ, ఐఐటీ బాంబే 129వ ర్యాంకులు సాధించాయి.
1) ఎ, బి 2) ఎ, బి, సి, డి
3) బి, సి, డి 4) ఎ, సి, డి

19. కింది వాటిలో సరైంది?
ఎ) 2025 కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాల్లో డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ రాసిన 'కబుర్ల దేవత'కు బాల సాహిత్య పురస్కారం లభించింది.
బి) 2025 కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాల్లో ప్రసాద్ సూరి రచించిన 'మైరావణ'కు యువ సాహిత్య పురస్కారం లభించింది.
సి) కేంద్రసాహిత్య అకాడమీని 1954లో స్థాపించారు.
డి) 2025 సంవత్సరానికి 24 భాషల్లో బాలసాహిత్య పురస్కారాలు, 23 భాషల్లో యువసాహిత్య పురస్కారాలను ప్రకటించారు. డోగ్రీ భాషకు అవార్డును ప్రకటించలేదు.
1) ఎ, బి 2) బి, సి
3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

20. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో భారత జీడీపీ వృద్ధిరేటు ఎంత శాతంగా ఉండొచ్చని ప్రముఖ రేటింగ్ సంస్థ ఇక్రా అంచనా వేసింది?
1) 8.2% 2) 6.5% 3) 6.2% 4) 6.9%

21. ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ) ఆరోగ్య సంరక్షణ, విద్య, స్థిరత్వం, మౌలిక సదుపాయాలు, పర్యావరణం లాంటి అంశాల ఆధారంగా 173 దేశాలతో రూపొందించిన ప్రపంచంలో అత్యంత నివాస యోగ్యమైన నగరాల జాబితా - 2025లో 1, 2 స్థానాల్లో నిలిచిన నగరాలు వరుసగా..
1) కోపెన్‌హెగన్, మెల్‌బోర్న్
2) జ్యూరిచ్, జెనీవా
3) కోపెన్‌హెగన్, వియన్నా
4) ప్యారిస్, న్యూయార్క్

22. ఏ దేశంలో ఇటీవల (ఎస్‌సీఓ) షాంఘై కో-ఆపరేషన్ రక్షణమంత్రుల సదస్సు జరిగింది?
1) రష్యా 2) పాకిస్థాన్ 3) ఇండియా 4) చైనా

23. ఇండియా వద్ద 2025, జనవరి నాటికి ఎన్ని అణు వార్‌హెడ్లు ఉన్నాయని స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ (ఎస్ఐపీఆర్ఐ-సిప్రీ) తన నివేదికలో పేర్కొంది?
1) 195 2) 180 3) 250 4) 440

నోట్: ఈ నివేదిక ప్రకారం రష్యా వద్ద 5,459, అమెరికా వద్ద 5,177 అణు వార్‌హెడ్లు ఉన్నాయి.

24. ఆస్ట్రోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా 2025, జూన్ 14, 15 తేదీల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎక్కడ విజయవంతంగా రాకెట్ లాంచ్ వ్యవస్థల ప్రయోగ పరీక్షలు జరిగాయి?
1) వారణాసి 2) లఖ్‌నవూ
3) కుశీనగర్ 4) అలహాబాద్

25. 'యునెస్కో క్రియేటివ్ సిటీ ఆఫ్ గ్యాస్ట్రోనమీ'గా ఏ భారతీయ నగరాన్ని నామినేట్ చేశారు?
1) విశాఖపట్నం 2) కోల్‌కతా
3) మీరట్ 4) లఖ్‌నవూ

26. ప్రపంచ వ్యాప్తంగా సైబర్ నేరాలను ఎదుర్కోవడానికి ఇంటర్‌పోల్ ఏ ఆపరేషన్‌ను ప్రారంభించింది?
1) ఆపరేషన్ గాంగర్ 2) ఆపరేషన్ సిందూర్
3) ఆపరేషన్ వసంత్ 4) ఆపరేషన్ సెక్యూర్

27. 2025, జూన్ 9-13 యూఎన్ఓ ఓషన్ కాన్ఫరెన్స్ ఫ్రాన్స్‌లోని 'నైస్' (మూడోది) లో జరిగింది. అయితే 2028లో 4వ మహాసముద్ర సదస్సును ఏ దేశాలు నిర్వహిస్తాయి?
1) ఇండియా, చైనా 2) చైనా, దక్షిణ కొరియా
3) ఇండియా, బంగ్లాదేశ్ 4) కెన్యా, ఈజిప్టు

28. ఇంటర్నేషనల్ బిగ్‌క్యాట్ అలయన్స్ (ఐబీసీఏ) మొదటి సమావేశం ఇటీవల ఎక్కడ జరిగింది?
1) మంగళూరు 2) మైసూర్
3) న్యూదిల్లీ 4) ముంబయి



29. ఇటీవల వార్తల్లో నిలిచిన మౌంట్ లెవోటోబి లకిలకి అగ్నిపర్వతం ఏ దేశానికి చెందింది?
1) క్యూబా
2) ఆస్ట్రేలియా
3) ఇండోనేసియా
4) మలేసియా



రచయిత: బి. ధన్‌మోహన్ రెడ్డి

సమాధానాలు

1-1; 2-1; 3-2; 4-1; 5-2; 6-1; 7-4; 8-4; 9-4; 10-4; 11-1; 12-3; 13-2; 14-3; 15-4; 16-4; 17-1; 18-2; 19-4; 20-3; 21-3; 22-4; 23-2; 24-3; 25-4; 26-4; 27-2; 28-3; 29-3.

(c) eenadu

భారతదేశంలో మౌలిక సదుపాయాలు - రవాణా వ్యవస్థ

పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ ఎకానమీ



నిలకడతో కూడిన వృద్ధికి.. నిఖార్సైన మార్గాలు!

ఒక దేశం నిలకడగా ఆర్థిక వృద్ధిని సాధించాలంటే సమన్వయంతో కూడిన సుస్థిర రవాణా వ్యవస్థ కీలకం. మారుమూల, వెనుకబడిన ప్రాంతాలను ఆయా మార్కెట్లతో అనుసంధానం చేయడంలో, ఆ ప్రాంతాల్లో పెట్టుబడులను ఆకర్షించడంలో ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ కారణంగానే ప్రభుత్వాలు రవాణా సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించి వివిధ కార్యక్రమాలు, పథకాలతో వాటి అభివృద్ధికి శ్రీకారం చుట్టాయి. హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేల విస్తరణ; రైల్వేల విద్యుదీకరణ, గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు, కొండ ప్రాంతాల్లో రోడ్‌వే కనెక్టివిటీ, స్మార్ట్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల రూపకల్పన మొదలైన మౌలిక సదుపాయాల పురోగతి లక్ష్యంగా అవి పనిచేస్తున్నాయి.

భారత జాతీయ రహదార్ల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)

దీన్ని 1988లో ఏర్పాటు చేశారు. 1995లో స్వయం ప్రతిపత్తి లభించింది. జాతీయ రహదార్ల నిర్మాణం, నిర్వహణకు సంబంధించిన నోడల్ సంస్థగా ఇది పనిచేస్తుంది.

✦ మొదటి అధ్యక్షుడు డాక్టర్ యోగేంద్ర నారాయణ్. ప్రస్తుత అధ్యక్షుడు సంతోష్ కుమార్ యాదవ్ (2022 డిసెంబరు నుంచి కొనసాగుతున్నారు).

✦ జాతీయ రహదార్ల అభివృద్ధి పథకం అమలు బాధ్యత ఈ సంస్థ నిర్వహిస్తుంది. దీని కోసం పెట్రోల్, డీజిల్‌పై వసూలు చేసే మొత్తంలో కొంత భాగం ఈ సంస్థకు కేటాయిస్తారు. జాతీయ రహదార్ల అభివృద్ధి పథకం బాండ్ల విక్రయం ద్వారా అదనపు నిధులను సమకూర్చుకుంటుంది.

✦ ఈ సంస్థ చేపట్టే ప్రాజెక్టుల్లో పెట్టుబడి కోసం ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, జపాన్ బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ నుంచి రుణాలు తీసుకుంటుంది.

జాతీయ రహదార్లు, అవస్థాపన అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్‌ఐడీసీఎల్)

ఇది హైవేస్ కనెక్టివిటీ కంపెనీ లిమిటెడ్ పేరుతో ఏర్పడింది. కంపెనీ చట్టం 2013 ప్రకారం దీన్ని ఏర్పాటుచేశారు. 2014, జులై 18 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. అప్పుడు దీని పేరును జాతీయ రహదార్లు, అవస్థాపన అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ (National Highways and Infrastructure Development Corporation Limited - NHIDCL)గా మార్చారు.

● అంతర్జాతీయ సరిహద్దు కలిగిన ప్రాంతాల్లో ఇది రహదార్ల నిర్మాణం, ఉన్నతీకరణ, విస్తరణ లాంటి పనులు నిర్వహిస్తుంది. తద్వారా ప్రాంతాల అనుసంధానాన్ని ప్రోత్సహిస్తుంది.

స్వర్ణ చతుర్భుజి

ఈ పథకాన్ని 2001లో అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ ప్రారంభించగా, 2012లో పూర్తయ్యింది.

■ దిల్లీ, ముంబయి, చెన్నై, కోల్‌కతా నగరాలను కలుపుతూ అభివృద్ధి చేసిన రహదార్ల అనుసంధానమే స్వర్ణ చతుర్భుజి. దీని పొడవు 5,846 కి.మీ. ఇది నాలుగు వరుసల రహదారి వ్యవస్థ.

పీఎం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్రణాళిక

దీన్ని 2021, అక్టోబరు 13న ప్రారంభించారు. భారతదేశ ఆర్థిక మండలాల్లో మల్టీ మోడల్ మౌలిక సదుపాయాల అనుసంధానాన్ని మెరుగుపరచడం దీని లక్ష్యం. దీని అమల్లో భాగంగా కింది రంగాలపై దృష్టి కేంద్రీకరించారు. అవి:

- రైల్వేలు
- రోడ్లు
- ఓడరేవులు
- జలమార్గాలు
- విమానాశ్రయాలు
- సామూహిక రవాణా
- లాజిస్టిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్

జాతీయ రహదార్ల అభివృద్ధి ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌డీపీ)

దీన్ని నాటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ 1998లో ప్రారంభించారు. దేశంలోని జాతీయ రహదారుల ఉన్నతీకరణ - పునరుద్ధరణ - విస్తరణ దీని లక్ష్యాలు.

❖ ఇది కేంద్ర రోడ్డు రవాణా - రహదారుల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఎన్‌హెచ్‌ఏఐ ద్వారా అమలవుతుంది. ఈ పథకం కింద దేశంలో జాతీయ రహదారులను దశలవారీగా అభివృద్ధి చేస్తారు. ఇప్పటివరకు ఏడు దశలు అమలయ్యాయి.

1) మొదటి, రెండు దశల్లో స్వర్ణ చతుర్భుజి పూర్తయ్యింది. ప్రధాన రేవు పట్టణాలను కలుపుతూ జాతీయ రహదారులను అభివృద్ధి చేశారు.

2) మూడు, నాలుగు దశల్లో నాలుగు వరసల రహదార్లు అభివృద్ధి చేశారు.

3) అయిదో దశలో 6,500 కి.మీ. మేర ఆరు వరసల రహదార్లుగా అభివృద్ధి చేసేందుకు ఆమోదం లభించింది.

4) ఆరో దశలో ఎక్స్‌ప్రెస్ రహదారులను అభివృద్ధి చేయాలని సంకల్పించారు.

5) ఏడో దశలో అనేక ప్రాంతాల్లో వలయ రహదార్లు (రింగ్‌రోడ్లు), బైపాస్ రహదార్లు, ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టారు. ఈ పథకం భారత్ మాలా ప్రాజెక్టులో విలీనమైంది.

జాతీయ లాజిస్టిక్స్ విధానం (ఎన్‌ఎల్‌పీ)

దీన్ని 2022, సెప్టెంబరు 17న ప్రారంభించారు. వివిధ రవాణా పద్ధతులను ఏకీకృతం చేయడం, లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గించడం దీని ముఖ్య లక్ష్యాలు.

◆ 2030 నాటికి లాజిస్టిక్స్ పనితీరు సూచిక (ఎల్‌పీఐ)లో భారత్‌ను టాప్ 25 దేశాల్లో ఒకటిగా చేర్చడం; లాజిస్టిక్స్ ఖర్చును 13% నుంచి 14% మేర తగ్గించేలా ఇది కార్యాచరణను రూపొందించింది.

◆ ప్రపంచ బ్యాంకు రూపొందించే ఎల్‌పీఐలో భారతదేశ ర్యాంకింగ్ 2014లో 54 (160 దేశాల్లో) నుంచి 2023లో 38కి (139 దేశాల్లో) మెరుగుపడింది.

భారత మాల పరియోజన

దీన్ని కేంద్ర ప్రభుత్వం 2017, అక్టోబరులో ప్రారంభించింది. ఇది దేశంలో రెండో అతిపెద్ద రహదారి నిర్మాణ ప్రాజెక్టు.

◗ ఎకనామిక్ కారిడార్లు, ఇంటర్ కారిడార్లు, ఫీడర్ రూట్స్, నేషనల్ కారిడార్ సామర్థ్యం మెరుగుదల, సరిహద్దు - అంతర్జాతీయ కనెక్టివిటీ, తీరప్రాంత - ఓడరేవు కనెక్టివిటీ; రోడ్లు, ఎక్స్‌ప్రెస్‌వేలతో పాటు జాతీయ రహదారుల అభివృద్ధి నిర్మాణం ద్వారా దేశంలో రవాణా సదుపాయాలను మెరుగుపరిచి, లాజిస్టిక్స్ వ్యయాన్ని తగ్గించే ఉద్దేశంతో దీన్ని తీసుకొచ్చారు. రూ.5.35 లక్షల కోట్ల అంచనా వ్యయంతో 34,800 కి.మీ. పొడవున రహదార్ల నిర్మాణం కోసం భారతమాల పరియోజనను భారత ప్రభుత్వం ఆమోదించింది.

◗ 2025 మార్చి నాటికి భారతమాల పరియోజనలో భాగంగా 20,378 కి.మీ. రహదార్ల నిర్మాణం జరిగింది.



రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

Word of the Day

699

Temperament

Telugu meaning: వ్యక్తిత్వం, స్వభావం

English meaning: The word 'temperament' (టెంపరమెంట్) is a noun that describes a person's natural character or typical emotional attitude and behaviour, especially how they tend to react emotionally.


Synonyms: Disposition, Personality

Antonyms: Indifference, Insensitivity

Usage: **1.** Despite facing constant pressure, she maintained a calm temperament and handled the situation gracefully.

2. His artistic temperament not only made him sensitive to criticism but also fuelled his creativity.

Latest Updates



IBPS PO/MT and SO Recruitment 2025

The Institute of Banking Personnel Selection (IBPS) has released the Common Recruitment Process notification for the recruitment of Probationary Officers/Management Trainees and Specialist Officers (SO) Scale-I in various public sector banks for the 2026–27 recruitment cycle. No. of posts - PO/MT: 5,208 & SO: 1,402. The application fee is Rs.850. Eligible candidates can apply online before 21 July 2025.

Probationary Officer Jobs

State Bank of India (SBI) has released a notification for the recruitment of 541 PO jobs for the year 2025. The application fee is Rs.750. The last date for receipt of online applications is 14 July 2025.

Dear Aspirants..! These are one of the largest recruitment drives conducted annually by the IBPS and SBI, offering an excellent opportunity for graduates seeking government jobs. *Eenadu Epratibha* guides you on how to make the most of this chance. Join our *'Banking Exams Course'* now!

For more information and other notifications - scan QR code

అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం

జులై 3
చరిత్రలో ఈనాడు



ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి కలిగే ముప్పు గురించి ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏటా జులై 3న 'అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం'గా (International Plastic Bag Free Day) నిర్వహిస్తారు. ప్రస్తుతం ప్రపంచాన్ని పీడిస్తోన్న పర్యావరణ సమస్యల్లో ప్లాస్టిక్ కాలుష్యం ఒకటి. ముఖ్యంగా పునర్‌వినియోగం కాని ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు, బాటిల్స్, ఇతర ఉత్పత్తుల వాడకం ఎక్కువయ్యాక ఈ వ్యర్థాలు భూమి, జలావరణ వ్యవస్థల్లో ఎక్కువగా పోగవుతున్నాయి. దీంతో ఆయా ఆవరణ వ్యవస్థల్లోని జీవులు నష్టపోవడమే కాక, జీవవైవిధ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోంది. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడంతోపాటు ప్లాస్టిక్ చెత్త రీసైక్లింగ్, కంపోస్టింగ్‌పై ప్రజల్లో చైతన్యం కల్పించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

- ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా ఏటా 460 మిలియన్ మెట్రిక్ టన్నులకు పైగా ప్లాస్టిక్ ఉత్పత్తి అవుతోంది. అదేవిధంగా ప్రతి సంవత్సరం 20 మిలియన్ మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాల రూపంలో గాలి, నీరు, నేల ఆవరణల్లోకి చేరుతుందని అంచనా.
- ప్రపంచవ్యాప్తంగా పోగవుతున్న ప్లాస్టిక్ వ్యర్థాల్లో అయిదోవంతు భారత్ నుంచే ఉన్నాయి. ఒక్కో భారతీయుడు సగటున సంవత్సరానికి 11 కిలోల ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నట్లు అంచనా. ఏటా మన దేశంలో 93 లక్షల టన్నుల వ్యర్థాలు వస్తుండగా, అందులో 35 లక్షల టన్నులు పర్యావరణంలోకి చేరుతున్నాయి.

చారిత్రక నేపథ్యం:

ప్లాస్టిక్ వాడకాన్ని నివారించే ఉద్దేశంతో 2005లో స్పెయిన్ కేంద్రంగా 'రీజీరో' అనే స్వచ్ఛంద సంస్థ ఏర్పడింది. ముఖ్యంగా అక్కడి కాటలోనియా, బాలెరిక్ దీవులు ఈ వ్యర్థాల బారిన పడకుండా అనేక కార్యక్రమాలు, చర్యలు చేపట్టింది. ప్లాస్టిక్ వల్ల కలిగే హానికర ప్రభావాల గురించి చెప్పడంతోపాటు పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాల వాడకాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో 2008, జులై 3న మొదటిసారి ఈ సంస్థ 'అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని' నిర్వహించింది. తర్వాతి కాలంలో ప్రపంచ దేశాలు ఈ రోజును జరుపుకోవడం ప్రారంభించాయి. రీజీరోకు జీరో వేస్ట్ యూరప్‌లో సభ్యత్వం ఉంది.

జనరల్ స్టడీస్ - భారతదేశ సమాజం

గిరిజనులు

అనాది కాలం నుంచి అడవులు, కొండ ప్రాంతాల్లోనే నివాసం. వేట లేదా వ్యవసాయం ప్రధాన జీవన విధానం. నాగరిక సమాజానికి పూర్తిగా దూరం. సొంత సంప్రదాయాలు, మత విశ్వాసాలు, బలమైన బంధుత్వాలతో సాగుతున్న సనాతన సహజీవనం. ప్రకృతి అంటే అపారమైన ప్రేమ. జంతువులపై అంతులేని ఆరాధన. అదే అమాయకులైన అడవి బిడ్డల చారిత్రక బతుకు చిత్రం. వారి సంస్కృతి సామాజికం, సహజసిద్ధం, స్థానికం, పరిణామ క్రమాల ఫలితం. అందుకే ఆ ఆదివాసీలు అసలైన భారతీయులు.

భారత రాజ్యాంగం గిరిజనుల్లోని అన్ని తెగలను షెడ్యూల్డ్ తెగలుగా నిర్వచించలేదు. రాజ్యాంగంలోని 342, 366(25) ఆర్టికల్స్ షెడ్యూల్డ్ తెగలుగా ఎవరిని గుర్తించాలో పేర్కొన్నాయి. ఆర్టికల్ 342 ప్రకారం షెడ్యూల్డ్ తెగలు లేదా గిరిజనులు అంటే గిరిజనుల్లోని కొన్ని తెగలు, కొన్ని వర్గాలు లేదా అన్ని వర్గాలు/అన్ని తెగలు.

తెగ లక్షణాలు


భౌగోళికంగా దూరంగా, ఒంటరిగా జీవనం

✦ మిగతా సమాజంతో కలవడానికి బిడియం, సంకోచం

✦ ఆర్థిక వెనుకబాటుతనం

ఆదిమ గిరిజన తెగలు

గిరిజనుల్లో మరింత వెనుకబడి, నాగరికతకు దూరంగా ఉన్న వర్గాలను ఆదిమ గిరిజనులు అంటారు. వీరిని ప్రస్తుతం పర్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్స్ (పీవీటీజీ) అని పిలుస్తారు.



భౌగోళిక విస్తరణ

బి.ఎస్.గుహ అనే మానవ శాస్త్రవేత్త తెగలను మూడు మండలాలుగా విభజించారు. అవి: ఉత్తర-ఈశాన్య మండలం, కేంద్ర/మధ్యమండలం, దక్షిణ మండలం.

హైడెన్ వివరణ

భారతదేశ ప్రజలను హైడెన్ మూడు రకాలుగా విభజించారు.

1) హిమాలయ ప్రాంతం
2) ఉత్తర మైదాన ప్రాంతం (ప్రస్తుత పాకిస్థాన్)
3) దక్కన్ ప్రాంతం

భారత్‌లో గిరిజనుల జనాభా లెక్కలు, ఆదిమ గిరిజన తెగలు - లక్షణాలు, జాతిపరమైన వర్గీకరణ, భాషా ప్రాతిపదిక, 2011 జనాభా లెక్కలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Current Affairs



The Indian Navy commissioned its latest stealth frigate, INS Tamal (F 71), at the Yantar Shipyard in Kaliningrad, Russia on 1 July 2025. INS Tamal is the eighth multi-role stealth frigate under Project 1135.6 and the second vessel in the follow-on Tushil class of ships.

✦ Although built in Russia, the frigate includes 26% indigenous systems, such as the BrahMos long-range supersonic cruise missile and the Humsa-NG sonar system.

The Union Cabinet, chaired by Prime Minister Narendra Modi, approved the National Sports Policy (NSP) 2025 on July 1. The policy replaces the National Sports Policy of 2001 and sets a comprehensive roadmap to establish India as a leading sporting nation, with a particular focus on preparing for the 2036 Olympic Games.



Union Railway Minister Ashwini Vaishnaw launched the 'RailOne' app at the India Habitat Centre in New Delhi on 1 July 2025. He inaugurated the app at the 40th Foundation Day celebrations of the Centre for Railway Information Systems (CRIS).

India's gross Goods and Services Tax (GST) collection for 2025 June stood at Rs.1.85 lakh crore. Gross GST collections stood at Rs.1.73 lakh crore in June 2024. In comparison, the revenue in April 2025 had touched a record Rs.2.37 lakh crore, while May's mop-up was Rs.2.01 lakh crore.

For more Current Affairs: Scan QR code

Cubes & Dice

1. The length of a side of a cube is 60 cm and the cube is coloured (painted) with pink colour. If the cube is divided into 12 equal parts then how many small cubes have pink colour at all three sides?

A) 32 B) 28 C) 8 D) 64

2. If a cube is coloured with purple whose side is 24 cm and it is divided into small cubes whose side is 4 cm then the number of small cubes having purple colour at two sides is?

A) 64 B) 36 C) 20 D) 48


3. If a cube of length 12 cm is coloured with red and it is divided into small cubes of length 2 cm. Then the number of small cubes having red colour at least on one face is...

A) 152 B) 8 C) 144 D) 96

4. If '6' sides of a cube has been coloured with green and the cube is divided into 64 equal parts, then the number of small cubes having black colour at one face side is.....


A) 8 B) 48 C) 24 D) 12


5. If we fold the following figure, it becomes a cube. In the given options which one is a pair of opposite faces of the cube?



A) 2 - 1 B) 5 - 4
C) 6 - 2 D) 5 - 2

6. If we fold the following net then which of the cube in given options did we get?





7. If a cube of length 18 cm which is totally coloured divided into small cubes having length 6 cm then how many small cubes have colour on only one face?

A) 8 B) 24 C) 48 D) 6


Railway Exams

Reasoning

8. If a cube of length 20 cm has been coloured with red colour, blue colour and black colour such that opposite faces coloured with above colours respectively. If the cube is divided into small cubes of side 4 cm then how many small cubes have red colour on one side, black colour on one side and no colour on one side?


A) 36 B) 24 C) 12 D) 8

9. Six letters - S, T, M, P, R and C are written on different faces of a dice. Two positions of this dice are shown in the figures below. Find the letters on the face opposite to M.




A) R B) P C) C D) S

10. The letters U, V, W, X, Y and Z are given on six faces of a die. Two different forms of this die are given below. Find the letter on face opposite to the face containing the letter V.



A) X B) Y C) Z D) W

11. The letters M, N, O, P, Q and R are written on six faces of a die. Two different forms of the die are given below. Find the letter on face of the die opposite to the face of the die containing the letter 'O'.



A) R B) M C) Q D) P

12. A solid cube of each side 15 cm has been painted green, blue and yellow on pairs of opposite sides (faces). It is then cut into cubical blocks of each side 5 cm. Then How many cubes have only one faces painted?

A) 18 B) 12
C) 48 D) 6

Scan the QR code for Key

These model questions were prepared by
Rajesh Madhu
Asst. Prof. of Mathematics.

(c) eenadu

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

యూఐ/యూఎక్స్ డిజైన్
సంస్థ: ఆర్కడన్ గేమ్స్
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ఫిగ్మా, యూజర్ ఇంటర్‌ఫేస్ డెవలప్‌మెంట్
స్టైపెండ్: రూ.1,000-5,000
☛ https:/nk.ink/EAH9N

ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్
సంస్థ: అరికా ఫన్ అండ్ ఫోలిక్ ఎల్ఎల్‌పీ
నైపుణ్యాలు: ఏఆర్ఎం మైక్రోకంట్రోలర్, సర్క్యూట్ డిజైన్, సీ ప్రోగ్రామింగ్, పైతాన్
స్టైపెండ్: రూ.15,000-30,000
☛ https://lnk.ink/LEmEt

సోషల్ మీడియా మార్కెటింగ్
సంస్థ: డెస్టినేషన్ యాడ్స్
నైపుణ్యాలు: డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.5,000-6,000
☛ https://lnk.ink/gjhBE

ప్రొడక్ట్ డిజైన్
సంస్థ: గ్రోమీ ఆర్గానిక్ ప్రై.లి.
నైపుణ్యాలు: అడోబ్ క్రియేటివ్ సూట్, ఫిగ్మా, స్కెచ్ స్టైపెండ్: రూ.8,000-10,000
☛ https://lnk.ink/dsk7g

డేటా ఎంట్రీ
సంస్థ: సింగ్యులారియం టెక్నాలజీస్ ప్రై.లి.
నైపుణ్యాలు: క్రిటికల్ థింకింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, ఇమేజ్ ఎడిటింగ్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్టైపెండ్: రూ.5,000
☛ https://lnk.ink/ycOzQ

లీగల్ కంటెంట్ క్యూరేషన్
సంస్థ: లాటెక్
నైపుణ్యాలు: క్రియేటివిటీ, లేబర్ లాస్, లీగల్ డ్రాఫ్టింగ్, లీగల్ రిసెర్చ్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-పవర్ పాయింట్, ఎంఎస్-వర్డ్
స్టైపెండ్: రూ.10,000-15,000
☛ https://lnk.ink/wPxHu

హైదరాబాద్‌లో

డేటా ఎంట్రీ
సంస్థ: ఎంజేఎంఏ ఇంపెక్స్ ప్రై.లి.
నైపుణ్యం: ఎంఎస్-ఎక్సెల్
స్టైపెండ్: రూ.18,000-22,000
☛ https://lnk.ink/yTgy5

రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్
సంస్థ: లీప్ రోబోస్
నైపుణ్యాలు: అడ్వినో, సీ ప్రోగ్రామింగ్, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రాస్‌బెరీ పై స్టైపెండ్: రూ.8,000-10,000
☛ https://lnk.ink/vAnIu

మార్కెట్ రిసెర్చ్
సంస్థ: బ్లూక్వార్క్ రిసెర్చ్
నైపుణ్యం: మార్కెట్ రిసెర్చ్
స్టైపెండ్: రూ.3,000-10,000
☛ https://lnk.ink/ZuVAz

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: జులై 27

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)
సంస్థ: నట్యుర్జ్ బయో కంట్రోల్ ప్రై.లి.
నైపుణ్యాలు: డిజిటల్, ఈమెయిల్, సోషల్‌మీడియా మార్కెటింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హిందీ మాట్లాడటం, మైక్రోసాఫ్ట్ 365, ఎంఎస్-ఎక్సెల్
స్టైపెండ్: రూ.8,000-10,000
☛ https://lnk.ink/JIPLw

ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్
సంస్థ: ఆద్వి టెక్ సొల్యూషన్స్
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, జిర
స్టైపెండ్: రూ.6,000
☛ https://lnk.ink/niGyd

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: జులై 26

ఇన్‌సైడ్ సేల్స్
సంస్థ: ఫోస్టరేట్
నైపుణ్యం: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్
స్టైపెండ్: రూ.15,000-25,000
దరఖాస్తు గడువు: జులై 12
☛ https://lnk.ink/g4MB0

సీఎన్‌సీ అండ్ క్యాడ్ డిజైన్ అసిస్టెంట్/ ఆర్ట్ స్టూడియో
సంస్థ: హర్షజ్ స్టూడియో
నైపుణ్యాలు: ఆటోక్యాడ్, ఆటోడెస్క్ ఫ్యూజన్ 350, బ్లెండర్ 3డీ, క్యాటియా, రైనో
స్టైపెండ్: రూ.13,500-15,000
దరఖాస్తు గడువు: జులై 24
☛ https://lnk.ink/lzz9p

అసిస్టెంట్ మేనేజర్
సంస్థ: ఓపెన్ సైంటిఫిక్ పబ్లిషర్స్
నైపుణ్యాలు: కంప్యూటర్ స్కిల్స్, ఇంటర్నెట్, ఎంఎస్-ఆఫీస్ స్టైపెండ్: రూ.2,000-4,000
దరఖాస్తు గడువు: జులై 16
☛ https://lnk.ink/RqxpG

మార్కెటింగ్ అండ్ సేల్స్
సంస్థ: రిలయెన్స్ నిప్పన్ లైఫ్ ఇన్స్యూరెన్స్
నైపుణ్యాలు: క్లయింట్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, లీడ్ జనరేషన్, నెట్‌వర్కింగ్
స్టైపెండ్: రూ.2,000-8,000
దరఖాస్తు గడువు: జులై 23
☛ https://lnk.ink/8JeIV

వీడియో ఎడిటింగ్
సంస్థ: మాస్టర్స్‌హెల్ప్
నైపుణ్యం: వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.9,100-10,500
దరఖాస్తు గడువు: జులై 20
☛ https://lnk.ink/tOtLa

తెలుసుకున్నారా.. కార్పొరేట్ కల్చర్?



కార్పొరేట్ సంస్థల్లో చేరి, నెగ్గుకురావాలంటే సాంకేతిక నైపుణ్యాలు, ప్రతిభ, అకడమిక్‌గా మంచి మార్కులు మాత్రమే సరిపోవు. ఆ సంస్థ విలువలు, ప్రవర్తనా నియమాలు వంటి అదనపు అంశాలపైనా అవగాహన అవసరం. ఈ లక్షణాలనే కార్పొరేట్ కల్చర్‌గా పరిగణిస్తారు.

బెంగళూరు కేంద్రంగా సాంకేతిక సేవలు అందించే ఒక సంస్థ గత సంవత్సరం 50 మంది ఫ్రెష్ గ్రాడ్యుయేట్లను ఎంపిక చేసుకొంది. తొలి నెల పర్ఫార్మెన్స్ ఎవాల్యుయేషన్లో అభిషేక్‌ను వాచ్ లిస్టులో పెట్టారు. నియామక దశల అన్ని అంశాల్లోనూ ప్రథముడిగా నిలిచిన అతడు 'వాచ్ లిస్టు'లోకి ఎలా వచ్చాడు? సంస్థ ఇండక్షన్ మాన్యువల్లోని అంశాలు ఫాలో కానందున ఈ పరిస్థితి ఏర్పడిందని తేలింది.

కార్పొరేట్ పని సంస్కృతి అనేది ఆ సంస్థల వ్యవహార శైలి. ఉద్యోగార్థులు దీన్ని అలవరుచుకుంటే పోటీలో ఇతరుల కంటే ప్రత్యేకంగా నిలబడే అవకాశాలుంటాయి.

సంస్థలో పని చేసే ఉద్యోగులు బయటి ప్రపంచానికి ఆ సంస్థ తరపున ప్రతినిధులుగా వ్యవహరిస్తుంటారు.. చాలా సంస్థలు, ఉద్యోగులు కొత్తగా తమ కంపెనీలో చేరినపుడు ఇండక్షన్ ప్రోగ్రాంలు నిర్వహించి తమ సంస్థ వ్యవహార శైలి, విజన్ లాంటి అంశాలపై ఉద్యోగులకు అవగాహన కలిగేలా చేస్తాయి.

ఒక్కో సంస్థలో ఒక్కో రకం

ఒక సంస్థలో పనిచేసే ఉద్యోగులందరూ కలిసి సంస్థ లక్ష్యాలను సాధించే విధానం, సంస్థ నమ్మకాలు, పాటించే విలువలు, పని తీరు, వివిధ శ్రేణుల మధ్య వ్యక్తీకరణ, కమ్యూనికేషన్.. వీటన్నిటి సముదాయమే కార్పొరేట్ కల్చర్. కొన్ని సంస్థలు చాలా ఫార్మల్‌గా ఉంటాయి.. కొన్ని సంస్థలు క్యాజువల్‌గా ఉంటాయి. కొన్ని సంస్థలు టీమ్ వర్క్‌తో చేసే పనికి ప్రాధాన్యం ఇస్తాయి, మరి కొన్ని 'వ్యక్తిగత పని' తీరును ప్రోత్సహిస్తాయి. ఈ సంస్కృతిని అర్థం చేసుకోవడం ద్వారా ఆ సంస్థ పని వాతావరణంలో సులభంగా కలిసిపోవచ్చు.

ఎలాంటి లక్షణాలు ఒక తాజా గ్రాడ్యుయేట్‌ను కార్పొరేట్ కల్చర్‌కు సరిపోయే ఉద్యోగిగా తయారుచేస్తాయో చూద్దాం.

▲ **మార్పులకు అనుగుణంగా:** వ్యాపార సంస్థలు అందించే ఉత్పత్తి, సేవలకు సంబంధించి మార్కెట్ పరిస్థితులు తరచూ మారుతుంటాయి. టెక్నాలజీ మారుతుంటుంది. మారిన వ్యాపార స్థితిగతులకు తగిన విధంగా ఉద్యోగి, తన వ్యవహార శైలి, పని విధానం మార్చుకొని సంస్థ నిర్దేశించిన లక్ష్యాల సాధనకు పనిచేయాలి. ఉదాహరణకు ఆన్‌లైన్ బుక్ స్టోర్‌గా ప్రారంభమైన అమెజాన్ నేడు ప్రపంచంలో దిగ్గజ ఈ-కామర్స్ కంపెనీగా అవతరించింది. తొలినాళ్ల నుంచీ కంపెనీని అట్టిపెట్టుకొని ఉన్నవారు ఈ పరిణామాలకు తగ్గట్టు తమను తాము మలుచుకోగలగాలి.

▲ **లక్ష్యాల అవగాహన:** ప్రతి సంస్థకూ 'దార్శనికత', ఒక మిషన్ ఉంటాయి. అవి వాస్తవరూపం దాల్చేందుకు సంస్థ విజన్‌ను ఉద్యోగి తన విజన్లో భాగంగా చూడగలగాలి. ఉదాహరణకు ఇన్ఫోసిస్ కంపెనీ అంతర్జాతీయంగా గౌరవం పొందే కార్పొరేట్‌గా ఎదగాలన్న విజన్‌తో ముందుకెళుతోంది. అత్యున్నత ప్రతిభతో వాణిజ్య సంస్థలకు సేవలందించడం ద్వారా దీన్ని నిజం చేయడం ప్రతి ఉద్యోగి లక్ష్యం కావాలని సంస్థ కోరుకుంటోంది.

▲ **సవినయంగా అభిప్రాయం:** సంస్థ నిర్దేశించిన లక్ష్యాల సాధనకు ఉద్యోగులు, ఉన్నతాధికారులు, క్లయింట్స్ ఇలా అందరితో కలిసి ఒక 'టీం'గా పనిచేయవలసి ఉంటుంది. ఈ క్రమంలో అభిప్రాయభేదాలు తలెత్తవచ్చు. ఆలోచనలను, తనలోని భావాలను బాస్‌తో, సహోద్యోగులతో, ఇతరులతో సద్భావనతో గౌరవ పూర్వకంగా తెలియజేయగలగాలి.

▲ **ప్రతి పనీ సమర్థంగా:** సంస్థలో పనిచేసే ప్రతి ఉద్యోగీ తన పనిని సమర్థంగా చేయాలనే ఆశిస్తారు. దానితోపాటు, పనిలో నాణ్యత కనిపించాలి. మంచి పనితీరు ప్రదర్శిస్తే సంస్థలో స్థానం దృఢపరచుకోవచ్చు. నిరంతర మెరుగుదల, నూతన ఆవిష్కరణలతో అత్యుత్తమ ఉత్పత్తులను అందివ్వడం యాపిల్ కంపెనీ విధానం. దీనికి అనుగుణంగా ప్రతి ఉద్యోగీ తన ప్రతిభను గరిష్ఠ స్థాయిలో చూపగలగాలి.

▲ **పరిశీలన:** యాజమాన్యం లేదా పై అధికారులు సంస్థ నిర్వహణ, వ్యాపారపరంగా జరిగే వివిధ సమావేశాల్లో తెలియజేసే నిర్ణయాలను పరిశీలించి, అనుసరించాలి. వాటిని ఉత్పాదక పద్ధతుల్లోకి మార్చగల సామర్థ్యం అలవర్చుకోగలగాలి.

▲ **మౌలిక విలువలు:** సంస్థ నిర్దేశించిన లక్ష్యాలు సాధించే క్రమంలో కొన్నిసార్లు ఒత్తిడి ఎదుర్కోవాల్సి వస్తుంది. కేవలం ఏదో విధంగా పని పూర్తి చేయాలని భావించే వ్యక్తులను కాకుండా విశ్వసనీయతతో పని చేసే వ్యక్తినే సంస్థలు కోరుకుంటాయి.

▲ **సంస్థ లక్ష్యాలు సొంత లక్ష్యాలుగా:** తనకు కేటాయించిన పనిని మాత్రమే చేస్తూ, తన విజయాన్ని మాత్రమే కోరుకునే తత్వం ఉన్న వ్యక్తులను కార్పొరేట్ సంస్థలు అభిలషించవు. 'నా పని మాత్రమే నేను చేస్తా' అన్న ధోరణితో కాకుండా తన పని సంస్థ లక్ష్యానికి ఎలా తోడ్పడుతుందో ఆలోచించి పని చేసేవారిని కార్పొరేట్లు స్వాగతిస్తాయి.

▲ **పట్టుదల.. వినయశీలత:** లక్ష్య సాధనకు పట్టుదలతో పాటు ఆత్మవిశ్వాసం, స్వతంత్రంగా ఆలోచించే గుణం అవసరం. అదే సమయంలో ఇతరుల అభిప్రాయాలను వినడం, వారి అభిప్రాయాలూ, సలహాలను అంగీకరించడమూ ముఖ్యమే. సంస్థలు ఒక బృందంగా వినయశీలతతో పనిచేసే అభ్యర్థులను కోరుకుంటాయి.

▲ **నిరంతర విద్యార్థి:** సాంకేతికత వేగంగా మారుతున్న కాలంలో వ్యాపార పద్ధతులు, వ్యాపార శైలీ అందుకనుగుణంగా వేగంగా మారుతుంటాయి. 'నేనిది చదువుకోలేదు, నాకీ విషయం తెలియదు' అనేవారెవరూ సంస్థలో కొనసాగలేరు. కొత్త సాంకేతికతనూ, కొత్త కొత్త విషయాలనూ ఎప్పటికప్పుడు పోటీపడి నేర్చుకొని, తనను తాను మెరుగుపరచుకునే అభ్యర్థికే కార్పొరేట్లు మొగ్గు చూపుతాయి.


కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు కోరుకొనే అభ్యర్థులు కార్పొరేట్ కల్చర్‌కు అనుకూలంగా ఎదగాలంటే ఈ లక్షణాలను తమ స్వభావంలో భాగం చేసుకోగలగాలి.



- దొరైరాజ్
ప్రముఖ కార్పొరేట్ సంస్థలో సీనియర్ జనరల్ మేనేజర్

నమ్మకంతో నేర్చుకుందాం!

నేటి వేగవంతమైన ప్రపంచంలో నిరంతరం నేర్చుకోవడం, నైపుణ్యాల అభివృద్ధి, తద్వారా వ్యక్తిత్వాన్ని మెరుగుపరుచుకోవడం చాలా అవసరం. సంప్రదాయ విద్య పునాది వేసినప్పటికీ, నిజమైన విజయం స్వీయ అభ్యాసం ద్వారానే వస్తుంది. పీటర్ హలిన్స్ రచించిన 'ది సైన్స్ ఆఫ్ సెల్ఫ్-లెర్నింగ్' దీన్నెలా నిర్వహించుకోవాలో వివరిస్తుంది. ప్రత్యేకంగా యువతకు ఈ పుస్తకం ఉపయోగకరమైన అంతర్దృష్టిని అందిస్తుంది.



పుస్తకం

స్వీయ అభ్యాసానికి అవసరమైన ముఖ్య అంశాలను ఈ పుస్తకం వివరిస్తుంది. దీనిలో 'లెర్నింగ్ సక్సెస్ పిరమిడ్' అనే భావన పరిచయమవుతుంది. ఇది మూడు ముఖ్యాంశాలతో ఉంటుంది. ఆత్మవిశ్వాసం, స్వీయ-నియంత్రణ, అభ్యాసం. చాలామంది వ్యక్తులు నేరుగా అభ్యాసంతో ప్రారంభిస్తారు. కానీ మీ సామర్థ్యంపై నమ్మకం ఉంచడం, మీ ప్రేరణలను నియంత్రించుకోవడం చాలా ముఖ్యమంటారు రచయిత. నేర్చుకోగలననే నమ్మకం లేకపోతే నిరుత్సాహం కలుగుతుంది. అలాగే శ్రద్ధ, క్రమశిక్షణ లేకుండా కేవలం చదవడం వల్ల పెద్దగా ఫలితం ఉండదు.

పుస్తకంలోని మరో ముఖ్యమైన అంశం స్వీయ-నియంత్రణ. ఇందులో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకోవడం, సమయాన్ని సమర్థంగా నిర్వహించడం, స్వీయ-క్రమశిక్షణను అభివృద్ధి చేయడం లాంటివి ఉన్నాయి. 'డెలిబరేట్ ప్రాక్టీస్' ప్రాముఖ్యాన్ని కూడా ఈ పుస్తకం చెపుతుంది. ఇది ఏదైనా అంశంలో నైపుణ్యం సాధించడానికి కేంద్రీకృత, క్రమబద్ధమైన విధానం. అభ్యాస ప్రక్రియలో స్వీయ-అవగాహన, స్వీయ-పర్యవేక్షణలకు ప్రాముఖ్యం ఉంటుంది.

కెరియర్ ప్రారంభ దశలో ఉన్న యువత కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడానికీ, కెరియర్‌లో అభివృద్ధి చెందడానికీ ఈ పుస్తకం మార్గనిర్దేశం చేస్తుంది. నిర్దిష్ట నైపుణ్యాన్ని నేర్చుకోవాలనుకున్నా, కొత్త డొమైన్‌ను అన్వేషించాలనుకున్నా ఈ పుస్తకంలోని సూచనలు మార్గం చూపుతాయి.

రచయిత ఆచరణాత్మక వ్యూహాలపై కూడా దృష్టి పెట్టారు. సమాచారాన్ని బాగా గ్రహించి గుర్తుంచుకోవడానికి 'స్పేస్డ్ రెపిటిషన్', 'ఇంటర్‌లీవింగ్' లాంటి పద్ధతుల గురించి వివరించారు. అభ్యాసంలో ఎదురయ్యే అడ్డంకులను ఎలా అధిగమించాలో, ప్రేరణను ఎలా నిలబెట్టుకోవాలో సూచనలు ఇచ్చారు. స్వీయ-అభ్యాస శక్తిని గుర్తించి, దాన్నో అలవాటుగా మార్చుకుంటే భవిష్యత్తులో ఎదురయ్యే ఎలాంటి సవాళ్లనైనా సులభంగా అధిగమించవచ్చు.

బాగా గుర్తుండాలంటే..

పరీక్షలకు బాగా ప్రిపేర్ కావడానికీ, పాఠ్యాంశాలను లోతుగా అర్థం చేసుకోవడానికీ ఈ రచన సహాయపడుతుంది. కేవలం బట్టీపట్టి చదవడం కంటే, విషయాలను అవగాహన చేసుకోవడం, వాటిని సొంత మాటల్లో వివరించగలగడం ముఖ్యం. ఇందుకోసం ఆయన SQ3R పద్ధతిని సిఫార్సు చేస్తారు. ఈ పద్ధతి సమాచారాన్ని బాగా గుర్తుంచుకోవడానికి, అర్థం చేసుకోవడానికీ సహాయపడుతుంది.

1 **సర్వే:** చదవడం ప్రారంభించే ముందు మెటీరియల్‌ను ఒకసారి పరిశీలించడం.
2. **క్వశ్చన్:** మీరు ఏమి నేర్చుకోబోతున్నారో దాని గురించి ప్రశ్నలు అడగడం.
3. **రీడ్:** సమాధానాలను గుర్తించడానికి ఒకేసారి ఒక విభాగం చదవడం.
4. **రిఫ్లెక్ట్:** మీరు అడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానం దొరికిందా అని ఆలోచించడం.
5. **రిసైట్:** చదివిన విషయాన్ని సొంత మాటల్లో చెప్పడం/రాయడం.
6. **రివ్యూ:** మెటీరియల్‌ను మళ్లీ చూడటం, మిగిలిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం.

– రహ్మాన్ & సంపత్

ఏ ఎంబీఏ మేలు?

బీటెక్ కెమికల్ ఇంజినీరింగ్ (2023) చేసి.. కెమికల్ ఫెర్టిలైజర్ కంపెనీలో పనిచేస్తున్నా. లాజిస్టిక్స్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీయే చేయాలనుంది. క్యాట్ ఎంబీఏ/ వర్కింగ్ ప్రొఫెషనల్స్ ఎంబీఏ.. రెండిటిలో ఏది మేలు? – వరుణ్‌స్వామి



■ రెండిట్లో క్యాట్ రాసి రెగ్యులర్ ఎంబీఏ చేయడమే శ్రేయస్కరమని చెప్పొచ్చు. రెగ్యులర్ ఎంబీఏ చేయడానికి అవకాశం లేనప్పుడు మాత్రమే ఆన్‌లైన్ / వీకెండ్ ఎంబీఏ చేయాలి. ఎంబీఏ లాంటి ప్రొఫెషనల్ ప్రోగ్రామ్స్‌ను రెగ్యులర్‌గా చేస్తేనే విషయ పరిజ్ఞానం, నైపుణ్యాలు మెరుగవుతాయి. ప్రస్తుతం పనిచేస్తున్న సంస్థలోనే పదోన్నతి కోసం వర్కింగ్ ప్రొఫెషనల్స్ ఎంబీఏ ఉపయోగపడుతుంది. పదోన్నతి ద్వారా వచ్చే ఈ వేతనం కంటే పూర్వ ఉద్యోగానుభవంతో ఐఐఎం లాంటి విద్యాసంస్థ నుంచి పొందే ఎంబీఏతో లభించే ప్రారంభ వేతనం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. మీరు బీటెక్ (కెమికల్ ఇంజినీరింగ్) విద్యార్హతతో 2025 నవంబర్‌లో జరగబోయే క్యాట్ రాయండి. 2026లో ఐఐఎం లాంటి ప్రతిష్ఠాత్మక బిజినెస్ స్కూల్లో ప్రవేశం పొందితే, అప్పటికి మూడు సంవత్సరాల ఉద్యోగానుభవం ఉంటుంది. ఎంబీఏ పూర్తి చేశాక ఈ అనుభవంతో మెరుగైన ఉద్యోగం పొందొచ్చు. ఇంజినీరింగ్ డిగ్రీతో లాజిస్టిక్స్ అండ్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ చేస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది. ఒకవేళ మీరు క్యాట్ ద్వారా మంచి విద్యాసంస్థలో ప్రవేశం పొందలేకపోతే ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాన్ని కొనసాగిస్తూనే ఆన్‌లైన్/ వీకెండ్ వర్కింగ్ ప్రొఫెషనల్స్ ఎంబీఏ చేయవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

ఏఆర్‌సీఐలో సైంటిస్టులు

హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రిసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్ (ఏఆర్‌సీఐ) 11 సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
▸ సైంటిస్ట్-ఈ: 03 ▸ సైంటిస్ట్-సీ: 01 ▸ సైంటిస్ట్-బీ: 02
▸ సైంటిస్ట్-బీ (ఆర్ అండ్ డీ): 05
అర్హత: పోస్టును బట్టి బీఈ/ బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం.
వయసు: సైంటిస్ట్-ఈ పోస్టులకు 45 ఏళ్లు, సైంటిస్ట్-సీ, బీ పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు సైంటిస్ట్-ఈ పోస్టులకు రూ.2,38,895, సైంటిస్ట్-సీ పోస్టులకు రూ.1,36,405, సైంటిస్ట్-బీ పోస్టులకు రూ.1,14,945.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 28.07.2025
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.600, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, మహిళలకు రూ.300.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో
వెబ్‌సైట్: https://www.arci.res.in/careers/

వాక్-ఇన్స్

వికారాబాద్ సీసీఐలో..

ప్రభుత్వరంగ సంస్థ అయిన వికారాబాద్ జిల్లా, తెలంగాణలోని తాండూరు సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సీసీఐ) ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన వివిధ విభాగాలలో 9 ఖాళీల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
▸ మిల్లర్ (సీసీఆర్ ఆపరేటర్-సిమెంట్ మిల్): 03 ▸ కెమిస్ట్: 01
▸ సూపర్‌వైజర్: 01 ▸ ట్యాలీ చెకర్ (మెకానిక్): 01
▸ షిఫ్ట్ ఆపరేషన్ (మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్): 03
అర్హత: సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీతో పాటు ఉద్యోగానుభవం. **వయసు:** మిల్లర్, కెమిస్ట్ పోస్టులకు 35 ఏళ్లు, సూపర్‌వైజర్‌కు 58 ఏళ్లు, ఇతర పోస్టులకు 55 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు మిల్లర్‌కు రూ.21,000- రూ.25,000; కెమిస్ట్‌కు రూ.27,000-రూ.30,000; సూపర్‌వైజర్‌కు రూ.40,000- రూ.50,000; ఇతర పోస్టులకు రూ.25,000-రూ.30,000. **ఇంటర్వ్యూ తేదీ:** 04.07.2025. **చిరునామా:** సీసీఐ లిమిటెడ్, తాండూర్ సిమెంట్ ఫ్యాక్టరీ, కరన్‌కోటే విలేజ్, తాండూరు మండలం, వికారాబాద్ జిల్లా.
వెబ్‌సైట్: www.cciltd.in/page.php?id=216

సెయిల్‌లో స్పెషలిస్టులు

భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్)కి చెందిన ఐఐఎస్‌సీఓ స్టీల్ ప్లాంట్ బర్న్‌పుర్ హాస్పిటల్‌లో వివిధ విభాగాల్లో స్పెషలిస్టులు, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
▸ స్పెషలిస్టులు: 14 ▸ సూపర్ స్పెషలిస్ట్: 01
▸ జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ (జీడీఎంఓ): 02
విభాగాలు: ప్రసూతిశాస్త్రం అండ్ గైనకాలజీ, పల్మనరీ, జనరల్ సర్జరీ, డెర్మటాలజీ, సైకియాట్రీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, రేడియాలజీ, పబ్లిక్ హెల్త్, క్రిటికల్ కేర్, ప్లాస్టిక్ సర్జరీ తదితరాలు.
అర్హత: పోస్టును అనుసరించి ఎంబీబీఎస్‌తో పాటు డీఐహెచ్, పీజీ డిప్లొమా/ పీజీ డిగ్రీ/ డీఎన్‌బీ, డీఎం/ ఎంహెచ్. ఎన్ఎంసీలో పేరు నమోదై ఉండాలి. **వేతనం:** నెలకు జీడీఎంఓ పోస్టులకు రూ.90,000; స్పెషలిస్టులకు రూ.1,20,000.
వయసు: 17.07.2025 నాటికి 69 ఏళ్లు మించకూడదు.
ఇంటర్వ్యూ తేదీ: 17.07.2025.
వేదిక: ఆఫీస్ ఆఫ్ సీఎంఓ ఐ/సీ, బర్న్‌పుర్ హాస్పిటల్.
వెబ్‌సైట్: https://sailcareers.com/

Wordwise-33

క్రాస్‌వర్డ్ పజిల్స్ పూర్తి చేసి కొత్త పదాలను ఆనందంగా నేర్చుకోవచ్చు. ఇక్కడ ఉన్న 'వర్డ్ వైజ్'ను ఒకసారి ప్రయత్నించండి. ఇది వినోదంతో పాటు పోటీ పరీక్షల్లో విజయానికి కూడా తోడ్పడుతుంది.

ACROSS
1. Just the right way — not too much, not too little!
5. For 'All OK' or 'everything is fine', we use this.
6. Personal computer, abbr.
7. To put numbers or things together.
9. You say this before 'do' and 'teen' in Hindi counting.
10. Latin abbreviation at the end of a proof — means 'Which was to be demonstrated'.
11. Fill the fuel tank again.
13. Zebra has this pattern!

DOWN
1. Sheets you write or print on.
2. A vehicle that flies into space.
3. Tiny word that means every-thing's fine.
4. A tricky question with a clever answer.
7. Spanish word for 'here', often used in English too.
8. Far down from the surface.
12. Title for 'Father' — used for a priest in Christianity.

- డా. వంగీపురం శ్రీనాథాచారి

1	2	3			4
5			■	■	
6		■	7	8	
9		■	10		
11		12			
13					

ANSWERS

ACROSS
1. PROPER
5. AOK
6. PC
7. ADD
9. EK
10. QED (Quod Erat Demonstrandum)
11. REFUEL
13. STRIPE

DOWN
1. PAPERS
2. ROCKET
3. OK
4. RIDDLE
7. AQUI
8. DEEP
12. FR

ఇస్రో సైంటిస్ట్ అవుతారా?

ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో).. 39 సైంటిస్ట్/ ఇంజినీర్ ఎస్‌సీ (సివిల్) పోస్టులను భర్తీచేయనుంది. తాత్కాలిక ప్రాతిపదికన ఎంపిక చేసినప్పటికీ.. శాశ్వతంగా నియమించవచ్చు.

అర్హతలు: సివిల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ మెకానికల్ (ఏసీ అండ్ రిఫ్రిజరేషన్)/ ఆర్కిటెక్చర్ బ్రాంచ్‌తో బీఈ/ బీటెక్ 65 శాతంతో పూర్తిచేయాలి.

వయసు: 14.07.2025 నాటికి 28 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, కేంద్రప్రభుత్వ ఉద్యోగులు, మాజీ సైనికోద్యోగులు, దివ్యాంగులకు నిబంధనలకు అనుగుణంగా సడలింపులు వర్తిస్తాయి.

దరఖాస్తు ఫీజు: అభ్యర్థులందరూ ముందుగా రూ.750 దరఖాస్తు ఫీజు చెల్లించాలి. రాత పరీక్షకు హాజరయ్యే ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులకు మొత్తం ఫీజును, మిగిలినవారికి రూ.500 తిరిగి చెల్లిస్తారు. రాత పరీక్షకు హాజరు కానివారికి ఫీజు రిఫండ్ చేయరు.

వేతనం: నెలకు రూ.56,100. మూల వేతనానికి అదనంగా డీఏ, హెచ్ఆర్ఏ, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, ఎల్‌టీసీ, గ్రూప్ ఇన్స్యూరెన్స్, న్యూ పెన్షన్ స్కీమ్, హౌస్ బిల్డింగ్ అడ్వాన్స్, వైద్య సదుపాయాలు ఉంటాయి.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూతో ఎంపిక చేస్తారు. ప్రశ్నపత్రం ఆబ్జెక్టివ్ విధానంలో రెండు భాగాలుగా ఉంటుంది. వ్యవధి రెండు గంటలు.

▼ పార్ట్-ఏలో సబ్జెక్టు సంబంధిత ప్రశ్నలు 80 ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. ప్రతి తప్పు సమాధానానికీ ముప్పావు మార్కు తగ్గిస్తారు.
▼ పార్ట్-బీలో ఆప్టిట్యూడ్/ ఎబిలిటీ ప్రశ్నలు 15 అడుగుతారు. వీటికి 20 మార్కులు. నెగటివ్ మార్కులు లేవు.
▼ రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా 1:5 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.



ఇంటర్వ్యూ: 100 మార్కులకు నిర్వహిస్తారు. టెక్నికల్ (అకడమిక్) నాలెడ్జ్-40 మార్కులు, జనరల్ అవేర్‌నెస్-20 మార్కులు, ప్రజెంటేషన్/ కమ్యూనికేషన్ స్కిల్స్-20 మార్కులు, కాంప్రహెన్షన్-10 మార్కులు, అకడమిక్ అచీవ్‌మెంట్స్-10 మార్కులు.

▼ అన్‌రిజర్వ్‌డ్ అభ్యర్థులు రాత పరీక్ష, ఇంటర్వ్యూల్లో 50 శాతం చొప్పున, ప్రత్యేక వర్గాలకు చెందినవారు రాత పరీక్ష, ఇంటర్వ్యూల్లో 40 శాతం చొప్పున మార్కులు సాధించాలి.
▼ ఇంటర్వ్యూ సమయంలో ఒరిజినల్ ధ్రువపత్రాలను పరిశీలిస్తారు.

పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, అహ్మదాబాద్, బెంగళూరు, భోపాల్, చెన్నై, గువాహటి, కోల్‌కతా, లఖ్‌నవూ, ముంబయి, న్యూదిల్లీ, తిరువనంతపురం.

✦ ఒకరు ఒక పోస్టుకు మాత్రమే దరఖాస్తు చేయాలి.
✦ ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులకు సెకండ్ క్లాస్/ స్లీపర్ క్లాస్ రైలు ఛార్జీలను చెల్లిస్తారు.
✦ ఎంపికైనవారిని దేశవ్యాప్తంగా ఉన్న ఇస్రో సెంటర్లు/యూనిట్లలో ఎక్కడైనా నియమించే, బదిలీ చేసే అవకాశం ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 14.07.2025
వెబ్‌సైట్: https://www.isro.gov.in/

(c) eenadu